ారతి

సాహిత్య మాసపత్రిక
నవంబరు 1983

జాలు విరబోసుకో

క్య రావు

యాణం

మ సూ రి

తన్య సంకల్పం

ోమసుందర్

మన పాడి పరిశ్రమ

రవికుమార్

ఆదిలాబాదు మాండలిక భాష

వేంకటేశ్వర్లు

ఎండ

వెంకటేశ్వరరావు

ఇంకా వెంకటరామశాస్త్రి, కిశోరుబాబు – అశోకుబాబు, సాంధ్యశ్రీ, సుధాకరరావు, రామారావు, అప్పలస్వామి, విజయ దత్తాత్రేయశర్మ, అనంతపద్మనాభశాస్త్రి, సుబ్బారావు, శ్రీరామమూర్తి, కోణార్క ఇతరుల రచనలు.

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

నవంబరు 1983

సంపుటము: 60 సంచిక: 11

విడిప్రతిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

నవంబరు 1983

నాన్యః తరుః నన్నయ వృక్ష ఏవ

శ్రీ పిడపర్తి వెంకటరామశాస్త్రి

గోదావరీ తీర నిరూఢ మూలః
ఛాయా పరివ్యాప్త త్రిలింగ భూమిః
మూర్ధన్య విద్వత్కవి వాక్ప్రసిద్ధః
నాన్యః తరుః నన్నయ వృక్ష ఏవ.

ఆదే మహో భారత బీజరూపః
మధ్యే ప్రబంధ ప్రియ వాక్సమూహః
శాఖా ప్రశాఖా పరి వర్ధమానః
నాన్యః తరుః నన్నయ వృక్ష ఏవ

సారంగ దుర్భాగ్య నిరుద్ధవృద్ధిః
వాణ్యశ్రుధారా హుత హృత్ప్రసూనః
వైదేశికోన్మూలన లబ్ధప్రాణంః
నాన్యః తరుః నన్నయ వృక్ష ఏవ.

ఆచార్య రోణంకి అప్పలస్వామి

తెలుగు భాష, సాహిత్యంపై ఆంగ్లభాషా సాహిత్యాల ప్రభావం

ఇప్పుడు మనం గ్రాంథికమంటున్న భాష గ్రంథాలలో స్థిరపడి వుండేది. ఆంగ్లేయుల సంపర్కము వలన గిడుగు రామమూర్తిగారి నిర్విరామకృషి వలన ప్రారంభంలో శిష్ట వ్యావహారికం తదుపరి వాడుకభాష సాహిత్యంలో సైతం ప్రవేశించి ఈనాడు గ్రాంథికాన్ని పూర్వపక్షం చేసివేశాయి. భావకవులలో ఎక్కువమంది గ్రాంథికాన్నే వరించారు. గురజాడ అప్పారావుగారు కన్యాశుల్క నాటకంలోనూ ముత్యాలసరాలలోను తన కొద్దిపాటి కథలలోను వాడుకభాషనే వాడ నిశ్చయించి అట్టి భాషకు సాహిత్యస్థాయిని సాధించారు.

మొదటినుండి వాడుకభాషలోనే పండితులు సైతం మాట్లాడే వారు. అయితే సంస్కృత భాష గంభీరతను తెలుగులో సాధించవలె నని ఒక కృతక భాషను తెలుగు గ్రంథాలలో రాయనారంభించారు. కాలక్రమేణ తెలుగు దీర్ఘసమాస భూయిష్టమై జటిలాతి జటిలతను అందుకుంది. కవిత్వంలో సంస్కృత వృత్తాలు రాసినవాడే కవినని పించుకునేవాడు. ఈ సంకెళ్ళ నన్నింటినీ తెంచుకోమని గిడుగు పిడుగు హెచ్చరించాడు. గురజాడ గిడుగు వలన ప్రభావితుడై నూతన శకానికి నాంది పలికాడు. కన్యాశుల్కంలోను, ఇతర అసంపూర్ణ నాటకాలలోను సమర్థవంతంగా వాడుక భాషను ప్రవేశపెట్టాడు. ముత్యాలసరాలలో నూతన మాత్రా ఛందస్సును ప్రయోగించాడు. నారాయణబాబు, శ్రీశ్రీ, పురిపండా నైపుణ్యంతో ప్రజల భాషను కవిత్వంలోను, వచనరచనలోను స్థిరపరచారు.

ఈనాడు కవులు, రచయితలు ఈ భాషలోనే రచన సాగిస్తున్నారు. నవలలలోను, కథలలోను ఆంగ్లపదాలను విరివిగా చొప్పించ నలవాటు పడ్డారు. ఇదేమీ తప్పు లేదు. చదువుకున్నవారు అక్షర జ్ఞాన్యులు కూడా ఆంగ్ల పదాలను అర్థం చేసికోగలరు. ప్రభుత్వ ఆధ్వర్యవములో మాత్రం ఒక కృతక భాషను తయారు చేస్తున్నారు. ఇది సమర్థనీయం కాదు. ఆంగ్ల రచయితలు ప్రపంచ భాష లన్నింటి నుండి పదాలను అరువు తెచ్చుకొని ఇంగ్లీషులో స్థిరపరచుకొన్నారు. ఇది సరియైన పద్ధతి. నావెల్ అన్న ఇంగ్లీషు పదము తీసికొని తెలుగు వారు తెలుగుకు తగినట్లుగా మలిచారు. మనుచరిత్రంలో "నవలా నాకానొక మరున్నారీ శిరోరత్నమున్" అని వుంది. అందుచేత నవల అన్నమాట తెలుగులో అతుక్కుంది. హిందీ, బెంగాలీ భాషలలో నవలను ఉపన్యాస్ అంటారు. మహారాష్ట్ర భాషలో గాబోలు కాదం - అంటారట. నవల అన్న పదమే అన్ని దేశభాషలలోవుంటే బాగుండేది. తెలుగువారు ఏ భాషనుండైనా సరే పదాలను తీసికొని తెలుగులో మలచుకోగలరు. 'రోజు' అన్నమాట తెలుగు కాదు. అనాడు, ఈనాడు, కొన్నినాళ్ళు, నేడు అంటాము గాని 'రోజు' అన్నమాటకు తెలుగుమాట ఏమిటో మరచిపోయాము. పారశీక, అరబ్బీ భాషలలోనుండి మహమ్మదీయ పరిపాలన కారణంగా అనేక పదాలు మన దేశభాషలలో చోటు చేసుకున్నాయి.

కార్లమీద, జీపులమీద "ప్రభుత్వ వాహనము"అని రాస్తున్నారు. ఎవరూ ప్రభుత్వ వాహన మనరు. గవర్నమెంటు లేదా గవిరిమెంటు జీపు, గవిరిమెంటు కారు, గవిరిమెంటు వాను అంటే అందరికీ తెలుస్తుంది. బస్సు, జీపు, కారు అని అందరూ అంటారు. ఆసుపత్రి అన్నమాట మనకి స్థిరపడి వుంటే "వైద్యశాల" అనడం సబబుగా లేదు. చదువురానివారు కూడా ఎలోపథీ వైద్యుడిని డాక్టరనే అంటారు. వైద్యుడు అంటే గ్రామీణులు నాటువైద్యు డనుకొంటారు. పల్లెప్రజలకు కోర్టు, జడ్జీ, మేజిస్ట్రీటు, ప్లీడరు తెలుగు మాటలైపోయాయి. రైల్వే స్టేషన్ని నిరక్షరాస్యులు సైతం టేసను అంటారు. సిగ్నల్ సిగినేలు అయిపోయింది. అందరూ లంకిలేరు (లైన్ క్లియర్) అయింది అంటారు. ఔటు, సైటు ఈ మాటలకు తెలుగు పదాలు అవసరంలేదు.

కాలేజీ అనడమే మంచిది. రిక్షావాడిని 'కళాశాలకు తీసుకు పో' అంటే తెల్లముఖం వేసి 'ఎక్కడికి బాబూ' అంటాడు. కాలేజీ అన్నా,

యూనివర్శిటీ అన్నా బోధపడని వాడుండడు. టైమ్ అన్నమాట తీసుకోండి. అడుక్కునేవాడు కూడా 'టైమెంతైంది బాబూ' అంటాడు. అందరూ టైమైపోయింది, మరి టైములేదు అంటారు. ఇలాంటి పదాన్ని తెలుగులోకి జీర్ణించుకొని పోయాయి. మనం శాస్త్రమంటున్న ది మనకు పాశ్చాత్య దేశాలనుండి సంక్రమించింది. అందుచేత సైయన్సులు, మాథమాటిక్స్‌ల పారిభాషికాన్ని ఆంగ్లపారిభాషి తీసికొని తెలుగులో మలచుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం. విద్యార్థులే కాదు అనేకమంది విద్యాధికులు కూడా పలకలేని సంస్కృత సమాసాలను తయారు చేయడం వ్యర్థం అంటే తప్పులేదు. ప్రయోజన శూన్యము, హానికరం కూడా.

నేను విపులీకరించ నుద్యమిస్తే చదువురానివాళ్లు కూడా ఇంగ్లీషు ఏమాత్రం రానివారు సైతం ఇంగ్లీషు భాషలోని అనేక పదాలను ఈనాడు తెలుగులో మలచుకొని ఉపయోగిస్తున్నారు. భాష మారుతూ వుంటుంది. ఇంగ్లీషు పదాలను పారదోలే ప్రయత్నం ఫలించదు. ఇది తెలుసుకోలేని విజ్ఞులను ఏమనాలో నాకు బోధపడడం లేదు. షవెల్ ని శవల లేక శవల పార అంటారు. పిక్ఆక్సే ని పిక్కాసు అంటారు నెయిల్ ని మేకు అంటారు గాని నట్ ని నట్టు అనే అంటారు. బోల్ట్ ని బోల్టు అనే అంటారు. సినిమాని సినిమా అనే అంటారుగాని చలనచిత్రం అనరు. ఫిలిమ్ ని చదువురానివారు ఫిలుము అంటారు. ఫొటోగ్రాఫ్‌ని ఫొటోగ్రాపు లేదా ఫోటో అంటారు. పెన్సిల్ ని పెన్సలు అంటారు. ఈ విధంగా విస్తరిస్తే లెక్కలేనన్ని ఇంగ్లీషు పదాలు ప్రజానీకానికి పరిచితమే. కొన్నిటికి తెలుగు పదాలు అసలు లేవు. ఇంగ్లీషు పదాలు తెలుగు పదాలుగా మారిపోయాయనడం సముచితం.

వాడుకభాష అన్నది కేవలం తెలుగేకాక ఇతర భాషలనుండి అవసరానికి ఎరువు తెచ్చుకున్న పదాలతో మిశ్రమమని తెలుసుకోవడం మంచిది. వాడుకభాషకు ఎవరూ సంకెళ్ళు వేయలేరు. వేయ నుద్యమించినవారు కృతకృత్యులు కాలేరు. భవిష్యత్తులో ఎట్టి మార్పులు వచ్చినా రావచ్చు. ప్రజలభాష ప్రజలే సృష్టించుకుంటారు. విజ్ఞుల ద్రోక్యం నిరర్థకం.

ఇంతవరకూ వాడుకభాషను గురించి ప్రస్తావించాను. ఇకమీదట తెలుగుపై ఆంగ్ల లేక పాశ్చాత్య సాహిత్యం ప్రభావం గురించి చర్చిద్దాం. ఆంగ్లేయులు మనదేశాన్ని పరిపాలించడం వల్ల మాత్రమే ఈ ప్రభావం మన సాహిత్యంపై రాలేదు. మనవారు ఇంగ్లీషు చదువు కొని అందలి సాహిత్యాన్ని చదివి మననం చేసికోవడం వలన వచ్చిం దనుకోవడం న్యాయం. పాశ్చాత్యులు సంస్కృత పాళీ భాషలను చదువుకోవడం వలన పాశ్చాత్య సాహిత్యాలలో కొన్ని మార్పులు కలిగినవి. ఇంతేకాక భాషాశాస్త్రం ఏర్పడింది. ఆంగ్ల విద్యావంతులు కొందరు మనదేశ భాషలను నేర్చుకొని పరిశ్రమించి మన తోడ్పాటుతో నిఘంటువులను తయారు చేశారు. వారు మన భాషలకు చేసిన సేవ మరువరానిది. వీరిలో సి. పి. బ్రౌన్ అన్న ఆంగ్లేయ ప్రముఖుడు తెలుగు భాషకు చేసిన సేవ ఇంతింతనలేము. మన లిపిని ముద్రణకు వీలైన విధంగా మలిచేడు. మొట్టమొదట ఈయన వేమన పద్యాలను ఆంగ్లములోనికి అనువదించి అతని ప్రతిభను మనవారు గుర్తించేటట్లు చేసి తెలుగు సాహిత్యంలో వేమనను సుస్థిరమొనర్చాడు. ప్రముఖ తెలుగు రచయితలు వచన రచనను అలవర్చుకున్నారు. మన సాహిత్యంలోని గద్యాన్ని స్వేచ్ఛా కవిత అనాలి గాని వచనమన వీలులేదు. వీరు మొట్టమొదట నవల అనే ప్రక్రియను ఆంగ్లం నుండే గ్రహించారు. స్కాట్ నవలలను చదివి చారిత్రక నవలా రచనను బహుళంగా ప్రచారంలోకి తెచ్చారు. సాంఘిక నవలలు, డిటెక్టివ్ నవలలు ఆంగ్ల ప్రభావ జనితములే. ముఖ్యంగా చిలకమర్తి, వీరేశలింగం పంతులు మొదలగు వారి కృషి అనల్పం. వీరేశలింగం వచన రచనలలో స్విఫ్ట్, ఆడిసన్‌లలోని ఎగతాళి, అపహాస్య హాస్యాత్మక ధోరణులను సమర్థవంతంగా తెలుగుపరం చేయగలిగాడు. పానుగంటి హాస్యరచన విధానం దేశీయమనే చెప్పాలి. జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు ఆంగ్ల సాహిత్యం నుండే మనకు సంక్రమించాయి. గురజాడ గురించి ఇది వరకే ప్రస్తావించడం జరిగింది. మరి విస్తరించనవసరం లేదు. అతని సాహిత్యకృషి ఆంగ్ల సాహిత్య ప్రభావితం అంటే సరిపోతుంది. ఆంగ్ల సాహిత్యంలో నిష్ణాతుడవడం వల్ల తెలుగు సాహిత్యాన్ని నూతన మార్గాలు పట్టించాడు.

గురజాడ తరువాత నారాయణబాబు, శ్రీశ్రీ లు కవిత్వంలో వాడుకభాష సుస్థిరతను సాధించారు. వీరి ఆధునికతను చర్చించక ముందు భావ కవిత్వాన్ని పరిశీలించడం అవసరం. ప్రారంభంలో నారాయణబాబు, శ్రీశ్రీ లిద్దరూ భావకవులనే అనుసరించారు. రాయప్రోలు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, వేదుల, నాయని సుబ్బారావు, మొదలగువారు భావకవిత్వంలో అగ్రగణ్యులు. వీరు షెల్లీ, కీట్సు, టెనిసన్ మొదలగు ఆంగ్లకవుల వలన ప్రభావితులయారు. వీరిలో కొందరు తమకు తెలియకుండానే ఫ్రెంచి కవులతో ఏవిధమైన సంపర్కం

లేకుండా వారితో సరితూగ గలిగే సింబలిస్టు పద్ధతి కవిత్వం చెప్పేరు. దీనిని బట్టి చూస్తే సింబలిస్టు ధోరణి తెలుగుభాషకు అనువుగా వుందనుకోవాలి. ఇట్టివారిలో ముఖ్యులు కృష్ణశాస్త్రి విశ్వనాథ అని చెప్పవచ్చు. చావలి బంగారమ్మ రచించిన "ఆకొండ" ప్రథమశ్రేణికి చెందిన సింబలిస్టు కవిత. భావకవులు అంతకుముందు తెలుగులో లేని ప్రేమకవిత్వాన్ని ప్రవేశపెట్టారు. గురజాడ స్త్రీని ఒకేవిధంగా నఖశిఖ పర్యంతం వర్ణించడాన్ని తిరస్కరించాడు. 'కొయ్యబొమ్మలె మెచ్చుకళ్ళకు కోమలుల సౌరెక్కునా' అని ఈసడించాడు. వేదుల ప్రేమకవిత్వ ప్రాశస్త్యం ఎన్నదగినది. కింది చరణాలు పరిశీలించండి:

ఆమె జగదీశ మకుటాగ్ర సీమ నుండి
యుర్విపై జారిన సుధా మయూఖరేఖ
ఆమె మూడు లోకాల కళ్యాణమునకు
అవతరించిన యొక పవిత్రాను భావ మామె
నా జన్మ జన్మ పుణ్యములు పండి
ప్రాప్తమైన కేళీ పరిత్యాగ లీల
ఆమె పద సన్నిధాన దివ్యస్థలాన
భక్తి సమ్మృడనై నిలంబడిన యపుడు
తలపునకు వచ్చు నాపేదతనమె నాకు.

రామచంద్ర అప్పారావు ఒక జవ్వని వాలు జడను వర్ణించడం ఈవిధంగా ప్రారంభించాడు

కలకలలాడు వాలు జడకై
జగమెంత తపస్సొనర్చెనో చెలియ

ఈ ప్రారంభం మధురాతి మధురం. అతిశయోక్తి అయినను పరిత కట్లనిపించదు సరికదా అసలు సిసలైన నిజమనిపిస్తుంది.

కృష్ణశాస్త్రి సింబలిస్టు పద్ధతి చూడండి :
వీడని వియోగమున వేగు ప్రోడు మేను
తరిలు తోరణమై సుమదామ మాయె

ఈ పదజాలం ప్రతి పదార్థ తాత్పర్యాల కతీతం.

చెదరు చేతుల నెటొ కై సేసుకొంటి
మొయిలు వసనమ్ములో ప్రొద్దుపొడుపు నగలో
ఏదొ కాలుచు హాయియో ఏదొ తెల్చు
భారమో ఏమొ సైరింప నేరనైతి.

మరొక ఉదాహరణ చూడండి:

ఈవు తేనియ గొంతెత్తితేని నీ క
పోలములు చిరునవ్వ నేత్రాలు కూడ
మరచి సర్వమ్ము, సొగసుగా శిరసు త్రిప్పు
చెందులకొ పాడినట్లుండు, నేదొ ఏదొ!

మరియు నేవేవొ కలలు, ముంగురుల జారి
వాలి కనుబొమ్మ నునుగొమ్మ వంపులందు
దూరి, చూపుల, చెక్కిళ్ల జేరి, మంద
మందహాసంపు మసకలో మాయమౌను.

ఈ ధోరణినే సింబలిస్టు ధోరణి అనాలి. కవి సంగీతజ్ఞుడు సంగతులు వేసినట్లు పదాలు కూర్చ నుద్యమిస్తాడు. ప్రతిపదార్థ తాత్పర్యాలతో నిమిత్తం లేదు. మాటలకు దొరకని ధ్యానుభూతి పఠిత అనుభవించడం తథ్యం. విశ్వనాథ సత్యనారాయణ 'చిన్నిమబ్బులు' ఈ కోవకు చెందినదే.

ఆకాశ మధ్యాన అటునొక్క తెలిమబ్బు
మెరపులా మెరిసిందిలే
వెలుగులో ఒరసిందిలే
ఈఅనుభవం భార్యకళ్ల
కదలులాడిన వేళ
కందలించిన వేళ

అంటాడు కవి. ఈ పద్ధతినే సింబలిస్టు పద్ధతిగా ఫ్రెంచి రసజ్ఞులు కొనియాడుతారు. నేనింతకు ముందు రాసినతెలుగు కవిత్వంలో సింబలిస్టు ధోరణి అనే వ్యాసం శ్రీశ్రీకి మద్రాసులో జరిగిన సన్మాన సందర్భంలో ప్రచురించిన ప్రత్యేక సంచికలో వెలువడింది.

ఈనాడు కవులలో అధిక సంఖ్యాకులు వాడుక భాషలోనే కవిత్వం రాస్తున్నారు. పూర్వకవులను యువతరం చదవడమే మానివేసి నట్టుగా వుంది. వచన కవిత్వం వెల్లుబుకుతోంది. మినీ కవిత్వమని క నూతన ప్రక్రియ బయట పడ్డది. ఇంతకుముందే గురజాడ వాడుక నను ప్రవేశపెట్టేడని చెప్పేను. అతను అభ్యుదయ పథాన్ని చేబట్టి సాంఘిక దురాచారాలను, అర్థరహితనమ్మకాలను దుయ్యబట్టాడు. మన పురోగతికి పాటించవలసిన విధులను విశదీకరించాడు. నారాయణబాబు, శ్రీశ్రీలు గురజాడవలన, ఆధునిక ఆంగ్ల, ఫ్రెంచి కవుల వలన ప్రభావితులయారు. ఒకే కాలంలో భావకవిత్వానికి నిశితాతి నిశితంగా ఎదురు తిరిగారు. అయితే నారాయణబాబు, శ్రీశ్రీల పద్ధతులు వేరు వేరు. వాచ్యంతో శ్రీశ్రీ ప్రజానీకాన్ని ఉత్తేజపరచగలిగాడు. పాశ్చాత్య భాషలలో వలె తెలుగులో అంత్యప్రాస ఆదినుంచీ వుంది. ఆంగ్ల కవిత్వ శయ్యలను తెలుగువారి జన్మసొత్తు అనేటట్టు తెలుగులో మలచ గలిగిన దిట్ట. సంస్కృత పదాలను తెలుగు విరుపులతో జనసామాన్య భావోద్వేగాన్ని ప్రజ్వలింపజేయగల నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఇతని కవిత్వంలో సింబలిస్టు ధోరణి మెండుగా వుంది. ఇంతటితో తెలుగు కవిత ప్రజల భాషకు అనువైన పుంతలను ఏర్పరచుకుందని చెప్పవచ్చు. నారాయణబాబుది పరోక్షపద్ధతి. నినాదాలను విసర్జించి, సిద్ధాంతాల జోలికి పోకుండా పెట్టుబడిదారీ వ్యవస్థలో అధిక సంఖ్యాకుల దీనావస్థను విగ్రహస్పష్టి పర మొనర్చి, సుఖసంపదలకు నోచుకున్నవారిలో సైతం మానసికమైన మార్పును తేగలిగేటట్టు తన కవితను మలచగలిగేడంటే అతిశయోక్తి కాదు. ఏ పదానికైనా అందరికీ తెలిసిన అర్థమొకటుంటుంది. గాని పూర్వకవులు ప్రయోగించిన సందర్భాలను బట్టి వివిధ తళుకులను సంతరించు కుంటుంది. ఈ తళుకులెరిగిన కవి తన పదబంధాలలో వివిధ స్మృతులను పొందుపరచి, శబ్దాంతర సంగీత గుణగ్రహణ పారీణత ద్వారా పఠిత హృదయ పరిణతిని సంగీత స్థాయికి గొనిపోగల పదకూర్పుతో రసాతి శయాన్ని సాధించి తీరుతాడు. ఇట్టి నేర్పరితనం నారాయణబాబుకు అమితంగా వుందనక పీలులేదు. భావకవిత్వానికి ఎదురు తిరగడంలో నారాయణబాబు, శ్రీశ్రీలిద్దరూ ఆద్యులే అనాలి. పద్ధతులు వేరైనా కళాకౌశలంలో ఒకరికొకరు తీసిపోరు. నేనింతకు ముందు వీరిద్దరిని గూర్చి విపులంగా రాసివున్నాను. అయితే శ్రీశ్రీ అధివాస్తవికతను గూడా చేపట్టి కొన్ని కవితలు చేశాడు. ఇంగ్లీషు లిమరిక్కులను 'లిమ బుక్కులు'గా తెలుగులో స్వతంత్రించి రాశాడు. నారాయణ బాబు కూడా 'మౌనశంఖం' అన్న అధివాస్తవిక కవితను స్వాప్నికంగా మలిచాడు. స్వప్న జగత్తు సర్రియలిస్టు భూయిష్టమనవచ్చు. ఇంతేకాక సర్రియలిస్టు ప్రయోగాలు చేశాడు. 'ఐరావతపు పంది అర్ధచంద్రుడు', 'పాపారాయుడు తమస్సు' అన్న ప్రయోగాలు ఈ కోవకు చెందినవే.

మనదేశంలో చాలాకాలంనుండి ఇంగ్లిషుభాష నెలకొనివుంది. ఇంగ్లీషును విస్మరించడం ఈ కాలంలో మనకు శ్రేయస్కరం కాదు. ఈ భాష ప్రపంచభాషగా పరిణమించింది. మన భాషకు, మన సాహిత్యానికి, మన శాస్త్రజ్ఞాన విస్తృతికి అత్యవసరం. పాశ్చాత్యులు సంస్కృతం అధ్యయనం చేసి రెండు భాషాశాస్త్రాలను సృష్టించారు. మొదటి భాషాశాస్త్రం 'ఫిలాలజీ' అంటారు. ఈ శాస్త్రం ప్రపంచభాషల ఉత్పత్తి, వాటి సంబంధ బాంధవ్యాలను వివరిస్తుంది. రెండవది పాణిని వ్యాకరణాన్ని నిశితంగా పరిశీలించి భాషలను త్వరిత గతిని నేర్చుకునే పద్ధతులను బోధించ నేర్చింది. ఈ శాస్త్రాన్నే 'లింగ్విస్టిక్స్' అంటారు. మనం ఇంగ్లీషును దేశభాషలలో ఒకటిగా పరిగణించి క్షుణ్ణంగా అభ్యసించడం బహుళార్థసాధకం. పాశ్చాత్య భాషజ్ఞులు సంస్కృతాన్ని, గ్రీకు, లాటిన్ భాషలను, ప్రాచీన పారశీక భాషను, అరబిక్ హీబ్రూలను నేర్చిన గాని సంపూర్ణ పాండిత్యం సంపాద్యం కాదని విశ్వసిస్తారు. మనం సంస్కృతాన్నైనా సరిగా నేర్వవలసిన ఆవశ్యకతను గుర్తించక పోవడం విచారకరము.

మధురానుభూతి

ప్రియా!

నీవులో నేను

నేనులో నీవు

లీనమైన ఈ శుభగడియల్లో

కొండగాలి తిరిగె

ముత్యాల జల్లు కురిసె

రతనాల మెరుపు మెరిసె

పగలే వెన్నెల విరిసె

లాహిరి లాహిరి లో జగమే ఊయలగా ఊగె!

మనసున మల్లెల మాలలె పొరలె

కన్నుల వెన్నెల డోలలే కదిలె!

తనువు తలిరు తోరణమై సుమదామమే ఆయె!

గోదావరి వరదలాగా కోరికలే చెలరేగ!

ఏదో హాయియో భారమో

ఎదను కాల్చసాగె!

వెలుగు - చీకటి

ఉజ్జ్వలమైంది వెలుగని

గొప్పగా వర్ణిస్తుంటారు

కాని

అది ఉజ్వలమైందా?

దాని కాంతిలో

ఒళ్ళు నజ్జు అయ్యేటట్లు కష్టించినా

జానెడు పొట్టనే నిండదు!

మీదు మిక్కిలి చిక్కులు - చీకాకులు కలుగుతుంటాయి

మరి అలాంటిది వెలుగా?

కాదు - చీకటే !!

అసహ్యమైంది చీకటని

అనాదరంగా మాట్లాడుతుంటారు

కాని

అది అసహ్యమైందా ?

దాని చేరువలో

గుండెల్ని తొలిచివేసే గొడవలన్నింటిని మరచిపోయి

ఖుషీగా నిద్రించవచ్చు

హాయిగా నిషాగా ఉండవచ్చు

మరి అలాంటిది చీకటా ?

కాదు - వెలుగే !!

శ్రీ కె. కిశోరుబాబు
శ్రీ కె. అశోకుబాబు

డా॥ సూర్యదేవర రవికుమార్

మన పాడి పరిశ్రమ

ప్రపంచములోగల పశువులలో సుమారు నాల్గవవంతు భారత దేశమున గలవు. కాని భారతదేశము పాలఉత్పత్తిలో ప్రపంచములోని చిన్నచిన్న దేశాలతో కూడ పోల్చలేని పరిస్థితిలో ఉన్నది. మన దేశంలోని 1055 లక్షల ఆవులు సంవత్సరానికి 52,900 టన్నుల పాలను ఉత్పత్తిచేస్తే, జపాన్‌లో 18.5 లక్షల ఆవులే 48 లక్షల టన్నులపాలను ఉత్పత్తిచేస్తున్నాయి. నెథర్‌లాండ్స్‌లో అయితే కేవలం 74 వేలఆవులు 3.౫ లక్షల టన్నుల పాలను ఉత్పత్తి చేస్తున్నాయి. దీనినిబట్టి పాలఉత్పత్తిలో మన పశువుల స్థోమతను, ప్రపంచంలో మనదేశస్థానాన్ని సులభంగా ఊహించుకొనవచ్చును.

మన గోజాతి మనదేశవాతావరణమునకు తగినట్లుగా, వనరులకు ఇముడునట్లుగా కొన్ని ప్రత్యేక లక్షణములతో రూపొందింప బడినది. ఆ లక్షణములివి.

మన గోజాతి శరీరపరిమాణము పెద్దది. దీనికితోడు విస్తృతమైన ఉపరితల ప్రదేశాన్ని కలిగించే గంగడోలుబాగా అభివృద్ధి చెందినది. సింధునాగరికతా కాలమునాటి గోజాతిరూపాలను గమనించిన ఈ విషయము స్పష్టమగును. గంగడోలుతోపాటు చర్మపు ముడుతలుకూడా ఎక్కువగా యేర్పడినవి. స్వేదగ్రంథులీ జాతి పశువులలో దట్టముగాను, పెద్దవిగాను ఉండి ఎక్కువ చెమటను బయటకు పంపుటద్వారా శరీర ఉష్ణోగ్రతను స్థిరముగా ఉంచుటకు సహాయపడుచున్నవి. శరీరమున వెంట్రుకలు తక్కువగాఉండి చర్మము నునుపుదేలి మెరుస్తుంటుంది.

వాలుమలుగులు ఈ పశువుల ప్రత్యేక లక్షణము. వీటికి రోగ నిరోధక శక్తి ఎక్కువ. మాతృప్రేమ అధికము. సంతానోత్పత్తి దశకు ఆలస్యముగా వచ్చును. ప్రజనన సామర్థ్యము, పాలఉత్పాదక శక్తి తక్కువ. మితాహారాన్నేగాని, అమితాహారాన్ని జీర్ణించుకొనేశక్తి, ముడి ఆహారపదార్థాన్ని పాలుగామార్చే శక్తితక్కువ. మృగశిరవచ్చే దాకా ముసిలెద్దుకు రంకెవేసే ఓపికకూడా ఉండదని యీ ఉష్ణదేశంలో వర్షాకాలంలోనే తప్ప ఇతర కాలాలలో సహజంగాలభించే పచ్చిగడ్డి తక్కువ.గడ్డి విస్తారంగాలభించే కాలంలో విరివిగాతిని, తిన్న ఆహారాన్ని క్రొవ్వురూపంలో నిల్వచేసుకొని, కరువుకాలంలో దానిని శరీరపోషణకు వాడుకొనవలసిన అవసర మేర్పడటముతో పెద్దపెద్ద మూపురాలు క్రొవ్వుతో బలిసిన చర్మం యీజాతికి ఏర్పడినాయి. మూపురం గల గోజాతికి భారతదేశమే ప్రథమ నివాసస్థానము (ఆఫ్రికా ఖండము ప్రథమ నివాసస్థానమని కొందరి అభిప్రాయము). పశుజాతికూడా ఇతర ప్రాణికోటివలెనే వాతావరణ పరిస్థితుల, వంశపారంపర్య లక్షణాల కలయికలతో రూపొందింప బడినదే.

మనదేశంలోని సింధునాగరికతావశేషాలలో ఎంతో అభివృద్ధి చెందిన గోజాతి కనుగొనబడినది.'గోవులు పొదుగులతో బలిసియున్నవి' అని, 'అధికమైన వెన్నను ధరించుచున్నవని' వేదాలలో చెప్పబడినది. పశువులే ధనముగా, ఆరు ఆవులైనా లేనివాడు బీదవాడుగా పరిగణింప బడిన ఆరోజులలో గోజాతి ఎక్కువపాలను ఉత్పత్తిచేసేవని, శ్రద్ధగా పోషింపబడుతుండేవని తెలుస్తున్నది. కాలక్రమేణ అనేక కారణముల వలన మనదేశంలోని గోజాతి పాల ఉత్పత్తి స్థోమత తగ్గిపోయినది.

ఇటువంటి పశువులతో రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్న దేశజనాభాకు అవసరమైన పాలను ఉత్పత్తిచేయటం సాధ్యంకాదు. తరతరాలుగా, శతాబ్దాలుగా గోజాతి పోషణలో భారతీయులకు ఆర్థిక దృష్టిలేదు. గోజాతిని ఎంతో పవిత్రమైన జాతిగా ఉన్నతపీఠమేసి పూజించటమేగాని, దాని పోషణలో లాభనష్టాల ప్రసక్తి కనబడదు.

మన వాఙ్మయంలో గోవులు ఎంతో పవిత్రమైనవిగా మంగళ కరమైనవిగా పేర్కొనబడినవి. గోమయము, గోక్షీరము పవిత్రమైన నదులతో పోల్చ బడినవి. కాశీఖండములోని యీ గోసంకీర్తనను గమనించండి.

వినుడనయంబు గోవులు పవిత్రము గోవులు మంగళంబు ద
ర్శన ఖురటంకశృంగ పరిఘట్ట దళద్ధరణీ రజశ్ఛటన్
కనుకని నవ్వుచుండుఁ బుర ఘస్మరమూర్ధ జలాటవీ నట
ద్ఘనపథ సింధువార్ఘహరి గర్వభరార్భటిఁ బావనోన్నతిన్.

ప్రతివసియించు గోవుల ఖుర్రాగ్రములందు సమస్తతీర్థ సంతతియును నర్వపర్వత వితానము గొమ్ముల మధ్యసీమ న
ద్భుత చరితుండు శంకరుఁడు భూధరకన్యయుఁ దానునుండుఁ ద
ద్విత తకుచేభ కుంభపరిదిగ్ధ పటీర పవిత్ర వక్షుఁడై.

గోమయం యమునా సాక్షా ద్గోమూత్రం నర్మదా శుభా
గంగాక్షీరస్తు యాసాం వైకిం పవిత్ర మతః పరమ్.

గవామంగేషు తిష్ఠన్తి భువనాని చతుర్దశ
యస్మా త్తస్మాచ్ఛివం మేస్యా దిహలోకే పరత్రచ.

మహాభారతమున గోప్రభావ మాహాత్మ్యములు వివరింపబడినవి. "సారములగు గోవులు...సౌఖ్యముఁజేర్చు" నని, "గోవు పవిత్రంబు గోవు హవిర్జన్మభూమి గోవరయఁగా భూతములకు నెల్ల నాధారభూతమౌ నీడ్యవస్తు, వతుల లక్ష్మికి మూల, మత్యంత దురిత జలనిధికి నోడ, నిర్జరసద్మమునకు నిచ్చెన, సురలకు మనికిపట్టు" అని కొనియాడబడినవి.

గోజాతి విషయమై మనకున్న ఈ సంప్రదాయ దృష్టిని, ప్రేమాభిమానాలను వీడకుండానే, గోపోషణలో లాభ నష్టాలను బేరీజు వేసికొని, ఆర్థికంగా వ్యక్తి, దేశము పరిపుష్టి చెందేవిధంగా మన దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరము ఈనాటి కాలానుగుణము.

పాలు సంపూర్ణాహారముగా చెప్పబడినవి. 'ఓ పాలయందుండు ఉదకములారా! మీరు ప్రపంచమును భరించు వారలగుడు' అని వేద మంత్ర మాసించుచున్నది. మనిషికి రోజుకు సగటున 284 గ్రాముల పాలు అవసరమని భారతీయ వైద్య పరిశోధకసంస్థ (ఐ.సి.యం.ఆర్) సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు ప్రకారం మనదేశంలోని ప్రజలకుపాలను సరఫరా చేయాలంటే సంవత్సరానికి 550 లక్షల టన్నుల పాలను ఉత్పత్తి చేయవలసి ఉంటుంది. కాని మన దేశంలో పెరుగుతున్న జనాభాతోపాటు పాల ఉత్పత్తి పెరగక పోవటముతో తలసరి వాడకం నానాటికి తగ్గిపోతున్నది. 1951లో తలసరి వాడకం 132గ్రాములుగా ఉంటే 1961 నాటికి 123 గ్రాములకు 1971 నాటికి 105 గ్రాములకు దిగజారిపోయింది. ఈ దుస్థితి తొలగాలంటే పాలు సముద్రంలా పొంగాలి. కాని ఈనాటి మన దేశవాళీ పశుజాతులతో పాలసంద్రాలను ప్రవహింపచేయటం సాధ్యంకాదు. ఇది పొదుగులలో పాల సంద్రాలను దాచిన విదేశీ గోజాతులవలననే సాధ్యం కావలసిఉన్నది.

విదేశీ గోజాతులు 15-30°c ఉష్ణోగ్రతలో పుట్టిపెరిగాయి ఆ వాతావరణములో నివసించే ఆ జాతుల లక్షణాలు ఇవి.

ఎత్తుమలుగులు గలిగిన యీ జాతి పశువులలో గంగడోలు, చర్మపుముడుతలు చాల తక్కువ. చర్మము రోమపూరితమై శీతల బాధను తట్టుకొనటానికి అనువుగా ఉంటుంది. ఈ పశువులకు రోగనిరోధకశక్తి తక్కువ. రోగకారక సూక్ష్మజీవులకు సులభముగా వశమౌతాయి. మాతృప్రేమ చాల తక్కువ. లేత వయసులోనే సంతానోత్పత్తి స్తోమతను కలిగి ఉంటాయి. ప్రజననసామర్థ్యమధికవ పాల ఉత్పాదక శక్తి ఎక్కువ. ఆహారాన్ని అమితంగా తిని జీర్ణించుకొనుశక్తిని గలిగియుండును. ముడి ఆహారాన్ని పాలుగా మార్చు సామర్థ్య మధికము.

ప్రపంచంలో ఈనాడు పశుపరిశ్రమలలో అగ్రస్థానాన్ని పొందిన దేశాల చరిత్రను గమనిస్తే ఎంతో అద్భుతమనిపిస్తుంది. పాల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న న్యూజిలాండ్‌లోను ఉన్ని ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న ఆస్ట్రేలియాలోను అమెరికాసంయుక్త రాష్ట్రాలలోను మొట్టమొదట బ్రిటిష్‌వారు కాలుపెట్టేసరికి అక్కడ సరైన గోజాతిగాని గొర్రెలమందలుగాని లేవు. బ్రిటిష్‌వారు తమవెంట తమతమ పశువులను తీసుకువెళ్ళారు. వారు శ్రద్ధ తీసుకొని అభివృద్ధి పరిచిన జాతులే ఈనాడు ఆయాదేశాలను ప్రపంచంలో ప్రథమశ్రేణిలో ఉంచుతున్నాయి. ఒక పశుజాతిస్థాయిని బాగా అభివృద్ధి పరిచేందుకు 40సం॥ల కాలం సరిపోతుందని అంచనా. మనదేశంలో చరిత్రకు అందిన తొలి రోజులనుంచీ పశుజాతులున్నాయి. అవి ఆనాడు ఉత్తమ జాతి పశువులే కావచ్చును. కాని అవి దేశ ఆర్థిక స్థితిగతులను, యజమానుల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచే విధంగా రూపొందింపబడలేదు. అందుకు మనదేశీయులు తరతరాలుగా ఉత్సాహాన్నీ, ఆసక్తినీ చూపలేదు. ప్రాచీనకాలంలో వ్యక్తిసంపద అతనికి గల పశువుల సంఖ్యపైనే ఆధారపడినప్పటికీ ఆ పశువుల ఉత్పాదకశక్తిని అభివృద్ధి పరచేందుకు తగినంత కృషి జరగలేదు.

మొన్నమొన్నటివరకు భారతదేశం ఎడతెరపిలేని రణరంగమే. యుద్ధంలో విజయం, పరాజయం ప్రధానంగా అశ్వ, గజ బలాలపై అనుసరించి ఉండేది. అయినప్పటికి ఏ రాజు మన దేశంలోనే ఉత్తమ అశ్వజాతిని, గజజాతిని రూపొందించేందుకు, ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నం చేసినట్లు కనిపించదు. ఎంతధనమైనా వెచ్చించి అరబ్బు దేశాలనుంచి అశ్వాలనూ, సింహళంనుంచి ఏనుగులను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకొనేవారేగాని తమ అధీనంలో ఒక మేలుజాతిని ఉత్పత్తి చేసే పనికి వారు పూనుకోలేదు. పశుజాతిని రూపొందించటం లేక అభివృద్ధిపరచటం ఒక బృహత్ప్రణాళిక. కొన్ని సంవత్సరాలకుగాని దాని ఫలితాలు కనిపించవు. యుద్ధ ప్రయత్నాలు లేకుండా కొన్ని సంవత్సరాలైనా ఉన్న రాజీలేనప్పుడు ఈ విధమైన పశుజాతి అభివృద్ధి కార్యక్రమాలను రాజులు చేపట్టకపోవటం సహజమే. ఇక సకాలంలో

వర్షాలు లేకపోవటం, పశువుల మేతకు కరువురావటం, విపరీతంగా జృంభించే అంటురోగాలు- ఈ ఈతిబాధలతో సతమతమయ్యే సాధారణ పశుకామందుకు ఈ విషయంలో తగినంత శ్రద్ధలేక పోవడమూ సహజమే.

ఈస్టిండియా కంపెనీ మనదేశంలో కాలుపెట్టినప్పటినుండి కావసరములకై పశుజాతుల స్థావరములనేక మేర్పాటుచేయబడినవి. వీటితోపాటు పశుగ్రాసాభివృద్ధికి కూడా విస్తారమైన భూభాగము పత్యేకించబడినది. దీనితో పశుజాతులపై కొంత శ్రద్ధఏర్పడి ప్రత్యేక పరిశోధనకు అవకాశము లభించినది. 1929 నుంచి మన దేశంలో పరిశోధనలు విస్తరించాయి. మన దేశంలోని పశుజాతుల పుగ్రాభివృద్ధికి కృషి ప్రారంభమైనది.

మన దేశంలో 26 ప్రధానమైన గోజాతులున్నాయి. ఇవన్నీ ప్రధానంగా వ్యవసాయపు పనులలో- ఉపయోగించటానికే పోషింపబడుతున్నాయి. ఒంగోలు వంటి కొన్నిజాతులు వ్యవసాయానికి, పాల ఉత్పత్తికి కూడా పేరుపొందినా పాల ఉత్పత్తిలో విదేశీ గోజాతులతో పోల్చదగినవిగా లేవు.

మనదేశంలోని ఉత్తమమైన గోజాతులు అత్యుత్తమ పోషణలో సగటున ఈతకు 700 నుండి 2000 కిలోల పాలను మాత్రమే ఇవ్వ గలుగుతాయి. ఇవి గ్రామాలలో రైతుల ఇళ్ళలో సాధారణ పోషణలో ఇచ్చేపాలు చాల తక్కువ. ఒంగోలుజాతి ఆవు మొదటి ఈతలో ఇచ్చే సగటుపాలు 815 కిలోలుగా అంచనా వేయబడింది. మన దేశంలోని ఆవుల సగటు పాలఉత్పత్తి సంవత్సరానికి 173 కిలోలు. ఇటువంటి ఆవులు ఈ దేశస్థుల పాల అవసరాలను తీర్చజాలవు. సాధారణ రైతుల పోషణలో సగటున ఈతకు 2000 కిలోల పాలను ఉత్పత్తి చేయగల ఆవులు ఉంటేతప్ప మన పాల అవసరాలు కొంతవరకైనా తీరవు. ఈ లక్ష్యాన్ని సాధించటానికి సగటున ఈతకు 5వేల కిలోల పాలను ఉత్పత్తిచేసే విదేశీ గోజాతులతో మన గోజాతిని సంకరపరచటం తప్ప మార్గాంతరం లేదు. ఇందుకు జెర్సీ, ఫ్రీషియన్‌వంటి విదేశీ గోజాతులు అనుకూలమైనవి. కనుకనే ఈ దేశంలోని ఒంగోలువంటి వివిధజాతుల ఆవులను, ఇతర నాటు ఆవులను విదేశీజాతుల ఆబోతుల వీర్యముతో సంకరపరచి సంకరజాతి ఆవులను ఉత్పత్తి చేయటం మన జాతీయ విధానంగా నిర్ణయించబడినది. దీనికి కృత్రిమ గర్భోత్పత్తి విధానమే ఏకైక సాధనముగా అంగీకరించబడినది.

కృత్రిమ గర్భోత్పత్తి విధానం రెండవ ప్రపంచ యుద్ధకాలంలో రూపొందింపబడినది. మన దేశంలో కృత్రిమ గర్భోత్పత్తి విషయమై ప్రారంభమైన కృషి ప్రోత్సాహకరంగా ఉండటంతో 1945-47 సం॥ లలో బెంగుళూరు, కలకత్తా, పాట్నాలలో కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రాలు నెలకొల్పబడినవి. కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా మనదేశంలో మొట్టమొదటి సంకరజాతి జెర్సీ దూడ బెంగుళూరులో పుట్టింది.

ఐరోపా దేశాలలో పాల ఉత్పత్తికి పేరుగాంచిన ప్రధానమైన గోజాతులు నాలుగు. అవి ఫ్రీషియన్, జెర్సీ, బ్రౌన్‌స్విస్, రెడ్‌డేన్‌లు. ఈ జాతులను గురించి క్లుప్తంగా తెలుసుకొందాం.

ఫ్రీషియన్

ఈ జాతి ఆవులకు హాలెండ్ పుట్టినిల్లు. డచ్‌లోని ఫ్రీష్‌లాండ్‌లో అభివృద్ధి పరచబడిన ఈ ఆవులు ఫ్రీషియన్ ఆవులుగా ప్రపంచ ప్రఖ్యాతి బొందాయి. ఉత్తర అమెరికాలో ఇవి హాల్‌స్టెయిన్ అని పిలవబడటముతో 'హాల్‌స్టెయిన్ ఫ్రీషియన్' అను వ్యవహారనామ మేర్పడినది. నలుపు, తెలుగు రంగుల కలబోతతో ఉండే ఈ ఆవులు పాల ఉత్పత్తిలో ఛాంపియన్‌లు. వీటి తోకకుచ్చు తెలుపు. ఈ జాతి ఆవుల పాలు తక్కువ వెన్నశాతాన్ని(సగటున 3.6) గలిగి ఉంటాయి. ఈ జాతిలో ఛాంపియన్ ఆవు 365 రోజులకు 19,262 కిలోల పాలను ఉత్పత్తి చేసింది.

జెర్సీ

ఇంగ్లీషు ఛానల్‌లోని జెర్సీ దీవులలో అభివృద్ధి పరచబడిన ఈ జాతి విదేశీగోజాతులలో శరీరపరిమాణమున చిన్నది. లేతఎరుపునుండి నలుపుదాకా దీని శరీరవర్ణము వివిధంగా ఉంటుంది.తోకకుచ్చు తెలుపుగా గాని, నలుపుగాగాని ఉంటుంది. ఈ జాతిలో ఛాంపియన్ ఆవు 365 రోజులకు 11,984 కిలోల పాలను ఉత్పత్తి చేసింది దీని పాలు లేత గులాబీ రంగులో ఉంటాయి. వెన్నశాతం 5.3.

బ్రౌన్‌స్విస్

ఇది స్విట్జర్లండ్‌లో రూపొందింపబడిన జాతి. పాల ఉత్పత్తితో పాటు, మాంసోత్పత్తికి కూడా ఈజాతి పేరుగాంచినది. దీని పాలు నాలుగు శాతం వెన్న గలిగి తెల్లగా ఉంటాయి. ఈ జాతిలో ఛాంపియన్ ఆవు 365 రోజులకు 15,841 కిలోల పాలను ఉత్పత్తి చేసింది.

రెడ్‌డేన్

ఇది డెన్మార్క్‌లో రూపొందింపబడిన జాతి. ఈజాతి ఆవుల సగటు పాల ఉత్పత్తి (305 రోజులకు) 4522 కిలోలు.

పై నాలుగు జాతులు వివిధ దేశాలలో ఆయాదేశ వాతావరణ పరిస్థితుల ననుసరించి ప్రత్యేకంగా రూపొందింపబడినవి. ఫలితంగా, వివిధ దేశాలలో వీటిపాల ఉత్పత్తిలో వైవిధ్యం ఏర్పడింది. ఉదాహరణకు అమెరికాలోని ఫ్రీషియన్ ఆవులు సగటున 305 రోజులకు 6433 కిలోలపాలను ఉత్పత్తిచేయగా అదే ఫ్రీషియన్ ఆవులు రష్యాలో సగటున 305 రోజులకు 3883 కిలోల పాలను మాత్రమే ఉత్పత్తి

చేస్తున్నాయి. మనదేశంలో రికార్డు చేయబడిన జెర్సీ ఆవు మొదటి ఈత పాల ఉత్పత్తి 5793 కిలోలు. కాగా ఫ్రీషియన్‌ది 5256 కిలోలు, రెడ్ డేన్‌ది 3182 కిలోలు, బ్రౌన్‌స్విస్‌ది 2121 కిలోలు. జెర్సీజాతితో మన దేశంలోని గోజాతిని సంకరపరచటం మనదేశ వాతావరణ దృష్ట్యా చాల అనుకూలమైన విధానముగా నిర్ణయించబడినది. ఫ్రీషియన్ జాతి ప్రపంచంలో అత్యధికంగా పాలను ఉత్పత్తి చేసే గోజాతిగా పేరు పొందటముతో జెర్సీ, ఫ్రీషియన్ జాతులతో సంకర పరచిన గోజాతిని రూపొందించే ప్రయత్నాలు మన దేశంలో విరివిగా జరుగుతున్నాయి.

ఈనాడు మనదేశంలో ఉత్పత్తి అయ్యేమొత్తం పాలలో సగం పాలను గేదెలే ఉత్పత్తి చేస్తున్నాయి. అసలు ప్రపంచంలోని మొత్తం గేదెల సంఖ్య (110మిలియన్లు) లో సగానికి పైగా (52.8మిలియన్లు) మనదేశంలోనే ఉన్నాయి. బ్రహ్మదేవుడు ఆవులను సృష్టిస్తే విశ్వామిత్రుడు బర్రెజాతిని సృష్టించాడని చెపుతారు పెద్దలు. మనదేశంలోని మహిషజాతిని 'ఇండియన్ వాటర్ బఫలో' అంటారు. పేరుకు తగినట్లుగానే వీటికి, నీటికి ఎంతోబంధమున్నది. నీటి గుంటలలోను, కాలువలలోను గంటలతరబడి పడిదొర్లటం వీటికి సరదా! కాళిదాసు ఋతుసంహారంలో ఈజాతి జలతృష్ణను చక్కగా వర్ణించాడు.

సఫేన లోలాయత వక్త్ర సంపుటం
వినిస్సృతా లోహిత జిహ్వా ముమ్ముఖం
తృషాకులం నిస్సృత మద్రిగహ్వరా
దవేక్ష్యమాణం మహిషీకులం జలమ్.

ఉష్ణతాపం లైంగిక వాంఛని, ప్రజనన సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. మహిషజాతి ఉష్ణతాపాన్ని భరించలేవు. వాతావరణంలోని అధికమైన వేడి వీటి ఉత్పాదక శక్తిపై విపరీత ప్రభావాన్ని చూపిస్తుంది. వాతావరణం చల్లబడితేనే తప్ప ఈసజీవయంత్రాలు సక్రమంగా పనిచేయవు.

కనుకనే, సంవత్సరంలోని అన్నినెలలలోను ఒకేస్థాయిలో ఈ బర్రెజాతిద్వారా పాలఉత్పత్తి జరగటంలేదు. శీతాకాలంలో అత్యధికంగాను, వేసవిలో అత్యల్పంగాను బర్రెపాలు ఉత్పత్తి కావటంతో దేశంలోని పాలఉత్పత్తిలో ఒక అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడింది. వేసవి కాలంలోకూడా బర్రెజాతి పాల ఉత్పత్తిని ఒక స్థాయికి తగ్గకుండా చూడాలంటే వాటిపోషణలోని మెలకువలను గ్రహించాలి. ఉష్ణతాపాన్ని తట్టుకొనేవిధంగా పశువులపాకలను ఏర్పాటు చేసుకోవటం, తగినంత నీటివసతిని గలిగిఉండి పశువు పరిసర వాతావరణ ఉష్ణోగ్రతను పశువు శరీర ఉష్ణోగ్రతకు దగ్గరగా ఉంచగలగటం, పచ్చిగడ్డిని సమృద్ధిగా సమకూర్చటం వంటి చర్యలద్వారా వేసవిలోకూడా పశువుల పాల ఉత్పత్తి, ప్రజనన సామర్థ్యాలను తగ్గకుండా చూడవచ్చు.

మన దేశంలోని గేదెలలో ఆరుప్రధానమైన జాతులున్నాయి. వీటిలో ముర్రాజాతి ప్రముఖమైనది. ఢిల్లీ,పంజాబ్,హర్యానా ప్రాంతాలు ఈజాతికి పుట్టినిల్లు. వీటిపాలలో వెన్న శాతం అధికంగా ఉంటుంది. దేశంలోని నాటుగేదెలను ఈజాతితో సంకరపరచి అభివృద్ధిచేయుచున్నారు.

రైతుకు లాభసాటికాకుండా, అంటురోగాల వ్యాప్తికి దోహదం చేస్తూ, దేశంలోని భూభాగం భరించలేనంతగా ఉన్న మనదేశంలోని నాసిరకం పశువుల మందలను త్వరితగతిని మేలుజాతి పశుసంపదగా రూపొందించుకొన వలసిన ఆవశ్యకతను ప్రతి పశుకామందు గుర్తి తదనుగుణంగా వ్యవహరించాలి.

అయితే ఒక్కమేలుజాతి పశువులను రూపొందించుకోవటం ద్వారానే మనం మన పాల అవసరాలను తీర్చుకోగల మనుకోవటం పొరపాటు. ఉత్తమ జాతిని రూపొందించటంతోపాటు వాటికి తగినంత పోషకాహారాన్ని సమకూర్చి శ్రద్ధగా పోషించినప్పుడే మనకు ఆశించిన ఫలితాలు లభించగలవు.

మానవున కాహారముగా పనికిరానిగడ్డి, గాదములనుపయోగించుకొని మానవునికి కావలసిన పోషకాహారాన్ని మేల్తరముగా ఉత్పత్తి చేయగలిగేది జంతుజాలములోకెల్ల పాడిపశువు ఒక్కటే. పాడిపరిశ్రమ ఆర్థికంగా లాభదాయకంగా ఉండాలంటే పశువు ఉత్పత్తి స్థోమత,దానికి సమకూర్చే పోషకాహారం, దాని పోషణలో శ్రద్ధ ప్రధాన పాత్ర వహిస్తాయి. పాల ఉత్పత్తి ఖర్చులో సగానికిపైగా పశువుకిచ్చే పోషకాహారానికే అవుతున్నది. పశువుకిచ్చే పోషకాహారాన్ని ఉత్పత్తిచేసే ఖర్చు ఎంతతగ్గితే పాలఉత్పత్తి అంత లాభదాయకంగా ఉండగలదు. దీనికి హైబ్రిడ్ నేపియర్, పేరాగడ్డి, లూసర్న్, అలసంద, జనుము మొదలగు పుష్టికరమైన పచ్చిమేతలు విస్తారంగా ఉత్పత్తి చేయవలసి ఉంటుంది. ఈ పచ్చిమేతలను సమృద్ధిగా సమకూర్చ గలిగినపుడు పాడిపశువుకిచ్చే మిశ్రమదాణాను తగ్గించవచ్చు. దీనివలన పాడిపశువుకు సమకూర్చే పోషకాహారపు ఖర్చుతగ్గి పాలఉత్పత్తి లాభదాయకంగా ఉండగలదు.

అయితే, మనదేశంలోగల పెరిగే, పాలిచ్చేపశువులకు తగినంత పుష్టికరమైన పచ్చిమేత ఈనాడు సమకూరటంలేదు. దేశంలోసాగుబడి అయ్యేభూభాగంలో కేవలం 4.4 శాతం భూమిలోమాత్రమే పచ్చిమేత పైరులువేయడమే దీనికి ప్రధానకారణము. ఈ భూభాగంలో ఉత్పత్తి అయ్యే పచ్చిమేత మనదేశంలోని మూడవవంతు పశువులకు మాత్రమే సరిపోతుంది.

ఈ పరిస్థితులలో పాడిపశువుల పోషకాహార అవసరాలను తీర్చలేని పశుకామందులు ఉత్తమ జాతి పశువులను పోషించటం లాభదాయకం కాదు. పుష్కలంగా పచ్చిమేతను పండించగలవారే పాడి పరిశ్రమను చేపట్టటం మంచిది. అప్పుడే వ్యక్తి ఆదాయముతోపాటు దేశంలో పాల ఉత్పత్తి కూడా అధికమౌతుంది. పాలవెల్లువ దేశాన్ని ముంచెత్త గలుగుతుంది. పాడి పశువుల సంఖ్యలోనే కాక పాల ఉత్పత్తులలోకూడా భారతదేశం ప్రపంచంలో ప్రముఖ స్థానాన్ని అలంకరించగలుగుతుంది.

సఖీ శిరోజాలు విరబోసుకో

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు

సఖీ శిరోజాలు విరబోసుకో
నీలిమ నలుదెసలు వ్యాపించనీ

నీలి ఛాయలో నిండుగా
నీ ముఖలావణ్యం చూసుకోనీ.

తెల్లని వెన్నెల కన్నా
నలుపే మిన్నయనీ

శ్యామలమే సుందరమని
లోకానికి తెలిసిపోని.

'శ్యామల' మా జాతిది
శ్యామసుందరుడు మా వాడనే

తత్వం తలకెక్కిన శిరోజాలు
మెరుస్తూ మురుస్తున్నవి.

అవి తెల్లబడితే
ముఖం వెలవెల బోతుంది.

సఖీ శిరోజాలు విరబోసుకో.

శ్రీ చివుకుల అనంతపద్మనాభ శాస్త్రి

లింగాల శిలాశాసనము

ప్రాచీన శిలాశాసనములు, ముఖ్యముగా తెలుగు భాషకు సంబంధించినంతవరకు, కడప జిల్లాలో ఎక్కువగా దొరికినవి. వాటిలో కలమళ్ల, ఎఱ్ఱగుడిపాడు, పొట్లదుర్తి, తిప్పలూరు మొదలగు శాసనములు సుప్రసిద్ధములు. అవేకాక, 7–8వ శతాబ్దికి చెందిన మరికొన్ని శిలాశాసనములు కూడా చెప్పుకోదగినవి. అందులో ప్రస్తుతము సమీక్షిస్తున్న శాసన మొకటి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తుశాఖ కడపజిల్లా శాసన సంపుటములను ప్రచురించి చారిత్రికులకు, భాషాశాస్త్రవేత్తలకు మహోపకారము చేసినారు. ఆ శాసన సంపుటములలో పేరెన్నిక గన్నది మొదటి సంపుటము. బ్రహ్మశ్రీ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శాస్త్రిగారు వాటికి ఆధ్వర్యము వహించి, చక్కని పరిచయముతోను, శీర్షికలతోను వ్రాసినారు. వారి నిశితదృష్టి, పరిశీలనాశక్తి నుండి మరేలకో ఈ శాసనము తప్పించుకొనినది. ఇది అక్షర పరిణామమునకును, కొత్తరాజులను గురించి చెప్పు శాసనము.

ఈ శాసనము[1] కడపజిల్లా, పులివెందుల తాలూకా, లింగాల గ్రామములో నున్న శ్రీ వీరభద్రస్వామి దేవాలయములోనున్న శిలపై చెక్కియున్నది. అచ్చటచ్చట ఒకటి రెండక్షరములు కానవచ్చుటలేదు కాని శాసనమును చూడగానే ప్రాచీనమయినదిగా చూపరులను ఆకట్టుకొనును.

కాలనిర్ణయము చేయుటకు తగిన శకసంవత్సరాదులు లేకిపోయిననూ, అక్షర పరిణామము, నిర్మాణతనుబట్టి ఇది సుమారుగా 8వ శతాబ్దికిచెందినదిగా భావించవచ్చును.[2]

శాసన లిపిలో కొన్ని అక్షరములు, ముఖ్యముగా 'అ' కారము దాని పరిణామమును గమనింపదగినవి. ఈ అక్షరము రెండు విధములుగా చెక్కబడినవి. మొదటిది మామూలుగాను, రెండవది ఒత్తక్షరముగాను కలవు. మొదటిది మూడు రకములుగా లిఖించబడినది. మొదటి దానియందు (8వ పంక్తి) అక్షరము సుమారు నలుచదరముగా నుండి, మధ్యగీతతో రెండు భాగములు చేయబడినది. రెండవరకమున (అదే పంక్తిలోనే) బండి 'ఱ' వలె యున్ననూ, రెండువైపుల పైభాగము లోపలికి వంపు తిరిగియున్నది. ఎడమవైపు వంపు మధ్యగీతకు తగిలియున్నదికాని కుడివైపు వంపు మధ్యలోనే ఆగిపోయి ఉండుట గమనింపదగినది. ఇక మూడవరకమున (పంక్తులు 6, 9, 11, 12, 13 లలో) మధ్యగీత లేదు. ఈ అక్షరమందు పైన చెప్పినవిధముగా గాక అర్ధానుస్వారముగా నుండుట గమనింపదగియున్నది. పైన చెప్పబడిన అక్షరములు ఒకే శాసనములో నుండుట చూడవచ్చును. దీనివలన 'అ' అక్షరము కాలానుగుణ్యముగా ఎట్లు మార్పు చెందుచున్నది తెలియుచున్నది.

ఒత్తక్షరముగా నిందులో రెండవ పంక్తిలోను, పదునాలుగవ పంక్తిలోను చెక్కబడినది. పై సమీక్షవలన, మనకు 'అ' కారము ఒత్తక్షరముగా వాడబడుచున్నప్పుడు ప్రాచీన రూపముగా వాడబడుచుండెననియు, మామూలు అక్షరము వాడబడుచున్నప్పుడు వివిధ రూపములుగా మార్పుచెందుచున్నది.

భాషా ప్రయోగమున పెద్ద మార్పులుగాని, ప్రయోగములుకాని లేకపోయిననూ, అయిదవ పంక్తిలోను, పదవ పంక్తియందు 'న' కారంతముచూడవచ్చును. 'మగ' అనుటకు బదులుగా రెండక్షరములు కలిపి 'మ్గ' గా రాసినారు. బహుశ నిది శిల్పి లోపము కావచ్చును.

శాసనము 'స్వస్తి' వాచకముతో ప్రారంభింపబడినది. ఆ తరువాత దొమ్మేరి విక్రమాదిత్యుని యోధుడు (మగన్డు) అయినటువంటి చోళపుళ విజయాదిత్యుడు రట్టగుళ్లను, అతని కుమారుడు అభిమానగుదియన్, అగణితగుణదాని బిరుదాంకితుడు అయినటువంటి శ్రీ జయమేటి వాయూరి యుద్ధమున, బాణరాజుల కుమాళ్లు అయిన వఱువరేణ్ణు, గువమవుఱున్ను మరియు సత్తికుమారుని చంపెను. ఆపైన శ్రీజయమేటి ఒక గాడిదను, నలుగురు వీరులను నిహతమొందించెను.[3] దీని తరువాత పదములు చుచిత్రములైనవి. యుద్ధములోని పొరకుక్క విషయము (పొగరు) శ్రీ జయమేటి వున్న సభలో ఎవరికి తెలియదు అన్నదానితో ఈ శాసనము పూర్తి చేయబడినది.

శాసనములో మొదట చెప్పబడిన శ్రీ దొమ్మెఱు విక్రమాదిత్యుడెవరో తెలియటం లేదు. అతని దగ్గర అభిమానగుణవంతుడు, సకల ధైర్యవంతుడు, వీరుడు అయినటువంటి శ్రీ జయమేటి ఉండటం బట్టి, విక్రమాదిత్యుడు ఒక స్వతంత్రరాజని తెలియవచ్చును. ఇతనికి,

బాణరాజులకు, సత్తికుమారులకుగల వైరమెట్టిదో తెలియదు. దీనిలో చెప్పిన సత్తికుమారుడు, రేనాటిచోళ రాజయినటువంటి సత్తికుమారుడు కావచ్చునా అని సందేహము కలుగుచున్నది. ఈ సందేహములు ప్రాజ్ఞులెవ్వరయిననూ వివరింతురని ఎదురుచూచుచున్నాను. విజయాదిత్యరట్టగుళ్లు చోళుపులకు అధినేత అతని కుమారుడు శ్రీ జయమేటి.

శాసనమున కొన్ని విశేషములు కానవచ్చును. 'వెఱళ' 'మెఱళ' అన్న పదప్రయోగము. ఇవి సాధారణముగా మనకెచ్చటను (శాసనములలో) కనిపించవు. బహుశ 'వెఱళ' అనగా భయంకర మనియు, 'మెఱళ' అంటె పొగరు అన్న అర్థముగా తీసుకుంటె, సమయ సందర్భాలకు తగినట్టుగా వుంటుంది. ఇక రెండవది ఛందస్సు. శాసనము చివరిలో నున్న పదములు. ఛందస్సు ప్రయోగించిచూడగా అది 'రగడ'కు సరిపోవు చున్నది. 'రగడ' ఈ శతాబ్దిలో ప్రయోగించటం ఇదే మొదటిది.

స్థళనామములయిన వాయూరు, చోళుపుళలలో వాయూరు గుర్తించుటకు వీలుకాకున్నది. చోళుపుళ చిప్పిలి కావచ్చును.

శాసనము[4]

1. స్వస్తి[॥*] శ్రీ దొమ్మయా [ఱి][5]
2. విక్రమాదిత్యు గ్గ్మాను[6] చో [ఱు]
3. ంపుళ విజయాదిత్యరట్ట-
4. గుడ్ళ కొడుకు అభిమానగు-
5. డియన్ అగణితదాని శ్రీ జయ
6. మేటి వాయూరిపోటున సత్తి-
7. కుమాష్థ పెగుతాంకి ముంలప [లు*]
8. ది కుమాళ్లు వఱువరేణ్ణు గువ-
9. మవుళు ఒక్క[8] గాజ్బు ను న్రల్వు-మగ.
10. లను పొడిచి పడియె [న్] [॥*]
11. పాటిళో పరి[పరి]వల్కు వెఱళ పో-
12. ఱకుక్క మెఱళ [–] నెవ్వరెఱుంగవా [స్టు*]
13. శ్రీ జయమేటి వాస్టిసభ
14. శోన [॥*]

అధోజ్ఞాపికలు

1. ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కడప డిస్ట్రిక్ట్, వాల్యూం 1, పే. 42.
2. పై వాల్యూం సంపాదకులు ఈ శాసనము తొమ్మిదవ శతాబ్దికి చెందినదిగా భావించారు. కాని లిపి పరిణామమునుబట్టి 8 వ శతాబ్దికి చెందినదిగా నిర్ణయించవచ్చు.
3. పై గ్రంథము, పే. 41, ఆంగ్లశీర్షిక సరిగాలేదు.
4. ఫోటో ఆధారముగా చదవబడినది.
5. ఈ అక్షరము పై వాల్యూంలో చదవలేదు.
6. మగస్టుగా చదువవలెను
7. 'వా' సరికాదు 'జా' అయితే అర్థము స్ఫురిస్తుంది
8. దీక్క అని చదివినారు.
9. స్త్ర అని చదివినారు.

ప్రయాణం

శ్రీ రామసూరి

నిరంతర జీవన యాత్రలో మనిషికి
ఎన్ని అనుభవాలు
ఎన్నెన్ని జ్ఞాపకాలు—
అన్నీ
గుండె 'సూట్ కేస్' లో
దాచుకుంటూ
సాగిపోయే ప్రయాణీకుడు మనిషి.
చినుకులు పలకరిస్తే
ఆనందంగా కేరింతలు కొట్టే మనస్సు
వెన్నెల చిలకరిస్తే
హాయిగా సేదతీరె మనస్సు
దట్టంగా మంచు కురిస్తే
గజ గజ వణికే మనస్సు
ఆకులు రాలి రేపటి చైతన్యం కోసం
గాలికి ఊగే చెట్లని చూస్తే
ఆశలు పెంచుకునే మనస్సు
చిగుళ్లు తొడిగిన ఎలమావి తోటలలో
పాటలు పాడుకునే మనస్సు
రకరకాల అనుభూతులు
లయాన్విత రసగీతులు
కాల ప్రవంతిలో కలలై అలలై
పలకరిస్తుంటే—
జీవితం పొడుగునా
తనివి తీరా అనుభవిస్తూ ఆనందిస్తూ—
ఏడ్చి ఓదార్చి నవ్వి నవ్వించి
ఎన్నెన్నో
ప్రపంచానుభూతి ప్రవాహాలతో
సయ్యాటలాడి విసిగినా వేసారినా
వేదనలూ నిట్టూర్పులూ అన్నీ
ఉదయా స్తమయాల కౌగిట్లోనే-
ఆనందాన్వేషణలో
దుఃఖాన్ని కౌగిలించుకునే వాళ్లూ
కన్నీటిలోనే
అమృతాన్ని అందుకునే వాళ్లూ
అందరి గమ్యం ఎక్కడికో మరి
ఏ ఆశ నడిపిస్తోందో మరి
ప్రతి మనిషి కదలికా ముందుకే
జీవితం అసలు రహస్యం తెలుసుకునేందుకే
ఈ ప్రయాణం.

శ్రీ సోమసుందర్

చైతన్య సంకల్పం చైత్రం

క్రొ ఉగాదితోపాటు నవయుగాది సైతం ఆగమించింది.

ఇరవై ఒకటో శతాబ్దం వచ్చి – నీ నిశాంత దేహళిలో నిలచింది.

ఆప్యాయంగాతలుపుతట్టి పిలిచింది.

లే ! ఎందుకాలస్యం చేస్తావింకా ?

ఉన్నవ పున్నెమా అని ఆరు దశాబ్దాలుగా మనం కలలుగన్న సమధర్మ వ్యవస్థకై సంఘవిజయం సమకూరలేదు. అనైక్య కాలయాపనలలో ఆశాబింబాలు నీరుకారిపోతున్నాయి. అజ్ఞాన తిమిరంలోపడి నీరసించి పోతున్నాయి. అభిప్రాయ విభేదాల విరిగిన వంతెనల క్రిందనుంచి ఎంతెంత జీవజలం వ్యర్థమైపోయిందో చరిత్రనడిగి తెలుసుకో! ఆగామి శతాబ్దం ఆహ్వానిస్తోంది; చైతన్యాలనన్నిటినీ సమీకరించు; మనస్సులన్నీ కేంద్రీకరించు !

మన అలసత్వాన్ని బలహీనతగా పోల్చుకొని స్వార్థం బొర్రలు పెంచు కుంటోంది. నల్లడబ్బుల పరకీయప్రవేశం చేస్తున్నారు కామందులు ! పొద్దెక్కి–లేచి వికటాట్టహాసం వినిపిస్తున్నారు కామాంధులు ! వీళ్ళేవీళ్ళే వసంతాన్ని అడ్డినవాళ్ళు! శిశిరానికి గల సహస్రముండిత శిరస్సులు!

అభిప్రాయ విభేదాలున్నంతలో అన్నతమ్ములంజన్మ శత్రువులు కారు; ఆయుధ ప్రయోగంలో అభిప్రాయ సమన్వయం సాధించాలనుకోవడం– జంతువును చీల్చి చెట్టుకు వ్రేలాడగట్టి అరుణోదయమనుకొని పిచ్చి గంతులు వేయడం వంటిదే!

ఖగనాథులు జగన్నాథులుగా అందలా లెక్కుతూంటే – పక్షీంద్రులు మక్షీంద్రులుగా పరగళ్ళ పాలవుతున్నారు. సంఘం బహిష్కరించ వలసిన దుష్టులు విశిష్టరాజలాంఛనాలాక్రమించారు. అధికార పర్వ తాగ్రాలకధిరోహిస్తున్నారు. నా దారులు కాలిదారివిడిచి విమానాలెక్కి విహరిస్తున్నారు. తృటికాలంలో మనబొక్కసాలు దోచారు, కోట్లకు పడగలెత్తారు. ధనరాశులు పేరుకొన్న ఆ దూరపు కొండలు – పొగ మంచుల జూలు దులిపి, సింహాలై గర్జిస్తున్నాయి; ధన వర్గ రథానికి పూన్చబడ్డ తురంగాలయ్యాయి ప్రభుత్వాలు !

లే – ఎందుకు తాత్సారం చేస్తున్నావు ? అందరినీ ఒక బిరిలోనికి పోగెయ్యి... నీకెందుకయ్యా ఈశషభిషలు ? తూర్పు పడమరల పట్టింపులు? విజృంభించే ఉత్తుంగతరంగానికి కోటలన్నీ పాదాక్రాంతాలు! అదోవిను ఆగామి శతాబ్దం కోటి శంఖనాదాలాలికిస్తోంది! ఆలకించు...

గడచినకాలం కన్నీళ్ళతో వ్రాసుకుంది తన చరిత్ర... దారిపొడుగునా కడగండ్లను ముళ్ళతుప్పల్లో దాచుకుంది. నెత్తుటితో ఉత్తరీయాలు తడుపుకుంది. ఎండుచితుకులతో మంటలు రాజుకుంది. తిరుగుబాటు బాటలు పతాకాలుగా మార్చుకుంది. ఐతే ఏమైనట్లు ? నక్షత్రకాంతులే మన ధ్వాంత రాత్రిని పట్టపగలుగా మార్చేనా ?

అస్సీరియా బాబిలోనియాల మానవీయ విజయాల నాగరకతా పరంపరలు సాధించిన వైభవాలన్నీ ఏమైపోయినట్లు? ఏసాఫల్య గుణపాఠా లందించినట్లు? ఏథెన్సో-పాటలీపుత్రమో,ఏ థీబ్సో-హస్తినాపురమో- ఏవైఫల్య కాలగర్భ కార్కశ్యంలో కలసి పోయాయి? సింధునదీతీరాల ప్రాక్తన భారతీయులు సాధించిన సౌమనస్య సస్యాలన్నీ ఏ బూడిద ప్రోగుల క్రింద నిద్రించాయి? ఏ థార్ ఎడారి ఇసుక తుఫానుల క్రౌర్యం మింగేసింది.

ఎలా వెళ్ళి పోయింది నీ కాంతి పరివేషం? విక్రమాదిత్యుల చల్లని పరిపాలనా వైభవాలు సమకూర్చిన రుచిర కావ్యరత్న వీధులన్నీ ఏ దిశగా తరలిపోయాయి ?

తెలుసుకొనే వీళ్ళెవి? ఆనవాళ్ళెక్కడ? పురావైభవాల జ్యోత్స్న విభావరులను ఏ దగ్ధ కామనల కాననాలలో వెదికేది?ఎంతని విలపించేది? ఎలా పోల్చుకొనేది?

దివారాత్రాలు – ఆక్రోశిస్తున్న చరిత్రహృదయారవాలు...సకలవిలాపాలకూ సమాప్తి పలికే ఉజ్జ్వలరేఖ భవిష్యత్తు !

ఈ లోకం తనంత తానేమారుతుందను కుంటున్నావా? ఉత్త భ్రమ... దురవగాహనల మాయపొరల్ని చీల్చు! డాకురేకుల మెరుపులతో కన్ను

కట్టే కాకి బంగారాన్ని నమ్మకు! ఉన్నకాలాన్ని జాడ్యంలో పంపకు! మలినదుకూలాల్ని విసర్జించు... ఆగామి శతాబ్దం ఆహ్వానిస్తోంది పురోగమించు !

నిజమే గతానేక ప్రకరణాలు కనీవినీయెరుగని మహత్తర మానవతా విజయాలు సాధించిందీ శతాబ్దం. ఎన్నో కాంతిపుంజాలందించింది. రుచిరజీవన విచిక లామోదాలెన్నో సమకూర్చింది ! ఆ సత్ఫలజాలానికి ఫలితార్థం ఇదా? నిష్క్రియా పాతిత్య పాటవ పరీక్షలేనా?

మన శతాబ్దం- పీడితమానవులందరికీ విప్లవ మంత్రోపదేశం చేసిందే! పీడనారహిత సమధర్మోజ్వల ధ్వజాల ఘననభోంతరాళాల నింపిందే? మరింకా ఎన్నాళ్ళిలా అవుగాముల పలుగాముల సుడిగుండాలపడి, ఉక్కిరి బిక్కిరి అవుతాం? నిన్నటిలాగే నీరవంగా విలపిస్తాం?

పరాన్న భుక్కులకు అధికారాలందించి అడుగుమెట్లపై నిస్తేజంగా పడి గాపులు పడుతున్నాం మనం? మరియికనైనా మేలుకో-సాధించు సాగించు జైత్రయాత్ర !

నిర్జీవ జడపదార్థం ఇసుకను మరగించి, కరగించి, తళతళలాడే అందచందాల గాజుపాత్రల్ని మలుస్తున్నామే, శప్తవై పడివున్న సజీవ మానవులను జీవకాంతులతో మెరిపించలేమా ? శ్రమైకజీవనకుంజర యూధాల కెన్నాళ్ల ఈసంకెళ్ళు? మానవతా నుబంధాలను ముందుకు నడిపించలేని చక్రబంధాలు ?

ఎందుకిలా విరిగినకలల్ని ప్రోగుచేసుకుంటూ బ్రతకడం? గుడ్డిపేలికల కోసం, చిత్తుకాగితాలకోసం, ఇనుపముక్కలకోసం, పందిపెంటల కోసం- పెంటపోగుల్ని కెక్కరిస్తూ ఎంతకాలం బ్రతకడం ? నికృష్ట జీవులమై, నిర్వీర్యదేహులమై, ఇలాగేనా బ్రతకడం?

ప్రపంచాన్ని పునర్మించాల్సిన ప్రతిభాసూర్యులకా దుర్వ్యవస్థా మేఘాచ్ఛాదనలు? లేయింక! విజృంభించు; ఆగామిశతాబ్దం ఆహ్వానిస్తోంది. చేలాంచలమందుకో, కేలందుకో ! మురికిముదుసళ్ళ మంచుల్ని దులుపుకుని ముందుకు నడుద్దాంపద! ఆగామి సకల జగజ్జన జీవన గాయత్రి ! సర్వంకషసవిత్రి !

సోమరిపోతులకే హంసతూలికా తల్పాలందించి, వంచనల పంచలలో తలదాచుకొనే నిర్భాగ్యం మనకెన్నాళ్ల ? పగలంతా కష్టాల కాష్ఠాలలో కరగిన ఆలుబిడ్డలన్నదమ్ములందరినీ రాత్రంతా దుర్భర యాతనల కడగళ్ళకన్నీళ్ళలో ముంచుతున్నాం! పసిడివెలుగుల మంచి పాలపుంతాకోశాల, ముడిపడలేవు రోడే... పాలు ఒలికిన సిరి విలపించడం ఆత్మవిమర్శ ఎంతమాత్రం కాదుసుమీ! మనజీవనోద్యానవనాలు దురంతశ్మశానాటవులు కారాదు. కర్తవ్యంనిశ్రేణికను కూల్చడం వివేకంకాదు. దౌష్ట్యాన్ని పరిమార్చక మృష్టాన్నం లభించదు. కాలయాపనలలో కరగి ఉనికయినా మిగలదు !

నిన్నలవలెనే నేడులన్నీ పసచచ్చి, ససిచెడిన మోడులై, పుల్లవిరిగిపోతూంటే, నీ ఆశాలతలు కుక్కమూతి పిందెలు దింపుతూంటే ఇంకెంతకాలం దీన్ని కల్పలతగా భావించడం? బాష్పబిందువులే పైసలుగా మార్చుకుంటూ అడియాసలు పడడం ఎన్నాళ్ళు? ప్రాణంలేని బొమ్మలకోసం చేతులు చాపడం ఎన్నాళ్ళు ?

సర్వాధికారివి నీ ముంగిట కెవడో వేషధారి వాజమ్మవచ్చి ఉత్తుత్త ఆశల బొమ్మలాంతరు చూపుతూంటే- నిర్జీవప్రతిమలా నిలచి నిన్ను నీ వమ్ము కుందుకెందుకు సిద్ధపడతావు? బానిసలా దీనంగా ఒణుకుతావు? లే, ఇక చాలించు; నీ ముఖకళవళికల్ని సొంతం కడిగేసుకో!

నీ కుపితోగ్ర జ్వాలా కీలలతో అశ్రుజలరాశుల్ని సత్వరం ఇంకించు ! క్రుద్ధ సాయుధ యోధంగా పురోగమించు. నైచ్యలోకాన్ని పరిమార్చు! ఆగామి శతాబ్దం ఆహ్వానమందిస్తోంది, సందేశమందుకో !

ఈ నిశాంతవేళ నీ మొగసాలలోనిలచి ఇరవై ఒకటో శతాబ్దం పిలుస్తోంది ! ఆప్యాయంగా చేతులుచాపి, శతారమందిస్తోంది. నీ కోసమే నిరీక్షిస్తోంది.

ముక్కుపచ్చలారకుండానే మిత్తిని కౌగలించుకుంటున్న మన తమ్ములు నెత్తమ్ములు ! వ్యక్తి నిర్మూలనమే వర్గ శత్రుసంహారణ మనుకుంటున్నారు! అదే శ్రామిక విప్లవంగా భ్రమిస్తున్నారు. వాళ్ళందరినీ పిలుచుకురా ! భగత్సింగ్‌వంటి మహావిప్లవవీరుల వైఫల్యాల అనుభవ సారాల గుణపాఠాలందించు !

అందరమూ కలసి ఈ కష్టాల కందకాలు దాటుదాం ! సమధర్మ సుదర్శనం అవతలిగట్టుపై నిరీక్షిస్తోంది ! అందరమూ కలసి మానవతా మణిహారం ధరించుదాం ! మణికంధరులమై తరిద్దాం ! సమైక్య కంఠ నాదంతో సురభిళవసంతాన్ని చేరబిలుచుకుందాం ! గుండె గుండెకీ చల్లని ద్రాక్షాసవాల పసందులందించి గుబాళిస్తుంది ఆగామి వసంతం!!

ఆగామి శతాబ్దం ఆహ్వానిస్తోంది...

అందరమూ తరలి పోదాం కదలండి...!

శ్రీ రేబల్లి వేంకటేశ్వర్లు

ఆదిలాబాదు మాండలికభాష దాని తీరుతెన్నులు

ఆదిలాబాదు జిల్లా చాలా పూర్వకాలమునుండి వివిధ రాజవంశముల కాలమున మహారాష్ట్రులతో రాజకీయ, సాంఘిక, సంబంధములు కలిగియున్నట్లు తెలియుచున్నది. నేటికి వీరు వైవాహిక, వ్యాపార, సంబంధములు కలిగియున్నారు. కావున వీరు జరుపుకొను పండుగలు, భాషలలో సారూప్యము గోచరించును. ఉదా :- పోలాపండుగ (ఎడ్లపండుగ)

ఈ వ్యాసమున ఆదిలాబాదు మరియు పరిసర ప్రాంతవాసులు వాడుకొను కొన్ని మాండలిక పదముల వాడుకతీరు వివరింపబడును. ఇందు శిష్ట, శిష్టేతర వ్యవహారములో తేడా అగుపించకుండుట గుర్తింప దగినది. భాషలోని వైవిధ్యం మూడు రకాలు 1) చారిత్రకం 2) ప్రాంతీయం 3) సాంఘికం. ప్రాచీన ఆధునిక మాండలికాలమధ్య కన్పించే వైవిధ్యం చారిత్రకాంతరంవల్ల ఏర్పడుతుంది. ప్రాంతీయ వైవిధ్యం నైసర్గిక సీమలు, రాజకీయపు హద్దులవల్ల ఏర్పడుతుంది. సాంఘిక అంతరం వ్యవహర్తలమధ్య భాషావైవిధ్యాన్ని కలిగిస్తుంది.[1] పై విభజనలోని చారిత్రకం మరియు ప్రాంతీయ వైవిధ్యాలు ఆదిలాబాదు మాండలికపు తెలుగులో (ఆ. మాం. తె) అగుపించును.

మరాఠీపదాలు

1. "ఆయి" అనగా అమ్మ. చాలామంది తల్లిని "ఆయి" అని పిలుస్తారు. "అవ్వ" అనే అచ్చతెనుగు పదము చాల కొద్దిమంది నోట వినగలము.

నానాయి = నాన + ఆయి = నాయినమ్మ

అమ్మాయి = అమ్మ + ఆయి = అమ్మమ్మ

అత్తాయి = అత్త + ఆయి = అత్తమ్మ

పై పదాలు తెలంగాణా ప్రాంతంలో వాడే పెద్దాయి (పెద్దమ్మ) అనే పదాన్ని పోలియున్నది. "ఆరె" వాళ్ళు "ఆయి" అనే పదాన్ని వాడుట గమనింపతగిన విషయము. ఆరెవాళ్ళ పూర్వీకులు మహారాష్ట్ర నుండి వచ్చి తెలంగాణ గ్రామాలలో స్థిరపడినట్లు తలపబడుచున్నది.

2. బాయి = ఆడవాళ్ళందరినీ (చిన్నపెద్ద అనే భేదం లేకుండ) "బాయి" అని పిలుతురు. ఉదా :- పండ్లబాయి, బిచ్చపుబాయి, కూరగాయలబాయి, పనిబాయి మొదలగునవి.

3. బాపు = మగవాళ్ళందరిని "బాపు" అనిపిలుస్తారు. ఉదా :- చుట్టపుబాపు, దుకాణపుబాపు, కూరగాయలబాపు మొదలగునవి.

4. మౌషి = చిన్నమ్మఅని అర్థము. "కాకి" అనిగూడ చిన్నమ్మను పిలుస్తారు.

5. కాక = చిన్నాయన. కరీంనగర్, వరంగల్ జిల్లాలలోకూడ కొందరి నోట, "కాక" అనే పదం వింటాము.

6. వైజి = వదినె.

7. భేటి = భేటి అనగా కలుసుకొనుట. మహారాష్ట్రుల సంపర్కంవల్ల దక్షిణాంధ్ర సాహిత్యంలో కూడ "భేటి" అనుపదం అగుపడును. ఉదా : "తొండమాన్ వంశావళి" అనుగ్రంథమున నిట్లున్నది.[2] "వారితోనేవినస్వామి భేటికిపోవ" అనియున్నది. ఇట యుద్ధమున. పోరాటమునకై శత్రువులను "కలిసికొనుట" అను అర్థమున వాడబడినది.

8. పోత = "పోత్" అను మరాఠీపదము "పోత" గా మారినది పోత అనగా బస్తా అని అర్థము. ఉదా :- బియ్యపుపోత, పప్పుపోత, సిమెంటుపోత మొదలగునవి.

9. సండాస్ = మరుగుదొడ్డి. "సండాస్" అనేపదాన్ని మనం రైల్వే కంపార్టుమెంటులలోని మరుగుదొడ్డి తలుపులపై చూడగలము.

10. సాకర్‌పుడి = (సాకర్‌అనగా చెక్కర) పెండ్లికుమార్తెకు నిశ్చితార్థము సమయమున (పెండ్లికిముందు) చీర, రవిక, పూలు, పండ్లు మొదలగునవి పెట్టుటను సాకర్‌పుడి అని అందురు.

11. ఎర్రబొట్టు = వరపూజ చేయుటను "ఎర్ర బొట్టు" అందురు. "పొగాచుట్టించుట" అనికూడ కొన్నిచోట్ల వ్యవహరింతురు.

12. రత్నపురి గడ్డ=(రతాళు. మరాఠి) కందగడ్డ

13. భరణి = జాడి లేక మర్తబాను.

14. లౌకర్ = తొందరగా

15. బొప్పడు = అన్న. *
శబ్దరత్నాకరము

16. నీటెం = చక్కగా, సూటిగ

17. లెంకుడు = వెతుకుట.

పై మరాఠీ పదాలు యథాతథంగా లేక కొలదిమార్పులతో ఆ. మాం. తె. లో వాడుచున్నారు. ఈ పదాలు వావి వరుసలకు, నిత్యవాడుకకు సంబంధము కలవగుటచే ప్రాంతీయ వైవిధ్యము సుస్పష్టమగుచున్నది.

తెలుగు పదములు (తెలుగు పదముల సంజ్ఞావివరణ పట్టిక 7)

వర్గము-1

1. తోడెము=(దే) కొంచెము, లేశము అని అర్థములు. ఈ పదము చిన్నయసూరి మిత్రభేదములో అగుపించును.
ఉదా :- "తోడెంబు" తోడనే ప్రొద్దుపుచ్చుకొనియెద, నేనేమి చేయుదునని సింహము, కాక వ్యాఘ్రజంబుకములతో యనును.

2. కొత్తలు= (దే) చిల్లర డబ్బులకు హాత (నైజాం), కల్దారు (ఇంగ్లీషు) నాణాలను వాడుకాలమున తెలంగాణా జిల్లాలలో వాడిన పదము. నయాపైసల వాడుకతో 'కొత్తలు' అనుమాట అదృశ్యమైనది. కాని నేటి ఆదిలాబాదు ప్రాంత ప్రజల వాడుకలో ఈ పదము నిలిచియున్నది.

3. రంజణ= (దే) గాదెవంటి కాగు. ఇది నీళ్ల పోసుకొనుటకు వాడబడు మట్టిపాత్ర. ఈ పాత్రకు అనేక సన్న నిరంధ్రములుండుటచే నీరు బయటకు వచ్చుటకు, గాలి పోవుటకు వీలుండి నీరు చల్లగా నుండును. ఈ పాత్రల తయారీ వీరి ప్రత్యేకతను తెలుపును.

4. రజాయి (దే)=చలికి కప్పుకొనెడి దుప్పటి. ఇది $2\frac{1}{2}$ కి॥ దూదితో సన్నని పరుపువలె తయారుచేయుదురు. ఇది కప్పుకొనిన చలి కాలమునకూడ ఒంటికి చెమట పట్టును.

5. లగ్గము (వై) పెండ్లి

6. మొగులు = (దే) ఆకాశము, మబ్బు. "మొగులు చేసింది"అని వాన మబ్బు చేసిందనే అర్థంలో వాడుదురు.

7. రెండక్కల్లి, మూడక్కల్లి = రెండు దిక్కుల, మూడు దిక్కుల (చోట్ల)

8. డాగులు (దే) = మరకలు, గురుతు
ఉదా :- "విరహిజనమ్ములన్ మరుడు వీపున డాగులు వేయ బూని" (చంద్రహాసోపాఖ్యానము.)
(డాగులు అనే పదాన్ని మూటల లెక్కలకు ఉపయోగిస్తా కొన్నిచోట్ల)

9. మరెంక = తర్వాత. ఉదా :- పనికి మరెంక రమ్మనుట.

10. పగలెక్కుట = ప్రొద్దెక్కుట. పొద్దు పోయిందనుటకు ఈ పదమును వాడుదురు.

11. సోలాలు = పచ్చి దినుసులను ముఖ్యంగ పచ్చి బబ్బెర్లను, పచ్చి కందులను "సోలాల" ని అందురు.

12. పిసికిళ్లు (దే) = జొన్నలు లోనగువాని యూచబియ్యమనిఅర్థము. "పిసుకుళ్లు"గా రూపాంతరం చెందింది. పలుగురాళ్ళను కాల్చి ఒక గుడ్డలోవేసి, జొన్నలుకూడ పోసి పిసుకుట వలన, వానికి పిసికిళ్ళను పేరు వచ్చినది. ఖమ్మం, వరంగల్ జిల్లాలో కూడ ఈ పదము వాడుకలో కలదు.

13. మస్తు (దే) = సమృద్ధి, చాల. ఉదా:- మస్తుదూరం, మస్తుపని, మస్తుమంది, మస్తుబియ్యం/చక్కెర మొ॥

14. కాల్వకు పోవుట = (దే) దొడ్డికి పోవుట

15. శనగపిండికి గల పేర్లు = (ఎ) సూన్‌పిండి (సూన్ అనగా ఉల్లి గడ్డలు మరియు శనగపిండి కలిపి వండు కూర) వీరు సూన్‌ను మదరం (మదనం) అనికూడ అంటారు. (బి) మదరం పిండి.

16. అగ్గిడబ్బ = అగ్గిపెట్టె

17. మంటినూనె = (ద్వి) (మన్ను + నూనె) గ్యాసునూనె.

18. కోక(దే) = వలువ, వస్త్రమని అర్థము. "చీరె"కు ఈపదం వాడుక కరీంనగర్, వరంగల్ జిల్లాలో చాకలివాళ్లు వాడుదురు. ఖమ్మం, ఆదిలాబాదు జిల్లాలలో చాలామంది "కోక" అని వాడుదురు.
ఉదా :- ఆ॥ చాకివాడు కోక చీకాకు పడజేసి...
(వేమనశతకము పు.17.ఎస్. వి.గోపాల్ అండ్ కో ప్రచురణ, 1941)

19. చట్టాగొట్టుట = ఎగవేయుట, ఇవ్వకుండుట.

20. తొగరి(వై) = కందిచెట్టు, తొగరుపప్పు = కందిపప్పు.

21. తెల్లబాసన్లు=రాతెండి/అల్యూమినియం బోళ్లు/పాత్రలు.

* బొప్పడు = (దే) మూఢుడు—తెలుగు. శబ్దరత్నాకరము

వర్గము - 2

క్ర. సం.	అంశం	ఆ. ప్ర. తె. రూపం	ఆ. మాం. తే. రూపం
1	"ఎవ" కు బదులు "ఓ" వాడుక	ఎవరు	ఓలు
		ఎవడు	ఓడు
2	"చి" అక్షరానికి బదులు "స" వాడుక	ఇడిచి పెట్టి	ఇడస పెట్టి
		చక్కెర	సక్కెర
3	"ళ" రావత్తుకు బదులు "డ్ర" వాడుక	మళ్లి	మడ్రి / మజ్జి
		బర్లు, చెర్లు	బడ్లు, చెడ్లు
4	"వె" కు "ఎ" వాడుక	వెరచుట	ఎరసుట
5	"న" కు "స" వాడుక	దినము	దిసము
6	"చ" కు "ఛ" వత్తు	పోచమ్మ	పొచ్ఛమ్మ

వర్గము - 3

భాషా స్వరూపము మారుచున్నట్లే కాలక్రమమున అర్థములోగూడ మార్పుచూపట్టు ననుటకుదాహరణములు.

క్ర. సం.	పదము - అర్థము	ఆ. మాం. తె. వాడుకతీరు
1	లేక (దే) = మరొకటి	లేక = లేదు అనిఅర్థము ఉదా :- ఇచట వరి పంట లేక (లేదు)
2	గొలుసు (దే) = సంకెల, చేతధరించెడి సొమ్ము	గొలుసు = గొళ్లెము
3	ముంత = (దే) మానిక కొలపాత్ర	ముంత = చెంబు
4	జీతము (వై) = వేతనము జీతగాడు (ద్వి) జీతము + కాడు	జీతము = ఉద్యోగము జీతము చేయుట = ఉద్యోగము చేయుట
5	యేగు (ప). దే. = పూయుట	యేగుడు = ఇల్లు అలుకుట.
6	పూటకూళ్ళ. దే. = వెల తీసుకొని పెట్టెడి అన్నము	పూటకూళ్లు = చిరుతిండ్లు ఉదా :- బిస్కట్లు, పిప్పరమెంట్లు, పాపడ్, నువ్వు/పల్లిముద్దలు మొ॥
7	లేపుట (దే) = లేపజేయు	లేపు = తీసుకొనుట, సర్టిఫికెట్ లేపుట.
8	పగుల కొట్టుట (దే) = ముక్కలు ముక్కలు చేయుట	పగులకొట్టుట = విప్పుట ఉదా:- బియ్యంపోత పగులకొట్టుట, అగ్గిపెట్టెల పుడా పగులకొట్టుట
9	నూకుట = (దే) తోచు, త్రోలు	నూకుట = ఊడ్చుట, వాకిలి నూకుట

అనేక దేశ్యపదములు (అచ్చతెనుగు, మరాఠీ, హిందుస్థానీ (ఉర్దూ)భాషాప్రభావమునకు లోనుగాక నిలిచి యున్నవనుటకు తోడెము, కొత్తలు, రంజణ, రజాయి మొదలగుపదములు సాక్ష్యములు. కిన్వట్, రాజురా మహారాష్ట్ర ప్రాంతములలోనేటికి తెలుగు మాట్లాడువారుండుట నైసర్గిక సాన్నిహిత్యమని చెప్పుకొనవచ్చును. (*తెలుగుపదములన్నియు శబ్దరత్నాకరముతో సరిచూసి, పరిష్కరింపబడినవి).

హిందుస్థానీ (ఉర్దూ) పదములు

1. కిస్మత్ (కిస్మత్) = అదృష్టము, భాగ్యము.
2. దుకాన్ = దుకాణము.
3. కిరాణా (కిరానా) = ఉప్పు, మిర్చి, మసాలా మొ॥ వస్తువులు
4. కిరాయి (కిరామా) = బాడుగ, కూలి.
5. హక్ = "హక్కు"గా మారినది.
6. ఆల్మారు (ఆల్మారా) = సొరుగులుగల ఎత్తైన కఱ్ఱపెట్టె.
7. అత్తరు = (అతర్) వాసనద్రవ్యము.
8. హోదా = ఉద్యోగస్థాయి.
9. ఖబర్ = ఖబురు, కబురుగా మారినది = వార్తఅని అర్థము.
10. ఖర్చ = ఖర్చుగా వాడబడుచున్నది (వ్యయమని అర్థము).
11. షబాష్, సెబాసు, శాబాసు రూపములలో వినుచున్నాము. ఇది మెచ్చుకొనుటను తెలుపును.
12. హుషార్ లేక హుసారనివాడబడుచున్నది. "తెలివిగల" అనిఅర్థము.
13. జమ్‌ఖాన, జముకాణ, జంపఖానగా మారినది.
14. తమాష్, తమాష, తమాస = వింత అని అర్థము.
15. "ఛప్పన్" "ఛప్పన్న" గా రూపాంతరం చెందినది.
"ఏబది" అని అర్థము. (పేజి 409 ద.వా.భా.వి)

ఉదా : "ఛప్పన్నదేశ రాజ్యములచేత కప్పముల్ దెప్పించి గర్వించినట్టి"
(చొక్కనాథ చరిత్రము, పు. 51.)

16. ఫరక్ = తేడా, భేదము. ఉదా :- ధరలో ఫరక్ పడదు.
17. తుట్టి = తక్కువ. ఉదా :- రూపాయికి పావలా తుట్టి.
18. అంగార్‌డబ్బి = అగ్గిపెట్టె.
19. తువ్వర్‌దాల్ = కందిపప్పు.
20. కజ్జాడుట/గూసులాడుట = కొట్లాడుట.
కజ్యా/ఖజ్యా అను హిందీ పదములు "కజ్జాడుటకు" మూలము

నోటు : క్ర. సం 1-8 మరియు 16-20 వరకు శబ్దరత్నాకరముతో సరిచూడబడినది. క్ర. సం. 9-15 వరకు దక్షిణాంధ్ర వాఙ్మయ భాషా విశేషములనుండి తీసుకొనబడినవి.

(సంజ్ఞ వా. భా. వి.)

క్ర. సం.	12 & 13	...	పేజి.	414 ,,
,,	09	...	,,	419 ,,
,,	11	...	,,	413 ,,

పై పదాలన్నీ హిందుస్థానీ (ఉర్దూ) పదాలు. ఉర్దూ లష్కరీ (సైనికుల) భాష అని అంటారు. సైనికులు పలు భాషల మాట్లాడుదురు (పలుప్రాంతముల వారగుటచే). పలుభాషా పదములు కలిసి ఉర్దూ భాషేర్పడినది. ఉర్దూ సుల్తానులకాలములో రాజభాషైనది కావున ఉర్దూ వ్యవహారభాషలో, సాహిత్యములో చోటు చేసుకొన్న తత్ఫలితముగనే మాండలికభాషలో ఉర్దూ పదములు స్వభాషా పదముల వలెనే వాడబడుచున్నవి.

అధోజ్ఞాపికలు

1. భారతి సెప్టెంబరు 1982. పేజి 9,రాయలసీమ తెలుగు-అసాధారణ లక్షణములు (చూడుము)రచయిత శ్రీ సి.ఆర్.యస్. శర్మ.
2. దక్షిణాంధ్ర వాఙ్మయ భాషావిశేషములు, పు. 407.
3. తెలుగు పదముల సంజ్ఞావివరణ పట్టిక (శబ్దరత్నాకరము)
   అ) దే = దేశ్యము.
   ఆ) వై = వైకృతము. ప్రాకృత సమమును, సంస్కృత భవమునైన పదము.
   ఇ) ద్వ = ద్వయము. వైకృతమును, దేశ్యమును మిశ్రమమైన పదము.
4. నీతిచంద్రిక. మిత్రభేదము చూడుము.
"కాక వ్యాఘ్రంబులు పొట్టియను జంపించుట" అను కథలోనిది.

సహాయక గ్రంథములు

1. శబ్దరత్నాకరము : విద్యారత్న నిడదవోలు వెంకటరావు పరిష్కరించిన 1981 ప్రచురణ.
2. దక్షిణాంధ్ర వాఙ్మయ భాషావిశేషాలు, డా॥ హేమలత, పిహెచ్.డి. డిగ్రీకొరకివ్వబడిన సిద్ధాంత వ్యాసము.
3. ఆం. ప్ర. డిస్ట్రిక్ట్ గెజిటీర్‌లు : ఎమ్. వి. రాజగోపాల్, 1976
4. ప్రాచీనాంధ్ర నగరములు : ఆదిరాజు వీరభద్రరావు, దేశోద్ధారక గ్రంథమాలా ప్రచురణ.
5. తెలుగు మెఱుగులు : శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి.
6. నలందా హింది శబ్దకోష్ : సంపాదక్ శ్రీ ఎస్. ప్రభాకర్.
7. 1980-82 ఉద్యోగరీత్యా ఆదిలాబాదు నగరమున ఉన్నపుడు సేకరించిన పదములిందు చేర్చబడినవి.
8. ఎ హిస్టరీ ఆఫ్ సౌత్ ఇండియా : నీలకంఠశాస్త్రి, 1966.
9. లఘుకోశము : సంయోజకుడు-ఉభయభాషా ప్రవీణ దుగ్గిరాల వేంకట పూర్ణభుజంగ శర్మ.

తెలుగుతేజం - వెలుగునిత్యం

కాకతీయుల తర్వాత చెల్లాచెదరైన తెలుగుజాతి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతో మళ్ళీ ఒకేచోటుకు, ఒకే నీడకు చేరుకొని అఖండంగా అవతరించింది. నాటినుండి గత కీర్తి స్మృతులను నెమరువేసుకుంటూ, వర్తమానాన్ని శుభకరంగా, సుందరంగా, సుఖప్రదంగా నిర్మించుకుంటూ, భవిష్యత్తును అఖండంగా ఊహించుకుంటూ ప్రగతివైపు పురోగమిస్తున్నది.

ఈ పురోగమన యాత్రను మరింత సంగమం చేయడానికి, రాష్ట్రాభ్యుదయాన్నీ, ప్రజాసంక్షేమాన్ని సత్వరమే సాధించడానికి శ్రీ ఎన్. టి. రామారావుగారి నాయకత్వంలో ఏర్పాటైన రాష్ట్రప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది.

★ 15 అంశాల ప్రగతి పథం కార్యక్రమం ద్వారా బడుగువర్గాల జీవితాల్లో నూతన చైతన్యం వెల్లివిరుస్తోంది.
★ సంక్షేమ సేవా కార్యకలాపాలకు నిధుల కేటాయింపు రెట్టింపు చేయబడింది.
★ బలహీనవర్గాలకోసం 2,20,000 పక్కా ఇండ్ల నిర్మాణం దశలవారీగా చేపట్టబడింది.
★ పేదవారికి కిలో బియ్యం రెండు రూపాయలకే అమ్మించే పథకంవల్ల 94.22 లక్షలమందికి లాభం చేకూరుతోంది.
★ ప్రాథమిక విద్యావ్యాప్తికి 16,000 ఉపాధ్యాయులను ప్రత్యేక ప్రాతిపదికపై క్రొత్తగా నియమిస్తున్నారు.
★ స్వచ్ఛమైన పాలనా యంత్రాంగాన్ని ప్రజలకు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం నెలకొల్పిన లోకాయుక్త 1983 నవంబరు 1 నుండి అమలులోకి వచ్చింది.
★ వృత్తి విద్యాలయాల్లో అర్హతకు ప్రాధాన్యం యిచ్చే ఉద్దేశంతో కాపిటేషన్ ఫీజు వసూలు చేయడాన్ని ప్రభుత్వం నిషేధించింది.
★ ప్రాథమిక విద్యావ్యాప్తికి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుపరుస్తున్నారు. దీనివల్ల దాదాపు 40లక్షలమంది బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ప్రయోజనం పొందుతున్నారు.
★ మహిళలకోసం ప్రత్యేకంగా ఒక మహిళా విశ్వవిద్యాలయాన్ని తిరుపతిలో ప్రారంభించడం జరిగింది.
★ గ్రామాలలో మంచినీటి ఎద్దడిని తీర్చడానికి కనీసం 100 జనాభాకు ఒక మంచినీటి వనరును ఏర్పాటు చేస్తున్నారు.
★ తరచుగా అనావృష్టికి గురయ్యే రాయలసీమ ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యాన్ని కల్పించే ఉద్దేశంతోనూ, పొరుగున వున్న తమిళసోదరుల దప్పిక తీర్చడానికీ మానవతాదృక్పథంతో తెలుగు గంగ పథకం చేపట్టబడింది.

నవంబరు 1, 1983 నుండి అమలు జరుగుతున్న నూతన కార్యక్రమాలు

గ్రామోదయ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతి పథకాలను చేపట్టి సౌభాగ్యాన్ని సాధించడానికి, నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు యువతకు స్వయంఉపాధి సౌకర్యాలు కల్పించడానికి కేంద్ర సహాయంతో చేపట్టబడినది. ఈ కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి యువత సేవలను వినియోగించుకొనటం ఈ పథకం ప్రధానలక్ష్యం.

దీప : ప్రతి జిల్లాలో ఉపాధి, పారిశ్రామిక పెంపుదల సంస్థను ఏర్పాటుచేసి విద్యావంతులలో నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి ఉద్దేశించబడినది ఈ కార్యక్రమం. గ్రామసౌభాగ్య సాధనకు దీనివలన దోహదం కలుగుతుంది.

విముక్తి : అతిహేయమైన పాకీపని నుండి ఆ పనిలో వున్నవారికి విముక్తి కలిగించడానికి, గ్రామాలలో ప్రధానంగా మహిళల సౌకర్యార్థం సెప్టిక్ మరుగుదొడ్లను నిర్మించడానికి ఉద్దేశించినది. ఈ పథకం. ఈ కార్యక్రమం క్రింద అన్ని మున్సిపల్ పట్టణాలలోను, రక్షిత మంచినీటి పథకాలుగల పెద్ద పంచాయతీలలోను తక్కువ ఖర్చుతో సెప్టిక్ మరుగుదొడ్లను దశలవారీగా నిర్మిస్తారు. సామాజిక మరుగుదొడ్ల నిర్మాణంలో ప్రయోగాత్మకంగా బయోగ్యాస్ ఉత్పత్తికి అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంలో పాకీ వృత్తిని అవలంబిస్తున్న వారి సంపాదనకుగాని, ఆర్థిక ప్రతిపత్తికిగాని భంగం కలగని రీతిలో వారికి పునరావాసం కల్పించబడుతుంది.

ఇటీవలి తుఫాను, వరదలవల్ల కలిగిన నష్టాన్ని భర్తీ చేయాలంటే పెద్ద ఎత్తున నిర్మాణ, సంక్షేమ, సహాయ, పునరావాస కార్యక్రమాల్ని చేపట్టాల్సి వుంటుంది, ప్రభుత్వం చేపట్టే బృహత్తర కృషిలో ప్రతి పౌరుడు ముందుకువచ్చి ప్రభుత్వ కార్యక్రమాలలో భాగస్వామిగా తోడ్పడినప్పుడే యిది సాధ్యమౌతుంది.

DIPR NO.24556/Advt/c4/83 సమాచార, పౌర సంబంధ శాఖ : హైదరాబాదు

మనం మనం కలసి జనం....

శ్రీ మేకా సుధాకరరావు

ఆశల శిథిలాల అట్టడుగునుంచి
ఆర్తంగా ఈ ఆక్రందన—
ఎవరో వచ్చి ఈ శకలాలను తొలగించి
లేవ నెత్తుతారని కాదు—

అన్యాయాక్రమాల మబ్బుల క్రింద
దురవకాశాల ఆకాశం క్రింద
అసూయా ద్వేషాల అనల జ్వాలల మధ్య
మానవత మరుగు పడిన చీకట్లలో
వక్రీ భవించిన మేధస్సుల వికృత సదస్సులో—

రాద్ధాంతలు సిద్ధాంతాలుగా
నటియించే రంగస్థలిని—
పరుల అపజయం స్వీయవిజయంగా
మెలి పెట్టే మీసాల సహవాసాలలో—

ధనాధికారాల దాహం దట్టంగా
పెరిగి పోయిన జనారణ్యంలో—
అవహానం ఆవేశం అవాంఛనీయంగా
పేరుకుపోయిన క్రూరతీరాలలో—

ఏ సినిమాకో బయలు దేరే సందడిలో
పాలకై గుక్క పెట్టే పసిపాప రోదనను
పట్టించుకోని తల్లుల కొల్లల మధ్య—
దాచుకోవడం, దోచుకోవడం
దర్జాగా చలామణీ అయ్యే నాటు—
అభిమానం అంతరించిన పీటు
వంచన వర్ధిల్లే చోటు

అనారోగ్యం దురాక్రమించిన సమాజంలో
ఈ వ్యవస్థ గాడ్పుల వడదెబ్బకు
ఒరిగిపోయిన నన్నూ నిన్నూ
ఎవరో ఉద్ధరిస్తారనే భ్రమలు లేవు—
నేనే మారాలని—

అనునిత్యం జ్వలియించే
ఆరని ఆశగా;
బీడువారిన జీవిత క్షేత్రాలూ
మోడు వారిన బ్రతుకు వృక్షాలూ
చూచి, కరిగి కన్నీరు కురిసే మేఘంగా—
ఆగిపోతే చనిపోయే
ఆగని హృదయంగా—
అంధకారాన్ని చీల్చే అమరజ్యోతిగా—

రూపు దిద్దుకుని
నేనే మారాలని—
ఆ గమ్యం చేరాలని....

అందుకే
ఈ శకలాలను చెల్లా చెదురుచేసి
బైటపడేబలం, నాలో
పుంజీ భూతం గావించడానికే
ఉగ్గపట్టి బిగ్గరగా ఈ పిలుపు!

గుడ్డను పొడుచుకొని
స్వేచ్ఛగా బైటపడే పక్షికూనలాగా—
రాతిని పగులగొట్టి నవ్వే పువ్వులాగా—

అంతరాంతరాలలో మరిగిమరిగిన
ఆలోచనల అవగాహనలూ, అనుభూతులూ
వికసించిన సుకవితా కిరణంలాగా—
ఉర్విని నిలవాలని

ఉత్తేజంతో ఉరుముతూ
శుష్కప్రియాలను తరుముతూ
నీవూ నేనూ కలసి మనం....
మనం మనం కలసి జనం....!

శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

ఎండ

ఎండ పేల్చేస్తోంది.

ఎండ వాయించేస్తూ వుంది.

ఎండ దంచేస్తూ వుంది.

*　　*　　*

వెచ్చటిగాలి ఆవిర్లు గ్రక్కుతూ వుంది. చెట్లు ఆల్లాడుతు వున్నాయి.

'అబ్బ' అనుకున్నాడు అబ్బయ్య.

'అబ్బబ్బా' అని ఆపసోపాలుపడ్డాడు, అబ్బయ్య. ఊపిరాడనట్లుగా, ఉక్కిరి బిక్కిరి అయిపోయినట్లుగా, అల్లాడిపోయాడు అబ్బయ్య. మెలికలు తిరిగిపోయి తెగరొప్పాడు.

'అయ్యో' అంటూ బాధకి లోనయాడు.

'అబ్బా' అని మూలిగాడు.

'అమ్మా' అనుకుని ఆక్రోశించాడు.

*　　*　　*

కరెంటు ఆగిపోయింది.

ఎయిర్కండిషనర్ చచ్చిపోయింది.

గాలి వేడెక్కింది. ఉక్కిరిబిక్కిరి చేసివేస్తూఉంది. వళ్ళు బిగిసిపోయింది. వంటిమీద చెమట్లు ధారలుగా కారాయి-ఆవిర్లయిపోయాయి.

'అమ్మమ్మ' అనుకుంటూ, కరెంటునీ, కరెంటువాళ్ళనీ తెగతిట్టుకున్నాడు, కోటిస్రావు.

'నేను, చచ్చిపోతానేమోరా, నాయనా' అనుకుని గిలగిల్లాడాడు, ఇట్లా ఈ కరెంటు వాళ్ళు ఎంతమందిని చంపేస్తారోగదా! అని జాలి కూడా పడ్డాడు.

పేట్రేగి పోతున్న ఈ ఎండలు, చీటికీమాటికీ ఆగిపోయి అజా పజాలేకుండా పోతున్న ఈ కరెంటు! ఈ ప్రపంచం కాలి, మాడి మసయి పోతుందేమోరా దేవుడా అనుకుంటూ, తెగ యిదయి పోయాడు కోటిస్రావు.

*　　*　　*

ఆ ఒక్కచెట్టూ మోడులాగఅయింది. ఆకులు రాలిపోయాయి. కొమ్మలుఎండి గిడసబారినట్లుగా అయాయి. ఆ చెట్టుక్రింద ఇంత చల్లదనాన్ని అందించే బారెడు నీడకోసం వెతుక్కుంటూ, అల్లల్లాడాడు అబ్బయ్య. ఆ నీడకోసమే వెతుకులాడుతూ, ఎండకి రొప్పుతూ, చొంగలు గార్చుకుంటూ, అటుగా వచ్చి నిలబడింది ఒక గజ్జికుక్క. పిచ్చి ముండ.

ఛీ ఛీ అనుకున్నాడు అబ్బయ్య.

ఫో ఫో అని అదిలించాడు - అక్కడినించి ఆ కుక్క కదలక పోగా, ఒక మాంచి పలుకురాయిని తీసుకుని నడుం విరిగేటట్టు కొట్టాడు. కుయ్యోమంటూ, పరుగు లంకించుకుంది కుక్క.

'నీయమ్మ ! తిక్కకుదిరిందా?' అని అథార్టీగా, ఆ నీడలో సర్దుకున్నాడు అబ్బయ్య. గర్వంగా నలుదిక్కులా పరికించి చూసాడు.

*　　*　　*

సరిగ్గా సమయానికి ఫోను కూడా మొరాయించింది. అలో-హలో అని పిలవగా చివర్కి అది పనిచెయ్యటం ప్రారంభించగా-అవతల్నించి ఎంగేజుడు అన్న కూతలు వినవచ్చాయి. ఎంతసేపూ అవే కూతలు!

'ఛీ... నీయమ్మ. ఇక ఈ దేశం బాగుపడదు. ఎటు బట్టుకుని చూద్దామన్నా అంతా డిసార్డరే!' అని ఆశ్చర్యపోయాడు, ఆ పట్నంలో రెండు సినిమాహాల్సుకీ, నాలుగు పేద్ద వ్యాపారాలకీ అధిపతి అయిన కోటిస్రావు. ఇంటావిడ పురిటికి పోయింది. కొడుకులిద్దరూ కేష్మీరు వెళ్ళారు. ఈ ఆస్తిపాస్తులకి ఇక్క కుక్క కాపలా కాస్తూ కోటిస్రావు మిగిలి పోయేడు, ఈ ఎండల్ని పుష్కలంగా భారీగా అనుభవిస్తూనే!

*　　*　　*

అబ్బ !

అబ్బబ్బ !!

ఎండ వాయించేస్తూ వుంది !!!

*　　*　　*

ఏం[టానాయనా !

ఈ ఎండకి మనసులేదా?

ఈ వడగాలికి జాలిలేదా ?

ఈ సూరీడుకి బుద్ధిలేదా ?

ఏమిటిది ?

ఇది ఏమిటి అని !

అసలు మనుషులు [బతకాల్నా వద్దా అని ! ఈ చెట్టూ చేమలు [ప్రాణాలు నిలుపుకుని మళ్ళీ వచ్చే వసంతానికి చివురులు వేస్తాయా, అని!

బాబో !

భగమంతుడా !

నాయనా !

పిచ్చి నాయనా !

నేను సచ్చిపోతన్నానురా ! మూడు దినాల్నుండీ తిండి లేక పోయినా భరించాను. ఒక మొండి బండముండా కొడుకులాగా నిలబడ్డాను. [బతగాల్ననే తాప[తయంతోనే 'అమ్మా ఆకలి' అని ఆ[కోశించాను. ఛీ ఫో అన్న ఎన్నో ఛీత్కారాల్నీ భరించాను. ఎలాగో లాగా ఆ ఎంగిలి ముద్దల్నయినా, ఆ ఆకూ అలముల్నయినా, ఆ పంపు నీళ్ళనయినా ఆ కడుపులో పడవేసి, ఇట్లా నిలబడటానికి [పయత్నించానా—

ఏమిటీ ఎండా ! ?

నిలువునా జీవుల్ని చంపటమే దీని ఇదా? ! దీనెమ్మ. ఫా! పఫా.

*　　　*　　　*

అబ్బా!

అమ్మా!

ఏమిటీగుండె! ఇదేమి గుండెరా నాయనా? ఒకటే ఇదిగా దడదడా దడదడా కొట్టుకుంటూ వుందే! ఏమయిపోదామనీ?!

లబాడబా

లబాడబా

డబాలబా

డబాలబా

ఏమిటని! ఆగిపోదుగదా! అమ్మో ! ఇంకేమయినా వుందా ? అంతపనీ జరుగదుగదా కొంపదీసి ! అలాగే అయితే ఇక రక్షించే నాధు డెవరూ?

ఇక లాభంలేదు. బాల్చీ తన్నదుగా వెధవ[పాణం'

ఏదో ఒకటి చెయ్యాలి. చెయ్యాల్చెయ్యాలి.

ఆ ఘోరమే జరిగితే- ఈ చుట్టూ వున్నవాళ్ళు సామాన్యులు కాదుగదా!

ఆ స్వంతబామ్మర్ది ఆ సినిమాహాళ్ళని స్వంతం చేసేసుకుంటాడు. ఆపార్ట్నర్లు దొంగలెక్కలు రాసిపారేసి, తనపెళ్ళాం బిడ్డల నెత్తిన చేతులు పెట్టేస్తారు! రాస్కెల్సు! అందువలనా,

తను పోకూడదు! పోనే పోకూడదు.

తను పోకుండా వుండాలంటే-

ఏదో ఒకటి చెయ్యాలి. చెయ్యాల్తప్పదు మరి!

తప్పదు... తప్పదు మరి.

అబ్బా! అమ్మా!

ఎండ !

వేడి, ఉక్క, ఊపిరాడని స్థితి!

పాడు గుండె లబడబ డబలబ

స్వామీ...

దేవాదిదేవా! అనాధరక్షకా! ఆర్త[తాణ పరాయణా.

నీదగ్గరకు వచ్చి నిలువుదోపిడీ ఇస్తాను. కొల్చుకుంటాను. పూజలు చేస్తాను.

రక్షించు నన్ను.

రక్షించు నా కుటుంబాన్ని.

కాపాడు నన్నూ, నా భార్యాబిడ్డల్నీ, నా ఆస్తిపాస్తుల్నీ, నా అన్నింటినీ.

నా చిన్ని పొట్టకు శ్రీరామరక్ష. సర్వే జనా స్సుఖినో భవంతు !

అబ్బా !

అమ్మా !

ఏమిటీ ఆయాసం !

సమయానికి, ఇంట్లో ఎవరూ లేకుండా పోయారు గందా ఖర్మ బాబూ ఖర్మ.

*　　　*　　　*

'ఏయ్'

'......'

'ఇదిగో, నిన్నే'

'......'

'మాట. ఇట్లారా. బాబూ !

'......'

'ఒక్కమాటవినిపో. ఇదిగో. ఈ పదిరూపాయలూ నీకుఇస్తాను. త్వరగా రా బాబూ! నామాట వినవూ?'

* * *

'ఎవరదీ?'

'......'

'నన్నేనా, పిలుస్తూంటా ! అవునూ. నన్నే.'

'......'

'ఏమిటబ్బా మాట అంటున్నాడూ!? తెగ సంపాదించి బొజ్జ పెంచుకున్న ఆ సిల్కులాల్చీ, వుంగరాల పెద్దమనిషికి తనతో ఏం పని చెప్మా?'

'......'

'పది రూపాయలిస్తానంటున్నాడే! ఎంత మంచి పెద్దమనిషీ !'

* * *

'చూడుబాబూ ! ఈ వీధిచివర డాక్టర్ బొజ్జయ్య వుంటారు. నువ్వు అక్కడికి వెళ్ళి ఆయన్ని పిల్చుకొస్తివా, ఈ పది రూపాయలూ నీకే ఇచ్చేస్తాను. ఏం? వెళ్ళి పిల్చుకుని వస్తావా? అబ్బ ! అమ్మ ! అయ్య ! అయ్యో ! ఇక్కడ ఒక పెద్ద మనిషికి ప్రాణం మీదికి వచ్చిందని చెప్పి పిల్చుకురా.'

'......'

'ఏం నాయనా ! నువ్వు మంచి వాడివిగదూ ! వెళ్ళవూ ! వెళ్ళి ఆ డాక్టర్ని వెంటనే పిల్చుకుని రావూ ! సాటి మనిషిమీద నీకు ఆ మాత్రం జాలిలేదూ! ఇదుగో. ఈ పదిరూపాయలూ తీసుకో. నీకే.'

అబ్బయ్య తల పైకీ క్రిందికీ వూపి, వెనక్కి తిరిగి పరుగు లంకించుకున్నాడు. వూపిరి బిగపట్టి మండుతూవున్న నిప్పులమీద పరుగెత్తే శూరుడిలాగా, వీరుడివలే, దవుడు తీసాడు.

* * *

'ట్రింగ్. ట్రింగ్'

'ట్రింగ్. ట్రింగ్'

'ట్రింగ్. ట్రింగ్'

ఎయిర్కండిషనర్ ఆగిపోగా ఆ వుక్కకి తట్టుకోలేక, బట్టలన్నీ విడిచి, తడి తువ్వాలు నడుంకి చుట్టుకొని, బాత్‌రూంలో టబ్ వచ్చి తలుపుదీసాడు.

ఎదురుగా, మాసిన జుత్తుతో, వొంటిమీద జీరాడ్తున్న గుడ్డ పీలికలతో, నెత్తుటి అంటుకుపోయిన కనుపాపలతో. ఎర్రగా నిప్పుల్లా అయిన కళ్ళతో నిలబడివున్న అబ్బయ్యగాడ్ని చూసి, కళ్ళెర్రజేసి—

'ఎవడ్రా నువ్వా ! ఫో. ఫో' అని అరిచాడు, చిరాగ్గా.

అబ్బయ్య నోరుతెరిచి ఏదో చెప్పటాన్కి ప్రయత్నించాడు.

'పోలీసుల్ని పిలిచి బొక్కలో తోయిస్తాను. నీ అమ్మాబాబులు జ్ఞాపకం వచ్చేలాగా, ఎముకలు నలగ బొడిపిస్తాను. దొంగరాస్కెల్. ఫో. పోరాఫో' అంటూ కర్రతీసుకుని మీదిమీదికి వస్తూ— బొజ్జయ్య—

'టామీ ! కమాన్. టామీ. కాచ్ దిస్ రెచెడ్ ఫెలో', అంటూ, అల్సేషియన్‌ని పిలిచాడు. ప్రళయ భీకరంగా పళ్ళు బయటపెట్టి, గర్జిస్తూ ఇంట్లోనించి బయటకి వస్తూవున్న, ఆ విశ్వాసంగల జంతువుని గమనించి, ప్రాణభయంతో వెనుదిరిగి, పెనంలాగా కాల్తువున్న రోడ్డెక్కి, మిల్కాసింగ్‌ని తల్చుకున్నాడు అబ్బయ్యగాడు, అర్భకుడు!

రొప్పుతూ రోజుతూ—

చమట్లు కారుస్తూ—

ఆయాసంతో వూగిపోతూ—

భయంకరమయిన పొగలూసెగలూకక్కే ఆ ఎండని చీల్చుకుంటూ కోటేశ్రావు మేడదగ్గరకి వచ్చిపడిన అబ్బయ్యగాడికి—

ఆక్కడ వరండాలో, క్రిందపడి—దిక్కూ మొక్కూ లేనట్లుగా—పక్షిలాగా—గిలగిలా కొట్టుకుంటూ, హృదయ విదారకంగా మూల్గుతూ, మృత్యుదేవత కౌగిలిని తప్పించుకొనటానికి విశ్వప్రయత్నం చేస్తూ, వొడిపోయే దశలోవున్న కోటేశ్రావుని చూస్తూ—

తోకనివూపుతూ, అసహాయంగా నిలబడి, కళ్ళవెంట ధారాపాతంగా నీరు కార్చుతూవున్న ఆ గజ్జికుక్క కనపడింది. దాని నడుం మీద ఎర్రగా ఆ గాయం! అవతలి వ్యక్తి బాధని చూడలేక, తన నొప్పిని కూడా మరిచి, కన్నీరు పెట్తున్న పిచ్చ జీవి! ఫూలిష్ ఫెలో!

అప్రయత్నంగానే, అబ్బయ్యగాడి కళ్ళూ చెలమలయ్యాయి. తనకీ ఏం చెయ్యటానికీ దిక్కుతోచక భోరుమని ఏడ్చాడు, ఫూల్ అబ్బయ్య.

ఎండ పేల్చేస్తోంది.

ఎండ దంచేస్తోంది.

ఎండ వాయించేస్తూవుంది. అప్పుడు ఆఖరిసారిగా—ఆయొక్క జీవుడు గిలగిలలాడాడు.

డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి

విరియాలమల్లని గూడూరుసానుబంధ శాసనము విమర్శ - పరామర్శ

భారతి-మార్చి '83 సంచికలోని "విరియాలమల్లని గూడూరు శాసనమునందలి బొట్టుబేత, కాకతిబేతకాడు" అను శ్రీ కొల్లూరు సూర్యనారాయణగారి వ్యాసమునందు అపార్థములు, అపార్థీకరణములు కలవు. అవి :-

1. "శాసనపు భాషాప్రయోగ సంస్కరణలెట్లు జరిగినను చారిత్రక విషయములు కొన్ని నిష్కారణముగా బలియైపోవుటను బట్టి, వారందు ప్రకటించిన అభిప్రాయములు కొన్నింటిని వెంటనే సవరించుకొనుమని గోరుటయే యీ వ్యాసపు ముఖ్యోద్దేశము."

విరియాల మల్లని గూడూరు సానుబంధ శాసనములోని తెలుగు పద్యములు కవి రచించినవి. లేఖకుడుచెక్కినవి. కనుక లేఖదోషములు కలవు. అవి పరిష్కరించుకొనుట అవశ్యకర్తవ్యము. "భాషాప్రయోగ సంస్కరణలు" ఇష్టానుసారము జరుగవు. నియమానుసారముజరుగును. పరిష్కరణము వలన చారిత్రిక విషయములు బలికావు. సంస్కరణములేని, శాసనములోని ఏకదేశములను పట్టుకొని కావించిన అందదుకు సమన్వయములు బలికావచ్చును. అది నిష్కారణము కాదు; సకారణము. పరిష్కరణమునందు భ్రమ ప్రమాదములు కలవేని, అవి సవరించుకొనుమని కోరుట సముచితము. అపశబ్దములనుబట్టి, గణయతి ప్రాసభంగములను బట్టి అల్లుకొనిన అందదుకు చారిత్రిక సమన్వయములను, అచ్చమైన చారిత్రిక విషయములుగ స్వయము చాటుకొనుచు సవరించుకొనుమని కోరుట విపరీతము.

2. "శాసనపద్యార్థము నూహింపవలదని, సమకాలీన చారిత్రక విశేషములను గుర్తింపవలెనని మనవి చేసుకొనుచున్నాము."

శాసనపద్యార్థమేకాదు; ఏ పద్యార్థమును ఊహించునది కాదు. భాషాఛ్చందో వ్యాకరణాద్యనేక విషయముల పరిజ్ఞానమును బట్టి గ్రహించునది. పద్యార్థము నిష్కృష్టమైన తదుపరి సమకాలిక చారిత్రిక సత్యముల పరిగణనము. బండిముందు, గుఱ్ఱమువెనుకకాదు.

3. "పద్యములలోనున్న దోషముల నన్నింటిని లేఖకున కొక్కనికే అంటగట్టిరి. శాసన రచయితపైనున్న గౌరవముచే నాతనికి దోషము లాపాదింప నిచ్చగించక వారిట్లు గావించియుందురు."

"పద్యములలో నున్న" అచ్చుతప్పులవంటి "దోషముల నన్నింటిని" లేఖకునికిగాక, కొన్నింటిని కవికి కూడ "అంటగట్ట" వలయును కాంబోలు! కవిదోషములకు, లేఖకదోషములకు భేదముకలదు. అది సాహిత్య పరిజ్ఞానమువలన తెలియును. తెలియుటచేత లేఖక దోషములను కవికి "అంటగట్ట" లేదు. శాసనరచయితపై గౌరవముచేతకాదు. శాసన లేఖకునిపై అగౌరవముచేత కాదు. శాసన సాహిత్యముపై గౌరవముచేత.

4. "కన్నడ భాగమున దోషములు లేకపోవుటను బట్టి లేఖకుని లేఖన పాండిత్యమును అంతగా శంకింప పనిలేదు."

లేఖకుని లేఖనము పాండిత్య విషయముకాదు. లేఖకులు పండితులునుకారు. కవులు పండితులు కాకపోరు. కవిత్వము పాండిత్య విషయముకాకపోదు కవిదోషములు పాండిత్య విషయిక భ్రమప్రమాదములు. లేఖక దోషములు అపాండిత్య విషయిక వర్ణస్ఖాలిత్యములు. కన్నడ భాగమునందు లేఖకదోషములు లేకపోయినను, (ఉన్నవో,లేవో కన్నడ సాహిత్య పరిజ్ఞానము కలవారు తెలుప వలయును) తెలుగు భాగమునందు ఉండుటకు హేతువు, లేఖకుడు కన్నడభాషా పరిజ్ఞాత అగుట, తెలుగుభాషా పరిజ్ఞాత కాకపోవుట కావచ్చును. కారణాంతరమును కావచ్చును.

5. "తెలుగుభాషలో అంతగా పరిచయములేని లేఖకునిద్వారా కొన్ని చిక్కులు వచ్చియుండిన వచ్చియుండవచ్చును. కాని మొత్తమన్నింటికి నాతడే బాధ్యుడనుట అసమంజసము".

తెలుగుభాషలో అంతగాకాదు; ఎంతగా పరిచయమున్నను, లేకపోయినను, లేఖకుని వలన వచ్చునవి చిక్కులుకావు. తప్పులు.

అవి తెలియని పరిశీలకులవలన వచ్చునవి చిక్కులు. కవి దోషములకు కవివలె, లేఖక దోషములకు లేఖకుడే బాధ్యుడు అగును. కాదనుట అసమంజసము. లేఖక దోషములు కొన్నింటికి లేఖకుడు, కొన్నింటికి కవి బాధ్యుడు అనుట మిక్కిలి అసమంజసము. అచ్చుతప్పులు కొన్ని ముద్రాపకునివి, కొన్ని గ్రంథకర్తవి అనుటవంటిది.

6. "కన్నడ శాసనమును వ్రాసిన రచయితయే, తనకున్న పరిమిత పాండిత్యముతో నీ తెలుగు భాగము కూడ వ్రాసియుండెనని అనుమానించుటకు అవకాశమున్నది."

అనుమానించుటకు ఏమైన అవకాశముండును !— "అవకాశమున్నది" అనుటయేగాని, ఉన్నదనిన అవకాశమును ఉట్టంకించినదిలేదు. కనుక ఊహామాత్ర శరణ్యము కావలయును. అంతయును ఊహామాత్ర శరణ్యమే ! — రచయితకు పరిమిత పాండిత్యమును, లేఖకునికి పరిపూర్ణ పాండిత్యమును ఆపాదించుట విపరీతము. శాసనకాలమునందు కన్నడ కవులు తెలుగు పద్యములు వ్రాయుట "సమకాలీన చారిత్రక విశేషము" కాఁబోలు ! ఆ కాలమునకు ముందు వెనుకల - తెలుగు వారు కన్నడ కావ్యములు వ్రాసినట్లు, తెలుగు కవులు కన్నడ పద్యములు వ్రాసినట్లు ఆధారములు కలవుగాని, కన్నడిగులు తెలుగు కావ్యములు వ్రాసినట్లు, కన్నడ కవులు తెలుగు పద్యములు వ్రాసినట్లు ఆధారములు కానరావు.

7. "శాసనపు మొదటి పద్యమున పెద్ద మార్పులేమియు సూచింపలేదు."

కారణము పెద్ద లేఖక దోషములు లేకపోవుటమాత్రమే. ఉన్న చిన్న లేఖకదోషమునకు చిన్న మార్పు సూచింపఁబడినదికద.

8. "రెండవ పద్యమునుండి వీరి సంస్కరణ మొదలైనది... నామవాచకమైన 'విరియాలు'ను విడదీసి ఆతనిని 'భీమనృపఘస్మరుని'గా పేర్కొనిరి. అటువంటి యితర ప్రయోగముల నుదాహరించుచు కటుకూరు శాసనమునందలి "వీరనరేంద్రఘస్మరే" అను దానిని చూపిరి. కాని కటుకూరు శాసనమీయబడిన కాలము పదమూడవ శతాబ్ద ఆరంభము."

పదమూడవ శతాబ్ది ఆరంభములోని శాసన ప్రయోగము, పదొకండవ శతాబ్ది ఆరంభములోని శాసన ప్రయోగమునకు ప్రమాణము కాదు కాఁబోలు ! ఏమి శబ్ద శాసన ప్రామాణిక బుద్ధి !- "భీమనృపఘస్మరుఁడై" అను సమాసము సాధ్యసమాసముకాదు. సిద్ధసమాసము. అది సంస్కృతభాషయందు పుట్టును. సంస్కృతభాష పుట్టినదిమొదలు నేటివఱకు మాత్రమే కాదు; ఏనాటి వఱకును "భీమనృపఘస్మరః" అను సమాసమునకు భీమరాజును సంహరించినవాడనియే అర్థము. "విరియాలభీమనృపఘస్మరః" అని సమాసమును గ్రహించినచో, విరియాల భీమరాజును సంహరించినవాడు అని మాత్రమే అర్థము వచ్చును. అది ప్రకరణ విరుద్ధము. అనన్వితము. కనుక పరిత్యక్తము.

9. "ఈ శాసనపు తొలి నాలుగు పద్యములు కాకతీయవంశ ప్రతిష్ఠాపన కాలము నాటివని అంగీకరించిన, సుమారు నాటికి రెండు శతాబ్దుల క్రిందటివగును. కనుక రెండు శతాబ్దుల తరువాతి ప్రయోగములను బట్టి యిచ్చట పదచ్ఛేదము జరుపుట పద్ధతికాదు. అట్లు జరుపుటయే వారికభీష్టమైనచో సమకాలీనుడై, తత్ప్రాంతమున విరియాలుతో కలహించి నశించిన "భీమనృపు" నొక్కనిని శాసన ప్రమాణముతో చూపవలసి యున్నది."

తొలి నాలుగు పద్యముల రచనాకాలము స్థూలముగ 1005వ సంవత్సరము, లేఖనకాలము 1124వ సంవత్సరము అని పూర్వోక్తము. తన్మధ్యకాలము రెండు శతాబ్దులా ? 1124 - 1005 ఎంత? 119. వింశోత్తర శతాబ్దికిని ఒకటి తక్కువ. లెక్కలుకూడ రావుకాఁబోలు!- "రెండు శతాబ్దుల" తర్వాతివి లేఖనములా? ప్రయోగములా?- రెండు శతాబ్దుల తర్వాతి లేఖనములను బట్టి ఇచ్చట పదచ్ఛేదము చేయుట పద్ధతికాదా? ఏల?- నన్నయ భారతమునకు లభించిన తాళపత్ర గ్రంథములు రెండు శతాబ్దుల తర్వాతివికావు; నాలుగైదు శతాబ్దుల తర్వాతివి. కనుక నన్నయ భారతములోని పద్యములకు పదచ్ఛేదము చేయుట పద్ధతి కాదన్నమాట! ఇట్టి విపరీత సిద్ధాంతములు చేయుట మాత్రమే పద్ధతి కాఁబోలు!- పదచ్ఛేదము చేయకుండ పద్యార్థము ప్రత్యక్షము కాదు. అయినదనుకొనుటవలని అనర్థకము.

విరియాలు సంహరించిన భీమనృపుని శాసన ప్రమాణముతో చూపవలసియున్నచో, మఱి విరియాల సూరడు కాపాడిన రవ్వనృపుని, రాపాడిన భీమనృపుని కూడ శాసన ప్రమాణములతో చూపవలయును.

10. "శాసనమునుబట్టి 'పాండవ మధ్యమ భీముని పోలిన విరియాల భీముడ'ని చెప్పవలెను. 'భీముడు' అని తత్సమముగా ఆ పదము లేకపోవచ్చును. 'విరియాలుడ'ని కూడ లేదు. కనుక 'విరియాలభీమ' అనునది ప్రథమైక వచనములో తత్సమ రూపమని అంగీకరించవలెను."

శాసనమును బట్టి "పాండవ మధ్యమ భీముని పోలిన విరియాల భీముడు" అని చెప్పరాదు "పోలిన" అనుటకు పద్యమునందు ఉపమాలంకారము లేదు. ఉత్ప్రేక్షాలంకార ముకలదు. "విరియాల భీముడు"

అనుటకు "భీమ" అను తత్సమము తెలుగు [illegible] లో లేదు. కన్నడభాష యందునులేదు. ఒరియా భాషయందు కలదు. కాని శాసన భాష ఒరియాభాషకాదు. ఒరియా సంబంధము సమకాలిక చారిత్రిక సత్యముకాదు. "భీముడు" అనియే తత్సమముగా ఆ పదము తెలుగుభాష యందుకలదు. ఉండవలయును. అట్లు"విరియాలుడు" అనిఉండనక్కఱ లేదు. "విరియాలు" అని కూడ ఉండవచ్చును. అది సాంస్కృతికము. ఇది ఆచ్ఛికము. "భీమ" అని లేదు. ఉండదు. కనుక "విరియాల భీమ అనునది ప్రథమైక వచనములో తత్సనురూపమని అంగీకరింప" రాదు. శబ్దజ్ఞానము కల ఎవ్వరును అంగీకరింపరు. ఇది చరిత్ర పరిశోధకులకు మహాబధిరశంఖారావమే అయినచో, "అపశబ్ద భయం నాస్తి అప్పలాచార్య సన్నిధౌ" అని మాత్రమే అనుకొనవలయును. అథవా, చరిత్ర పరిశోధకులు సదృశమైన సమకాలికశాసన ప్రయోగాంతరమునైన చూపవలయును.

పద్యమునందు "పాండవమధ్యమ భీముఁడోయనంగా విరియాలు భీమనృపఘస్మరుఁడై యుదయించె" అని ఉండవలయును. ఇందలి "ఓయనంగా" అనునది ఉపమావాచకము కాదు. ఉత్ప్రేక్షాసూచకము. ఉపమాలంకారముగాక, ఉత్ప్రేక్షాలంకారము ఎందుకు కలదు ? అని ఆయోజించినచో, (ఆయోజనము పద్యార్థమును గ్రహించు పద్ధతి) సంహరింపఁబడినవాడు పేరునకు భీముడు, సంహరించినవాడు తీరునకు భీముడు అనియే అభివ్యక్తమగును. ఛందోవ్యాకరణాలంకారాది విశేషములను గ్రహింపని అర్థము పద్యార్థము కాదు. అద్యతన చరిత్ర అగును కాబోలు !

11. "ఇక మూడవ పద్యము... సంస్కరణమున బడి అర్థము మారిపోయినది. ఫలితముగా కాకతీయ ముదిగొండ చాళుక్య చరిత్రలో ముఖ్యమనదగు ఘట్టము నిష్కారణముగా బలియైపోయినది."

పరిష్కరణము వలన మారిపోయిన అర్థము, బలియైపోయిన కాకతీయ ముదిగొండ చాళుక్య చరిత్రలో ముఖ్యమనదగు ఘట్టము వీరి మాటలలోనే వీరు ఒకసారి "కల్పించి"నది. మఱొకసారి "సరిచేసి" నది. తర్వాత మఱొకరు ఖండించినది.[2] ఇట్లు కల్పించునది, సరి చేయునది, ఖండింపఁబడునది చరిత్ర అగునా? చరిత్రాభాసమగును.

12. "'తత్తనెయురు' అను శాసనపదము, 'తత్తతనయు' అని యుండవలెనని వీరి సంస్కరణ."

అవును. శాసన పదము కాదు శాసన లేఖనము. కారణము "తత్తనెయురు" అను శాసన లేఖనము ప్రాసస్థలమునందు కలదు. పద్యమునందు తకారము ప్రాసము. కనుక "తత్తతనయు" అని ఉండి

[illegible] ప్రాసభంగము కవికృతము కాదు. కారణము కన్నడమునందును ప్రాసము కలదు. ప్రకృత శాసనములోని కన్నడభాగమునందు ఏడు పద్యములు కలవు. ఏడు కన్నడ పద్యములందును ప్రాసకలదు. ఏడవ పద్యము నందు మాత్రము ఒకచో విలక్షణముగ కలదు.[3] అది లేఖక దోషమో, ముద్రణదోషమో, కన్నడ గుణమో కన్నడ సాహిత్యవేత్తలు తెలుపవలయును.

ఎనిమిదవ శతాబ్ది గుణకవిజయాదిత్యుని లేక పండరంగని అద్దంకి శాసనము మొదలు పంథొమ్మిదవ శతాబ్ది మండల తమ్మన్న శ్రీకూర్మశాసనముల వఱకును గల శతాధిక పద్యశాసనములందు సహస్రాధిక లేఖకదోషములు కలవు. అందు పద, గణ, యతిమైత్రి, ప్రాస భంగములును కలవు. అవి కవి దోషములు అని గాక, లేఖక దోషములు అనియే లెక్కించి జయంతి రామయ్యపంతులుగారు సూచించిన పరిష్కృత పాఠములు కలవు.[4] సుష్ఠుపాఠములనుగాక "భ్రష్ట" పాఠములను పట్టుకొని ప్రాకులాడుట దయనీయము.

కవిదోషముకాని, "తత్తనెయురు" అను లేఖకదోషమునకు "తత్తతనయు"అనుసాధు పాఠమునుగాక, మరొక సాధుతర పాఠమును ప్రాసభంగములేని ఇతరదోషమురాని పాఠమును- సూచించినచో, అవశ్యము పరిగ్రాహ్యము. పట్టినే "కవిపాఠములుగా భ్రమింపజేయుటకు చేయుచున్న ప్రయత్నమిది. నిరసింపదగినది" అని ఎంతవదరినను ప్రయోజనము సున్న. అపపాఠములను కవిపాఠములుగ, అపసిద్ధాంతములను స్థిరసిద్ధాంతములుగ భ్రమపడుటకు పాఠకులు బాలురుకారు.

13. "వీరు పూర్వపు పండితాభిప్రాయములను మన్నించుటగాని ఖండించుటగాని జరుగలేదు".

పరిష్కరణమునకు, అర్థవివరణమునకు సంభావ్య సమన్వయమునకు ఉద్దిష్టమైన వ్యాసము, పూర్వపండితాభిప్రాయముల ఖండన మండనములకు విషయముకాదుగాని, అవి గతార్థములే. అంతేకాదు. పండితాభిప్రాయములు సంభావ్యములైన సమన్వయములు మాత్రమే. వితండ వాదములు, విపరీత సిద్ధాంతములు కావు. ఉపరి ప్రమాదపతితములకు పండితులను చీల్చిచెండాడుట ప్రాజ్ఞ లక్షణముకాదు.

14. "'తత్తనెయురు' అనుపదమునకు ముందున్న 'ప్రతిష్ఠసేసి'అను పదమును'పేరు'కు ముడిపెట్టి,పేరు ప్రతిష్ఠచేసి అని అన్వయించి 'నిలబెట్టి' అని అర్థము చెప్పుట జరిగినది. కాని పద్యమునందు 'ప్రతిష్ఠసేసి' అనునది కొరవిదేశమున 'ప్రతిష్ఠింప' బడిన బొట్టు బేతనికి సంబంధించి నట్టిది".

పద్యమునకు ప్రతిపదార్థము, తాత్పర్యము అని మాత్రమేగాక "దండాన్వయము" అని ఒకటి కలదు. అది తెలిసిన, "ముడిపెట్టి, అన్వయించి, అర్థముచెప్పుట జరిగినది" అని వృథా వాగ్వ్యయము చేసి కొనుట జరగదు. "చేకొన్న బొట్టు బేతరాజు పేరు కొరవి దేశమునందు నిలబెట్టి" అనియే చెప్పిన అర్థము.[5]

15. "ఇక నాల్గవపద్యము. దీనికిని మూడవపద్యమునకు ఆంతరిక సంబంధము కలదు. దీనికిని రెండవపంక్తిలో తొలిభాగము కొద్దిగా పగిలిపోయినది. ఇచ్చటి పదము ' మేల్గరుడని ' అని పేర్కొనిరి."

ఇట "ఆంతరిక సంబంధము" కలదని, స్థలాంతరమున మూడు, నాలుగు పద్యములు ఒక్క ప్రకరణమనుటను కాదనుట స్వవచ్ వ్యాఘాతము. "ఆంతరిక సంబంధము" ఆకాశమునుండి ఊడిపడదు. ఏకప్రకరణమైననే ఏర్పడును.

ఇక రెండవ పంక్తిలో తొలిభాగము ఎంత పగిలిపోయినను, ఎప్పుడు పగిలిపోయినను, అక్కడ ఒక్క అక్షరముకూడ చెక్కుచెదర లేదు. "మేల్గరుడని" అని స్పష్టముగ కలదు. అయిదవ పద్యమునందు "మేలుగ" అను నాలుగు స్థలములందును "మే" ఎట్లు కలదో, "మేల్గరుడని" అను చోట కూడ "మే" అట్లే కలదు. దీర్ఘము అయిదు స్థలములందును లేదు. అంతేకాదు. "ల" యొక్క ఎడమప్రక్క పిసరంత ప్రిదిలినను, "ల" స్పష్టముగ కలదు. అది "య" శేషము కాగల అవకాశము లేదు. ఉపరి "ల" క్రింద "గ" ఒత్తుకలదు. ఇది యెల్ల శాసన ప్రతిబింబమును కంటితో చూచిన కనిపించక పోయినచో, మరి "భూతద్దముతో" చూచిన స్పష్టముగ కనిపించును. శాసనప్రతిబింబమునకు దీర్ఘకృతచ్ఛాయాపటము తీయించిచూచినచో, ఇంకను స్పష్టతరముగ కనిపించును. అట్టి "మేల్గరుడని" అను పదబంధము శాసనమునందు లేదనుట, లేనట్లు ఉదాహరణము నందు "ల్గ" కుండలీకరించుట, ఇట్లు పేర్కొనిరని అంగలార్చుట, "అహో! మూలచ్ఛేదీతవ పాండిత్యప్రకర్షః" అనిపించునది మాత్రమేకాదు; ఆత్మ వంచనముతోపాటు జగద్వంచనము కూడ. అక్షంతవ్యము.


వా పక్షముగ "మేల్గరుడని" కాదు "మెయ్గరుడని" అని వాదించినను, పద్యమునందు "గరుడని" అను పదము అపరిహార్యము. అది గరుడు + అని=గరుడని. అని పదచ్ఛేదముకాదు. గరుడని అనుపదము ద్వితీయాంత విశేషణము. ఇది తెలిసిన బహ్వర్థములు భాసించును. "గరుడని బేత భూవిభుని" అను పంక్తికి గరుడబేతరాజు అనియే అర్థము.

16. "గరుడని బేతభూవిభుని కాకతివల్లభు బిన్నవాని అని పదచ్ఛేదము చేసినయెడల దీనిముందున్న 'మేల్' నకు ఏమి అర్థము చెప్పవలసి యుండును?"

ఇది "రామాయణ మంతయు విని రామునికి సీత ఏమగును?" అని ప్రశ్నించినట్లు కలదు. 'మేల్' అనునది ఉత్తరరూపము. ఆచ్ఛికపదములందు పదాంతమందలి డ,ల,ట,ర, ల ఉత్వమునకు లోపము రావచ్చును. మేలు అనునది పూర్వరూపము. అసలు శబ్దము. అందరికిని తెలిసిన అచ్చుతెనుగు శబ్దము. ఆ శబ్దమునకు ముందు "కామవసాని మొక" అని శాసన లేఖనము. అది లేఖక దోషము. "కామవసాని యొక్క" అని కవి పాఠము. కామవసానియొక్క మేలు అనగా ఉపకారమని అర్థము. కామవసాని కారణమైన ఉపకారమని తాత్పర్యము. ఇంత స్పష్టార్థప్రతిపత్తికల సరళవాక్యమునకు సహితము అర్థము తెలియకుండ, అకాండ తాండవము చేయుట అత్యంత శోచనీయము.

17. "ఇన్ని శ్రమలుపడి యీ మేలును కామవసానియొక్క మేలుగా చెప్పి దీనిని, గరుడ బేతగా చిత్రింపవలసిన ఆవశ్యకత ఏమి వచ్చిపడినది?... కాకతి వంశీయుడైన రెండవబేతనితో యీచారిత్రకాంశము సమయానుకూలమై యొప్పుచుండ, యింత నిష్కారణ నిరర్థక ప్రయత్నము దేనికి?"

పద్యమునందు "కామవసానియొక్కమేలు" అని కలదు. కనుక అది కామవసానియొక్క మేలు అనిచెప్పుటకు శ్రమలు పడవలసిన ఆవశ్యకము వచ్చిపడదు. కాదని చెప్పుటకే అన్ని శ్రమలు పడవలసిన ఆవశ్యకము వచ్చిపడును. పద్యమునందు "గరుడని బేతభూవిభుని" అని కలదు. కనుక గరుడబేతనిగా చిత్రింపవలసిన ఆవశ్యకము వచ్చిపడదు.



ఇది శాసన ప్రతిబింబమునకు దీర్ఘకృతచ్ఛాయాపటము. మూడవపంక్తి చివరి అక్షరము "మె". అది "మే" అగును. ఇక నాల్గవపంక్తి మొదటి నాలుగు అక్షరములు "ల్గరుడని." కనుక "మేల్గరుడని" కవి పాఠము.

గరుడ బేతను కాదనుటకు మాత్రమే చిత్రింపవలసిన ఆవశ్యకము వచ్చి పడును. పద్యములోని చారిత్రికాంశము "కాకతి వంశీయుడైన రెండవ బేతనితో సమయానుకూలమై యొప్పుచుండ" లేదని, వీరి సంయుక్తాభిప్రాయము "చరిత్రను మార్చుచున్న"దని శ్రీ పి.వి. పరబ్రహ్మశాస్త్రిగారి ప్రత్యాఖ్యానము కలదు. దానికి సమాధానమీయక ఈ "నిష్కారణ నిరర్థక" దుస్సాహస దురర్థక ప్రయత్నము దేనికి?- "శ్రీ శాస్త్రిగారి చర్చకు మేమింకను సమాధానమీయవలసియున్నది- కనుక ప్రస్తుతమున కది విషయముకాదు" అనిన సరిపోవునా? అది ప్రస్తుతమునకు విషయముగాక అప్రస్తుతమునకు విషయమా?- పరబ్రహ్మశాస్త్రిగారి ప్రత్యాఖ్యానము వెలువడి పదియేను నెలలు గడచినవి. ఇంకను సమాధానము లభింపలేదు-కాబోలు!

18. "ఇచ్చట 'అరుదగునట్టి' అను పదము ఎఱ్ఱనృపునంగన కామవసానికి సంబంధించినది. అసామాన్యురాలైన కామవసాని అని భావం. కాని దీనిని కామవసాని యొక్క 'మేలు'కు ముడిపెట్టిరి. ఆ 'మేలు' పైన పేర్కొనబడిన 'మేల్గరుడని' డినుం విడగొట్ట బడినది."

ఇచ్చట అనగా స్పష్టార్థప్రతిపత్తికల సరళవాక్యమున హితము అర్థము కానిచోట! ఆ చోటు "అరుదగునట్టె ఎఱ్ఱనిపునంగనగామవసాని యొక మేల్గరుడని" అను లేఖకుని లేఖనము. "అరుదగునట్టి యెఱ్ఱనృపునంగన గామవసానియొక్క మేల్గరుడని" అను పరిష్కృతపాఠము. ఇందు "అరుదగునట్టి అను పదము కామవసానికి సంబంధించి, అసామాన్యురాలైన కామవసాని అని భావ" మైనచో, "యొకమే" అను లేఖకుని లేఖనముతోపాటు "యొక్కమేలు" అను కవి పాఠమునకును దొక్కశుద్ధి ఉండదు. అది "యొక్కమేలు" కాదు మఱొకటి అని చెప్పినది లేదు. చెప్పఁగలిగినదిలేదు. "ముడిపెట్టిరి"అని మోరకించుటయే గాని, ముడి విప్పినది లేదు. విప్పఁగలిగినది లేదు. "విడగొట్టబడినది" అని విహ్వాలించుటయేగాని, విడగొట్టకుండ సరియైన అర్థము చెప్పినది లేదు. చెప్పఁగలిగినదిలేదు. అసలు పదములను విడఁగొట్టకుండ పద్యము లకు అర్థము చెప్పుట ఆకాశ చిత్రలేఖనము. "పదచ్ఛేదము" అన్న పద బంధమునకు కూడ అర్థము తెలియదు కాఁబోలు!- "అరుదగునట్టి యెఱ్ఱనృపునంగన గామవసానియొక్కమేలు" అను వాక్యమునందు "అరుదగునట్టి" అను విశేషణము "మేలు" అను విశేష్యమునకు అన్వయించునని విశేష్యవిశేషణ సంబంధ పరిజ్ఞానము కలదేని తెలియును.

ఇటు "అరుదగునట్టి" అను పాఠమునుకలదు.[8] అది కవి పాఠమైనచో, కామవసానియొక్కమేలు అరుదగునట అని మాత్రమే అర్థము వచ్చును. కామవసాని అరుదగునట అని అర్థము రాదు. అంటఁగట్టిన తెలుగు నుడికారము కాదు. ఇంగ్లీషు పలుకుబడి అగును. "బొట్టుబేత, కాకతిబేత" అనుట కూడ ఇంగ్లీషు దుష్ప్రభావమే.

19. "బల్లహరాయనియోగిని, ఆశ్రయించునది, చక్రవర్తియైన భాస్కరవిభుని దర్శించునది, ఆ కాలమునందు స్త్రీ కాదని పేర్కొన్నారు... కాకతీయ రాజ్య చరిత్రలో స్త్రీలు నిర్వహించిన పాత్రను గుర్తించిన ఎవ్వరునూ పై వాక్యము నంగీకరింపరు. సిద్ధేశ్వర చరిత్రాది కథనములు కూడ పై చారిత్రక సంఘటనలను తలపింపజేయుట గమనింపదగినది."

పయి వాక్యములోని ఆశ్రయణము, అన్యరాజ్య సందర్శనము రాయబారమునకు సంబంధించినవిగ పద్యమునందు ప్రతీయమానము. కాకతీయరాజ్యచరిత్రలో స్త్రీలు నిర్వహించిన పాత్రను గుర్తించినవారు రాయబారము నెరపిన స్త్రీల చరిత్రను తెలిపిన, అవశ్యము స్వీకార్యము.

సిద్ధేశ్వర చరిత్రాది కథనములందు ఎఱుక దేవరాజు మేనత్త కుంతలిదేవి గుజరాష్ట్ర 'మహారాష్ట్ర' ఘూర్జర యవనరాజులపై దండు వెడలి వారినోడించి, మరల దండెత్తివచ్చిన కటకబల్లహుని, గంగిదేవుడను సేనాధిపతిచేత చంపించి, పందొమ్మిదేండ్లు రాజ్యముచేసినట్లు కలదు.[9] రాజ్యకాలమును కలదు.[10] మఱి కాకతీయ సామ్రాజ్య చరిత్రకారులు రుద్రమదేవిపేర అధ్యాయమువలె, కుంతలిదేవిపేర అధ్యాయము కాదు- కనీసము- ఒక పరిచ్ఛేదమునైన వ్రాయలేదేమి? ఇక వ్రాయుదురు కాఁబోలు!

సిద్ధేశ్వర చరిత్రాది కథనములు "పయి చారిత్రకసంఘటనలను తలపింపజేయుట గమనింపదగినది" అయినచో, అవి మొదటి కాకతి బేతరాజు కాలమునందు జరిగినట్లును మఱి గమనింపవలయునుగదా! అనుకూలమైనది ప్రమాణముగ, ప్రతికూలమైనది అప్రమాణముగ ఒకే విషయమును పరిగణించుట అర్ధజరతీన్యాయదోషమునకు లక్ష్యీభూతమగును.

20. "వారి అభిప్రాయమున యీ ఘనకార్యములన్నియు ఎఱ్ఱనవే"

అవును. అందుకు హేతువు పద్యమునందు "తాను" అను సర్వనామము కలదు. అది ఎఱ్ఱ నరేంద్రునికి ఎట్లు అన్వయించునో పూర్వోక్తము.[11] కామవసానికి అన్వయించునది కాదని చెప్పక పోవుటకు హేతువు, అట్లు తలపోయువారు కూడ ఉందురని, ఉన్నను తలయెత్తుదురని తలంపక పోవుట మాత్రమే. ప్రకరణమును వదలి పద్యార్థమును గ్రహించుట నిరాలంబనృత్యము. పదములను వదలి వాక్యాన్వయము చేయుట తలక్రిందు తాండవము.

21. "పై మూడు, నాల్గు పద్యముల నొక్క ప్రకరణముగా చెప్పి, రెండింటిలో వర్ణితములైన ఘనకార్యములను ఎఱ్ఱ నరేంద్రునివిగా వివరించినారు. కాని అది అంగీకార యోగ్యమైన వివరణ కాదు. మూడవ పద్యమున ఎఱ్ఱ నరేంద్రుడు బాధ్యత వహించిన కార్యమును, నాల్గవ పద్యమున కామవసాని చేబూని సాధించిన దుర్ఘటరాజకీయ బాధ్యతను వర్ణించుచున్నవి."

అర్థవివరణలకు అంగీకార యోగ్యతాయోగ్యతలు నిర్ణయింప వలసినది పద్యార్థము. పదార్థము తెలియనివారుకారు. తెలిసినవారు, మూడవ పద్యము ఎఱ్ఱ నరేంద్రుడు బాధ్యత వహించిన కార్యమును, నాల్గవపద్యము కామవసాని చేబూని సాధించిన దుర్ఘట రాజకీయ బాధ్యతను వర్ణించుచున్న"చో, భార్యాభర్తలైన కామవసానికి ఎఱ్ఱనరేంద్రునికి విడాకులు ఈయవలయును. అథవా, ఎఱ్ఱనరేంద్రుని చంపవలయును. అదికూడ జరుగకపోలేదు. "ఇట్ మే బి దట్ ఎఱ్ఱ హాస్డ్ అవే బిఫోర్ హి ఫుడ్ కన్సాలిడేట్ హిజ్ వర్క్" అని ఖండవల్లి లక్ష్మీరంజనము గారి అభిప్రాయము.[12] కాని, "విరియాల ఎర్రన కాకతిబేతరాజ శత్రువులను నిర్మూలించి అతనిని కొరవి దేశమునకు ఏలికగ ప్రతిష్ఠించెను. ఈ యెర్రన భార్య కామవ సానిగూడ ఇతనికి సాయమ్మునేసి కాకతి వంశమును సుప్రతిష్ఠితము చేసెను." అని మారేమండ రామారావుగారి అభిప్రాయము.[13] "తెలంగాణములోని గూడూరు శాసనము ప్రకారము విరియాల వంశజుడగు ఎఱ్ఱమాపతి కాకతి బేతనృపాలుని శత్రువును నిర్జించి, యీబేత వసుధాధిపుని కొరవిదేశమునందు ప్రతిష్ఠ జేసెననియు దెలియుచున్నది". అని కుందూరి ఈశ్వరదత్తుగారి అభిప్రాయము[14] కూడ. ఇవి "పూర్వపు పండితాభిప్రాయము"లే. అపండితాభిప్రాయములు కావు. ఇట్టివింకను కలవు.

22. "పొరపాటున ఎఱ్ఱను చంపిన కొరవియందలి శత్రువే ముదిగొండ చాళుక్యరాజుకావలెనని పేర్కొనిరి"

పొరపాటునకాదు. శాసన పద్యార్థమున. అది పూర్వోక్తము.[15] పద్యార్థము తెలిసిన ఖండవల్లి లక్ష్మీరంజనముగారి అభిప్రాయమును[16] అదే. "విరియాల ఎఱ్ఱ డిఫీటెడ్ దిస్‌లోకల్ ఛీఫ్‌టెన్ (పెర్‌హేప్స్ వుయ్ హేవ్‌టు లుక్ ఫర్ హిమ్ ఇన్ ది ముదిగొండ చాళుక్యాస్) అండ్ ఎస్టాబ్లిష్డ్ బేత I ఇన్ ది కొరవి సీమ". ఇందలి బేత I మొదటి కాకతి బేతరాజే. ఇది కూడ "పూర్వపు పండితాభిప్రాయమే". అపండి తాభిప్రాయముకాదు.

23. "కాకతి బేతవట్టి నిస్సహాయస్థితికి చేరుటకు మూలకారణమే ఆ విరియాల ఎఱ్ఱకు... పై పద్యమున చెప్పబడినట్లు అతడు కొరవి దేశమున కాకతీయులకు స్థానము లేకుండ చేయుట వలననే యీ స్థితి యేర్పడినది. తమ బాంధవ్యమును పురస్కరించుకొని కామవసాని నడుముకట్టి కాకతీరాజ్యపునర్వ్యవస్థీకరణకుద్యమింపవలసి వచ్చినది."

కాకతి బేతరాజు నిస్సహాయస్థితికి మూలము విరియాల ఎఱ్ఱడని శాసనమునందులేదు. కాకతి వల్లభుడైన బేతరాజు పిన్నవాడు అని మాత్రమే కలదు. విరియాల ఎఱ్ఱడు కాకతీయులకు కొరవి దేశమునందు స్థానము లేకుండచేసినట్లు "పై పద్యమున చెప్పబడి" లేదు. ఆ పద్యములోని చొట్టుబేత వసుధాధిపుడు ముదిగొండ చాళుక్యరాజుఅని, అతని శత్రువు కాకతీయరాజు అని కల్పించిన అద్యతన కథనములందు మాత్రమే "చెప్పబడి" కలదు. అట్లు చెప్పిన భర్త విరియాల ఎఱ్ఱడు కొరవిదేశమునందు, భార్య కామవసాని అనుమకొండ దేశమునందు ఉండి కాపురము చేయవలయును. అథవా కథలు అల్లవలయును. భర్త విరియాల ఎఱ్ఱడు కాకతీయ మహారాజును "ఉద్ధృతముగ" చంపగా భార్యకామవసాని కాకతీయ యువరాజును ఉద్ధరించుటకు కారణము "తమ బాంధవ్యము" అయిన, మఱి కామవసానికి - కాకతీయయువరాజుతోనే గానీ, భర్తవిరియాల ఎఱ్ఱనితో బాంధవ్యము లేదు కాబోలు ! అంతే కాదు. భార్యాభర్తృ సంబంధము "తమబాంధవ్యము"కాదు కాబోలు !! ఉపరి వీరు గుర్తించిన, కాకతీయ సామ్రాజ్యచరిత్రలోని స్త్రీలు నిర్వహించిన పాత్రలో- భర్తతోడి బాంధవ్యమును తెగతెంపులు చేసికొని, భూభర్తతోడి బాంధవ్యమును మాత్రమే పునరుద్ధరించుకొనుట కూడ కలదు కాబోలు!!! ఇట్టి దురర్థములకు దోహదము చేయు చారిత్రిక సమన్వయములు దురదృష్టము.

24. "ఇందు ప్రస్తావింపబడినవి యిరువురు శత్రువుల రాజకీయమునకు సంబంధించిన భిన్నవిషయములు."

ఇట్లు చెప్పుటను పద్యార్థప్రాప్తిని మాత్రమెగాక, ప్రమాణాంతరమును కూడ చూపవలయును. స్వీయచరిత్రకాదు. ఇదే ప్రమాణమైనచో, పద్యార్థ గ్రహణశక్తి రహితమగును. అంతేకాదు. అన్యోన్యాశ్రయ దోషదూషిత మగును.

25. "ముందు పద్యమున శత్రుసంహారము జరుగగా. తరువాతి పద్యమున అన్యసహకారము లభించినదట"

ఇది వక్రీకరణము. శత్రుసంహారము పద్యమునందు జరుగదు. యుద్ధమునందు జరుగును. అన్యసహకారమును పద్యమునందు లభింపదు. రాయబారమునందు లభించును. "అన్యసహకారము లేని శత్రుసంహారము మూడవపద్యమునందు అసహాయశూర లక్షణమేకాని, శత్రుసంహా

రములేని అన్యసహకారము నాల్గవ పద్యమునందు వ్యర్థము" అని పూర్వోక్తము! అర్థముకాలేదు కాఁబోలు! ఏది అర్థమయినది కనుక ఇది అర్థము అగుటకు? కాకతి వల్లభుని చేతఁబట్టుటకు, కాకతి (వంశము)ను నిలుపుటకు "బల్లహరాయనియోగిని" ఆశ్రయించినది, భాస్కరవిభు చక్రవర్తిని సందర్శించినది ఎందుకు? ఎత్తుకొనుటకు ,ముద్దుపెట్టుకొనుటకు కాదు, శత్రుసంహారమునకు. అది నాల్గవ పద్యమునందు లేదు. మూడవ పద్యమునందు కలదు. ముందు శత్రుసంహారమును చెప్పి, తర్వాత తదర్థమైన అన్యసహకారమును వివరించుట-కార్యమును ముందుచెప్పి, కారణమును తర్వాత వివరించుట క్రమవిరుద్ధముకాదు. తర్కసహము. సంస్కృతాంధ్ర కావ్యములు చదివిన తెలియును.

26. "గతములో...మేమును ముదిగొండ చాళుక్యవంశమున్న తత్కాలమున కానక (బొట్టు బేతరాజును) యీ అవసరము గడుపుటకై ఒకనిని క్రీ॥శ॥ 985 – 1000 ప్రాంతమున కల్పించితిమి. కాని తర్వాత యిందలి విషయములన్నియు శాసనములందు కానవచ్చుచున్న తర్వాత బొట్టు బేతరాజునకు సరిపడుటచే పై సన్నివేశమును క్రీ॥ శ॥ 1075 – 1110 ప్రాంతమున నున్న బొట్టు బేతరాజునకు సరిచేసితిమి."

ఇందు "అవసరము గడుపుటకై", "కల్పించితిమి", "సరి చేసితిమి" అను పదరాజములు అవశ్యగమనార్హములైనవి. గతములో కల్పనము! వర్తమానములో సరిచేత !! కలనేత. భవిష్యత్తులో ?- దిద్దుబాటు కాఁబోలు !!! చరిత్ర ఇంత చపల చిత్తమా? ఇంతకు, గూడూరు శాసనమునందలి విషయములు ఇతర శాసనములందు "కానవచ్చినవి" అన్నవి తమకు అనుకూలమైనవి. ప్రతికూలమైనవి కావు. వీరి కాలనిర్ణయము ప్రకారమైనను, ముదిగొండ చాళుక్యులందు 1075వ ప్రాంతమునందు బొట్టు బేతరాజు లేడు. వట్టి బేతరాజు కలడు. అతడు బొట్టు బేతరాజు అని సొంత ఆపాదనము!- ఇన్ని పల్లటీలు కొట్టుటకు హేతువు పద్యార్థగ్రహణశక్తి లేకపోవుటమాత్రమే కావలయును. అథవా, "తాఁబట్టిన కుందేటికి మూడేకాళ్లు" అను దృఢ నిశ్చయము కావలయును.

27. "అందు-(క్రివ్వాక శాసనమునందు) ఇరువురు బేతరాజులు కలరు. మా కాలనిర్ణయముననుసరించి మొదటి బేతరాజు క్రీ॥శ॥ 1075-1100 ప్రాంతము వాడగును. రెండవ బేతరాజు క్రీ॥శ॥ 1125-1150 ప్రాంతము వాడగును... అయితే వీరు'కొరవిపురవల్లభులు'గా తెలియుచున్నను, ప్రత్యేకముగా నాతనికి 'బొట్టు' శబ్దముపేరు ముందులేదు. కాని తరువాత వారు నత్తరామేశ్వర, శ్రీకాకుళ శాసనములలో 'బొట్టు'లే తమ నామములందుంచుకొనుటను బట్టి... వీరి సమీప పూర్వికుడైన బేతని కూడ బొట్టుబేతగ పరిగణించుట జరిగినది. కనుక ఆ కాలమునకు సరిపడునట్లు ముదిగొండ చాళుక్యవంశములోని బొట్టుబేతని గూర్చిన శాసన ప్రమాణ మున్నది."

ఇదా శాసన ప్రమాణము అనగా ?! ఏ కాలమును అనుసరించి సరిపడు శాసన ప్రమాణము? "మా కాలనిర్ణయముననుసరించి" అను మాటనుబట్టియే అది మఱొకరు అంగీకరించిన కాలనిర్ణయము కాదని అభివ్యక్తమగుచున్నది. అంతేకాదు. వీరి కాలనిర్ణయము "పురుషాంతరమునకు 25సంవత్సరముల ననుసరించి "నదని,"మెకానికల్ పద్ధతిలో చేయబడిన"దని పరబ్రహ్మశాస్త్రిగారు ప్రక్కను బెట్టినది.[17] శాసన ప్రమాణములను బట్టి తెలిసిన అంశములకు, తరమునకు 20మొదలు 40 సంవత్సరముల వఱకు పరిగణించి సమన్వయించుట ఇదివఱకటి చారిత్రిక పద్ధతి. తరమునకు 25 సంవత్సరములు మాత్రమే పరిగణించి, శాసన ప్రమాణములను బట్టి తెలిసియు తెలియని అంశములను సరిపెట్టుట ఇప్పటి చారిత్రిక పద్ధతి కాఁబోలు! 40 సంవత్సరముల పరిగణనము "అసాధారణమైనది కనుక పరిహరింప దగినది" అనుట ప్రసిద్ధ చారిత్రిక పద్ధతికి విరుద్ధము. అట్లు పరిగణించిన సందర్భములు మాత్రమే కాదు; పరిగణింపనిచో, పంగతములు కాని సందర్భములును కలవు. అంతేకాదు. ప్రాచీన కాలమునందు బహు భార్యా నిషేధ శాసనములు, సంతాన నిరోధ శాసనములులేవు. సంతాన సాగర శాసనములే కలవు. సంతాన నిరోధక వ్రతము సాగుచున్న ఈ కాలమునందే 40వ ఏట సంతానము కలుగుచున్న సంసారములు కలవు. "ఫ్రమ్ నోన్ టు అన్‌నోన్" కాని, "ఫ్రమ్ అన్ నోన్ టు నోన్" కాదు. గత్యంతరములేనిచో, తరముల పరిగణనముని తప్ప సరియేగాని, అది స్థిరముకాదు. చరము.

ఇంతకు, "నత్తరామేశ్వర, శ్రీకాకుళ శాసనము"లను బట్టి క్రివ్వాక శాసనములోని రెండవ బేతరాజునకు "బొట్టు" పెట్టనక్కఱ లేదు. అతనికి "బొట్టు" క్రివ్వాక శాసనమునందే కలదు. శాసనములను చూడగానే సరికాదు. సరిగా చూడవలయును. అంతేకాదు సరిగా అర్థము చేసికొనవలయును. క్రివ్వాకశాసనములోని వాక్యమిది:[18]

> "కుసుమాయుథు (ధు) నకు ఎని (నీ) త జన్మాస (శ్ర) యుణెన బొటు బేతభూపాలుణ్ణ జనిమిం (స్మిం) చె."

ఇట్లు పరబ్రహ్మశాస్త్రిగారి శాసన పాఠమునందు మాత్రమేగాక శాసన ప్రతిబింబమునందును కలదు.[19] కనుక క్రివ్వాక శాసన ప్రమాణమున లభించు ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజు ఇతడు మాత్రమే కలడు. ఇతని కాలము తెలిసికొనుటకు క్రివ్వాక శాసనమునందు కాల నిర్దేశములేదు. శాసనలిపియందు క్రీనీడలు కలవు. కనుక ఎవరి కాలనిర్ణయము వారిది! ఉభయుల కాలనిర్ణయములందును నిజమైన శాసన ప్రమాణమున లభించు ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజు కాలము, ఇద్దఱు కాకతి బేతరాజుల కాలమునుకాదు. కనుక ఊహాగానము!

విజయనగరరాజులందు మొదటిదేవరాయలకు, రెండవ దేవరాయలకు, మల్లికార్జున దేవరాయలకు, విరూపాక్ష దేవరాయలకు "ప్రౌఢ" విశేషణము కలదు. ప్రసిద్ధము. అయినను హరిహరదేవరాయలకు, బుక్కదేవరాయలకు "ప్రౌఢ" విశేషణమును ఎవ్వరును తగిలింపలేదు. కాకతీయ రాజులందు రెండవ రుద్రదేవునికి "ప్రతాప" విశేషణము కలదు. కనుక మొదటి రుద్రదేవునికి కొందఱు "ప్రతాప" విశేషణమును తగిలించినను, అతడు ప్రతాపరుద్రుడు కాడని ఉద్దండులైన చరిత్రకారుల - నేలటూరి వేంకటరమణయ్య, మల్లంపల్లి సోమశేఖర శర్మ ప్రభృతుల - ఉద్ఘోష. అది ఉద్బోధ. కనుక, క్రివ్వాకశాసనమునందు రెండవ బేతరాజునకు "బొట్టు" విశేషణము కలదని, మొదటి బేతరాజునకు కూడా "బొట్టు" విశేషణము తగిలించుట ప్రామాణిక చారిత్రిక పద్ధతికి పరమవిరుద్ధము. అది "శాసన ప్రమాణము" అని ప్రగల్భము కొట్టుట ప్రతారణము.

28. "ఇచ్చటి 'బొట్టు'అనునది స్థలనామము. పాల్వంచతాలూకాలోని అడవిలో నేదో ప్రాంతము కావచ్చును. 'బొట్టున వాని ప్రధానులు' అని క్రివ్వాక శాసనవాక్యము."

బొట్టు అనగా "స్థలనామము" అనుటకు, ఆ స్థలము "పాల్వంచ తాలూకాలోని అడవిలో నేదో ప్రాంతము కావచ్చును" అనుటకును గల ఆధారము క్రివ్వాకశాసనవాక్యమే. కాని, ఆ క్రివ్వాకశాసన గద్యవాక్యమును పాపము అర్థము కాలేదు! ఆ వాక్యమిది :

> "—ఆతని (కుసుమాదిత్యుని) ప్రథమ రాజ్యంబున భూమి ప్రఘట్టంబు పుట్టిన యవసరంబున బొట్టున వాని ప్రధానులు శ్రీకరణాధిపతియైన యిందపరాజును ఆతని తమ్ముడైన రేమ రాజును సమస్త వస్తువాహనంబులనుం గులధనంబులనుంజేకొని కుసుమాదిత్యుతోడన పరమణ్డలాభిముఖులై కందమూలప(ఫ)ల సా(శా)ఖాదులాహారంబుగా గైకొని—"

ఇందు కందమూల ఫలములు కలవుగావున, క్రివ్వాకగ్రామము పాల్వంచ తాలూకాలోనిదని పరబ్రహ్మశాస్త్రిగారి స్థలనిర్దేశమును కలదుగావున, "బొట్టున" అను శబ్దమునందు బొట్టు అని కలదుగావున, "బొట్టు స్థలనామము పాల్వంచతాలూకాలోని అడవిలో నేదో ప్రాంతము కావచ్చును" అని ఊహాగానము! ఇది ఏనాడో చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు చమత్కరించిన భాగవత పురాణపరిశోధనమును జ్ఞప్తికి తెచ్చునది !

కుసుమాదిత్యుడు రాజ్యమునకు వచ్చిన తొలి సంవత్సరమునందు భూమిప్రఘట్టము పుట్టినది. భూమిప్రఘట్టమన భూకంపము. అవసరమన సమయము. అవశ్యకము కాదు. "అయ్యవసరంబున" అను ప్రయోగములు కోకొల్లలు. "భూకంపము పుట్టిన సమయమునందు 'బొట్టున' కుసుమాదిత్యునితోపాటు వాని ప్రధానులు పరమండలమునకుపోయిరి" అను వాక్యమునందు "బొట్టున" అను పదమునకు "స్థలనామమున" అని అర్థము కాదు. "బొట్టున" అను పదము నిఘంటు పఠితముకాదు. కనుక ప్రకరణమును బట్టి అర్థమును గ్రహింపవలయును. భూకంపము పుట్టినపుడు పరమండలమునకు పోవుట ప్రకరణము. ప్రమాదము వచ్చునపుడు "వెంటనే" పోవుట లోకసహజము. కనుక "బొట్టున వాని ప్రధానులు" అను క్రివ్వాక శాసన వాక్యములోని "బొట్టున" అను శబ్దము చట్టున అను శబ్దము వంటిది. చట్టు అను శబ్దమునకు, చట్టున అను శబ్దమునకు సంబంధము లేదు.అట్లు బొట్టు అను శబ్దమునకు,బొట్టున అను శబ్దమునకు సంబంధము లేదు. ఉండనక్కరలేదు. చటుక్కున అను శబ్దము చట్టున అగునట్లు, పుటుక్కున అను శబ్దము బొట్టున అగును. ఇది భాషాశాస్త్ర పరిజ్ఞానము వలన తెలియునది. "బొట్టున" అను శబ్దము క్రివ్వాకశాసన కాలమునందు మాండలిక పదము కావచ్చును. దేశ్యము.

ఇక పేరునకు ముందు కల బొట్టు శబ్దము తద్భవము. వ్యక్తి నామములకు ముందు భట్ట శబ్దము బహు ప్రసిద్ధము. భట్టలౌత, భట్టనాయక, భట్టనారాయణాద్యనేక వ్యక్తినామములు గ్రంథములందు మాత్రమేగాక, పదవశతాబ్ది తెలుగు శాసనములందును భట్టగుణ్డ, భట్టదేవనికి అను వ్యక్తినామములు కలవు.[21] సంస్కృత భట్టశబ్దమునకు తెలుగు భట్టుశబ్దము తత్సమము అది బొట్టు, బొట్టు అను తద్భవములు అగును. "గొప్పవాణ్ణి కావాలని వుంది కొంపబొట్టూ అందే పెద్దవాళ్ళని పట్టుకు తిట్టరా పెద్దబొట్టూ" అను సామెత వ్యవహార ప్రసిద్ధము. వ్యావహారిక పదములను చాలవఱకు స్వీకరించిన సి. పి. బ్రౌను నిఘంటువునందు "బొట్లు ఆర్ భొట్లు [ఫర్ యస్కెటి భట్ట]" అని కలదు. తత్తదేక వచనములు బొట్టు, భొట్టు. కనుక పేరునకు ముందుకల బొట్టు శబ్దమునకు ఆద్యప్రకృతి సంస్కృత భట్టశబ్దము. సంస్కృత భట్ట శబ్దమునకు పండితుడు అని మాత్రమేగాక; రాజు, యువరాజు అను అర్థ తాత్పర్యములు కలవు.

"ఎలార్డ్, మాస్టర్, (యాజ్‌డు ఏజ్ ఎ ప్రైటిల్ ఆఫ్ రెస్పెక్ట్ ఇన్ ఎడ్రెసింగ్ ప్రిన్సెస్'' అని వి. యస్. ఆప్టే నిఘంటువునందు కలదు. కనుక భట్ట శబ్ద వికృతి అయిన, పేరునకు ముందుకల, బొట్టు శబ్దము స్థల నామము కాదు. బిరుదనామము. అంతేకాదు. యువరాజును సంబోధించు గౌరవసూచకమైన బిరుదనామము. ఉపరిప్రభువాచకము.

నాల్గవ పద్యమునందు కాకతివల్లభుడైన బేతభూవిభుడు "పిన్నవాడు'' అని కలదు. అనగా చంటిపిల్లవాడని అర్థము కాదు. తక్కువ వయస్సు కలవాడని తాత్పర్యము. బాలుడని భావము. కనుక యువరాజు కాఁగలడు. యువరాజైన, కాకతివల్లభుడైన బేతభూవిభుని మూడవ పద్యమునందు బొట్టుబేత వసుధాధిపుడు అనుటియే అర్థవంతము. తదితరము అర్థరహితము. ఇందుకు, మొదటి కాకతి బేతబాజు గరుడ బేతరాజుతోపాటు బొట్టుబేతరాజును అగుట మఱి అసంభవముకాదని పూర్వోక్తము.[22] ఇట్లు సుసంభవము.

శబ్దము యొక్క అర్థమును " అర్ధాన్నపు అడవిలో వదిలి " పద్యముయొక్క తాత్పర్యమును కల్లోలపు కడలిలో కలిపి చేయు కల్పనము అధివాస్తవిక కవిత అగును గాని ఆధునిక చరిత్ర కాదని విజ్ఞేయము.

ఇంతకు, మొదటి కాకతి బేతరాజు " పిన్నవాడు " అయిన కాలమునందు గాని, రెండవ కాకతి బేతరాజు " పిన్నవాడు " అయిన కాలమునందు గాని, ముదిగొండ చాళుక్య రాజులందు బొట్టు బేతరాజు కలడనుటకు ఊహాగానము వినా, ఖచ్చితమైన శాసనప్రమాణము లేదు. ఆ కాలమునందు ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజుకలడని గూడూరు శాసనానుబంధ పద్యమునందు లేదు. పద్యతాత్పర్యమును కాదు. ప్రసిద్ధ పండితాభిప్రాయము కూడా కాదు. నాల్గవ పద్యమునందు కాకతి (వంశము), కాకతివల్లభుడు అని ద్విరుక్తమయినను, మూడవ పద్యమునందు చాళుక్య వంశము, చాళుక్య వల్లభుడు అను ప్రసక్తి లేదు. అయినను ముదిగొండ చాళుక్య రాజునకు గుదిబండ వేసిన పూర్వ వాదమును పునరుద్ధరించుకొనుటకు మఱింత అనభిజ్ఞతను ప్రదర్శించుకొనుట చిత్రము. చింత్యము.

29. "ఇదే ప్రాంతాల్లో సమకాలీన కన్నడ శాసనాల్లో ఒక ' పల్లవ రాయడు' కానవస్తున్నాడు. కుమారసోమేశ్వరు దంతటివాడు కూడ వేములవాడలోని అరికేసర దేవునికి దానము సమర్పించడానికి, యీ పల్లవరాయని అనుమతిని పొందటము జరిగింది. కనుక 'పల్లవరాయని' గూర్చి చెప్పేముందు యింకా విపులమైన పరిశీలన చాలా అవసరము."

ఒక లేముడవాడ కన్నడ శాసనమునందు " పల్లవరాయడు " కాదుగాని, " బల్లవరాయడే కలడు. అతనికి కుమారసోమేశ్వరుడు విన్నపము చేసి, హరికేశ్వరదేవునికి పూలతోట దానము చేసినట్లు శాసనము కలదు.[23]

"శ్రీమతు కుమారం సోమేశ్వరదేవరు శ్రీమతు బల్లవరసర్గె బిన్నప హెంగెద్యు...శ్రీమద్ధరికేశ్వరదేవర నివేద్యక్కం..."

ఇందలి బల్లవరసు బల్లవరాజే. అతడు బల్లవరాయడు అగును. గూడూరు శాసనానుబంధ పద్యమునందు "ఘను బల్లవరాయ నియోగిఁజొచ్చి''అనియే కలదు. అది"ఘనున్ + పల్లవరాయనియోగిన్" అనియే పదచ్ఛేదము చేయనక్కరలేదు. "ఘనున్ + బల్లవరాయని యోగిన్" అనికూడ పదచ్ఛేదము చేయవచ్చును. కాని, లేములవాడ కన్నడ శాసనము కాలము 10-4-1106 వ తేదీ.[24] అది మొదటి కాకతి బేతరాజు కాలములోనిది కాదు. రెండవ కాకతి బేతరాజు కాలము (1076-1108) లోనిదేకాని, అతని బాల్యములోనిది కాదు. కనుక "ఇంకా విపులమైన పరిశీలనచాలా అవసరము'' కాఁబోలు!

ఎంత "విపులమైన పరిశీలన" చేసి, 1106 వ సంవత్సరము నాటి బల్లవరాయని 1076 వ సంవత్సరమునకు లాగికొనివచ్చినను, రెండవ కాకతి బేతరాజు అప్పటికి "పిన్నవాడు" కావున, బల్లవరాయడును పిన్నవాడే అగును. అనగా యువరాజు. మఱి యువరాజైన కాకతి బేతరాజును ఉద్ధరించుటకు మహారాజు నియోగినిగాక యువరాజు నియోగిని అనగా రాజోద్యోగిని ఆశ్రయించెననుట మఱొక అనుచితమగును.

"సిద్ధేశ్వర చరిత్రాది కథనములుకూడా పై చారిత్రక సంఘటనలు తలపింపజేయుట గమనింప దగినది" అయినచో, ఆ కాలమునందు కటకబల్లహుడు కలడుకదా! అతనిని ఒకసారి ఆశ్రయించుట, మఱొకసారి చంపించుట రాజకీయములందు సహజమే. అందును కామవసాని "అసామాన్యురాలు''కద!_ పూర్వోత్తర విరోధశంకానిరాతంక ప్రకటనములకు మూలము, పూర్వవాద పునరుద్ధరణ ప్రయత్నము కావలయును. అందువలన "తొందరపాటుచర్య, పాడిగాదు, నిరసింపదగినది" మొదలైన అధిక ప్రసంగములు!

30. "ఇక మిగిలిన ఐదవపద్యము... ఇందు 'మేలుగ' అనునది పడికట్టు మాటగా పేర్కొనిరి. కావచ్చును. కాని పద్యమునందలి ఆఖరి పంక్తి(ని) శ్రీశాస్త్రిగారు 'గరెండయరాజు' అను కన్నడ ప్రయోగముగా పేర్కొన్నారు."

శాస్త్రిగారు "గరెండయరాజు" అని పృథక్కరణము చేసినమాట నిజమేగాని, అది "కన్నడ ప్రయోగముగా పేర్కొన" లేదు. "కన్నడ సంస్కారముతో 'గరుడయ' పదమును (గరెండయ అని) వాడెను" అని పరబ్రహ్మశాస్త్రిగారి స్పష్టప్రతిపాదనము.[25] కన్నడ సంస్కార

ముతో వాడినను తెలుగు ప్రయోగము కన్నడప్రయోగముకాదు. తెలుగు ప్రయోగమే అగును. ఇంతకు కన్నడసంస్కారమును ఇదమిత్థముకాదు. అపాదనము. అంతేకాదు. అయిదవ పద్యమునందు ఉత్తరార్ధమునకు,

"మేలుగ మూడుముప్పయిని మేలుగ నేరెడు బేటిపాడునుం
మేలుగ బేకు(క్క) మావిణ్డు మేలుగ రెండెయరాజు సంగణ్డు"

అని శాసనలేఖనము. మొదటి మూడుస్థలములందు "మేలుగ" అని కల పదము, నాల్గవ స్థలము నందును "మేలుగ" అని ఉండుట సహజము. "మేలు"అనివుండుట అసహజముమాత్రమేకాదు;అనన్వితముకూడ.కనుక ప్రాస, యతిమైత్రి ఘటితమైన "మేలుగ" అనుపదము నాలుగు స్థలము లందును ఇమ్ముగ, మానుగ వంటి పడికట్టు మాటయే. "కావచ్చును" కామ. అగును. నాల్గవపద్యమునందు "గరుడని బేత భూవిభుని" అను పదచ్ఛేదము ఎంతసమంజసమో, అయిదవ పద్యమునందు "గరెండయ రాజు" అను పృథక్కరణము అంత అసమంజసము. అదిసరే, నాల్గవ పద్యమునందు శాసనస్థమైన; ప్రాస, యతి మైత్రిఘటితమైన "గరుడని" అను పదమునకు మూలచ్ఛేదము, అర్థమునకు అన్యథాకరణము-చేసి, అయిదవ పద్యమునందు అనుచితవిభాగమైన "గరెండయ" అను పదమును గౌరవించుటలోని ఆంతర్యము గమనార్హము. అది గర్హ్యము.

ఒక పద్యశాసనమును పరిష్కరించుటకు మాత్రమేకాదు; ఒక పద్యశాసనము యొక్క మాత్రమేకాదు; ఒకగద్యశాసనము యొక్కయు అర్థమును గ్రహించుటకు ప్రథమతః భాషాచ్ఛందో వ్యాకరణాద్యనేక విషయముల పరిజ్ఞానము ఆవశ్యకము. తదుపరి సమకాలిక చారిత్రిక సత్యముల సమన్వయము కర్తవ్యము. ఊహామాత్ర శరణ్యములైన చారిత్రిక సమన్వయములు (కన్జెక్చర్స్) స్వప్రమాణ నిరూపణచణము లైన చారిత్రిక సత్యములు (హిస్టారికల్ ఫేక్ట్స్) కాజాలవు. చరిత్రకు ధ్యేయము సత్యాన్వేషణము. స్వకపోల కల్పితములైన చారిత్రిక సమన్వ యములనుబట్టి శాసనపద్యములకు విపరీతార్థ కల్పనము, శాసనగద్యము నకును విరుద్ధార్థజల్పనము చేయుటకంటె, సరియైన అర్థములను తెలిసికొని, స్వకపోల కల్పితములను సవరించుకొనుట సహృదయ లక్షణము.

చరిత్ర (హిస్టరీ) పురావస్తుతత్త్వము (ఆర్కియాలజీ) వలె, సాహిత్య పురాతత్త్వము (లిటరరీ ఆర్కియాలజీ) కలదు. అది ప్రథమతః మల్లంపల్లి సోమశేఖర శర్మగారి ముఖతః విన్నది. వారి పీఠికను కలది.[26] తదుపరి వేదము వేంకటరాయ శాస్త్రిగారి (మనుమడు) ముఖతః విన్నది. వారి గ్రంథమునందు కలది.[27] తత్తాదృశమైన సాహిత్య పురాతత్త్వ సరణిని కూడ, విరియాలమల్లని గూడూరు సానుబంధ శాసనములోని తెలుగు పద్యముల రచనాకాలము పరిశీల నీయము. పరిగణనార్హము.

విరియాల మల్లని గూడూరు సానుబంధ శాసనములోని తెలుగు పద్యములు చంపకోత్పలమాలలు. అవి సంస్కృతచ్ఛందస్సులు. కాని సంస్కృత కావ్యములందు కానరావు. మాఘకావ్యమునందు ఒక్క చంపకమాల కలదుగాని, అది సంశయాత్మకము. అయినను చంపకో త్పలమాలలు సంస్కృతచ్ఛందస్సులే. అంతేకాదు. వృత్తములు. సంస్కృత వృత్తములకు పాదాంత విరతి విధాయకము. తెలుగు వృత్త ములకు తొలుత విధాయకముగ కలదు. నన్నయనుండి వికల్పముగ కలదు. నన్నయ భారతములోని మొట్టమొదటి ఉత్పలమాల మొట్ట మొదటి పాదమునందే పాదాంత విరతి పాటింపబడలేదు. వృత్తరచ నమునందు పాదాంతవిరతి పాటింపకపోవుట సంస్కృత లక్షణాను సారముకాదు. కన్నడలక్షణానుసారము. కన్నడమున ఆదికవి పంపని భారతమునందు ఇట్లు కలదు.[28]

"సకలక్ష్మాచర ఖేచరాంచిత మహామాణిక్యగాణిక్యహ
స్తిక—"

తెలుగున ఆదికవి నన్నయ భారతమునందు ఇట్లు కలదు.

"రాజకులైక భూషణుడు రాజమనోహరుడన్యరాజతే
జోజయశాలి శౌర్యుడు—"

ఇట్లు వృత్తమునందు పాదాంతవిరతిని పాటింపకపోవుట నన్నయకు పూర్వము తెలుగునందు లేదు. తర్వాత కలదు. ఎనిమిదవ శతాబ్ది గుణక విజయాదిత్యుని లేక పండరంగని అద్దంకి శాసనములోని తరువోజ పద్యమునందు, తొమ్మిదవ లేక పదవ శతాబ్ది యుద్ధమల్లుని బెజవాడ శాసనములోని అయిదు మధ్యాక్కర పద్యములందును పాదాంత విరతి పాటింపబడినది.[29] 1108వ సంవత్సరము నాటి కొమ్మాసాని అమరావతీ శాసనములోని మూడు ఉత్పలమాల పద్యము లందును పాదాంతవిరతి పాటింపబడలేదు.[30] 1118వ సంవత్సరము నాటి సూరని చేబ్రోలుశాసనములోని ఆరువృత్తములకు మూడువృత్తము లందు పాదాంత విరతి పాటింపబడలేదు.[31] 1120వ సంవత్సరము నాటి రేవని మాటేడు శాసనములోని నాలుగు వృత్తములకు రెండు వృత్తములందు పాదాంత విరతి పాటింపబడలేదు.[32] 1124వ సంవత్సరమునాటి భీముని బెజవాడ శాసనములోని రెండు వృత్తములకు ఒక వృత్తమునందు పాదాంత విరతి పాటింపబడలేదు.[33] ఇట్టి వింకను కలవు. కనుక పాదాంతవిరతి పాటింపబడిన శాసనముల రచనాకాలము నన్నయ భారతమునకు పూర్వము, పాదాంతవిరతి పాటింపబడని శాసనముల రచనాకాలము నన్నయ భారతమునకు తర్వాత కావలయును.

విరియాల మల్లని గూడూరు శాసనములోని మూడు కన్నడ వృత్తములందును కన్నడ లక్షణానుసారము పాదాంతవిరతి పాటింప

ఉడలేదు. కాని, తదనుబంధమైన అయిదు తెలుగు పద్యములందును సంస్కృత లక్షణానుసారము పాదాంతవిరతి పాటింపఁబడినది. పాదాంతవిరతి అనగా ఒక పదములోని ఒక అక్షరము పూర్వ పాదాంతమునందు, మరొక అక్షరము ఉత్తర పాదాదిని ఉండనట్లు పదాంతమును పాదాంతము చేయు పద్య రచనా పద్ధతి. పాదాంత విరతిని పాటించని పద్యరచనా పద్ధతి ఛందస్సర్వపరిష్వంగము. "అనంగా, ఉద్ధృత, తత్తతనయు, మేల్గరుడని, భాస్కరవిభు" అనునవి పదములు కావు. పదబంధములు. అనన్ + కాన్, ఉత్ + హృత్, తత్ + తతనయు, మేల్ + గరుడని, భాః + కరవిభు" అనువాని సంధి రూపములు. అవి పాదాంత విరతికి అనుగుణములు. కనుక విరియాల మల్లని గూడూరు సానుబంధ శాసనములోని అయిదు పద్యములందును పాదాంతవిరతి కలదు. కనుక పాదాంతవిరతిని పాటించిన అయిదు పద్యముల రచనా కాలమును (1005,1045) నన్నయ భారత రచనా కాలముకంటె (1050-60) పూర్వమని సాహిత్య పురాతత్త్వ సరణిని కూడ సాధకము.

ఇది బాధకమైనచో, పిష్టపేషణముకాక, ఇతోధికమైన నిర్ధారక సాధనములు చూపి, కాలనిర్ణయము చేయుట కర్తవ్యము. పరస్పరోప జీవ్యములైన చరిత్రే, సాహిత్యముల పరస్పరోపబలకత భావ్యము. ఇది పరోక్షస్వశాఖాప్రభేద పరిశోధనయుగము కాదు. ప్రత్యక్ష శాఖాంతర సంవాద పరిశోధనయుగము (ఏజ్ ఆఫ్ ఇంటర్ డిసిప్లినరీ రిసెర్చ్.) పరిశోధనమునందు స్వీయదురభిమానము పరిత్యాజ్యము. యువకోద్రేకము ఉపశమనయోగ్యము.

సూచికలు

1. భారతి-ఆగష్టు '82, పుట 52.
2. అదే, డిసెంబరు '81, పుటలు 10-19.
3. అదే, పుట 11.
4. శాసన పద్యమంజరి 1,2 భాగములు.
5. ఒకటి వలె, పుట 47.
6. హైదరాబాద్ ఆర్కియలాజికల్ సీరీస్, నెం. 13, పార్ట్ II, పుట 78. ప్లేట్ 26.
7. రెండువలె.
8. అదే, పుట 12.
9. శ్రీ సిద్ధేశ్వర చరిత్రము (1960), పుటలు 78-9
10. ప్రతాపరుద్ర చరిత్రము, (1969), పుట 21.
11. ఒకటివలె, పుట 48.
12. తొమ్మిది వలె, ఇంట్రడక్షన్, పుట 31.
13. తెలుగు విజ్ఞాన సర్వస్వము, మూడవ సంపుటము, పుటలు 226-7
14. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము. పుట 112.
15. ఒకటి వలె, పుటలు 46-7.
16. పన్నెండు వలె.
17. రెండువలె, పుటలు 10,16.
18. భారతి-నవంబరు '79, పుట 38.
19. అదే, పుట 33.
20. పదునెన్మిది వలె.
21. ప్రాచీనాంధ్ర శాసనాలు, పుటలు 189, 192.
22. రెండు వలె, పుట 48.
23. కన్నడ ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, పుటలు 20-1.
24. అదే, పుట 5.
25. రెండువలె, పుట 15.
26. రంగనాథ రామాయణము.
27. నన్నెచోడుని కవిత్వము.
28. తెలుగు కవుల చరిత్ర, పుట 146.
29. శాసన పద్యమంజరి, ప్రథమభాగము, పుటలు 1-3.
30. అదే, పుటలు 7-8.
31. అదే, పుటలు 9-10.
32. హైదరాబాద్ ఆర్కియలాజికల్ సీరీస్, నెం. 19, పార్ట్ III పుటలు 143-5.
33. శాసన పద్యమంజరి, ప్రథమభాగము. పుటలు 11-12.

చీమకుట్టిన మంట

కోణార్క

స్తాయంత్రాలు
బెంచీమీద కూచుని
తీరిగ్గా హుసేనుసాగర్ను ప్రేమిస్తుంటాను
పడమటన సూర్యుడు
హుసేనుసాగర్ చెక్కిలి మీద
అరుణిమను అద్దుతుంటాడు
నా ప్రేయసి వేలచేతులతో వీచే చిరుగాలిని
అనుభవిస్తుంటాను-
హుసేనుసాగర్ అలల ముంగురుల్ని
సవరించుకుంటున్నప్పుడు
హుసేనుసాగర్ వొంటిమీద వాలుతున్న పక్షుల్ని చూసి
నాకు ఈర్ష్యతో ఉక్కబోస్తున్న వేళ
నేన్నమిలేసిన బరాణీ క్షణాల పొట్టును తింటానికొచ్చిన
చీమ
నన్ను కుదుతుంది.
చురుక్ మంటుంది
ఆ మంట వాస్తవమంత బాధగా వుంటుంది
సూర్యుడస్తమిస్తాడు
చీకట్లో
హుసేనుసాగర్ భయంకరంగా తయారౌతుంది
నాకోసం ఇందాకా సాచిన వేలచేతులే
ఆకలితో రాక్షసంగా సాచిన నాల్కలౌతాయి
మృత్యువుకు శీర్షికౌతుంది-
తన వికృతరూపాన్ని దాచుకోడానికి
విద్యుద్దీప కాంతుల్ని
వొంటినిండా కప్పుకుంటుంది.
కళ్ళుంటే, చూస్తే
బిర్లామందిర్ పాలరాతి ప్రతిబింబం కనిపిస్తుంది
టాంక్ బండ్
క్షుద్ర దేవత పూజావేదికలా ఉంటుంది
నగరం భక్తితో మోకరిల్లినట్లుంటుంది
నగరంలో నర్తించే దగాకోరు వ్యభిచార సంస్కృతికీ
క్షుద్రసాగర్కూ లాలూచీ ఉంది-
దగాపడ్డ ఓ చెల్లెలు అందులో దూకుతుంది
తృప్తిగా త్రేనుస్తుంది రాక్షసి !
ఆమె అంతిమ కేకను
నగర సంస్కృతి నీకు వినపడ్డీదు-
ఆమె అంతిమ కేక
వాహనాల రొదలో కల్సిపోతుంది
ఆమె అంతిమ కేక
నీ జంటకబుర్లలో కల్సిపోతుంది
ఆమె అంతిమ కేక
నీ ఆఫీను అలసటలో కల్సిపోతుంది
ఆమె అంతిమ కేక
సమాజంపట్ల
నీ నిర్బాధ్యతలో కల్సిపోతుంది
రాజీపడ్డ నీ ముర్గుంట బ్రతుకులో కల్సిపోతుంది
కట్నానికి తాళికట్టే నీ ద్రోహంలో కల్సిపోతుంది

ఆమె అంతిమ కేక
'రూపాయి కొరుక్కుతినగా' మిగిలిన
నీ భావాస్తిపంజరంలో కల్సిపోతుంది
దారి తప్పిన నీ దానవత్వంలో కల్సిపోతుంది
అస్త్రసన్యాసం చేసిన
నీ చాతకాని తనంలో కల్సిపోతుంది
ఆమె అంతిమ కేక
మతం గంతలు కట్టిన
నీ టాంగాగుర్రం బానిస బతుకులో కల్సిపోతుంది
తెల్లారినా చీకటి జ్ఞాపకాల్లో బతికే నీ నీరసంలో
కల్సిపోతుంది
ప్రశ్నించడం నేర్పని
నీ యూనివర్సిటీ డిగ్రీల చిత్తడిలో కల్సిపోతుంది
కర్మనాశ్రయించే
నీ నిష్క్రియత్వంలో నీ భావ దారిద్ర్యంలో కల్సిపోతుంది
అది హుసేనుసాగరైనా
విశాయక సాగరైనా.... అంతే!
చీమకుట్టిన మంట
హస్తమంత బాధగా ఉంటుంది
ఆ బాధ నాది
ఆ బాధంతా ప్రపంచానిది
బాధ్యతంతా ఈ ప్రపంచానిది
ఆమె అంతిమ కేక
శోక తొక్కిన నా హృదయంలో
పాటై పడగ విప్పుతుంది
మంటై మాట్లాడుతుంది
తీగ లాగాను-
ఇక డొంకంతా అంటుకుంటుంది

[30—7—'83 నాటి సాయంత్రం హుసేనుసాగరు ఎదురుగా.........]

శ్రీ ఎ. విజయ దత్తాత్రేయ శర్మ

పశ్చిమ గోదావరి జిల్లా గ్రామనామములు - ఒక పరిశీలన

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతపు జిల్లాలలో నొకటి యైన పశ్చిమ గోదావరిజిల్లా 1925 సం॥ లో నాటి కృష్ణాజిల్లా నుండి వేర్పడి (1942 సం॥ లో తూర్పు గోదావరి జిల్లాలోని పోలవరం తాలూకాను కలుపుకొని) ఏర్పడినది. 8 తాలూకాలతో, 7780 చ॥ కి. మీ॥ వి స్తీర్ణంతో 16°_15'_17°_30' ఉత్తర అక్షాంశ రేఖల మధ్యను, 80°_51'_81°_55' తూర్పు రేఖాంశముల మధ్యను వ్యాపించియున్న ఈ జిల్లాకు దక్షిణమున కృష్ణాజిల్లా, బంగాళా ఖాతము, పడమట కృష్ణాజిల్లా, ఉత్తరమున ఖమ్మంజిల్లా, తూర్పున గోదావరి నది ఎల్లలుగా వున్నవి.[1] 1975 సం॥ ఆంధ్రప్రదేశ్ స్టాటిస్టికల్ ఏబ్‌స్ట్రాక్ట్ ననుసరించి ఈ జిల్లాలోని వివిధ తాలూకాల లోని గ్రామముల/పట్టణముల సంఖ్యా వివరము క్రింది విధముగా నున్నవి.[2]

క్రమ సంఖ్య	తాలూకా పేరు♦	గ్రామముల సంఖ్య జనావాసము గలవి	లేనివి	పట్టణముల సంఖ్య	మొత్తము
1.	భీమవరం	85	1	2	88
2.	చింతలపూడి	102	8	---	110
3.	ఏలూరు	139	5	1	145
4.	నరసాపురం	87	—	2	89
5.	పోలవరం	126	9	—	135
6.	కొవ్వూరు	100	9	2	111
7.	తాడేపల్లిగూడెం	104	7	1	112
8.	తణుకు	98	—	2	100
	జిల్లా మొత్తం	841	39	10	890

చారిత్రక నేపథ్యము

చరిత్ర పూర్వయుగం నుంచి ఈ జిల్లా ప్రాంతం జనావాస యోగ్యమై యుండినదని మైప (భీ) మొ॥ చోట్ల అల్పపరిమాణ పరికరములు బయల్పడుట వలన తెలుస్తోంది.[3] మౌర్య, శాతవాహన సామ్రాజ్యాంతర్భాగముగ, ఇక్ష్వాక, బృహత్పలాయన, ఆనందగోత్ర, సాలంకాయన, విష్ణుకుండిన రాజ్యాంతర్గతముగ, తూర్పుచాళుక్య రాజ్యకేంద్ర బిందువుగ, వెలనాటి చోడ, కోట, కొలను, మలయ, నిడుదవోలు చాళుక్యాది సామంత మాండలిక వంశముల కాటపట్టుగ, రెడ్డి, ముసునూరి, కోరుకొండ నాయక, గజపతి, విజయనగర రాజ్యములలో భాగముగ ఈ జిల్లా చరిత్ర పుటలలో చోటుచేసుకున్నది. కుతుబ్‌షాహి, మొఘల్, ఆసఫ్ జాహి పాలన చవిచూసినది. ఆధునిక కాలములో నూజివీడు, వల్లూరు, లక్కవరం, పోలవరం మొ॥ జమిందారీల పాలన ఈ ప్రాంతమున సాగినది. ఆ ఈ రాజవంశముల, పాలకుల ప్రభావము ఈ జిల్లా గ్రామనామములపై తగు మాత్రముగ ద్యోతకమైనది. ఆ విషయమును విపులీకరించుటకు ముందుగా, ప్రాచీన, మధ్యయుగములందు ఈ జిల్లాలో వివిధ ప్రాంతములనుండిన ప్రత్యేక నామ విభాగములను శాసనాధారములను బట్టి తలస్పర్శగా పరామర్శించుట ఆవశ్యకమై యున్నది.

ప్రాచీన, మధ్య యుగములలో ప్రాంతీయ భాగములు

కురవాటము

సాలంకాయన రెండవనందివర్మ (క్రీ. శ. 395 - 410 ప్రాంతము) కంతేరు శాసనములో పేర్కొనబడిన ఈ విభాగము ముమ్మడి నాయకుని కోరుకొండ, (శ॥ సం॥ 1363) శ్రీరంగం శాసనము (శ॥ సం॥ 1363) లందును ప్రస్తావింపబడినది. మరియు, శ్రీనాథుని క్రీడాభిరామమున "సాధనంబైన తమిలేటి పరిసరమున వేగి కుర్వాటికా దేశ విపిన భూమి" యని పుంటను

బట్టి (తమిలేరు చింతపూడి, ఏలూరు తాలూకాలగుండా ప్రవహించు చున్నది) "వేంగిదేశమున నీ తమ్మిలేరు ప్రాంత పరిసరములు-గోదావరికి దక్షిణమున నున్న కొవ్వూరు, ఏలూరు తాలూకాలు. కాబట్టి కురవాటి సీమయనగా నీ రెండు తాలూకాలు అని చెప్ప వచ్చును"5 అని పరిశోధకాభిప్రాయము.

కొలను మండలము

పశ్చిమ గోదావరిజిల్లా యందు మాత్రమే కాక మొత్తం ఆంధ్ర కోస్తాలోనే పెద్దదైన మంచినీటి జలాశయము కొల్లేరను పేర గోదావరి, కృష్ణాజిల్లాల నడుమ నున్నది. రెండవ పులకేశి అయివోలు శాసనమందు 'కునాలము'గా ప్రస్తావించ బడినది. "కునాల శబ్దమే 'కులను', 'కొలను'గా పరిణామ మందినదని శబ్ద తత్త్వజ్ఞులు అనుచుందురు. 'కొలను' శబ్దము సంస్కృతీక రింపగా 'సరస్సు' అయినది."6 "కొలను మండలము పశ్చిమ గోదావరి మండలములోని ఏలూరు, భీమవరము, తణుకు తాలూకా ప్రాంతము"7 అని పరిశోధక నిర్ణయము.

పావార విషయము

7 శ॥ పృథ్వీమహారాజు తాండివాడ శాసనములో 'పాగుణార', ప్రథమ చాళుక్య విజయాదిత్యుని యొక శాసనములో 'ప్రాకునోర', రెండవ అమ్మరాజ విజయాదిత్యుని పంపాము శాసనములో 'పావునవార', రెండవ చాళుక్య భీమ విష్ణువర్ధనుని శాసనములో 'పగుణవార', మూడవ విజయాదిత్యుని సీసలి తామ్ర శాసనములో 'పాగుణవార', ముమ్మడి నాయకుని శ్రీరంగం శాసనములో 'పానార' విషయమని పేర్కొన బడిన ఈ విషయ విభాగము "తణుకు, భీమవరము, నరసాపురము తాలూకా ప్రాంతమున వ్యాపించి యుండెనని భావింప వచ్చును."8 అత్తిలి విషయము (తణుకు, భీమవరం తాలూకా ప్రాంతము) పానార విషయాంత ర్భాగముగా పరిగణించ బడినది.9

మలయ మండలము

12, 13 శతాబ్దములనాటి కొన్ని శాసనములలో ప్రస్తావింప బడిన గ్రామ నిర్దేశనమునుబట్టి ఇది ప్రస్తుతము కొవ్వూరు, నిడద వోలు (?) తాలూకాలలో గోదావరి తీరము నంటియున్న భాగముగా గుర్తించ బడినది.10

చెన్నూరుపల్లి విషయము

"మొదటి జయసింహ వల్లభుని (641-673) మోపట్టు దానశాసనమందు గానవచ్చు 'చెన్నూరుపల్లి' విషయమెందున్నదో సరిగా తెలియదు. అయితే ఈ 'మోపట్టు' పశ్చిమగోదావరిజిల్లా ఏలూరు తాలూకాలోని 'ముప్పట్టు'ను - ఈ రెండును ఒకటే అయినచో చెన్నూరుపల్లి విషయము ఏలూరు తాలూకా ప్రాంత మగును."11

వేంగి మండలము

పై విషయ విభాగము లన్నియు వేంగిదేశాంతర్భాగములే. వేంగి విషయము, వేంగినాడు, వేంగిదేశము మొదలుగా ఈ మండ లము 7-12 శతాబ్దాలనాటి అనేక శాసనములలో ప్రస్తావితమైనది.12

శాసనములు - గ్రామనామములు

క్రమ సంఖ్య	శాసనములోని గ్రామ నామము	ప్రస్తుత గ్రామ నామము	తాలూకా	శాసనము - కాలము - ఆధారము
1.	విప్పఱు	విప్పర్ర	తణుకు	యస్. ఐ. ఐ. V, నెం. 124, శ॥ సం॥ 1228
2.	డుత్తిక	జుత్తిగ	,,	పైది X, నెం. 10, శ॥ సం॥ 1000, ప్రాచీనాంధ్ర శాసనాలు, పు. 326.
3.	కొట్టలపట్టు	కొంతాలపర్రు	,,	ముమ్మడి నాయకుని శ్రీరంగం శాసనము - ఎ. ఇం. XIV, పే. 83 - 96, శ॥ సం॥ 1368.
4.	యోనంబట్టుౖ	మునమర్ర	,,	పైది
5.	వంగిపూడి	నెగ్గిపూడి	,,	,,
6.	చెఱువు	చెరుకువాడ	,,	,,
7.	తామరవాటక	తామరాడ	,,	,,

1	2	3	4	5
8.	పెనుకొండ	పెనుగొండ	తణుకు	పైది
9.	మారెదేరు	మారుటేరు	,,	,,
10.	ఉమికిలి	ఉసికిలి	,,	గుణగ విజయాదిత్యుని (క్రీ॥ శ॥ 848 – 891) సీసలి తామ్ర శాసనము–భారతి XXIII, పార్ట్ 1, పు. 486.
11.	అరువిల్లి	అరవిల్లి	,,	పైది
12.	కలుచుంబఱ్ఱు	కంచుమర్రు	,,	ఎ. ఇం. VII, పు. 177–192, క్రీ. శ. 945–70, ప్రాచీనాంధ్ర శాసనాలు, పు. 189.
13.	అత్తిలి	అత్తిలి	,,	పైది, ప్రాచీనాంధ్ర శాసనాలు, పు. 179–180.
14.	గజ్జర	గజ్జవరము	కొవ్వూరు	యస్. ఐ. ఐ. V, నెం. 116, శ॥ సం॥ 1170.
15.	నందమూరు	నందమూరు	,,	పైది.
16.	దేవ	దేవ	నరసాపురం	ముమ్మడి నాయకుని శ్రీరంగ శాసనము.
17.	విల్లూరు	విల్లూరు	,,	పైది.
18.	పెర్వఞ్చిలి	పెనుమంచిలి	,,	ఐదవ విష్ణువర్ధనుని (క్రీ. శ. 846–847) శాసనము
19.	దిగుంబఱ్ఱు	దిగుమర్రు	,,	డా॥ నేలటూరి వెంకటరమణయ్య, పల్లవులు–చాళుక్యులు, పు. 121 రెండవ చాళుక్యభీముని (935–945) శాసనము, పైది, పు. 120–121
20.	కొణ్డమఞ్చి	కొండమంచి	,,	పృథ్వీమహారాజు తాండివాడశాసనము, క్రీ. శ. 630 ప్రాంతము, పైది, పుట 121.
21.	అండలూరు	అండలూరు	భీమవరము	గుణగవిజయాదిత్యుని సీసలి తామ్రశాసనము
22.	కొండెయపూడి	కొండేపూడి	,,	పైది
23.	వేంద్ర	వేంద్ర	,,	,,
24.	యోంగలను	యోగల్లు	,,	యస్. ఐ. ఐ, X, నెం. 510, శ॥ సం. 1237
25.	కోర్కొలను	కోరుకొల్లు	,,	ఎ. ఇం. VII, పుట 177–192, క్రీ. శ. 945–70, ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట 189
26.	పాదొఱు	పాండువ్వ	,,	రెండవఅమ్మరాజ విజయాదిత్యుని (945–70) పంద్రముశాసనము, ఎ. ఇం. IX, పేజీలు 131–135
27.	కొండేరు	కోడేరు	,,	యస్. ఐ. ఐ., నెం. 148, శ. సం. 1076
28.	చిక్కాల	కొమ్ముచిక్కాల	,,	అనపోతారెడ్డి కొమ్ముచిక్కాల పలన శాసనము, జె. ఏ. హెచ్. ఆర్. ఎస్. III, పుట 229, శ. సం. 1344.
29.	డెన్దుఘూర	దెందులూరు	ఏలూరు	ఎ. ఇం. IV, పుట 193–198, క్రీ. శ. 506, ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట 520.
30.	ఏలూరె	ఏలూరు	,,	శాలంకాయన దేవవర్మ (క్రీ. శ. 300–335) ఏలూరు ప్రాకృత శాసనము.
31.	చిన్నపుర	చింతలపూడి	,,	శాలంకాయన స్కందవర్మ (410–420) కంతేరు శాసనం.
32.	విడెనూరు	వడ్డిగూడెము	,,	శాలంకాయన రెండవ నందివర్మ (395–410) కొల్లేరు శాసనం.
33.	కంబురాంచెరువు	కొమ్మర (ఉత్తర–దక్షిణ)	,,	పైది, పెద వేగి శాసనం.
34.	మ్రొపఱ్ఱు	ముప్పఱ్ఱు	,,	మొదటి జయసింహ వల్లభుని (641–677) శాసనం.
35.	వేగి	(పెద) వేగి	,,	యస్. ఐ. ఐ. VI, నెం. 102, క్రీ. శ. 1006, ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట 495.

పట్టిక ఆయా గ్రామముల ప్రాచీనతను తెలియజేయుటయే గాక ఉదాహరణ ప్రాయముగా కొన్ని గ్రామనామములు కాలగతిని మార్పునొందుటయు, మరికొన్ని, వందల సంవత్సరములు గడిచినప్పటికీ ఏ విధమైన మార్పులకు లోనుగాకుండుటయును తెలియజేసేదిగా వుంది.

గ్రామనామముల పరిణామము

కొన్ని గ్రామనామములు కాలగతిని కొన్ని ప్రత్యేక కారణముల వలన తమ పూర్వ రూపములను కోల్పోయి అపభ్రంశ మొందుట గమనించదగిన విషయము. ఈ అంశమును విశదీకరించుటకు మూడు ఉదాహరణ లీయబడుచున్నవి.

గుంటుపల్లి

క్రీస్తు పూర్వ కాలమునాటి ప్రసిద్ధ బౌద్ధక్షేత్రము. టాలెమి (క్రీ. శ. 150) మరియు ఖారవేలుని హాతిగుంఫ శాసనములోను పేర్కొనబడిన పితుంద్ర - జయస్వాల్ భావించినట్లు పృదు-అండ అనియు, ఆ నామము ఆ స్థలము యొక్క భౌగోళిక స్థితివలన ఏర్పడియుండి యుండవచ్చుననియు, కాలక్రమమున ఈ గుడ్డుపల్లి (పృదు-అండ) - యే గుంటుపల్లిగా మారినదనియు ఒక అభిప్రాయం.13 కాగా, పితుంద్రను - పృదు అండగా అన్వయించి గుడ్డపల్లి - గుంటుపల్లిగా శ్రీ సుబ్రహ్మణ్యంగారు తేల్చిరి. ఇది యెంతమాత్రము సమంజసముగా తోచదు. గుంటుపల్లి ప్రాచీన నామము మహా నాగ పర్వతముగా శాసనముల వలన నిరూపితమైనది....గుంటుపల్లియే పితుంద్ర అనువాదము నిరాధారము14 అని వేరొక సిద్ధాంతము.

కమ్బురాఞ్జెరువు

శాలంకాయన నన్దివర్మ 10 వ రాజ్యకాలము (క్రీ. శ. 435 ప్రాంతము) నాటి పెద వేగితామ్రశాసనములో ముణ్డూరు, చెంజెరువు, కంబురాం చెరువు గ్రామములు ప్రసక్తమైనవి. "కంబురాం చెరువు, ముండూరు అనునవి ప్రస్తుతము పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు తాలూకాలోని ఉత్తర దక్షిణ కొమ్మరలు, ముందూరు అను గ్రామములు. కంబురాం చెరువును కమ్మర చెఱువు గ్రామముగా గుర్తించిరి. ప్రాచీనాంధ్ర భాషయందు పూర్ణబిందు పూర్వక 'బు' వర్ణము వాడుకలో నుండెను. ఇది తరువాత కాలమున సమీకరణము చెంది 'మ్మ'గా మారినది. వనము, వనంబు, వనమ్ము రూపములు ఇట్లేర్పడినవియే. కంబురాం చెరువు కమ్మరి చెరువుగా పరిణామము పొందుట భాషారీతికి అనుగుణముగా వున్నది. చెంజెరువు నరసాపురము తాలూకా కాజ పర్కాలోని చించినాడ. చెంజెరువును చించినాడగా దినేశ్ చంద్ర సర్కారుగారు "శాతవాహనాంతరులు" అను గ్రంథమున గుర్తించిరి. కాని ఇది చాల దూరమైన పేరు. చెంజెరువు అనగా అందమైన చెరువు, ఎర్ర చెరువు అని యర్థము. చెన్ను అనగా, శోభ లేక ఎర్రదనము. చెంజెరువు ఎర్ర చెరువైనది అన్నచో బాగుండును కాని 'చించినాడ'ను పరిక్రొత్త రూపము దాల్చునా అను సందియము కలుగుచున్నది.... ....తాలవ్యీకరణము అను విధానము కూడా తెలుగు భాషయందు అప్పటికే ప్రవేశించినట్లు సూచనలు కలవు. కంఠ్యాక్షరములు తాలవ్యములైన అచ్చుల సాన్నిధ్యమున తాలవ్యాక్షరములుగా మారుటను తాలవ్యీకరణ మందురు. చెంచెఱువు కంబురాం చెఱువు శబ్దములలోని చెఱువు శబ్దము దీనికి ఉదాహరణము. ఈ శబ్దము కన్నడములో కెఱె అని యుండగా తెలుగులో చెఱువుగా మారినది. కకారము చకారమైనది. ఇ, ఈ, ఎ, ఏ లు తాలవ్యాచ్చులు. వాటి ప్రభావముచే ఈ మార్పు కలిగినది."15

ఱెన్దుళూర - దెందులూరు

"విష్ణుకుండినుల రాజధాని దెందులూరు నగరము. ఇది ఇప్పటి ఏలూరుకు సమీపమున ఉత్తరమునందున్న గ్రామము. దీని పూర్వరూపము 'ఱెందులూరు.' తరువాత డెందులూరు అయి క్రమముగా దెందులూరు అయినది. ప్రాచీన భాషయందు మూర్ధన్యాక్షరములకు గల ప్రచారమునకు ఇది యొక నిదర్శనము... .... ఇప్పటి భాషలో మూర్ధన్యాక్షరములు ఎక్కువగా వినవచ్చును. ఱ, ళ వంటివి. ఇవిగాక పరుషోచ్చారణము గల ఒక ఊష్మ వర్ణము వాడుకలో నుండినట్లు కన్పించును. దానిని మనము 'ఴ' గుర్తుతో వ్రాయవచ్చును. ఇది ఱెందుఴూఱు పఴికి రాష్ట్రమువంటి పదములలో వచ్చినది. ఈ ధ్వని తెలుగు భాషయందు కొన్ని శతాబ్దములుండి. నన్నయ నాటికి కావ్యభాషనుండి తొలగినది."16

గ్రామనామ పరిణామముగూర్చి కొండొకచో ఏవిధముగా విరుద్ధాభిప్రాయ ప్రకటనము జరిగినదో గ్రామ నామావిర్భావము గూర్చి కూడ ఆ విధమైన దృష్టాంతములను పేర్కొన వలసియున్నది. ఉ॥ దా॥ ఏలూరు, వేంగి.

ఏలూరు

"ఏలు+ఊరు=ఏలూరు (ముఖ్య పట్టణము) అన్న రీతిగా ఈ పదమేర్పడినదని కొందరు చెప్పుచున్నారు."17 'హేలాపురి' అనునది ఏలూరునకు సంస్కృతీకరణమనియు, ఏల అను చిన్న ఏరు ఈ పట్టణ పరిసరములందు ప్రవహించు చుండుటచే

ఏలేరునుంచి ఏలూరు గ్రామ నామము సంభవమై యుండవచ్చు ననియు[18] అభిప్రాయము వ్యక్తమై యున్నది.

వే(ం)గి (ఏ)

"తూరుప కనుమలనుండి సముద్రము వఱకును కృష్ణా, గోదావరుల మధ్య వ్యాప్తమై యుండు తీర ప్రాంత దేశమునకు పూర్వము వేంగి యని పేరు చెల్లుచుండెను. దీనికి దగ్ధ రాష్ట్ర మనియు జెప్పుట కలదు. ఒకానొకప్పుడిది యరణ్య ప్రాంతమై జన నివాసమునకు యోగ్యముగాక యుండగా నా యరణ్యమును దగులబెట్టి వానయోగ్యముగా జేయబడుట వలన దీ కీపేరు వచ్చి యుండును."[19] ఈ ప్రకారము వేడి–వేగి అను క్రమమున 'వే(ం)గి' యేర్పడినదనిపించును. కాని 'వేకువ' 'వేగు' సంబంధముగా ఈ పదము జనియించి వుండవచ్చునను అభిప్రాయము[20] పరిగణించ దగినది.

నామాంతరములు

కొలనిపాడునకు సరసీపురి, పద్మినీపురము, కమలాకర పురము[21] అను పేర్లుండెడివి. భీమవరం తాలూకాలోని గణప వరమునకు పూర్వ నామం పద్మినీపురం.[22] "పూర్వం టౌన్ ప్లానింగ్‌లో పద్మాకారం వున్న మాట నిజమే కాని అందువలన పద్మినీపురం కాలేదు."[23] పరి నాటి కోలని ప్రభువుల ముఖ్య పట్టణ నామ పరంగా ఈ పేరుండినట్లు భావించాల్సి వుండేది. "అప్పుడు రావులపల్లు వుండేశ నగరమని రాజుపేర పిలువబడు చుండెడిది."[24] అను మాట అలా వుండగా "దీనికి పూర్వము దుందెపురము అను పేరు కలదు. కాల క్రమేణ ఇది ఉండిగా మారినది."[25] అను అభిప్రాయమున్నది. కేతకీపురము, కేతవరము మొగల్తుర్రు (న) నకు సంస్కృతీకరణ రూపములు. పాలకొల్లు నకు దుగ్ధోపవనపురము, ఉప స్యపురము అను నామాంతరములు చెల్లినవి. ఖండవిల్లి(త)కి ఒకప్పటి పేరు ఉత్తరేశ్వర పురము.[26] శ॥ సం॥ 1314 లో చిక్కాల(న)గ్రామమునకు "ప్రోలయ కొమర గిరిపురము" అను నామకరణముచేసి తన అన్నగారి పుణ్యము కొరకు అనపోతారెడ్డి దానము చేసెను.[27] కాని నూతన నామము నిలువక నేటి కాగ్రామము కొమ్ముచిక్కాలవలస పేర నున్నది. కొన్ని సందర్భములలో నూతన నామము వచ్చి చేరి నిలుచును. అట్టిది గుండేపల్లి అను చోడవరం ఈస్ట్(తా). తణుకునకు 'తార కేశ్వరపుర' మను వ్యవహారముండెడిది.[27a]

పౌరాణికములు

మతం లేని (దే) మనిషిలేడనే మాట పూర్వకాలానికి మరింతగా సరిపోతుంది. ఈ సంగతి గ్రామనామకరణ విషయంలో కూడా ప్రస్ఫుటంగా ద్యోతకమవుతుంది. అందుకు సాక్ష్యంగా ఈ జిల్లాలోని కొన్ని గ్రామనామకరణాల వెనుక పౌరాణిక వ్యక్తులూ, సంఘటనలు దర్శన మవుతున్నవి.

అత్తిలి (త)

"అత్రిమహర్షి నివసించుటచే ఈ గ్రామము అత్రి అని మొదట పిలువబడి క్రమముగ అత్రి అను పదము అత్తిలిగ మారినదట." 8

ఆచంట (న)

"రక్షణ నిచ్చు మార్తాండేశ్వరి దేవత పేర దీనిని మార్తాండ పురమనిరి." పరమశివభక్తుడైన ఒడయనంబి ఒకానొక వేళ ఆత్మ లింగమును పూజించుటకు తగిన వ్యవధానములేక తన ప్రేయసి యైన పరవనాంబి వామ స్తనచూచుకమును శివలింగముగా భావించి అర్చించుట మొదలుగా సాగిన గాథను బట్టి ఆచంట నామమేర్పడి నదని నమ్మకగలదు.[29]

కాళ్లకూరు (భీ)

"చెఱువు గట్టుపై అడుసులో కాళ్ళు కూరుకొనియున్న ప్రతిమను గ్రామస్తులు జూచిరట. ఆ దారిని తిరుపతి తీర్థయాత్రకు పోవుచున్న మొగలితుర్రు జమిందారు కాసంగతి జెప్పిరట. వారిని

నరుకు జేయక వెళ్ళిన జమీందారుకు తిరుపతిలో స్వామి కనిపించలేదట. వెంటనే తిరిగివచ్చి జమీందారు గ్రామస్తులు చూపిన ప్రతిమనే వెంకటేశ్వర స్వామిగా ప్రతిష్ఠించెనట. దేవునికాళ్ళు మట్టిలో కూరుకొని యున్నందున ఊరిపేరు కాళ్ళకూరైనదట"30

కొవ్వూరు (కొ)

పూర్వమిది గోవూరన పేర బరిగెడిది. గౌతమ మహర్షి-గోదావరి నదికి సంబంధించిన గాథామూలకముగ నేర్పడిననామము.

జుత్తిగ (త)

"స్థల పురాణం-అవరణలో అంతర్దూతిక, ఊర్లో బహిర్దూతిక పేరిట ఊరి పేరు జుత్తిగయట.... చక్రకూట రాజ్యదేవత దంతేశ్వరి నచట ప్రతిష్ఠించెను. ఆమె జుత్తిగ దూతిక.... బస్తరు రాజ్యదేవత దంతేశ్వరి. ఈ దంతేశ్వరికీ, జుత్తిగ దూతికకూ సంబంధములేదు. దూతిక దేవతబట్టి గ్రామం జుత్తిగ కాలేదు. ఏదో పరివార దేవతకు కుతుబ్షాహీలనాడు కట్టిన దానిలో చిన్న ప్రతిమను ప్రజలు దూతిక అన్నారే కాని చరిత్రకాదు."31

ద్వారకా తిరుమల (ఏ)

చిన్న తిరుపతియని ప్రసిద్ధి. "దారక లేక ద్వారకుడను విప్రుడొకడు ఏటా తిరుపతియాత్ర చేసేవాడట. ఒకసారి దారిలో వడగాడ్పులకు స్పృహ దప్పెనట. స్వామి వృద్ధ బ్రాహ్మణుడుగా వచ్చి సేద దీర్చెనట. కలలో కనిపించి ఇక తిరుపతిరావద్దు, నీకై ఇచటనే వెలసెద ననెనట.... ద్వారకుని పేరిట క్షేత్రము ద్వారకా తిరుమల యైనదట .. ఈగాథలో గూడ ఏదో నొక శిథిల ప్రతిమను వేంకటేశ్వరునిగా ప్రతిష్ఠించుటే స్ఫురించును. ద్వారకా తిరుమల ప్రాంతాల దారువులున్నవి. అనేకుల వృత్తి గూడా దారుకము - చెట్లుకొట్టి, చీలి, కట్టెలుగా అమ్ముట. ఇటు కోస్తా - అటు మెట్ట ప్రాంతానికి ద్వారము (గడప) వంటిది ద్వారకా తిరుమల."32

దువ్వ (త)

దూర్వాశ పురమని వ్యవహరింప బడిన ఈ గ్రామము దూర్వాశ మహర్షి చేతనే వెలయింప బడినదని విశ్వాసం.33

వత్రా రామేశ్వరం (త)

"సీతలింగ ప్రతిష్ఠాపనకు ఆంజనేయుని బాణలింగము తేపంపెనట. ముహూర్తమునకు తిరిగి రానందున ఇసుక (సైకత), మట్టి (పార్థివ), గుల్లలు కలిపిచేసిన లింగము-నత్రా రామేశ్వరుడు.... క్రీ॥ శ॥ 1314 నాటి శాసనములో "మూలస్థానము నత దేవర"కు అఖండదీపం ప్రసక్తి వున్నది. ఈ నత్త (నాథ) దేవర నెవరో నత్తగుల్లను జేసారు."34

పట్టిసము (పో)

శ్రీశైలము, కాశి, కాళేశ్వరం, శ్రీకాళహస్తిలతోపాటుగా పంచశివక్షేత్రములలో నొకటిగా నెన్నబడిన ప్రదేశము.

తన తండ్రియగు దక్షుడొనర్చిన యాగ సందర్భమున సతీదేవి అవమానింపబడి యోగ విసృష్టదేహ మయ్యెను. తన్మూలమునఅత్యంత కుపితుడై ఆమె భర్తయగు మహాదేవుడు వీరభద్రావతారము దాల్చి దక్షుని శిర ముత్తరింప పట్టసము అను ఆయుధమును ప్రయోగించెను.... ఆ కారణమున నాటినుండి ఆ దేవకూటాద్రి పట్టసాద్రి లేక 'పట్టసాచలము' అను నామముచే వ్యవహరింప బడుచు వచ్చెను."35

పాలకొల్లు (ప)

పంచారామములలో నొకటియైన క్షీరారామమునకు నెలవు కావున ఆ పేరు సార్థకమే అయినది.

పెనుగొండ (త)

"ఏ కొండ పెనుగొండలో లేదు. దేవతలు స్వర్గలోకవాసులు అనే పురాతన విశ్వాసాలలో కొండలపైనా ఎత్తైనచోట్ల క్షేత్ర నిర్మాణము పురాతనము. ఆ నమ్మకాలలో ఊరిపేరు చివర కొండ వుండుట పరిపాటి .. మధ్యప్రాంత గిరిజనులలో పెన్ అనగా దేవుడట. పెన్+కొండ=దేవరకొండ - పెనుగొండ ఐనదా ? ... . పెనుగొండ వైశ్యధర్మాసనా కేంద్రము. సుసంపన్న పురము. వారి తూనికలు, కొలతలు నాడు ప్రామాణికము లని పించును. పెనుగోల (పెద్ద తక్కెడ, కాటా) కు పెనుగొండకు శబ్ద సంబంధ ముండెనేమో!"36

లక్ష్మణేశ్వరము (న)

శ్రీరామచంద్రుని సోదరుడైన లక్ష్మణునిచే ప్రతిష్ఠింపబడిన లక్ష్మణేశ్వరాలయముండిన గ్రామముగావున ఆ పేరేర్పడినదిగా తలంప బడుచున్నది.37

మండపాక (త)

"ప్రజలు ఆయా తావుల కాపేరు వచ్చిన కారణాలు చెప్పడంలో అత్రిముని పేరిట అత్తిలి, దూర్వాసుని పేరిట దువ్వ

అన్నట్లే మండపాకకు మాండవ్యునికి ముడి పెట్టారు .... మండపాక నేడు కమ్మటూరు. పూర్వం గొల్ల లెక్కువగా వుండేవారట. వారి తావు మందపాక మండపాకగా మారెనా?"38 ఈ విషయమే మరింత వివరముగా విశదీకరింప బడినది. "శ్రీమాండవ్య మహాముని ఈప్రాంతమున తపస్సు చేసుకొను చుండెడి వాడట. అందుచే తత్తీరప్రాంతముననున్న ఈ గ్రామము నకు మాండవ్య క్షేత్రమనియు, మండపాకయనియు వ్యవహారము కలిగెనట.... పశువుల మందలుండుటచే ఈగ్రామము 'మందపాక' యనియు, ఆ మందపాక అను గ్రామము కాలక్రమమున 'మండ పాక'యని వ్యవహరింపబడ దొడగెనని పెద్దలవలన వినికిడి."39

మల్లేశ్వరం (త)

చాళుక్య మల్లపరాజుచే ఈ గ్రామమందు ప్రతిష్ఠితుడైన స్వామి 'మల్లేశ్వరుడు'గా పేరొందాడు. ఆ దేవునిపేర గ్రామం 'మల్లేశ్వరం' అయినది.

రేలంగి (త)

"పూర్వం రాముడు తాటకిని చంపినప్పుడు తాటకి తల తెగి, ఈ ఊరు వున్న ప్రదేశంలో రాలింది. అందుకని ఈ ప్రదేశాన్ని 'రాలింది' అని పిలవసాగారు. వాడుకలో రూపాంతరంచెంది ఆ మాట 'రేలంగి' అయింది."41

దేవర చెరువు ఖండ్రిక (భీ), రామానుజపురం; వేదాంత పురం (పో), అమృతలింగంపేట; నాగులదేవునిపాడు (ఏ); చక్రదేవరపల్లి; దేవరాపల్లి; దేవులపల్లి (కొ), గుడిపాడు; గుడి పాడు ఖండ్రిక; శంఖచక్రపురం (చిం) మొ॥ గ్రామ నామములు కూడ హిందూ దేవతా పరముగా నేర్పడినవిగా ఎంచవచ్చును.

బౌద్ధము

"పేరులో బౌద్ధ సంబంధమనిపించు వడలి, సిద్ధాంతం (త)"42 వగైరా గ్రామములీ జిల్లాలో నున్నవి.

జైనము

ఈ జిల్లాలో ఆచంట (న), ఏలూరుపాడు (భీ), కలశమూరు (త), పెనుగొంచిలి(త) మొ॥చోట్ల జైన ప్రాభవ సూచక అవశేష ములు లభించినవి. జైనవారిగూడెం (పో) అను గ్రామము స్పష్టముగా జైన ప్రాభవమును సూచించుచున్నది. పెదమిరాం(భీ) అనగా పెద్ద చెట్టు అని అర్థంకాగా అది ఆచోట నేర్పడిన జైన స్థాపరమును సూచించేదిగా వున్నదని పరిశోధకాభిప్రాయం.43

రాజ వంశముల, పాలకుల నామ ప్రభావము

గ్రామ నామములకు, ప్రభునామములకు సంబంధము నిరూ పించుటలో సూక్ష్మ పరిశోధన అవసరమెంతైనావుంది. ఒకే పేరు గల గ్రామములు ఒకే జిల్లాలో పలు తాలూకాలలోను, వేరొక జిల్లాలోను కూడా కానవస్తవి. ఒకే పేరుగల రాజన్యులు వివిధ రాజవంశములలో కానవస్తూ వుంటారు. ఉదాహరణకు తాడేపల్లి గూడెం తాలూకాలోని "గణపవరం అనే పేరు కాకతి గణపతిదేవ మహారాజునుండి వచ్చెను"44 అని కేవలం పేరు పోలికనుబట్టి కాక వేరు ప్రబల సాక్ష్యాధారము లాధారంగా పరిశోధకులు నిశ్చ యించి వుండవచ్చు. గణపవరం అనే గ్రామం పోలవరంతాలూకా లోనూ వున్నది. కోన, కొలను, మలయ మండలాధిపతులలో వుండిన 'గణపతి' నామధేయు లెవరైనా ఈ గణపవరములకు కర్తలై యుందురా అనునది వివేచించవలసిన విషయము. మహా దేవపురం (పో), మహాదేవపట్నం (భీ) గ్రామములున్నవి. మలయ మండలాధిపతులలో, నిడదవోలు చాళుక్యులలో 'మహాదేవ' నామధారులున్నారు. తాడేపల్లిగూడెం తాలూకాలో కూనవరమను గ్రామము కలదు. కొలను కూనపరాజు-కోమకొండ మంచికొండ కూనప నాయకులలో నెవరీ గ్రామమునకు తమ పేరిచ్చిరో ? మల్లవరం (కొ&న), మల్లేశ్వరం (త&ఏ&చిం), చినమల్లాం-పెద మల్లాం (న) గ్రామములున్నవి. తూర్పు చాళుక్యులలో యుద్ధ మల్లురున్నారు. కల్యాణి చాళుక్య త్రైలోక మల్ల సోమేశ్వరుడు-ఈ ప్రాంతముపై ప్రభావము నెరపినవాడే. ప్రౌఢ దేవరాయల రాజమహేంద్రవర ప్రతినిధి మల్లప ఒడయరు గలడు. వీరిలో నెవరీ గ్రామనామ కారకులై యుందురు ? రెండవ పులకేశి 'సత్యాశ్రయ' బిరుదాంకితుడు. కల్యాణి చాళుక్యులకు ఈ బిరుదు అనువంశికము. తూర్పు చాళుక్య రాజరాజు 'సత్యాశ్రయకులశేఖర' బిరుదు ధరించాడు. కోన పాలకులలోని 'సత్య' నామధేయులు అలా వుండగా, స్థూలముగా సత్యవోలు (ఏ), సత్యవాడ సత్యవరం (త) గ్రామములు చాళుక్యుల బిరుద పరంగా వెలసినవని భావించడానికి వీలున్నది. కొప్పుల సామంత నృపతులలో ప్రోలయ - కాపయ లున్నప్పటికీ వారి పైవారైన ముసునూరి ప్రోలయ-కాపయ నాయ కుల పేరుమీదుగనే ఈ మండలములోని పోలవరములు(భీ&పో), కాపవరములు (భీ&న&త) వెలసినవని ఎంచవచ్చును. "సామాన్య ముగా కోటలు-దుర్గములకు సమీపమున కేసవరమని, కాపవరమని గ్రామములుండును."45 కనుక కావలిపురము (త) వలే ఈ కాప వరములో నేవైన కావలిపురములు కావచ్చును. ఇక కేశవరం (తా) కొలని కేశవదేవరాజులతో సంబంధము కలిగినదిగా

ఎంచవచ్చుననుకొందుమన్న "కేసవర మనగా - కేసరులవంటి వీరు లుండెడి గ్రామము"46 ను అభిప్రాయమున్నది. బేతపూడి (భీ), (కంసాలి) బేతంపూడి (న) కోటగణపాంబ భర్త బేతరాజు పేరున నేర్పడినవి కావచ్చును. (కోతుల) గోకవరం (చిం), గోకినపల్లి (ఏ) గ్రామముల పూర్వరూపము గోకర్ణ' శబ్దసారూప్యము కలిగినవిగా భావిస్తే వెలనాటి గొంక (గోకర్ణ గొంక- గోక) తో సంబంధము సంభావింపవచ్చును. ఈ ప్రాంతముపై సాగిన చోళ, చాళుక్య-చోళ, వెలనాటి చోడాది రాజవంశపాలనా ప్రభావసూచికముగా తాడేపల్లిగూడెం తాలూకాలో రెండు చోడవరం గ్రామములున్నవి. ఈ జిల్లాలో ఒక తాలూకా కేంద్రమైన భీమవరము మొదటి చాళుక్య భీముని పరంగా రూపెత్తినదని భావింపబడుచున్నది47 రెండవ కోట కేతరాజు పేర కేతవరం (కొ), కొప్పుల వంశపు నామయనాయకుని పేర నామవరం (చిం) ఏర్పడి వుండవచ్చును. వేమవరములు (భీ&న&త) సహజముగా 'వేమ' నామాభిదానముగల రెడ్డిరాజులకే చెందినవై యుండుననుకొనుటకు అభ్యంతరము లేదు. కాని పోలవరమునకు రెడ్డిపోలవరమను వ్యవహారము అది రెడ్డిరాజుల పాలనలో నుండి యుండుటవలననే నేర్పడినది48 అని నిశ్చయించుటకు చిన్న అభ్యంతరమగుపడుచున్నది. శాశ్వతకరనిర్ణయము (1802) నాటికి పోలవరం జమిందారీ రెడ్డి లక్ష్మీనారాయణదేవు. ఇట్టి సంసయాగ్రస్తతకు ప్రబల ఉదాహరణముగా నిడదవోలు [కొ] ను పేర్కొనవచ్చు. (i) "నిడదవోలు, నిడుదవోలు, నిడుదప్రోలు పూర్వనామం నిరవద్యపురము. నరేంద్రమృగరాజు, కలివిష్ణువర్ధన ద్వితీయ విజయాదిత్యుని (క్రీ. శ. 799-839) బిరుదుల్లో ఒకటి నిరవద్య- అ పేరిటి పురము"49 (ii) "'నిరవద్య' అనునది పశ్చిమచాళుక్య రెండవ విజయాదిత్యునకు (క్రీ. శ. 699-729) బిరుదనామము. అతని పేరనే యీ పురమునకాపేరు లభించియుండవచ్చును."50 బాదామి, వేంగి చాళుక్యవంశములకు చెందిన సమీపకాలమువారైన ఇరువురు రాజన్యుల కొకే బిరుదము ఉండుటయేగాక బాదామి చాళుక్య ఉద్యోగవర్గములోని వారికి కూడా ఈ బిరుదు చెల్లియుండుట గమనించదగిన విషయము.50-A

అంతగా చరిత్ర ప్రసిద్ధిగాని గ్రామ నామముల పుట్టుపూర్వోత్తరములను గూర్చి కూడ 'స్థలపురాణములు' వేర్వేరులుగా వుండుట గమనించవచ్చు. ఉ॥ దా॥ దండగర్ర (తా). "ఉంపుడుకత్తె తన దండకడియము వెలతో చెరువుకట్ట వేయించెను. అందువలన "దండకర్ర" అని పేరు వచ్చెను. ఈ "దండకర్రే" ఒక గ్రామముగా రూపొందినది."51 "ఒకప్పుడిక్కడ యేనా పల్లకీల ప్రయాణ కాలమున బోయీలు భుజములకిందికర్రలను (దండగర్ర)మార్చుకునే మజిలీ కాబట్టి ఆ పేరు వచ్చెనని కొందరి నమ్మకము. దండగర్రలో ఒకప్పుడు దండు (స్కంధావారము, కంటోన్మెంట్) ఉండెనేమో పరిశోధనీయము."52

ఏరువబోడ భక్తిరాజ కామరాజు (1356-1367) పేరున వెలసినది కామవరపుకోట (చిం), ఈతని రెండవ కుమారుడు అన్నదేవచోడుడు (1377-1416) మహాయోధుడు. అన్నదేవరపేట (కొ) ఈతని పరంగా రూపెత్తినదికానగును. అన్నదేవ చోడుడు ఉండేశుల అల్లుడు. "ఈ ఉండ్రాజుల పేరననే ఉండ్రాజవరము, ఉండేశపురమిత్యాది నామాంకితములుగల గ్రామములు వెలసినేటికి వారల కీర్తి ప్రతిష్ఠలను వ్యాపింప చేయుచున్నవి.

సంస్థానములు / జమిందారీలు

నూ జి వీ డు

పశ్చిమగోదావరి మండలములోనికి కూడ విస్తరించుకొని వుండిన నూజివీటి తొలినాటి సంస్థానాధీశులలో విఖ్యాతుడును, 'అప్పారావుగా' ప్రసిద్ధుడును (క్రీ. శ. 1667 ప్రాంతము) యైన అప్పన్న పేరిట వెలసినవి అప్పనవీడు (భీ), అప్పారావుపేట (తా). ఈతని కుమారుడు వెంకటాద్రి అప్పారావు. ఈ కోవలోని నిజామునుండి 'సవైరాజా' బిరుదు బడసిన మరియొక వెంకటాద్రి అప్పారావు (1772 ప్రాంతము) గలడు. వీరిరువురిలో నెవరి పేరునగాని వెంకటాద్రి అప్పారావుపురం (తా) ఏర్పడినది. పెద వెంకటాద్రి అప్పారావు కుమారుడు, 'తీన్ హజార్ మన్సబ్‌దార్' బిరుదాంకితుడు కుమార ధూర్జటి 'ఇందుమతీ పరిణయ' ప్రబంధ కృతిభర్తయైన నరసింహ అప్పారావు. అతని వారసుడు రామచంద్ర లేక నరసింహ అప్పారావు...... ఇంకను నూజివీటి వారి వంశమున నరసింహ - రామచంద్ర నామధేయులున్నారు. నరసింహాపురం (ఏ&భీ), నరసింహరాజపురాగ్రహారం (భీ), పెదరామచంద్రాపురం, చినరామచంద్రాపురం (భీ) గ్రామములలో వేటికి ఎవరు పేర్లిచ్చిరో! 1812 సం॥ లో పోలవరము ఎస్టేట్‌ను వేలములో నూజివీటి రామచంద్ర అప్పారావు ఖరీదుచేసేడు. కనుకనే కాబోలు పోలవరం తాలూకాలో నొక క్రొత్త రామచంద్రపురం అను గ్రామము వెలసినది.

పో ల వ రం

1803 సం॥ శాశ్వతకర నిర్ణయకాలము నాటికి రెడ్డి లక్ష్మీనారాయణదేవు పేర నమోదయి యుండిన పోలవరం జమిందారీ

తరువాతి పాలకుడగు రాజా మంగపతి దేవు కాలమున ఏర్పాటు వేయబడినది. పోలవరం తాలూకాలోనివైన లక్ష్మీనారాయణదేవుపేట, మంగపతిదేవుపేట ఈ పాలకుల మూలమున ఏర్పడినవని స్పష్టము.

మొగల్తూర్లు

మొగల్తూర్లు తొలియేలికలలో నొకడైన పెదబాపరాజు(17శం.) పేరున రూపెత్తినది. బాపిరాజుగూడెం (ఏ) కావచ్చును. ఇట్లే ఈ సంస్థానాధీశులలోని నారాయణరాజు పేర నారాయణపురం (ఏ), తిరుపతిరాజు (1760-1791) పేర తిరుపతిపురం (ఏ) అని లెక్క వేసుకొన వచ్చునుగాని అందులకు ప్రబల ప్రమాణము స్థానిక పరిశీలనము వలన సాధింపబడవలసి యున్నది.

ముస్లిం పాలనా ప్రభావము

రుసుమ్‌ఖాదా (న) పేరు అసఫ్‌జా (1713-1748) రాజమండ్రి ప్రతి ధి-చండశాసనుడు-మొగల్తూర్లు, నూజివీడు, పెద్దాపురం మొ॥ జమిందారీలకు కంటకప్రాయుడైన రుసుమ్‌ఖాన్‌ను స్ఫురణకు దెచ్చును. నవాబుపాలెం (తా) ఫలానా ఈ నవాబు సృష్టియని నిర్ణయించుట కష్టమే. కెస్‌బా (కసుబా-కస్బా) పెంటపాడు (తా) నాటి అధికార భాషయైన ఉర్దూభాష ప్రభావమును సూచించును. "కసుబా పెంటపాడు నాటి పరిపాలనా యంత్రాంగమునకు ముఖ్యస్థలమై యుండును. కసుబా అర్థం గడిస్థలము, వర్తకస్థలము, ఖజరీ, రెవెన్యూ ఇచ్చే పెద్ద గ్రామము."[55] 'తానాషా' అని పేరుగాంచిన అబుల్‌హసన్ కుతుబ్షా (1673-1687) మంత్రి సేనాధిపతులుగా అక్కన-మాదన్నలు ప్రసిద్ధులు.

ఆకివీడు (భీ)

"అక్కన్న మాదన్నలు ఇచ్చటనే నివసించిరని ప్రజలు అనుకొందురు. అక్కన్న నివసించుట వలన ఈ గ్రామమునకు అకివీడు అని పేరు. మాదన్న నివసించుటచే దీనికి సివారుగా నున్న గ్రామమునకు మాదివాడ అను పేరువచ్చినట్లున్నది."[56] కాగా, విక్రమేంద్ర (విష్ణుకుండిన) మహారాజు తుండి తామ్రశాసనమున దాన గ్రహీత స్వస్థలము అకి అని శాసనమున చెప్పబడినది. "పరిష్కర్తలు అకి గ్రామము పశ్చిమగోదావరిజిల్లా ఆకివీడు గ్రామము అయివుండవచ్చునను అభిప్రాయము వెలిబుచ్చిరి."[57] ఎక్కడ విష్ణుకుండిన విక్రమేంద్రుని కాలము- ఎక్కడి అక్కన్న మాదన్నలు !

గూడెములు - పాలెములు

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో 'వలసలు' మిక్కుటముగా నున్నట్లు, ఈజిల్లాలో గూడెములు - పాలెములు శతాధికముగానున్నవి. వాటిలో మూడు వంతులకుపైగా వ్యక్తి నామములతో వెలసినట్టివిగానున్నవి. ఉదా : అక్కిరెడ్డి గూడెం, చక్రయ్యగూడెం, కొండలరావుపాలెం, లింగారావు పాలెం, మేదినీరావుపాలెం, రాజమ్మపాలెం, రామారావుగూడెం, రామన్నపాలెం, సత్తెనగూడెం, సూరప్పగూడెం, తిరుమలమ్మ పాలెం, తిమ్మనగూడెం (అన్నీ ఏ); అల్లంచెర్లరాజుపాలెం, అప్పల రాజుగూడెం, అయ్యవరాజుగూడెం, చంద్రన్నపాలెం, ధర్మాజి గూడెం, గురవాయిగూడెం, కృష్ణారావుపాలెం, లింగారావుపాలెం, మల్లయ్యగూడెం, పట్టయగూడెం, రామనగూడెం, రామన్నపాలెం, శాయన్నగూడెం, తిమ్మారెడ్డిపాలెం, వెంకమ్మపాలెం (అన్నీ చిం) చిన్నయ్యగూడెం, బొప్పరామన్నగూడెం, ధూమంతునిగూడెం, కన్నయ్యగూడెం, తిమ్మరాజుపాలెం, ఎర్రనగూడెం (అన్నీ కొ). ఈవిధమైన గ్రామములన్నియు ఏతత్ గ్రామస్థాపకుల పేర్లమీదను గాని, ఏతత్ స్థాపనాకాలమునాటి ప్రముఖ వ్యక్తుల పేళ్ళమీదగాని ఏర్పడినవి. చాలవరకు ఇవి జమిందారీ యుగములో (18-19 శ॥) నేర్పడినవి కావచ్చును. స్థలజ్ఞులు ఆయా గ్రామముల పుట్టు పూర్వోత్తరముల విషయమై విశదీకరింప గలుగుదురు.

ఇంటిపేర్లు - గ్రామనామములు

ఈ రెంటింటికిగల అవినాభావ సంబంధము ఈ జిల్లాలో కొన్ని గ్రామములు ఇంటిపేర్ల ననుసరించియే ఏర్పడుటబట్టి మరింతగా స్పష్టము. ఉ॥ దా॥ దానంవారిగూడెం, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రావువారిగూడెం, స్వర్ణవారిగూడెం, (అన్నీపో), చెలికానివారి పోతపల్లి, మైలవరపువారిగూడెం (ఏ); బండివారి గూడెం, గణపవారిగూడెం, పుప్పాలవారిగూడెం, సెట్టివారిగూడెం (అన్నీ చిం); జలగంవారి కండ్రిక (కొ). గ్రామనామములు ఇంటి పేర్లుగాను, ఇంటిపేర్లు గ్రామ నామములుగాను అయిన సందర్భము నకు ఉదా॥ నేలటూరు, సిడదవోలు(కొ), నందమూరు (కొ&తా); కోవల్లి (భీ&ఏ) అడవికొలను, తెలికిచర్ల, వల్లూరు (తా), క్రొవ్విడి (భీ), ముంజులూరు (పో), అండలూరు, గుమ్ములూరు, కాళ్ళకూరు, నడదూరు, ఉంగుటూరు, వల్లూరు (అన్నీ భీ).

జాతి, కుల, వృత్తి సంబంధములు

ఏదియో ఒక జాతి, కుల, వృత్తులకు సంబంధించిన వారు తొలుత నివసించుటను బట్టియో, లేక వారి సంఖ్య గణనీయమైన దిగా నుండుటవలననో కొన్ని గ్రామములకు తత్ సూచనా పూర్వక నామము లేర్పడినట్లు తోచును. ఉ॥ దా॥ గవరవరం, కోమటిలంక మాలసానిగుంట, సానిగూడెం, రావులకుంట, వడ్డిగూడెం(అన్నీ ఏ); బ్రాహ్మణగూడెం, గవరవరం, కోమటిగుంట, సెట్టిపేట(అన్నీ కొ);

సాలి బేతపూడి (న): కోయ రాజమండ్రి (పో): గొల్లల కోడేరు): రావులపల్లు (తా).

..., పక్షి, వృక్ష సంబంధములు

ఉ॥ దా॥ డిప్పకాయలపాడు, చింతలగూడెం, దోరమామిడి, ...మ్మలగూడెం, తాటియాకులగూడెం, దొండపూడి, తాడిమూడి, ...గుమిల్లి, పూతికపాడు (అన్నీ పో), శృంగవృక్షం (భీ): ...ముదాలపల్లి, చీపురుగూడెం (తా): కోరుమామిడి, నిమ్మల...గూడెం, చెరుకుమిల్లి (అన్నీ కొ): బూరుగుపల్లి, చిన్నమామిడిపల్లి, ...రింటాడ, నేరేడుమిల్లి (అన్నీ న): కాకరపాడు, మామిడూరు, ...డిపర్రు, తేపర్రు, (త): ఆముదాలచెలక, చింతలపూడి, రావికం...డు, వేములపల్లి, (అన్నీ చిం): బూరుగుగూడెం, చల్లచింతల...డి, చోడిమళ్ళ, దోశపాడు, జాజులకుంట, పైడిచింతపాడు ...న్నీ ఏ): చిలకలూరు (పో), కాకుల ఇల్లిందలపర్రు, [త] ...తులగోకవరం [చిం]: నాగులపల్లి శరభపురం, కొక్కిరాయి...క [ఏ]

...గోళిక విశేష సంజనితములు

గుంటుపల్లికి పూర్వరూపముగా భావింపబడు పిధుండ ...ృధు+అండ=పెద్దగుడ్డు=గుడుపల్లి - గుంటుపల్లి] పేరు ఆ ...గ్రామ భౌగోళిక స్వభావముచేత వచ్చియుండునను అభిప్రాయము ...వరకే గమనించడం జరిగింది. అట్టి భౌగోళిక ప్రత్యేకతల ...చించు గ్రామనామములను మరికొన్నింటిని గుర్తించవగును. ...॥ అరుగొలను [తా]. "పూర్వం ఆరుకొలనులు ఉండేవట. వాటి ...రిట గ్రామం ఆరుగొలనయినదట."58 అడవికొలను, చినసంద్ర...లను, పెదనిండ్రకొలను, తెలికచెర్ల [పూర్వనామం తెలికచెరువు] ...న్నీ తా], మోగల్లు [మోంగొలను] [భీ], పాలకొల్లు [న]; గుండు...లను [ఏ] గుండుగొలనుకుంది [చిం] మొ॥ పేర్లు కూడా కొలనుల ...ై ఏర్పడినవియే అయివున్నవి. తూర్పువిప్ప [రు&త] పడమట ...ప్పర్రు [తా], కొమ్మర ఉత్తర-దక్షిణ [ఏ] మొ॥ ఆయా ...గ్రామములున్న దిక్కులను బట్టి విశేషణములను చేర్చుకొన్నవి.

...ద్ద - చిన్న, క్రొత్త - పాత వగైరా

ఒకేపేరుగల గ్రామాలను వేరువేరుగా గుర్తించడానికి ఆయా ...ర్ల ముందు పెద్ద-చిన్న అనే విశేషణం చేర్చడం ఒక ఆనవాయితీ. ...॥: పెదకాపవరం-చినకాపవరం, పెదమిరాం-చినమిరాం, పెద...ల్లేరు-చినపుల్లేరు (అన్నీ భీ): చిన నిండ్రకొలను - పెద నిండ్ర...లను, చిన రామచంద్రపురం - పెదరామచంద్రపురం [తా]: పెదమల్లాం-చినమల్లాం, పెదమామిడిపల్లి-చినమామిడిపల్లి [న]. క్రొత్తగా ఏర్పడిన గ్రామాలను అదే పేరుగల పాత గ్రామాల నుంచి వేరుగా గుర్తించడానికి ఆయా గ్రామ నామముల ముందు పాత కొత్త అనే విశేషణములను చేర్చడం ఒక పద్ధతి. ఉదా: పెద్ద-చిన్న రామచంద్రపురములు భీమవరం తాలూకాలో వుండగా కొత్త రామచంద్రపురం పోలవరం తాలూకాలోనున్నది. అయితే కొత్తపల్లి [ఏ&చిం&తా] అనే ఊళ్ళు వున్నవిగాని పాత పల్లి అనే ఊరు తటస్థపడలేదు. అట్లే కొత్తగూడెం [ఏ], కొత్త పాడు [త], కొత్తూరు [ఏ]. పెమ్మరాజు పోలవరం, అయ్యవారి పోలవరం, పోలవరంవున్న తాలూకాలోనేవుండి తమ ప్రత్యేకతను కలిగివుండగా మడుగు పోలవరం భీమవరం తాలూకాలో వున్నది. తణుకు తాలూకాలోనేవున్న కముదవల్లి నుంచి దాసుల కుముదవల్లి - కన్నయ్య కుముదవల్లి గ్రామాలను వేరుగా గుర్తించడానికి వీలుగా వున్నవి. వేమవరం గ్రామాలనుంచి తణుకులోగల ఒక వేమవరం తాలూకానుబట్టి ప్రత్యేకంగా తణుకు వేమవరమని పిలువబడుచుండగా అదే తాలూకాలోని మరియొక వేమవరం పిట్టల వేమవరమని ప్రత్యేకంగా గుర్తించడానికి సౌకర్య విశేషణం కలిగియున్నది. నరసాపురం తాలూకాలోని రెండు వల్లూరులలోను ఒక దానియందు ఏకాలములోనో పండితులు నివసించినట్లున్నది కావున అది పండిత వల్లూరను పేరు కలిగియున్నది.

వేర్పాటుగా గుర్తించడానికి వీలుకల్పించనిగ్రామనామములు లేకపోలేదు. ఉదా: కుముదవల్లి [భీ&త], వల్లూరు [న&తా], వేమవరం [భీ&న] సారిపల్లి [తా&పో], నందమూరు [కొ&తా] గవరవరం [ఏ&కొ], నిమ్మలగూడెం [పో&కొ], సీతాపురం [తా&భీ] రామన్నపాలెం [రెండూ చిం], లింగారావుపాలెం [ఏ&చిం] శ్రీరామపురం [ఏ&చిం], సీతానగరం [పో&చిం], జగన్నాధపురం [ఏ&కొ&న&పో], నరసింహపురం [భీ&ఏ], నరసాపురం (న& చిం), రాఘవపురం [ఏ&చిం], కేతవరం [కొ&చిం], వేగవరం [చి&ఏ]. ఒకే పేరునగల గ్రామములు ఏలూరు, చింతలపూడి తాలూకాలలో ఎక్కువగా నున్నట్లు తెలుస్తోంది. ఇది ఆయా తాలూకాల మధ్య జరిగిన వలస పద్ధతిని సూచించేదిగా వున్నది.

ఊరి పేరుపై మమకారం

ఏ కారణముల చేత వలసపోయి వేరొకచోట స్థిరపడిన వారైనా పాతపట్టులపై మమకారమును వదులుకొనలేరనిపించును. గ్రామనామములందు కొంత సాక్ష్యము. చేబ్రోలు-చేబ్రోలు ఖండ్రిక, తాడేపల్లి - తాడేపల్లిగూడెం [తా], రాపాక-రాపాక ఖండ్రిక,

కానూరు - కానూరుఅగ్రహారం [తా]; గుడిపాడు - గుడిపాడు ఖండ్రిక, రంగాపురం - రంగాపురంఖండ్రిక [చిం], పాండువ - పాండువఖండ్రిక, వేండ్ర - వేండ్ర అగ్రహారం [భీ]. ఈ విధముగా ఖండ్రిక అను గ్రామనామాంత్యమును గలిగియున్నవి. ఆయా గ్రామ అనుబంధ సూచితములని భావించిననూ, విజయనగరం జిల్లాలోని భోగాపురం [ఏ], విశాఖజిల్లాలోని ఎలమంచిలి [న] తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ [తా], గుంటూరు జిల్లాలోని చేబ్రోలు [తా] వంటిగ్రామములీ జిల్లాలో యుండుట గమనించదగియున్నది.

ముగింపు

పై వివరణలను అనుసరించి ఈ క్రింది నిశ్చయములకు రావచ్చును. 1. పౌరాణిక పరముగా నేర్పడినట్లు చెప్పబడిన గ్రామనామ కారణపైనము గతకాలము నాటి సాంఘిక జీవనముపై మత సంబంధ విశ్వాసములకుండిన పట్టును తెలియజేసేదిగా ఉన్నది. 2. కళింగాంధ్రములో వలెనే ఈ వేంగి మండలాంతర్గతమైన జిల్లాలో కూడా పూర్వ రాజవంశ పాలక వర్గ ప్రభావము గ్రామనామములపై ప్రగాఢముగ నున్నట్లు కనుగొనబడినది. కాని ఈ ప్రాంతముపై ఏలుబడి సాగించిన రాజ వంశములలో ఒకే పేరు గల రాజన్యులుండుటచే అట్టి గ్రామనామ కారక నిర్ణయ విషయములో ప్రత్యేక శ్రద్ధ వహించవలసి ఉన్నది. 3. ముస్లింపాలనా కాలమున ఏలూరు ఒక సర్కారు కేంద్రమై యుండినప్పటికిని గ్రామనామములపై ఆ ప్రభావము కన్పట్టలేదు. 4. ఈ జిల్లాలో కొంత ఏజెన్సి [మన్యం] తాలూకా ఉన్నది కాని ఆ ప్రాంత గ్రామనామములపై గిరిజన భాషా ప్రభావము లేకుండినది. 5. సంస్థానములు రానిలో ఇరుగు పొరుగు మండలములకు తీసిపోవుగాని సంస్థానాధీశుల నామవాసి గ్రామములకు అంతగా పట్టినట్లులేదు. అయితే, వ్యక్తుల పేర నేర్పడిన 'పాలెము' 'గూడెము' వంటి చరిత్రగతిలో అధునికతను సూచించు గ్రామ నామాంత్యములు గల గ్రామముల సంఖ్య శతస్థానమున నుండుటను బట్టి ఆయా గ్రామములు జమీందారీయుగ... న – తదాశ్రిత ... వర్గ ప్రభావజనితములని భావించుటకు వీలున్నది. 6. ఈ విషయముపై సాగవలసిన భావిపరిశోధన కేవలము శాసన, సాహిత్యాధారములతో సరిపెట్టుకొనక – క్షేత్రవిచారణావసరమును గూడ పరిగణనలోనికి తీసుకొనవలసి యుండుననని ఈ ప్రాథమిక పరిశీలన గుర్తించు చున్నది.

● ధోజ్ఞాపికలు

1. ఎమ్. రామమోహనరావు, వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ 1925-1947, ఎ హిస్టారికల్ సర్వే విత్ స్పెషల్ రిఫరెన్స్ టు రెవిన్యూ ఎడ్మినిస్ట్రేషన్ [ఆంధ్ర విశ్వకళాపరిషత్, వాల్తేరు, 1982] అన్ పబ్లిష్డ్ ఎమ్. ఫిల్. థీసిస్.

2. వై. వి. కృష్ణారావు & ఏటుకూరి బలరామమూర్తి [సం] ఆంధ్రప్రదేశ్ దర్శిని, (విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1976), పు. 1031.

◆ సౌలభ్యము కొరకు తాలూకాల పేర్లు కుందలీకరణములలో సంక్షిప్తముగా పేర్కొనబడినవి. ఆ సంజ్ఞా వివరణ: భీ= భీమవరం; చిం=చింతలపూడి; ఏ=ఏలూరు; న=నరసాపురం: పో=పోలవరం; కొ=కొవ్వూరు; తా=తాడేపల్లిగూడెం; త=తణుకు.

3. మద్రాస్ డిస్ట్రిక్ట్ గజిటార్స్, గోదావరి, 1907.

4. ఈ ప్రకరణమునకును, శాసనములు-గ్రామ నామములు అను ప్రకరణమునకును ప్రధాన అధారములు: 1) కుందూరిఈశ్వర దత్తు, ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, [ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, ద్వితీయముద్రణ, 1979] 2) డా. బూదరాజు రాధాకృష్ణ, ప్రాచీనాంధ్రశాసనాలు [ఆం. ప్ర. సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1971].

5. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశము, ఐదవ సంపుటము [హైదరాబాదు, 1966], పు. 199.

6. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశము, మూడవ సంపుటము [హైదరాబాదు, 1962], పు. 93.

7. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పు. 114.

8. పైది, పు. 22.

9. పైది, పు. 3.

10. పైది, పు. 206.

11. సంగ్రహ విజ్ఞాన కోశము, నాల్గవ సంపుటము, పు. 90.

డా ఎన్. వెంకట రమణయ్య, ది ఈస్టరన్ చాళుక్యాస్ అఫ్ వేంగి, [మద్రాసు, 1950], పు. 65.

12. చూ॥ డా. యస్. యస్. మూర్తి, 'సంఖ్యాకిత ప్రాంతీయ విభాగాలు', భారతి, డిసెంబర్ 1979, పుట 16.

13. డా॥ అర్. సుబ్రహ్మణ్యం, ది గుంటుపల్లి బ్రాహ్మీ ఇన్‌స్క్రిప్షన్ అఫ్ ఖారవేల, [ఆం. ప్ర. గవర్నమెంట్ ఎపిగ్రాఫికల్ సీరీస్ నెం. 3, హైదరాబాద్, 1968], పే. 5.

14. ఇంగువ కార్తికేయశర్మ, 'గుంటుపల్లి గుహల-బ్రాహ్మశాసనములు', భారతి, జూలై 1978, పుట 24 మరియు ఆగస్టు 1978, పుట 27.

15. ఆంధ్రదేశ చరిత్ర భూగోళసర్వస్వము, రెండవ సంపుటము, పు. 2 & 486

16. పైది, పుట 485, 486.

17. పైది, పుట 483.

18. డా॥ బూదరాజు రాధాకృష్ణ, ప్రాచీనాంధ్ర శాసనాలు, పు. 250.

19. ఖండవల్లి లక్ష్మీరంజనం - బాలేందుశేఖరం, 'ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి, (మద్రాస్, 1965) పుట 47.

20. ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట 495-96

21. యస్. ఐ. ఐ. X, నెం. 262, శ. సం. 1140

22. పైది, నెం. 126, శ. సం. 1073.

23. జి. అర్. వర్మ, 'గుడీ-గుంపా' (వర్మన్ పబ్లికేషన్స్, తాడేపల్లిగూడెం, 1974) పుట 22.

24. ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వము, మూడవసంపుటము, పుట 554.

25. పైది, పుట 552.

26. తురగా కృష్ణమూర్తి, 'దాయగజకేశరి ఖండవిల్లి శాసనము', ఎపిగ్రాఫియా ఆంధ్రికా, IV, (హైదరాబాదు, 1975), పుట 106

27.A. ఆం. ప్ర. డి. గ. వెస్ట్‌గోదావరి, పుట 238

27. రెడ్డిసంచిక, పుట 394.

28. భూగోళసర్వస్వము, మొదటిసంపుటము, పుట 155.

29. పైది, మూడవసంపుటము, పుట 36-37, 39. ఆంధ్రభూమి [వారపత్రిక, సికింద్రాబాద్], 21-7-1983, పుట 46.

30. గుడీ - గుంపా, పుట 4.

31. పైది, పుట 53, 55.

32. పైది, పుట 5.

33. డా॥ ఎన్. రమేశన్ [సం] ఆం. ప్ర. డిస్ట్రిక్ట్ గజిటీర్స్, వెస్ట్‌గోదావరి, పు 237.

34. గుడీ - గుంపా, పుట 44.

35. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము, పదవసంపుటము, పుట 462.

36. గుడీ - గుంపా, పుట 57.

37. ఆం. ప్ర. డి. గ. వెస్ట్‌గోదావరి, పు. 233.

38. గుడీ-గుంపా, పు. 35.

39. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశము, ఏడవ సంపుటము పు. 90.

40. ఆంధ్రపత్రిక (దినపత్రిక, విజయవాడ), 13-2-1983, పు. 7-8.

41. ఆంధ్రభూమి (వారపత్రిక, సికింద్రాబాద్), 21-7-1983, పు. 46.

42. గుడీ-గుంపా, పు. 57.

43. యస్. గోపాలకృష్ణమూర్తి, జైన్ వెస్టిజెస్ ఇన్ ఆంధ్ర (హైదరాబాద్, 1963) పు. 38.

44. గుడీ-గుంపా, పు. 21.

45. భారతి, డిసెంబర్ 1979, పు. 57.

46. పైది.

47. ఆం॥ ప్ర॥ డి॥ గ॥ వెస్ట్ గోదావరి, పు. 229.

48. పైది, పు. 236.

49. గుడీ–గుంపా, పు. 17.

50. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పు. 192.

50-A ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి, పు. 70, 76.

51. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పు. 231,

52. గుడీ–గుంపా, పు. 17.

53. రెడ్డి సంచిక, పు. 47. ఆంధ్ర దర్శిని (విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1959) పు. 153.

54. నరసింహనామధేయులు ఏలూరు తాలూకాలో విస్తరించుకొని యుండిన వల్లూరు జమిందారులలో నిరువురు కలరు.

55. గుడీ–గుంపా, పు. 13.

56. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పు. 8.

57. పైది, పు. 2.

58. గుడీ–గుంపా, పు. 14.

[గ్రామనామముల జాబితా వ్రాయుటలో సహాయపడిన కుమారి శ్రీరంగం రత్నకుమారికి రచయిత కృతజ్ఞుడు.]

పుప్పొడి చినుకులు

"సౌంధ్యశ్రీ"

[భారతి, ఆంధ్రపత్రిక రుధిరోద్గారి ప్రత్యేక సంచికలలో ప్రచురితమైన పుప్పొడి చినుకుల మొదటి సర్గ ఈ రెండు పద్యాలతో సమాప్తం. మొదటి సర్గ పూర్తిగా పృధివీ సూక్తానికి సంబంధించినది. "యస్యాం సముద్ర ఉత సింధు రాపో ; యస్యా మన్నం కృష్ణయః సంబభూవుః ; యస్యామిదం జి న్వతి ప్రాణ దేజత్ ; సా నో భూమిః పే యే దధాతు."]

పద్యం : 9

నేల ధరించిన ఈ మొక్కలు
కాండాత్కాండ ప్రరోహ కృతజ్ఞతా స్వరూపాలు
అడవిదారుల్ని అంటి
తెరలు తెరలుగా పొరలే పుప్పొడిగాలి కల్లోలంలో
కాలాన్ని
శిల్పంగా మలుస్తూ
మానవజాతికి మహత్తర గీతికల్ని పత్రాలమీద చిత్రించి
మంగళాశాశనం చేస్తాయి....

క్షణాలు దేవతలు
నీలో నాలో కదిలే ప్రత్యక్షరానుభూతులు
ఆత్మ కళ్లు తెరుచుకుంటే
ప్రత్యక్షానుభూతులు....

చెట్టుమీదికాయ
మొక్కమీది పూవు
స్వచ్ఛందంగా ఆనందం పంచుతోంది
ధరించు మిత్రమా....

మట్టి
విత్తులోనే వియత్తలమంటే
విషయాన్ని ఉంచుతోంది
గ్రహించు మిత్రమా....
క్షణాలు దేవతలు
అదృశ్యం కాకుండా కాపాడుకో.... !

పద్యం : 10

ఒడిలో
జల తరంగిణిని సంగతిస్తూ
అమృతశీతల స్పర్శానుభూతి పతాకాన్ని పవనాగ్రాని
కెత్తినప్పుడు
ఆ తప స్నానంతో
అక్షయ కాంతి కిరణ జాలాన్ని
అంతరంగవేదిపై వెల్గు వెల్లువ తోరణాలుగా మలచు
కున్నప్పుడు
చంద్రా తపస్నాతమై
నవజీవన వనమూలిక మొలిపించిన
విమృగ్వరి వసంత కుసుమాకర నికుంజ మైనప్పుడు
మట్టీ....
నీ మౌన యోగ పూర్ణ శబ్ద సంకాశంలో
మట్టీ....
నీవు కన్నపూలగుండె సందేశంలో
ఆ పుప్పొడి చినుకుల్లో

విన్నానమ్మా ఓమ్[1]
విన్నానమ్మా హూమ్[2]
విన్నా అమీన్[3]
విన్నా ఆమెన్[4]
విన్నా విన్నా ఇంకావిన్నానమ్మా ఆడమ్[5]

1. వైదిక శబ్ద బ్రహ్మం
2. టిబెటన్ల శబ్ద బ్రహ్మం
3. మహ్మదీయ శబ్ద బ్రహ్మం
4. క్రైస్తవుల, ఈజిప్షియన్ల, రోమ్, గ్రీక్, జ్యూస్ శబ్దబ్రహ్మం
5. పారశీక శబ్ద బ్రహ్మం ...

శ్రీ ఆర్. వి. ఎస్. సుబ్బారావు

హిందీ - తెలుగు కవుల భావ సమన్వయము

ప్రాచీనులు గాని, అర్వాచీనులు గాని, మహాత్ములైన వారి భావములు సార్వకాలికములు, సార్వదేశికములు. అవి సమస్త ప్రజలకు అనువర్తించునవై, భావసామరస్యము కలిగియుండును.

ఉత్తరభారతమున, తులసీదాసు, సూరదాసు, కబీరు, బిహారి, రహీమ్ మున్నగు భక్తి కవులెందరో ప్రసిద్ధి వహించి, సాహిత్య వినువీధిలో ధృవతారలై వెలయుచున్నారు. ప్రజల క్షేమముకై ఎన్నియో ఉపదేశములు చేసిరి. అట్లే ఆంధ్ర దేశమందు కూడ పోతన, త్యాగయ్య, వేమన, నన్నయ, తిక్కన, శ్రీనాధుడు, రామదాసు మొదలగు - ఉద్దండ - పండితులు, భక్త కవులెందరో జన్మించి, ఈ తెలుగు నాటను పునీత మొనరించినారు. వారు చెప్పదలచిన విషయములు, చెప్పెడి విధానములో మార్పున్నను, భావములు సన్నిహితములుగనే ఉండును. తమ రచనల ద్వారా ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేసి, తమకొక ప్రత్యేక స్థానమును వెలయించుకొనిన భక్తరామదాసుగారి రచనలలో - తులసీదాసు మొదలగు వారి రచనలలోని భావములు కొన్ని సమన్వయము నొందుచున్నవి. అట్టి ఆణిముత్యము లెన్నియో వారి భావ జలధిలో - తరచి చూచిన కొలది కనుపించుచునే ఉండును. అవి అనంతములు - ఉదాహరణకై కొన్నిటిని పేర్కొందును.

రా మ దా సు - తు ల సీ దా సు

ఉత్తర భారతమున - హిందీసాహిత్య వినువీధిలో 'తులసీదాసు' - పర్వచంద్రునివలె భాసించుచుండగ, ఆంధ్రావనిలో సాహిత్య గగనమున 'రామదాసు' ధృవతారయై సుస్థిరమైన కీర్తి సముపార్జితుడైనాడు.

హిందీ సాహిత్యమున - తెలుగువారి యదృష్టమో యనునట్లు లభ్యమైన కవిత్రయము వారి భారతము వంటిది. ఇంతవరకు ప్రసిద్ధినొందినట్లగుపించదు. కానీ-భాగవతము విషయమున ఇరువురి పంటలు పండినవి. సూరదాసు - పోతనలు సముజ్జీలై - ప్రజల హృదయ సౌధములలో సుస్థిరనివాస మేర్పరచుకొనినారు. ఇక రామాయణము విషయమున - తులసీదాసుగారి 'రామచరిత మానస్' - వినయపత్రిక మొదలుగునవి అసమానములై విరాజిల్లుచున్నవి. కానీ రాముడు - తెలుగువారికి ఇలవేల్పైనాడు. 'శ్రీరామ' లేనిదే - కావ్యారంభమేలేదు. రామచరిత్ర తెలుగువారికి ఆదర్శము. భాస్కర రామాయణము. మొదలగునవి ఉన్నను - రామచరిత మానసమునకున్న ప్రచారము జనబాహుళ్యమున కనుబడదు. కాని, భక్తకవులగు-పోతన, త్యాగయ్య రామదాసులవంటివారు గావించిన రామగుణ గానము తెలుగునాట - ప్రతినోట నిలచిపోయినవి. ప్రతి హృదయమందును - ప్రతిధ్వనించు చున్నవి. భక్తకవులు చెప్పెడి రీతులు వేరైనను, భావమొకటిగనే యుండును. 'నదీనామ్ సాగరో గతిః' అని కదా! దారులు వేరైనా, గమ్యస్థాన మొకటే. భక్తకవులగు రామదాసు - తులసీదాసుల భావము లనేకములు సామరస్యము నొందుచుండుట సహజమే.

భక్తి స్థిరపడుటకు-ముందుగా ఆత్మ పరిశోధన. అవసరము. తెలిసియో, తెలియకో - మానవుడెన్నియో పాపములొనరించి యుండుట సహజము. వాటిని గుర్తించి, పశ్చాత్తాపము నొందిన, పరమాత్మ చేఱువ యగును. — తులసీదాసు

"అబ్ కీ నసానీ, అబ్ న నసైహౌఁ,
రామకృపా, భవనిసా సిరానీ, జాగే-ఫిర్ న డసైహౌఁ" ॥

ఇంతవరకు దుష్టమార్గమున నడచిన నా జీవితము, రామచంద్రుని కృపా కటాక్షముచే-సంసారమనెడి మత్తును వదలిదిన. ఈ మాయ ఇటుపై తిరిగి నన్ను కాటు వేయదు - (ఆవరించదు) - అని తులసీదాసును. ఇదే భావనలో రామదాసుగారు కూడ -

"చేసితి ఘోరకృత్యములు, చేసితి భాగవతాపచారముల్,
చేసితి నన్య దైవముల జేరి భజించిన వారి పొందు, నే-
జేసిన నేరముల్ దలచి చిక్కులు బెట్టకుమయ్య, యయ్య, నీ-
దాసుడ నయ్య, భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!" (49)

నే ననేకములైన పాపములుజేసి యున్నాను. కానీ ఓరామా! నిన్ను శరణుబొంది, నీ దాసుడనని నమస్కరించుచున్నాను. నన్ను మన్నించి, ఈ సాంసారిక బాధలనుండి నన్ను విముక్తుని చేసి, నీ దరికి చేర్చుకొనుమని, రామదాసు వేడుకొనును.

మరి ఇన్ని పాపములు చేసిన విన్నెటుల మన్నించవలె నందువేమో! మేము పతితులము. నీవో - పతితపావనుడవు. మా వంటి పాతకుల నెందరినో నీవు పూర్వముద్ధరించి యున్నావు. నీ కీర్తిని, నీ భక్తులు, దేవతలు ఎల్లప్పుడు కొనియాడుచునేయుందు రనుచు, తులసీదాసు, రామదాసులు

"బిరద్ గరీబ నివాజ్ - రామకో,
గావత్ బేద్-పురాణ్, సంభు, శుక్, ప్రగట్ ప్రభావు నామ్‌కో-
ధ్రువ, ప్రహ్లాద్, బిభీషన్, కపిపతి, జడ్,
పతంగ్, పాండవ్, సుదామకో -
లోక్ సుజన్ పరలోక సుగతి, ఇన్హియేఁ
కోహైరామ్ కామ్‌కో॥ (వినయ్-99)

పతితపావనుడవని, ఆర్తులపాలిటి పెన్నిధివని, వేదములు, పురాణములు, ఈశ్వరుడు, నీప్రభావము తెలిసికొని, నీచే ఉద్ధరింప బడిన ధ్రువుడు, ప్రహ్లాదుడు, విభీషణుడు, పాండవులు, కుచేలు డేకాక, పక్షి జంతు, జడములైన - జటాయువు, సుగ్రీవుడు, రాతిరూపు వహించిన - అహల్యకూడ నీ ప్రభావమును వేనోళ్ళ చాటినారు. కనుక నన్ను తప్పక కాపాడవలసినదని తులసీదాసను చుండగ, రామదాసు —

"పాతకులైన మీకృపకు పాత్రులుకారె, తలంచిచూడ, జ -
ట్రాతికిగల్గె పావన, మరాతికి రాజ్యసుఖంబుగల్గె, దు -
ర్జాతికి బుజ్యమబ్బె, గపిజాతి మహత్వమునొందె గావునన్,
దాతవ యెట్టివారలకు, దాశరథీ కరుణాపయోనిధీ" -

రాయి-రమణి అయినది. శత్రువైన విభీషణునకు లంకా సామ్రాజ్యము లభించినది. శబరి మొదలగువారు తరించిరి. వానర జాతికి-ఎనలేని మహత్వమబ్బినది. కనుక - ఎటువంటి వారైనను నీ దయకు పాత్రులగుచుండగ, నన్ను మాత్రమేల కాపాడవని - రామదాసు రాముని ప్రార్థించును.

సులభసాధ్యుడైన రాముడుండగా, ఇతర దేవతలను ప్రార్థించుట-ఆకాశ గంగను వదలి, వడగండ్ల నీళ్ళకై పరుగెత్తుట, పంచదారను వదలి వేపాకుతినుటకు ఆశపడునట్లగునని - తులసీదాసు, రామదాసు లందురు. రాముని మించిన దేవుడు లేడని - వారి "అనన్య భక్తి"ని ప్రదర్శించుచు - వారిరువురు - ఈ విషయమును పదిమందిముందు చాటి చెప్పెదమందురు.

ఎప్పుడో - పెద్దైన పిదప భగవంతుని సేవించవచ్చునను కొనుట పొరబాటని - ప్రాణా లనిత్యములని - అంత్యసమయమున వీలుకాక అప్పుడు బాధపడుటకంటె, ఇప్పటినుండియే భగవంతుని సేవింపవలెనని-వీరువురు వివిన్న రీతులలో తెల్పెదరు.

"మన్ పఛితైహై అవసర బీతే,
దుర్లభ్ దేహపాయి, హరిపద భజు,
కరమ్ బచన్ అరు హీతే,
సహసబాహు, దసబదన్, ఆదిన్నృప బచే నకాల్ బలీతే,
హమ్-హమ్ కరి, ధన, ధామ్, సవాఁరే,
అంత్ చలే ఉఠి రీతే"— (వినయ్-198)

అవకాశము చేయజారినపిదప బాధపడి - ప్రయోజనముండ బోదు. మహాబలవంతులు, అమోఘ బలసంపన్నులైన సహస్రబాహుడగు కార్తవీర్యార్జునుడుగాని, దశకంఠుడగు రావణుడుగాని, చావునుండి తప్పించుకొనలేకపోయినారు. కాలపురుషుని బలము ముందు వీరి బలమెంత ! నాది-నాదని కూడబెట్టినదేదియు చివరకు మనవెంటరాదు. అందుచే దుర్లభమైన మానవజన్మనొంది, శ్రీహరి నాశ్రయించి, శాశ్వతమైన ముక్తిని బొందుటే మానవాళికి శ్రేయస్కరమని - తులసీదాసనును.

"ముప్పున గాలకింకరులు ముంగిట వచ్చినవేళ, రోగముల్,
గొప్పరమైనచో గఫము కుత్తుక నిండినవేళ, బాంధవుల్,
గప్పినవేళ, మీ స్మరణ కల్గునొ గల్గదొ, నాటికిప్పుడే,
తప్పకచేతు మీ భజన, దాశరథీ కరుణాపయోనిధీ"

అంత్యకాలమున రోగములు ముంచుకొచ్చి, చుట్టూ బంధువులుచేరి గొడవపెట్టుచుండగ, గొంతుకకు కఫము చుట్టుకొని మాటరానివేళ, యమకింకరులు ఎదుట ప్రత్యక్షమై యుండగ - ఓ రామా! నిన్ను స్మరించవలెనని తోచకపోవచ్చును-తోచినా వీలు గాకపోవచ్చును. అందుచే నీపవిత్రనామస్మరణను ఇప్పటినుండియే చేయుచుండెదనని_రామదాసనును.

రాముని పవిత్ర నామ మహిమను వర్ణించుటలో తులసీదాసు-రామదాసులిద్దరు — ఒకటగుదురు —

"తులసీ'రా'కె కహిత్ హీ నికసత్ పాప్ పహాడ్,
ఫిరి, భీతర్ నహిఁ ఆవతే దేత్, 'మ'కార్, కివాడ్"

'రామ'–లోని 'రా' అను అక్షరముచ్చరించుట తోడనే, కొండలవంటి పాపములు బయటకు వెళ్ళుచున్నవి. అవి తిరిగి లోపలకు ప్రవేశించకుండుటకై – 'మ' తలుపువలె వారించు చున్నదని – తులసీదాసను – రామదాసుకూడ —

"'రా' కలుషంబులెల్ల బయలం బడద్రోచిన, 'మా' కవాటమై
దీకొని ప్రోచు, నిక్కమని ధీయుతులెన్న, దదీయ వర్ణముల్,
గైకొని భక్తిచే నుడువ గానరుగాక, విపత్పరంపరల్
దాకొనునే, జగజ్జనుల, దాశరథీ కరుణాపయోనిధీ॥" 26

రామదాసుగారు కూడ తులసీదాసువలెనే, 'రామా' యను పదములో – 'రా' అను అక్షరమే–సమస్త పాపములను బయటకు నెట్టివేయుచుండగ, 'మా' అను అక్షరము కవాటమై, అవి తిరిగి లోపలకు రాకుండ అడ్డగించుననుచు, ఇట్టి మహత్తరమైన రామ నామ మహిమను గుర్తించి మానవులేల జపించి, తరింపరు? అట్టి వారిని ఆపదలు దరిచేరలేవుకదా ! అని – రామ నామము జపింపనివారి బాగుకై రామదాసు వ్యధచెందును. మహాత్ములు, 'తమకుఁదారె పరహితాచరణమతులు' గదా !

రామదాసు – బిహారీ

పరమత ప్రభావము వలన హిందూదేశములో, ఆస్తికత కుంటువడి, ధర్మమునకు గ్లాని కలుగుచుండగా, దేశములో వివిధ ప్రాంతములలో భక్త కవులుద్భవించి, తమ రచనలద్వారా ప్రజలను, పతనోన్ముఖులైన వారిని, కాపాడిరి. ఆస్తికతను పెంపొందించిరి. నిరీశ్వర వాదమును ఖండించిరి. ప్రజల భావములను భిన్నత్వమునుండి, ఏకత్వమునకు మరల్చి, అనన్య భక్తిని, ప్రేమ భక్తిని నెలకొల్పిరి. అట్టివారిలో ఉత్తరభారతమున– బిహారి – ఒకరుకాగా, ఆంధ్రప్రాంతమున రామదాసు గారొకరై ప్రసిద్ధి వహించిరి. ఆశయములు ఒకటైన వారిలో – భావములు కూడా సన్నిహితములగుట సహజమే కదా !

జీవితములోని – లౌకిక సుఖములు నశ్వరములైనవని తెలిసి కొని, శాశ్వత సుఖప్రదుడు – భగవంతుడొక్కడేయని గుర్తించి, ఆతనినే త్రికరణశుద్ధిగ శరణువేడిన – తప్పక రక్షించి కాపాడు నని తెలియజేయుచు, దానికి అచంచలమైన విశ్వాసమవసరమని రామదాసు – బిహారీలు ఒకేతీరున తెలియజేయుచున్నారు. –బిహారీ

"జిన్ దిన్ దేఖే వే కుసుమ్, గయీ సూ బీత్ బహార్,
అబ్ అలీ రహీ గులాబ్ మే, అపత్ కటీలీ డార్."

వికసించిన గులాబీపువ్వుల మకరందము నాస్వాదించిన తుమ్మెదలు, అవి వాడిపోయినను, తిరిగి వికసించు సమయము (ఋతువు) వచ్చునన్న ఆశతో, ఆకులు కూడా రాలిపోయి, ముళ్ళు మాత్రమే మిగిలిన ఆ గులాబీ కొమ్మనే ఆశ్రయించుకొని యున్నవి. (అటులనే, ఎన్ని కష్టములు సంప్రాప్తించినను, భగవంతునిపై అవిచ్ఛిన్న విశ్వాసముండవలెనని) బిహారీ అనుచుండగ– రామదాసు–

"జీవన మింక బంకమున జిక్కిన మీను చలింప కెంతయున్,
దావున నిల్చి జీవనమె దద్దయు గోరువిధంబు చొప్పడం,
దావలమైనవాని గుఱి దప్పనివాడు తరించు వాడయా,
తావక భక్తియోగమున దాశరథీ కరుణాపయోనిధీ॥ 94

నీళ్ళెండిపోయి, బురదమాత్రము మిగిలియున్నను, చేప ఆ మడుగునందే, తిరిగి నీరువచ్చు నన్న ఆశతో ఎదురుచూచు నట్లుగ, కష్టము లెదురైనను, చలింపని భక్తితో ఓ రామా ! నిన్నే నమ్మి యున్న వాడు తప్పక తరించగలడని రామదాసు గారు నొక్కి చెప్పును,

అఘటన, ఘటనా సమర్థుడగు భగవంతునకు సాధ్యము కానిదిలేదు. శరణు కోరినవారి పాపములను హరించి, వారిని పవిత్రుల నొనరించుట వాని నైజగుణము. ఇట్టి సంఘటనలనేక ములు జరిగియున్నవని – రామదాసు, బిహారీలు తెల్పెదరు –

"తు యహా బిరియా నహీఁ ఔర్ కీ, తూ కరియా వహ్ సోధి,
పాహన్ – నావ్ చఢాయ్ జిన్, కీన్హే పార్ పయోధి॥"

రాళ్ళను నావలవలె నీటిపై తేలించి, సముద్రమును దాటించిన (ఓ రామా) నీకంటె నన్ను భవసాగరము దాటించి, రక్షింపగల సమర్థు డెవ్వరని – బిహారీ భగవంతుని సూటిగా ప్రశ్నించును. దీనినే భంగ్యంతరముగ – రామదాసు –

"చరణము సోకినట్టి శిల జవ్వనియై చనఁగ అక్కజంబె, నీ
స్థిరముగ నీటిపైఁ గిరులు దేలిన దొక్కటి వింతగాని, మీ
స్మరణ దనర్చు మానవులు, సద్గతి జెందిన దెంత వింత, యీ
ధరను, ధరాత్మజా రమణ। దాశరథీ కరుణాపయోనిధీ॥"

ఓ రామా! నీ కాలు తగిలి, రాయి – రమణిగా మారుటొక వింత గావచ్చును. నీ పేరు రాసినంత మాత్రమున–రాళ్ళు నీళ్ళపై తేలుట వేరొక వింతగావచ్చును. కానీ–సదా నిన్నే స్మరించు మానవు లకు సద్గతులు కలుగునన్న దానిలో వింత ఏమాత్రము లేదు. తప్పక తరించెదరన్న భావమును–రామదాసు రూఢిగా తెల్పును.

భగవంతుని సేవలో నిరవధికమైన సుఖమున్నదని, ఆ ఆనందము చవిచూచినవారికి సర్వము సమకూరునని, వేరొకటి కోరదగినది యుండదని వీరిరువురు ముక్తకంఠముతో తెల్పెదరు. బిహారీ-

"మన్ మోహన్‌సే మోహకరి, తూ ఘనశ్యామ్ విహరి,
కుంజ బిహారీ, సౌ బిహారి, గిరిధారి-ఉర్ ధారి॥"

మనోహరుడైన ఆ కృష్ణునే ప్రేమించుము. ఆ నల్లనివాని రూపే సదా ధ్యానించుము. ఆ బృందావన సంచారితోనే-ఊహలలో విహరింపుము. ఆ గోవర్ధన ధారినే మనసున ధరించి యుండుము. ఇంతకన్న కావలసినదేమున్నదని బిహారీ చెప్పుచుండగా, రామదాసు-

"అండజవాహ! నిన్ను హృదయంబున నమ్మినవారి పాపముల్,
కొండలవంటివైన వెస గూలి నశింపకయున్నె? సంత తా
ఖండల వైభవోన్నతులు గల్గక మానునె? మోక్షలక్ష్మి కై
దండ యొసంగకున్నె తుద? దాశరథీ కరుణాపయోనిధీ॥" 29

ఓ గరుడగమనా! నిన్ను హృదయములో త్రికరణ శుద్ధిగ నమ్మినవారి పాపములు కొండలంత ఉన్నమా, నశింపకుందునా? వానికి ఇంద్రభోగములు సమకూరవా? చివరకు మోక్షలక్ష్మి సంప్రాప్తింపక పోవునా? అని తన అచంచల విశ్వాసమును ప్రకటించును.

"అనన్యాశ్చింతయంతో, మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమం వహామ్యహమ్"

అనన్యభక్తితో, ఇతరమును ధ్యానింపక, నాయందే యనురక్తులై యుండువారి యోగక్షేమములను నేనే వహించుచుండెద నన్న గీతావాక్యములిట స్ఫురించుచున్నవి.

రామదాసు - రహీమ్

రహీమ్, అక్బర్ ఆస్థాన కవులగు - నవరత్నములలో నొకరు, బహుగ్రంథకర్త. సూక్తులు - లోకోక్తులు వీరి పద్యములందు చక్కగా ఉపయోగింపబడి, హృదయాకర్షకములై యుండును. మహమ్మదీయుడైనను, పరమత సహనము కల్గిన విశాల హృదయుడు, దానశీలి. జీవితమందలి వివిధ పరిస్థితులను అవగాహన మొనరించుకొని, వానిని సులభశైలిలో నీతిపద్యముల రూపమున ప్రజల కందించి, వారి హృదయాలలో స్థావర మేర్పరచుకొనెను.

తెలుగువారిలో రామదాసు భక్తకవి. సంగీత, సాహిత్యములందు సవ్యసాచి. [భద్రాచలము పైనున్న రామాలయ పునరుద్ధరణకై తహసిల్ దారుగా ప్రభుత్వ సొమ్ము వినియోగించి, జైలుపాలైన మహనీయుడు. వాని బాధలను తీర్చుటకై శ్రీరాముడే స్వయముగా వచ్చి, బాకీ చెల్లించి, రామదాసుకు బంధవిముక్తి కల్గించెను. రామదాసు సంతోషమునకు మేరలేదు. శ్రీరాముని అనేకరీతుల కీర్తించెను.] భద్రాచల రామదాసు కీర్తనలు, దాశరథీ శతకములు వీని ప్రసాదములే. గోపన్న రామదాసయ్యెను. తన రచనల ద్వారా ప్రజలలో భక్తిభావమును పెంపొందించెను. నిర్గుణోపాసనను త్రోసిరాజని, సగుణోపాసనకు ప్రాతినిధ్య మిచ్చెను. భిన్నత్వము నుండి - ప్రజలభావములను ఏకోన్ముఖము గావించి 'అనన్యభక్తి'ని బలపరచెను. తెలుగువారిలో పోతన పద్యములవలె రామదాసు పద్యములుకూడ ప్రతినోట ప్రతిధ్వనించినవి. త్యాగరాజు కీర్తనలకు, రామదాసు కీర్తనలు అనుయాయులైనవి. దృష్టాంత పూర్వకముగా వీరి రచనలు సాగినవి.

మహానుభావులైన రహీమ్, రామదాసుల భావములలో సమన్వయము గోచరించుట సహజము కదా!

గొప్పవారు దీనుల అవస్థలను చూచి సహించలేరు. వారు స్వభావముగనే పరహితాచరణమతులై ఉందురు. వారి కరుణకు చుట్టరికములతో పనిలేదు. హెచ్చుతగ్గుల తారతమ్యములేదు. పిలచి వెంటనే సహాయపడెదరు. అందుచేతనే వారు మహాత్ములైనార రామదాసు-రహీమ్‌లు తెల్పెదరు.

"బడే దీన్ కో దుఃఖ్ సున్, లేతే దయా ఉర్ ఆని,
హరి హాథీసో, కబ్ హుతీర్, కహు 'రహీమ్' పహచాని"

గొప్పవారికి దీనరక్షణ సహజము. హరికి, కరికి - ఏమి పరిచయమున్నది? అది పిలువగనే హరివచ్చి కరిని రక్షించెనుకదా అని రహీమనును. రామదాసు-

"దాసిన చుట్టమా శబరి? దాని దయామతి నేలినావు, నీ
దాసుని దాసుడా గుహుడు, తావక దాస్య మొసంగినావు,
జేసిన పాపమో, వినుతి సేసిన గావవు, కావుమయ్య, నీ
దాసులలో నేనొకడ, దాశరథీ కరుణాపయోనిధీ॥"

శబరి నీకు దూరపు చుట్టముకాదు, గుహుడు కనీసము నీ సేవకులకు కూడ సేవకుడుకాడు. కడజాతివారన్న భేద భావన నీకు లేదు. వారి సేవలను స్వీకరించి, వారిని తరింప చేసినావు. కానీ నీ దాసుడని చెప్పుకొనినా, నన్నింకను ఎందులకు రక్షించి కాపాడవని రామదాసుగారు భగవంతుని ఎడ భక్తునికిగల చొరవ, హక్కులను ప్రదర్శించును. భక్తపరాధీనుడుకదా భగవంతుడు.

గొప్పవారి యనుగ్రహముండిన చాలును. సామాన్యులు కూడ అసాధ్యములగు పనులుచేయగలరు. అందుచేతనే భక్తులు భగవదనుగ్రహమునకు పాటుపడెదరు. గొప్ప పనులు చేయుట వారి ఘనత చాటుకొనుటకుకాదు. భగవద్భక్తిలోని మహిమను, భగవంతునికి భక్తులయెడగల అనురాగమును చాటుటకే! ఈ విషయమును రామదాసు, రహీములు భిన్న రీతులలో బహిర్గత మొనరించెదరు. బిహారీ —

"అనుచిత్, ఉచిత్ 'రహీమ్' లఘు, కరహి బడనికే జోర్,
జ్యోం, ససికే సంయోగ్‌తే, పచవత్ ఆగ్ చకోర్॥"

గొప్పవారి ఆశ్రయానుగ్రహములచే, సామాన్యులుకూడ అసంభవమనిపించు పనులు చేయగల్గుచున్నారు. చంద్రుని ఆశ్రయించుట వలన చకోరములు (నిప్పుకోళ్ళు) నిప్పునుకూడ తిని జీర్ణించుకొన గలుగుచున్నవని రహీమనును. (ఇది ఉత్తరాదివారి సాంప్రదాయము.) మరి, రామదాసన్ననో —

"కోతికి శక్యమా! యసురకోటుల గెల్వను, గెల్చెఁబో, నిజం
బాతని మేన శీతకరుఁడేట దవానలుఁ డెట్టి వింత! మా
సీత, పతివ్రతా మహిమ, సేవకు భాగ్యము, మీ కటాక్షమున్
ధాతకు శక్యమా పొగడ? దాశరథీ కరుణాపయోనిధీ॥" 82

ఒక వానరుడగు హనుమంతుడు సముద్రముదాటి, దేవతలను కూడ జయించిన — లంకలోని రాక్షసులను ఒక్కడే జయించ గల్గుటేమి? ఒకవేళ గెల్చినను, అతని తోక కంటించిన అగ్ని, అతనిని కాల్చక చల్లగా ఉండుట మహాశ్చర్యముకదా? వీనికి శక్తి సామర్థ్యము లెక్కడనుండి వచ్చినవి! అవి సీతామతల్లి పాతివ్రత్య మహిమ వలనను, బ్రహ్మకుగూడ దురవగాహమైన నీ యనుగ్రహము వలనను, నీ సేవకుని భాగ్యము పండినదని రామదాసుల భాగ్యమును రామదాసు పారవశ్యముతో ప్రకటించును.

మనకు కలిగిన ఆపదను గుర్తించి, దానిని నివారింప సమర్థుడగు వానిని నాశ్రయించిననే ఫలితముండును. లేనిచో, చెవిటికి శంఖమూదినట్లు వ్యర్థమగును. ఈ భావమును రహీమ్ —

"దివ్యదీనతాకే రస హిఁ కా జానే జగ్ — అన్‌ధు (అన్ధ)
భలీ విచారి దీనతా, దీన బన్ధుసె బన్ధు॥"

దీనుల కేర్పడిన బాధలను, వాటిలోని గొప్పదనమును, ఈ గుడ్డిలోక మేమి తెలిసికొనగలదు? మానవులలోని మహిమను గుర్తించి, ఆర్తులైన వారి కష్టములను తొలగించ గలిగినది ఆ భగవంతుడొక్కడే! అసమర్థులైన ఈ లోకులను నమ్ముకొని చెడుటకంటె, ఆ ఆపద్బాంధవునితోనే సంబంధము పెంచుకొనుట వివేకవంతుల లక్షణముకదా! అని రహీము అనును. రామదాసు వాని విధానములో ఇట్లనును —

"సరసుని మానసంబు, సరసజ్ఞుఁ డెఱుంగును ముష్కరాధముం,
డెఱిఁగి గ్రహించువాఁడె, కొల నేకనివాసముగాఁగ దర్దురం
బరయఁగ నేర్చునెట్లు; వికచాబ్జ మరందరసైక సౌరభో
త్కరము మిళింద మొందుక్రియ, దాశరథీ కరుణాపయోనిధీ॥" 95

సరసుని మనోగత భావములను సాటి సరసుడే గ్రహింప గల్గునుగాని, విరసుని కవగతము కావుకదా! పూర్ణ వికసితమై, తన మకరందమును, పిల్లవాయువులతో పద్మములు వ్యాపింపజేయుచుండగ, వాటి సువాసనను గాలిలో ఎక్కడో ఎగురుచున్న తుమ్మెద గ్రహించి వాటిపై వ్రాలి తేనెను గ్రోలగల్గుచున్నదికాని ఆ కొలను లోనే ఉన్న కప్ప ఆ విషయమునే గ్రహింపలేకున్నదిగదా! అని అనుచు రామదాసు —

"గురుతరమైన కావ్యరసగుంభన కబ్బురమంది ముష్కరుల్,
సరసులమాడ్కి సంతసిలఁజాలుదురోటు! శశాంకచంద్రికాం
కురముల కిందుకాంత మణికోటి స్రవించినభంగి, వింధ్య భూ
ధరమున జాలునే శిలలు, దాశరథీ కరుణాపయోనిధీ" (8)

మహా కావ్యములోని రసమాధుర్యమును సరసులైనవారు గ్రహించి ఆనందించునట్లు—మూఢులకది అశక్యమగు చున్నది కదా! పున్నమినాటి చంద్రకిరణాలకు చంద్రకాంత మణులు కరుగినట్లు, వాటికంటెను ఆకారములో పెద్దవియే యైనను, వింధ్య పర్వతముమీది బండరాళ్లు కరుగలేవు. అందుచేతనే తన కావ్యమును నరపరము కాకుండ, నారాయణ పరము గావించుచున్నానని రామదాసు విన్నవించుకొనును.

చిలికినకొలది వెన్న, ఇటువంటి ఆణిముత్యములు తరచిన కొలది లభించుచునే యుండును.

శుభం భవతు.

కొండలు

అవి కొండలు
అణువణువు నిండిన బండలు
స్పందన లేని గుండెలకు
ప్రతిఫలించే బింబాలు
కాని
వాటి గుండెల మాటున
ఎన్నెన్ని వనమూలికలు
వాటి కండల చాటున
ఎన్నెన్ని కళాఖండాలు
అయితే !
వాటి తనువులు జ్వలిస్తే
లావాలే స్రవిస్తాయి
వాటి మనసులు ద్రవిస్తే
జీవనదులే ప్రవహిస్తాయి

ఇంకా
మహావృక్షాలు సైతం
వాటి నెత్తిమీద మొలుస్తాయి
మహామునులు సైతం
వాటి మునుగుల్లో వసిస్తారు

ఆ కొండలు ఎందరికో
కూడుగుడ్డ పెడతాయి
ఆ బండలు ఎందరికో
భగవంతులై నిలుస్తాయి

అయినా వాటికేం తెలుసు
అవి కొండలు
ప్రపంచానికి కొండంత
అవే అండలు.

(ఆ) విరి కవితలు

నా
మానస విరి తోటలో పూచిన
ఎన్నెన్నో భావాల పుష్పరాశులు
సమాజ కలగూర గంపల్లో లాగ
సర్వస్వం కలసిపోయి వున్నాయి
నేను
వాటి సౌరభాన్ని ఆఘ్రాణించలేక పోతున్నాను
వాటి రూపాల్ని తిలకించలేక పోతున్నాను
వాటి అందాల్ని స్పృజించలేక పోతున్నాను
వాటి భావాల్ని అందుకోలేక పోతున్నాను

అందుకే
ఏ స్వభావంతో
ఏ స్వభావం కలుస్తుందో చూశాను
ఏ జాతికి
ఏ జాతి చెందుతుందో ఆలోచించాను
విడివిడి గా
విరి కవితల్ని ఏర్చికూర్చాను
అభ్యుదయ కవిత ఒక వైపు
ఆలోచన్లు చిందిస్తుంటే
విప్లవ కవిత ఒక వైపు
అవిరులు చిందిస్తోంది.

శ్రీ తమ్మిశెట్టి రామారావు

కలగూరగంప

అహోబలము - వేదాద్రి - యాదగిరి

మా తండ్రిగారు విద్యారణ్య పంచానన విద్యా వాచస్పతి కళానిధి శ్రీమాన్ (కీ. శే.) విక్రాల రామచంద్రాచార్యులవారు సుమారిప్పటికి అరువదియేండ్లనాడు మూడవసారి భూప్రదక్షిణము వారి తల్లిగారు (మా నాయనమ్మగారు), మా తల్లిగారు, పండిత శ్రీమాన్ మాయన్నగారు, శ్రీమాన్ మా మేనమామగారు, నేను ఇందఱితోడ సలిపిరి. కాని యీ యాత్ర అప్పుడు శ్రీమాన్ మా తండ్రిగారి కెక్కువ జబ్బుచేసి వారు చెప్పుచున్నను మా యజ్ఞానమువలన హరిద్వారమువరకేసాగి యటనుండి వెనుకకు మఱల వలసి వచ్చెను. అహోబలములో కొండలపైన ఏడుగురు నరసింహులు కొండక్రింద యిద్దఱని నాకు జ్ఞాపకముండి యీ విషయము నెఱుంగఁ గోరి యెచ్చట నుండునా? యని గ్రంథములు తిరుగ వేయ (చదువ) నారంభించితిని. చివరకు మా తండ్రిగారే మొదట భూప్రదక్షిణము సలుపుచు రచించిన "దివ్య దేశాలయవిశేషములు" అను గ్రంథముఁ జూచితిని. అందు కొంత విరివిగ నున్నది కాని అచట ఆ నవనారసింహు లేర్పడిన కారణ మేమి? వారివారి కథలేమి? యను నా సందేహము తీరలేదు. తెలుఁగు బాసయందు ఎఱ్ఱాప్రెగ్గడ విరచించిన లక్ష్మీనృసింహావతార మనెడు నామాంతరముకల నరసింహపురాణము (అహోబల మాహాత్మ్యము) నందు ఈ నవనారసింహుల విషయము కనుపించలేదు. దీనికి నొల్లపూడి శ్రీరామమూర్తి శాస్త్రిలుగారు సలిపిన వచనానువాదమునందీవిషయము కానరాదు. ఇది యిట్లుండ శ్రీనివాస వేదాంత యతీంద్ర మహాదేశిక విరచితమైన మంగళాశాసనమునందు

శ్లో॥ శ్రీ పరాంకుశయోగీంద్ర శఠారి ప్రముఖాన్గురూన్ ।
మఙ్గళాశాసనపరా న్మహితా ననిశం భజే ॥౧॥

జగజ్జన్మాది లీలాయ జగదానందహేతవే ।
జగత్ప్రభుఖ నివాసాయ శ్రీ నృసింహాయ మఙ్గళమ్ ॥౨॥

హిరణ్య స్తమ్భ సమ్భూతి ప్రఖ్యాతపరమాత్మనే ।
ప్రహ్లాదార్తిముషే జ్వాలానారసింహాయ మఙ్గళమ్ ॥౩॥

గరుడాద్రి గుహా గేహ గజకుణ్డ సరస్తటే ।
హిరణ్యస్థా ణ్యహంకార హరిసింహాయ మఙ్గళమ్ ॥౪॥

స్తంభోద్భవ నృసింహస్వామి కాఁబోలు? శ్రీమాన్ మా తండ్రిగారు మునుపటి "దివ్యదేశాలయవిశేషముల"లో వ్రాసినవారు.

వారిజా వారితభయై ర్వాణీపతిముఖై స్సురైః ।
మహితాయ మహోదార మాలోలాయాఽస్తు మఙ్గళమ్ ॥౫॥

లక్ష్మీనృసింహస్వామి

వరాహకుణ్డ మేదిన్యై వరాహార్ధ ప్రదాయినే ।
దన్తలగ్న హిరణ్యాక్ష దంష్ట్రసింహాయ మఙ్గళమ్ ॥౬॥

ఈ వరాహనరసింహస్వామి యెవరో తెలియదు. సింహాచలము నందు వరాహనరసింహు డుండ్రు కాని వీరిచ్చటివారే.

గో భూ హిరణ్య నిర్వ్యాజ గోభిలజ్ఞానదాయినే ।
ప్రభఞ్జన శునాశీర కారఞ్జాయాఽస్తు మఙ్గళమ్ ॥౭॥

కరంజ శబ్దమునకు కర్జకాయలు, కానుగుచెట్టు రెండర్థములు కనుక ఈ నరసింహ స్వామివారికి కజ్జకాయల న యిష్టమో? కానుగుచెట్టు క్రింద నున్నారో? తెలియదు.

భార్గవాఖ్య తపస్స్వశభావనా భావితాత్మనే ।
అక్షయ్య తీర తీరస్థ భార్గవాయాఽస్తు మఙ్గళమ్ ॥౮॥

వీడు పరశురామ నృసింహస్వామి.

చతురానన చేతోబ్జ చిత్రభానుస్వరూపిణే ।
వేదాద్రి గహ్వరస్థాయ యోగానందాయ మఙ్గళమ్ ॥౯॥

అహోబలపు కొండలలో నొకదానికి వేదాద్రి యని పేరు కలదేమో?

హాహాహూహ్వాఖ్య గన్ధర్వ నృత్తగీత హృతాత్మనే ।
భవహంత్రే తటచ్ఛత్ర వటసింహాయ మఙ్గళమ్ ॥౧౦॥

భారద్వాజ మహాయోగి మహాపాతకహారిణే ।
తాపనీయ రహస్యార్థ పావనాయాఽస్తు మఙ్గళమ్ ॥౧౧॥

భారద్వాజ మునీంద్రుని పాపములనుఁ బోఁగొట్టిన ఈ నరసింహస్వామి యెవరో?

శ్రీ శఠారియతీంద్రాది యోగిహృత్పద్మభానవే।
సర్వత్ర పరిపూర్ణాయాఽహోబిలేశాయ మఙ్గళమ్ ॥౧౨॥

అహోబల నరసింహస్వామి

మఙ్గళాశాసన మిదమ్ మానివాసమునీరితమ్।
మహనీయం పఠన్ శృణ్వ న్మఙ్గళాయతనం భవేత్ ॥౧౩॥

జ్వాలానృసింహ మఙ్గళం సంపూర్ణమ్॥

మొదట లక్ష్మీనృసింహాది మంగళాశాసనమని, ముగిసిన పిమ్మట జ్వాలానృసింహమఙ్గళ మనుట యేలకో? 378 వ పుటయే. విషయసూచికయందు జ్వాలానృసింహమంగళమ్ అనియు దాని పుట 378 అనియు వేసియున్నది. (చూ. 1897 సం॥ రము బెంగుళూరు బుక్‌డిపో ముద్రాక్షరశాలా ముద్రితమై తూప్పుల్ వేంకటాచార్య శోధితమైన స్తోత్రరత్నాకరము.) శ్రీ శోభనాచల మాహాత్మ్యము వచనకావ్యము శ్రీ లక్ష్మీనారాయణాచార్య ప్రణీత ములోవలె అనుబంధము లేర్పఱచి యందు అసలు స్వామివారి చరిత్రమును వ్రాసి యనుబంధములలో 1 - 2 - 3 మొదలుగాఁ గల యంకెలువేసి యచ్చట తతిమ్మావారి కథలను వ్రాసిన బాగుండును. లక్ష్మీనృసింహాది మంగళాశాసన ప్రణేతగారు అందలి నరసింహ మూర్తు లచ్చట యేర్పడిన కథలనుఁ దెలుపునట్టి ఒక్కశతకమును రచించివేసినను బాగుండెడిది. ముందు నుడివిన శ్రీ లక్ష్మీనరసింహాది మంగళాశాసన గ్రంథమునందు గజకుండమని, వరాహకుండ మని రెండు తీర్థకముల పేళ్ళున్నవి. శ్రీమాన్ మా తండ్రిగారు పూర్వోక్తమయిన "దివ్యదేశాలయవిశేషము"లను గ్రంథమునందు ఈ యన్ని సన్నిధుల ప్రక్కన కొండ సెలయేరులు పారుచుండు నని వ్రాసియున్నారు కాన అచ్చటచ్చట ఆయా సెలయేరుల కాయా పేళ్లు ఉంచుకొన్నను ఫరవాలేదని నాయుద్దేశము.

ఇట్టులే కృష్ణామండలాంతర్గతమైన వేదాద్రి పంచనారసింహ క్షేత్రము. (నల్లగొండజిల్లా భువనగిరితాలూకా అప్పటి యద్రిసు.) వంగపల్లి రైల్వేస్టేషనుకు పడమరదిశయందు మూడుమైళ్ళలో నుండు యాదగిరి పల్లెయు పంచనారసింహక్షేత్రము. (యాదగిరి పల్లెయందు పంచనారసింహు లొక్క సన్నిధియందే యుందురు.)

ఇది యిట్లుండ శ్రీమాన్ పండిత మాయన్నగారు ఒక పురాణ గాథను ఒకప్పుడు నుడివిరి. నవనారసింహసందర్శన మని. అది శ్రీ ఆంజనేయులకు శ్రీకృష్ణుఁడు దశావతారములను చూపించిన కథ. దాని సంగ్రహము - పూర్వకాలమున శ్రీరామభద్రుఁడు హనుమత్సుగ్రీవాదివానరులయు జాంబవదాది వెలుఁగుబంట్ల వీరు లయు సాయమున లంకలోని దుష్టులయిన రావణాదులను వధించి సీతను పొంది ఆమె సౌమిత్రి మిత్రబలగము మున్నగువారి తోడను అయోధ్య కేతెంచి పట్టాభిషిక్తుఁడై యున్నతఱి హనుమ త్సుగ్రీవాది మిత్రబృందము రామవియోగమునకు ఓడి పీడక యుండునప్పుడు రాముఁడు "రాజు లేకుండిన ప్రజ లధర్మప్రవర్తను లయ్యెదరు. వీరు నన్ను విడలేక యున్నారు. అని మది నెఱింగి వారి వారికి కావలసిన వరముల నొసఁగి పంపి చివరన హనుమంతుని యెచ్చరించి ఆయన కోరిన వరము లిచ్చి హనుమ యొనరించిన మహోపకారమును మదిఁదలఁచి హనుమా! నీవు కోరకుండినను నేనొక్క వరము నిచ్చుచుంటిని. కైకొమ్మని రాఁబోవు కల్పమున నిన్ను బ్రహ్మ నొనర్చెద నని నుడివి ఆయన కోరిన వరము లలో రెండవది దశావతార సందర్శనము. దాని నీ రామావతారమున కాదు, కృష్ణావతారమున అని నుడివి ద్వాపరయుగమున కృష్ణుఁడుగ నవతరించి సేతువువద్ద అర్జునుఁడు కట్టిన శరసేతువు ఆంజనేయ పదా హతము కాఁగా ఆ కృష్ణుఁడు పాండవుల నేవురను కాపాడువాడు కావున తానెచ్చట నుండియో వచ్చినట్లు నటించి యసాక్షిగఁ జేసిన యే పనియు చెల్లదని చెప్పి తానే ఆ పనియందు సాక్షిగ నుందునని చెప్ప అర్జునుఁ డాతడవ తన శరసేతువు హనుమడి పదాహత మయ్యెనేని తాను నిప్పులో దుముకుదునని సింధువున శరసేతువు నిర్మించెను. హనుమ పాదాహతము అయ్యెను. అర్జునుఁడు తానొనర్చిన శపథము ప్రకార మగ్నిఁ జొచ్చ యత్నించ, బావా! అర్జునా! నాఁడిపుఁ జూడుమని ఆంజ నేయ పాదఘాతములను జూపి యిమ్మహానుభావుని పాదముల ఘాతము నెవ రోర్వఁగలరు. ఇద్దఱి ప్రతిజ్ఞలు నెరవేరినవని నుడివి, ఆంజనేయుఁడన్న ప్రకారము యుద్ధకాలమున అర్జునుని రథముపైన ధ్వజముగ నుండి యుద్ధానంతరము శ్రీకృష్ణునితో స్వామీ! దేవరవారు రామావతారమునందు చెప్పిన దశావతార సందర్శనము నెప్పుడు దయచేసెద రన నేను మఱవలేదు. ఇది యందుకు స్థానము గాదు. అని హనుమమెడలపై యెక్కించుకుని కాశ్మీరదేశమునకుఁ దీసుకుని పోయి (తన) కృష్ణుని మాట ప్రకారము కన్నులు మూసి తెఱచునప్పటికి మత్స్యావతారముఁ జూప హనుమ పూజించి యిట్లే నరసింహావతారము మినహాగా దశావతారములనుఁ జూపఁ జూచినావా యని కృష్ణుఁడడుగ స్వామీ! నరసింహావతారము జూపవైతి యన దానిని నీవు చూడఁజాలవని నేనే చూపనైతిని మఱచి కా దన హనుమ బలాత్కారము చేత

కన్నులు మూసి తెఱవ భూమి నాకాశమును క్రమ్మి యొక సింగము హుంకారముతోడ జడలు విదలింప నాంజనేయులు పెడరేక వేసి యచ్చట నుండి మఱియొక తావుకు దుమికి చూడ నటను అట్టులే కనుపింప ఇట్టులు సేతువు వరకు తొమ్మిది తావులఁ గూర్చుని యచ్చటనుఁ గన్నులు దెఱచి చూడ అట్టులె పెద్ద సింహము కనుపింప హనుమ యిట్లు మదిఁ దలఁచెను. నేను స్వర్గసత్యాది సమస్త లోకములను తిరిగి రాఁగలను. కాని యీ సింగ మిప్పగిది కనుపించుచునే యుండును. ఇప్పుడు శరణాగతి కంటెను రక్షణకు వేఱొం డుపాయము లేదని యెంచి స్తుతించెను:

శ్లో॥ జ్వాలాఽహోబిల మాలోల క్రోడ కారుణ్య భార్గవాః ।
యోగానందో వటచ్ఛత్రః పావని ర్నవమూర్తయః ॥౧॥
మహాశౌర్యో మహాధైర్యో మహాభయనివారకః
నారసింహః పరోదేవః పాతు మాం శ్రీ నృకేసరీ॥౨॥ అని.

కృష్ణుఁడు ప్రసన్నుఁడై నరసింహ స్వరూపముసుఁ జూచితివా? నీవు ఆ రూపమును చూడ నేర వని యెఱిఁగి నేను విడువ నీవు బలవంతముఁ జేయఁ జూపితిని. హిరణ్యకశిపుఁ డనిన నా వైకుంఠ లోకమునం దొక ద్వారపాలకుఁడు. చివరకు పోరి నా చేత నే చచ్చె నని చెప్పెను. (ఇంకనుఁ గలదు.) ఇది శ్లోకము కాదు. మంత్రము. దీనియొక్క యర్థము జ్వాలా - జ్వాలానరసింహ మెచ్చటనో? అహోబల - అహోబల నరసింహస్వామి, మాలోల - లక్ష్మీనరసింహస్వామి - మంగళగిరి యని మా యన్నగారు, మఱి కొందఱు మాలెకొండ యని, ఇంకఁ గొందఱు ఇంకొకటి యని యందురు. క్రోడ - వరాహనరసింహస్వామి, సింహాచలమున, కారుణ్య - కరుణా నారసింహస్వామి ఎటనో? భార్గవాః - పరశురామునరసింహస్వామి ఎటనో? యోగానందః - యోగానందనరసింహస్వామి. సింగరాయకొండ యని పెద్దలు. వటచ్ఛత్రః - మఱ్ఱిచెట్టు క్రింద నుండు నరసింహస్వామివారు ఎచ్చటనో? పావనిః - హనుమన్నరసింహస్వామి, బోళంగివర మేమో? తెనుఁగు బాసయందు అహోబలనరసింహస్వామివారికి చెందిన గరుడాచల మను పాట యొకటి కలదు.

అహోబలమునందు తొమ్మండుగురు, వేదాద్రి - యాదగిరుల యందు ఐదేసిమంది నరసింహమూర్తులు అయా తావులయందు అహోబలము - వేదాద్రి - యాదగిరులపై వెలసిన గాథలు వారి వారినిఁ గురించినవి ఏవే గ్రంథములయందుఁ గలవో? భారతి మూలమున లోకమునకుఁ దెలిపి నాకుఁ బ్రత్యేకముగ జాబు వ్రాసి తెలుపఁగలందులకు విన్నపములు.

విక్రాల శేషాచార్యులు,
కలికివాయ పోస్టు, వయా సింగరాయకొండ, ప్రకాశం జిల్లా.

'తిరు' - 'శ్రీ'

భారతి, (ఆగస్టు 1983) లో శ్రీ కాకుమాను తారానాథ్‌గారి "భాష - సంస్కృతి: అప్పుడు - ఇప్పుడు" అను వ్యాసములో ఈ క్రింది వాక్యమును చర్చించెదను. ప్రాచీనత పేరుతో సంస్కృతం బదులు శుద్ధ తమిళాన్ని పెట్టడం, ఫలితంగా "శ్రీ" బదులు "తిరు" అనటం, "ఆకాశవాణి" బదులు ఇంకేదో....

పై వాక్యము బట్టి "తిరు" శబ్దమును శుద్ధ తమిళముగా భావించుచున్నట్లు స్పష్టము.

"తిరు" శబ్దము "శ్రీ" శబ్ద దవమే కాని వేరుకాదు.

సంస్కృతములోని స, శ లు ద్రావిడ భాషలలో 'త' గా మారును. ఉదాహరణములు

సంస్కృతము	ద్రావిడ భాషలు
శ్రీ	తిరి-తిరు
శ్రీమాన్	తిరుమాన్
సేన	తానాయ్
స్వర్గ	తుఱక్కం
సూచి	తూచి

మలయాళ తుళు భాషలలోనూ పదాదిలో 'స' 'త' ల మార్పిడి కన్పట్టును. ఉదాహరణలు

మలయాళము	తుళు
సంగం	తంగం
సంచి	తంచి
సమరం	తమరం
సభ	తభ

మలయాళము	తుళు
సస్యం	తస్య
సేవ	తేవ
నోన	తోన
నోలు	తోలు

పైనుదాహరణములను ఆర్. స్వామినాథఅయ్యరు గారి "ద్రావిడ సిద్ధాంతములు" అను గ్రంథమునుండి తీసికొన్నాను.

గుజరాతులో 'శ్రీఖండ్' అను మిఠాయి చేయుదురు. తియ్యని కండ అని అర్థము. 'శ్రీ' యన విషము, తీయదనము అని నానార్థము లుండియుండును. కన్నడ భాషలో 'శ్రీకరణి' అను తీయని వంటకము (చోష్యము) కలదు. 'శ్రీ' అను శబ్దము మధురము అను నర్థమున కన్నడ భాషలో 'సీ' యనియు, తెనుగులో 'తీ' (య) లేక 'తి' (య్య) అనియు మారినది.

దీనిని బట్టి 'శ్రీ' అను శబ్దము తిరి-తిరుగా మారి యున్నదనుట స్పష్టము. తమిళ భాషలో సంశ్లిష్టాక్షరములు సకృత్తుగా నుండును.

అందుకే సంస్కృతపరముగా 'శ్రీ' యెచ్చ టెచ్చట వచ్చునో, ఆయా చోట్ల తమిళములో 'తిరు' గా మారుట సర్వేసర్వత్ర కన్పించుచున్నది. 'ఆకాశవాణి' బదులు తమిళులు వాడు 'వాణోలి' కూడ సంస్కృత తద్భవమే. తెలుగులో ప్రకృతి - వికృతుల విలాసము చెప్పబనిలేదుకదా. అరవభాషా స్వభావము వలననే సంస్కృత శబ్దములు ఆ విధముగా మారినవి. దీనిని తమిళుల సంకుచిత తత్వముగా భావించుట సమంజసము కాదు.

'త్రి'

సోమలదేవి - దాక్షారామ శాసనము

1983 అక్టోబరు 'భారతి'లో సోమలదేవి-దాక్షారామశాసనము గురించి నేను వ్రాసినదానికి 1983 ఫిబ్రవరి, మే 'భారతి' సంచికలలో శ్రీ తుకగా కృష్ణమూర్తిగారు ప్రకటించిన వ్యాసములు చదివిన తరువాత ఈ నాలుగు మాటలు వ్రాయదలచితిని.

కళింగ రాజరాజు దేవేంద్రవర్మ భార్య రాజసుందరి 'చోడ మహీభుజాత్మజ' అని, 'రాజేంద్ర చోలస్య తనయా' అని శాసనాలలో చెప్పబడినది. ఈమె చాళుక్య రాజరాజ నరేంద్రుని పెరదలు అని శ్రీ కృష్ణమూర్తిగారు 1982 జులై 'భారతి'లో అభిప్రాయపడ్డారు. అమ్మంగదేవి - చాళుక్య రాజరాజుల వివాహము క్రీ॥ శ॥ 1020 లోను, రాజసుందరి-కళింగ రాజరాజుల వివాహము 1063 లోను జరిగినది. అమ్మంగదేవి, రాజసుందరి అక్క-చెల్లెళ్ళయిన వారికి వివాహములనగల 48 సం॥ ల అంతరము ఏవిధముగా సమర్థనీయమో శ్రీ కృష్ణమూర్తిగారు తెల్పలేదు. పై అభిప్రాయానికి భిన్నంగా వారే ఫిబ్రవరి 83 'భారతి'లో రాజసుందరి చాళుక్య రాజరాజ నరేంద్రుని కుమారుని మామయగు రెండవ రాజేంద్ర చోళునకు దాయాదియైన వీరరాజేంద్ర చోళుని రెండవ కుమార్తెగా చెప్పారు. రాజసుందరి తండ్రి చోడరాజైన గంగై కొండచోళుడా? చాళుక్య రాజరాజ సుతుడు రాజేంద్ర చోళుడా? 'ఈ ఇరువురిలో నెవ్వరన్నదే ప్రశ్న' అని ప్రారంభించిన శ్రీ కృష్ణమూర్తిగారు ఈ ఇరువురినికాక మూడవ వ్యక్తిని - వీరరాజేంద్రచోళుని-రాజసుందరి తండ్రిగా చెప్పినదానిపై పరిశోధక శిఖామణులే వ్యాఖ్యానించ సమర్థులు.

రేవణారాధ్యులు వివాహమాడిన సోమలదేవి చాళుక్య వీర విజయాదిత్యుని కుమార్తె అనుటకు "సోమలదేవి రేవణారాధ్యుల సమకాలీనత, ఆవాసముల సన్నిహితత్వము"లను కృష్ణమూర్తిగారు ప్రధానముగా పేర్కొనిరి. ('భారతి' జనవరి 83) ఏ కాలపు రచనో తెలియని పంచబ్రహ్మోపనిషద్ భాష్యమున పేర్కొనబడిన రాజమందిరము ఎక్కడిదో తెలియదు. అది రాజమహేంద్రవరము కాదు. నన్నయభట్టు రాజమహేంద్రవరమును 'రాజమహేంద్రపురము'గా పేర్కొనినాడు. (భార. 1-1-8) అది రాజరాజు నిర్మించినదే అయితే నన్నయ ఆవిషయమును చెప్పక విడువడు. అది రాజరాజు నిర్మితముకాదు. శ్రీ కృష్ణమూర్తిగారుదాహరించిన కావ్యాలంకార చూడామణిలోని పద్యములో రాజమహేంద్రవరమును గల్పించిన రాజు 'రాజమహేంద్రు'డని యున్నది కృష్ణమూర్తిగారు గమనించినట్లులేదు. "రాజమహేంద్రపురస్థిత రాజనరేంద్రుడు" అని కావ్యాలంకార చూడామణిలోనే చెప్పబడినదానికి, 14 వ శతాబ్ది శాసనంలో చెప్పబడినదానికి ఐకమత్యమే ఆధారము కాజాలదు. ఎట్లయినను, క్రీ. శ. 1050 ప్రాంతమునకే రాజమహేంద్రవరము అపేరున ప్రసిద్ధమైయున్నప్పుడు క్రీ. శ. 1100 లోనో, ఆ తరువాతనో అది రాజమందిరమని పిలువబడినదనుట,

ఆ రాజమందిరమే కాలక్రమమున రాజమహేంద్రి, రాజమహేంద్ర పురముగా ప్రసిద్ధి చెందినదనుట హాస్యాస్పదము, సత్యదూరము. కనుక వీర విజయాదిత్యుని కుమార్తె సోమలదేవి రేవణారాధ్యుల "ఆవాసముల సన్నిహితత్వము" ఊహకు సైతము అందునది కాదు. ఏ ఇతర ఆధారము లేకుండ కేవలము సమకాలీనతపై ఆధారపడి వీరవిజయాదిత్యుని కుమార్తె సోమలదేవికి, కోటిపల్లారాధ్యుల తండ్రి రేవణారాధ్యులకు వివాహ సంబంధ మంటగట్టుట సరికాదు. ఇంతకూ "ముఖలింగశాసనములో నుదహరింపబడిన సోమలదేవికి దాక్షారామశాసనములో నుదహరింపబడిన సోమలదేవికి యెట్టి సంబంధములేదు" అని చెప్పగలిగిన శ్రీ కృష్ణమూర్తిగారు పంచబ్రహ్మోదయభాష్యములో చెప్పబడిన 'సోమలాదేవి'ని దాక్షారామ శాసనములో చెప్పబడిన 'సోమలదేవి'గా ఎట్లూహించిరో అర్థమగుటలేదు.

'మంత్రి పురోహిత సేనాపతి యువరాజదౌవారికు'లు మహారాజునకు పంచప్రధానులు. రాజు పంచప్రధానుల సమక్షమున దాన ధర్మములిచ్చినట్లు చెప్పుట ఒకనాటి ఆచారము. వీరవిజయాదిత్యుని ద్యాలి శాసనమున పేర్కొనబడిన 'సంతాన'ము యువరాజే అయిన ఆ యువరాజును స్పష్టముగా, ప్రత్యేకముగా పేర్కొనక పంచప్రధానులతో కలిపి ఏశాసనకర్తయైన పేర్కొనునా? స్పష్టార్థమునకాక 'అంతరార్థము'న విషయవివరణ మొనరింప బూనునా? విజ్ఞులు వివరించ ప్రార్థన.

ముఖలింగ శాసనములో చెప్పబడిన సోమలదేవి పుట్టింటి వారెవరో తెలియదు. దాక్షారామశాసనములో చెప్పబడిన సోమలదేవి "దేవేంద్రవర్మ భార్య కాదని, అనంతవర్మ చోడగంగుని భార్య అసలేకాదని" కృష్ణమూర్తిగారి నమ్మకము. అయినను సోమలదేవి, దేవేంద్రవర్మల మధ్య ఉండగల వయోభేదమునుగూర్చి చర్చించి క్రీ. శ. 1061 నాటికి ఇరువురు సమవయస్కులని వూహించారు. నూతనాధారములు లేకుండా ఈచర్చనిక పొడిగించుట అనుచితము. ఇక రాజసుందరి వివాహము దేవేంద్రవర్మతో కుదిరిన సంధితో ముడిపడినది కనుక వరుని వయోవృద్ధత్వము ఇటువంటి వివాహములలో ఆరోజులలో అంతగా గణింపదగినది కాదని నా అభిప్రాయము.

శ్రీ సూర్యదేవర రవికుమార్

కూరాకు - ఖురాక్

1983 ఏప్రిల్ భారతిలో శ్రీ "తి" గారు కూరాకు పద వివరణపై చర్చచేస్తు దానికి "అకుకూర"అనే అర్థం పొసగదు . అది ఖురాక్ శబ్దతద్భవంగాని అకుకూర మాండలికం గాదని తాత్పర్యం అన్నారు.

తెలంగాణంలో నైజాంకాలంలో "ఖురార్ - గిజా" అనే పదాలు బాగా వ్యాప్తిలో ఉండేవి. ఖురాక్ పారసీకశబ్దం. దానికి ఆహారం ఔషధపుమోతాదు అనే రెండర్థాలున్నవి. గిజాలనేది అరబ్బీ పదం, దానికి ఆహారం అనే అర్థం మాత్రమే ఉంది. ఇక తెలుగులో కూరకు ఆహారం అనిగాక శాకం అనేదే రూఢి.

"నేయి లేని తిండి నీ యాన కసవది
కూర లేని తిండి కుక్కతిండి."

అని కూరకు శాకార్థంలో ఇటువంటి ప్రయోగాలెన్నో మనకు కనిపిస్తవి.

కూరాకు అనే పదానికి డా. గంగప్పగారు తమ వ్యాసంలో "అకుకూర" అనే అర్థం వ్రాసినారుకాని శ్రీ తి. గారన్నట్లు దాని కక్కడ ఆ అర్థం పొసగదు. కూరాకు షష్టి అయితే అకుకూర విశేషణపూర్వం అవుతుంది. "కూర" అన్నపుడు తెలుగువారికి సాధారణంగా "హరితక" సంకేతమేగాని అన్యానికిగాదు. కాని క్రమేణా అది, వ్యంజనార్థంలో రూఢి అయి వంకాయకూర, బీర కాయకూర అని కాయలతోచేసిన వానికి, కోడికూర-చేపలకూర అని మాంస వ్యంజనాలకు చేర నారంభించింది.

"తి" గారు కూరకు రాయలసీమలో "మాంసం" అనే అర్థం ఉందన్నారు. అది దానికి లేకపోలేదుగాని మాంసాన్ని కూర అనే సామాన్యులే "మాంసంకూర" అనిగూడ వాడుతారు కాబట్టి ఇది కౌలికులు మద్యానికి "వస్తువు", వ్యభిచారులు పడుచుకు "పిట్ట" అని పేరు పెట్టుకున్నట్టు వ్యంజనోపయోగమైన మాంసాని లోకం నిర్ణయించుకొన్న ఒక సంకేతం అనుకోవలె.

ఇక తాళ్లపాకవారి ప్రయోగంలో కూరాకు ఈ విధంగాఉంది

చెలఁగి కూరాకుఁగాఁ జేసేవు, నీ
తలమీఁద నుండే తరుణిఁబో నేను. XII-194.

ఇది ఒక నాయికా వాక్యం. నేను నీకు శిరోధార్యమైన దానిని. అట్టి నన్ను నీవు కించపరుస్తున్నావు అని దీని భావం. తెలంగాణంలో ఈ పలుకుబడి యింకా సజీవంగానేవుంది. వా

నన్ను కూరకు కొఱగాకుండా చేసినాడు, నేనంత కూరకు కొఱ గాని వాననుకున్నావా! అనేవి జానపదుల్లో వినిపిస్తుంటవి.

మామూలుగా కూరనే హీనార్థమైతే అందులో దొగ్గలికూర, పుంటికూర మరీను. దొగ్గలిని తోటకూర, పుంటిని గోంగూర లంటారు. దగ్గరుండేవారు దొగ్గలికి కొఱగారని, గోంగూర ఆంధ్రులకెంత ప్రియమయిందయినా, పుంటకూర తిన్నా పుట్టినిల్లే అష్టభాగ్యాలమరినా అత్తవారిల్లే అని సామెతలు వినిపిస్తూనే వుంటవి. కాబట్టి ఈవిధంగా కూర అల్పార్థ మైతె కూరాకుఅందులో మరికొంత విశేషంగా భావించవలె.

కూర అనే పదానికి తెలంగాణా భాషీయంలో అల్పార్థమే గాక ఈడిగిలబడు అనే అర్థంగూడవుంది. "కూరాకుసేయు" అనే పదానికి సూ. ని. వధించు అనే అర్థం యిచ్చిందిగాని వారిచ్చిన ప్రయోగానికి ఆ అర్థం సమంజసంగా కనిపించదు. చూడండి.

తే. పులుల చట్టలు చీరి దుప్పులను లేళ్ళ
నేకలమ్ముల గ్రుమ్మి కూరాకు సేసి
యమరఁ జమరులఁ బట్టి పాలార్తు మిపుడు
సామి చూడుము నీ బంట్ల సత్తువనుచు. సారంగ-1-90.

ఇది సారంగధరుని భటులు వేటలో తమ పౌరుషాన్ని చాటుకునే సందర్భం. కర్తయైన చేమకూర వెంకటకవి జాతి వార్తా చమత్కారఘటికుడు కనుక పైని ప్రయోగించిన చట్టలు చీరు, గ్రుమ్మి కూరాకుసేయు, పట్టి పాలార్చు తాత్పర్యంలో ఒకటే యైనా వ్యుత్పత్తిలో గావు.

చట్ట అంటే కవచం అని శ. ర. చర్మం అని. ఆం.శ.ర. కాబట్టి చట్టలు చీరు అంటె చర్మం వొలుచు అని ఆంధ్ర శబ్ద రత్నాకరం చెప్పింది సరిపోతుంది. గ్రుమ్ముట అంటె పొడుచుట కాబట్టి గ్రుమ్మి కూరాకుసేయు అనేదానికి సూ. ని. వధించు అనే అర్థంయిస్తే ఆం.శ.ర. సులువుగాజేసి చంపు అనే అర్థం ఇచ్చింది. ఇది కొంతవరకు వరిపోతుంది. అయినా సులువుగాజేసి అనే దానికంటె పొడిచి ఈడిగిలబడజేసి చంపు అంటె ఇంకా సరిపోతుంది.

పట్టి పాలార్చులో-పాలార్చు అనేదానికి శ. ర. ఉపేక్షించు అనే అర్థం యిచ్చింది. అది యిక్కడ పొసగదు కాబట్టి ఇది పాలార్చుకంటె "పల్లార్చు "అయివుండవలె. "పల్లార్చు "అనేదానికి శ. చం. చంపట్టు అని, సూ. ని. నశింపజేయు అనే అర్థాలిచ్చినవి కాని వీనికంటె "చలముడించు" అనేది ఇక్కడ సరిపోతుంది.

సారంగధరుని భటులు మేము పెద్దపులుల తోలువొలుస్తాము, "ఏకలం" అంటె ఒంటరిగాడనే అడవిపంది. అది మహా పొగరుబోతు కనుక అట్టిదాన్నిగూడ పొడిచి పొడిచి ఈడిగలపడవేస్తాం, చమరి అంటె గురిమెకం వాటినిపట్టి మత్సరందించివేస్తాం, మా పరాక్రమం చూడండి అని చెప్పుకుంటున్నారు కాబట్టి పైని ఉపయోగించిన చట్టలుచీరు, మున్నగువానికి చంపటం అనే అర్థం సామాన్యమే అయినా అది వారి పౌరుషాన్ని తెలుపదుకాబట్టి వానికి యౌగికార్థాలు చెబితేనే తగినట్టు ఉంటుందని పాఠకులకు తెలియక పోదు. అందువల్ల కూరాకుసేయు అనే పదానికి ఈడిగిలబడజేయు, లేదా మెత్తబడజేయు అనటమే తగినట్టుగావుంటుంది. దానికీయర్థం.

ఈరీతి గడుపునొప్పిం
గూరాకై యుడికి గోడుగుడుచుచు - 4-560.

అనే వెంకటకవిపంచతంత్ర ప్రయోగంచేతగూడ లభిస్తుంది.

కూరాకు మొక్కపై వున్నపుడు వెన్ను ఈనె బలంతో చక్కగా నిటారుగా వుంటుందికాని కోసినపిమ్మట కొలదిసేపటికి వాడి వెన్ను బలంచచ్చి ఎటువడితె అటు వాలిపోతుంది. కనుక, గ్రుమ్మి కూరాకు సేయటమంటె దాన్ని అలాగా చేయటమని తాత్పర్యం. అపుడే వారి బలమెంతదో తెలుస్తుంది.

"కూరాకగు" అనేదానికి వ్యవహారంలోగూడ "మాతంత్రి జ్వరంలో కూరాకైపోయినాడు, ఏరా! ఈడిగిలబడి కూరాకైనావు? అని శక్తిహీనతను తెలిపేవిధంగానే వున్నవి కాబట్టి "కూరాకు సేయు" అనేదానికి సూ. ని. యిచ్చిన అర్థం తాత్పర్యమూలమయిందనవలె.

ఇక దానికి డా. గంగప్పగారిచ్చిన అర్థంచూస్తే దాని ప్రయోగం వారిప్రాంతంలో ఏవిధంగావుందోగాని అది "ఖురాక్" తద్భవమని లేదా ఆ అర్థంలోగాని వాడబడిందని అనుకోలేం. అది అల్పార్థంలోనే వాడబడింది అనటం సబబు.

శ్రీ కపిలవాయి లింగమూర్తి

పదాలు - పదార్థాలు

మెకాలే ప్రవేశపెట్టిన పాశ్చాత్య విద్యావిధానం మన దేశంలో వేళ్ళూనిన తరువాత ఎన్నో కొత్త పదాలు వాడుకలో వచ్చాయి.

ప్రస్తుతం వాడుకలో వున్న 'స్కూల్'. పదం గ్రీక్ భాషా జన్యమైన విరామకాలం అన్న అర్థంలో ప్రయోగింపబడేది. విరామకాలాన్ని సద్వినియోగ పరచే సాధనం అధ్యయనం. అధ్యయనం సాగే ప్రాంతం అధ్యయన కేంద్రమైన 'స్కూల్' గా మారింది. 'స్కూల్' పదం లాటిన్, కెల్టిక్, ఆ తరువాత రష్యన్ భాషలో చదువుకొనే స్థలంగా స్థిరమై శతాబ్దాలుగా ప్రయోగంలో వుంది.

మన 'పాఠశాల' లోని శాల పదం మూలతః పాఠాలు చెప్పే కేంద్రమన్న అర్థంలో ప్రయోగింపబడలేదు. అథర్వ వేదంలో 'శాలా' పదం కార్యాలయం, 'గుర్రాలు కట్టే లాయం' అన్న అర్థాల్లో ప్రయోగింపబడింది. అశ్వశాల, చిత్రశాల, నృత్యశాల మున్నగువాటి ననుసరించి పాఠశాల ఏర్పడింది. ప్రాచీన కోశాలలో 'శాల' విద్యా సంబంధమైన పదంగా కనిపించదు. క్రీ. శ. 10 వ శతాబ్దికి చెందిన రాష్ట్రకూట వంశీయుడైన మూడవ కృష్ణుని శాసన మొకదానిలో 'శాల' శబ్దం కానవస్తుంది. అమరకోశంలో 'శాల' విద్యార్థులు - సన్యాసుల నిలయంగా పేర్కొనబడింది.

'కాలేజ్' అంటే లాటిన్ భాషలో సమూహం అని అర్థం. ప్రత్యేక లక్ష్యంతో నెలకొల్పబడిన వ్యక్తుల సంఘం, ఆ తరువాత ధార్మిక సంఘం అన్న అర్థాలతో ప్రచురితమైన 'కాలేజ్' 11 వ శతాబ్దం చివర్లో విశ్వవిద్యాలయం యొక్క అంగంగా మారింది. ఆ మూలార్థంలోనే ఆంగ్లంలో 'ఎలొక్టరల్' కాలేజ్ (ఓటర్ల సంఘం) మున్నగు రూపాలు కన్పిస్తున్నాయి.

నేటి 'కాలేజీ' లకు సమానమైన సంస్థ ప్రాచీనకాలం నాటి మన 'ఘటికాస్థానం'. ఈ ఘటికాస్థానాలు వివిధ శాస్త్రాలను నేర్పే విద్యా సంస్థలుగా వుండినట్లు మన శాసనాలు తెలుపుతున్నాయి. ఒక ఘటికాస్థానంలో అధ్యయనం సాగిస్తున్న మయూరశర్మ తనకు జరిగిన అవమానానికి రెచ్చిపోయి క్షాత్ర ధర్మాన్ని స్వీకరించి కదంబరాజ్య స్థాపనకు కారకుడయ్యాడు.

'ఘటికా' శబ్దానికి గడియ (24 నిమిషాల కాలం) అని మరొక అర్థం. కాలమును కొలిచేవని బుద్ధి సూక్ష్మతకు సంబంధించినది. జ్యోతిష, గణిత శాస్త్రజ్ఞులే అందుకు సమర్థులు. అట్టి పండితులు ఉన్నత విద్యాకేంద్రాలలో వుంటూ బోధన జరిపే వారని భావింపవచ్చు. ఉన్నత విద్యాకేంద్రాలంటే కాలగణన మొనర్చే కేంద్రాలుగా భావించి యుండవచ్చు. ఈ ఘటికాస్థానాలే కాలక్రమంలో చతుర్దశ విద్యాకేంద్రాలుగా రూపుదాల్చినట్లు ప్రొఫెసర్ సత్యనాథయ్యర్ పేర్కొన్నారు.

ఈ విద్యాస్థానాలే ప్రాచీన విశ్వవిద్యాలయాలని చెప్పవచ్చు. నేటి విశ్వవిద్యాలయాలు ఆంగ్ల పదమగు 'యూనివర్సిటీ' అన్న పదానికి అనువాదం, ల్యాటిన్ పదమగు 'యూనివర్సెటాస్' అంటే 'ఒకని ఆస్తి మొత్తం' అని అర్థం.

13 వ శతాబ్ది తరువాత ఫ్రెంచి భాషలో ఈ పదం 'మహా విద్యాకేంద్రం' గా ప్రచురితమైంది. మన ప్రాచీన గురుకుల విశ్వవిద్యాలయానికి అనురూపం (కుల అనగా సమూహం). ఇటీవల మన దేశంలో 'అకాదమి' లు బాగా పెరిగాయి.

'అకాదమి'అన్న గ్రీక్ మూల పదానికీ, విద్యకు సంబంధం లేదు. వివిధ కళల్లో శాస్త్రాలలో ఆరితేరిన వారిని ప్రోత్సహించే సంస్థ 'అకాదమి'.

'అకాదమి' గ్రీస్ రాజధానియైన ఏథెన్స్ నగర సమీపంలోని ఒక ఉద్యానవనం. బహుశా 'అకాదమోస్' అన్న వ్యక్తి పేరుతో ప్రసిద్ధమైనదనవచ్చు. సుప్రసిద్ధ గ్రీక్ తత్వవేత్త ప్లేటో- ఆ ఉద్యానవనంలో శిష్యులకు తత్వోపదేశం చేస్తూ వుండినందున, 'అకాదమి' కి తత్వశాస్త్రానికి లంకె ఏర్పడిందనవచ్చు. ఉద్యానవనాల్లో తత్వబోధ చేయటం భారతీయ సంప్రదాయంగా వుండేది. బుద్ధభగవానుడు బీహార్‌లోని అమ్రవనం, కాశీ సమీపంలోని సారంగ వనంలో తత్వోపదేశం చేశాడు.

జర్మన్ దేశీయులు తమ మాధ్యమిక పాఠశాలలను 'జిమ్నాశియం' అనేవారు. జిమ్నాశియం అన్న గ్రీక్ పదానికి గరిడీగుడి (సాముకూటు) అని పేరు. ఈ గరిడీ గుళ్ళలో అంగ సాధన చేస్తున్నట్లే పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తారు కదా! జర్మన్ పాఠశాలలు క్రమశిక్షణకు పెట్టిన పేరు కాని వాస్తవానికి 'జిమ్నోస్' అన్న గ్రీక్ శబ్దానికి అర్థం బిత్తలగా అంగసాధన చేయటం. శరీరాన్ని పవిత్ర సాధనంగా భావించిన గ్రీకులు బిత్తలగా శరీర సాధన, ఆటపాటలు కొనసాగించే వారు. కిండర్‌గార్టన్ అన్న జర్మన్ పదం యొక్క అర్థం 'బాలల ఉద్యాన వనం'. ఇక్కడ విద్య ప్రకృతి ఒడిలో నేర్పబడుతుంది.

('కస్తూరి' ఫిబ్రవరి '83 లోని శ్రీ పా. వెంగారి వ్యాసం ఈవ్యాసరచన కెంతో వుపకరించింది. వారికి కృతజ్ఞతతో....)

జానమద్ది హనుమచ్ఛాస్త్రి

సంభాషణలో చిన్న చిన్న పొరపాట్లు

"నాపశబ్దాన్ ప్రయుంజీత" అని సాధువులైన శబ్దాలనే వాడాలనీ, అపశబ్దాలను వాడరాదని వైయాకరణుల నిర్ణయం.

వ్యాకరణ మహా భాష్యకర్తయైన పతంజలి సాధుశబ్దోచ్చారణ వలన పుణ్యం, అపశబ్దోచ్చారణ వలన పాపం వస్తుందనీ చెబుతున్నాడు. "ఏకశ్శబ్దః సుప్రయుక్తః సమ్యక్ జ్ఞాతః స్వర్గేలోకే కామధుక్ భవతి" అనే న్యాయం సుశబ్దోచ్చారణం వలన స్వర్గం లభిస్తుందని చెబుతుంది. ప్రాచీన వైయాకరణులు "గౌర్గాఃకామ దుఘా" అని చెప్పారు. అంటే చక్కని వాక్కు కామధేనువు వంటిదని భావం. ఏది ఏమైనా మనం మాట్లాడే భాష సంస్కరింప బడినది. లలితము, సద్భావయుతమై వీనుల విందొనరించాలి. మన సంభాషణవలన మన సంస్కారం తెలుస్తుంది. "శుకవద్భాషణం కుర్యాత్" అనే న్యాయం చిలుక పలుకులు లాగ ఆకర్షణీయంగా మృదు మధురంగా ఉండాలని సూచిస్తోంది.

మన ఆంధ్రభాష సంస్కృతం మొదలైన ఇతరభాషా సంబంధంచేత సుసంపన్నమూ, సమృద్ధమై యలరారుతూంది. నిత్యవ్యవహారాలలో అనంతమైన భాష ప్రయోగింపబడుతూంది. మన సంభాషణలలోనూ, పత్రికలలోను తెలిసీతెలియక కొన్ని అపశబ్దాలు దొర్లుతుంటాయి. వీటిని చాలామంది విద్యావేత్తలు గూడ ఎక్కువగా పట్టించుకోరు. ఈ పదాలు, వాటి సాధుత్వం గూర్చి స్థాలీపులాకన్యాయంగా ముచ్చటించడం ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం. దోషైకదృష్టి విడచి నిష్పాక్షికంగా సాధుత్వా సాధుత్వ నిర్ణయం చేయాలి.

చాలమంది 'ఈ ఉద్యోగాలకు వయోపరిమితి' అని అంటూ వుంటారు. పత్రికలలో గూడ ఇలాగే ఉంటుంది. ఇది సరైన రూపంగాదు. సంస్కృత వ్యాకరణానుసారం 'హశిచ' అనే ఉత్వం ఇక్కడ రాదు. 'కుప్వోఃకఁపౌచ' అని ఉపధ్మానీయవచ్చి 'వయః పరిమితి' అనే అవుతుంది. 'మన క్రీడాకారులు ఆధిక్యతతో గెలుపొందారు' 'నీ ఆధిక్యత ఏమిటి ?' అని అంటూంటారు. ప్రాధాన్యత, ప్రాముఖ్యత అనేవి గూడ ఈ పద్ధతికి చెందినవే. ఆధిక్యత, ప్రాధాన్యత, ప్రాముఖ్యత అనే పదాలు అసాధువులే. భావార్థంలో ష్యఞ్ చేశాక మరల భావార్థంలోనే తల్ ప్రత్యయాన్ని చెయ్యడం అనవసరం. ఇలా రెండుమార్లు భావార్థక ప్రత్యయాన్ని చెయ్యడం శాస్త్రీయం గాదు. కనుక ఆధిక్యం, ప్రాధాన్యం, ప్రాముఖ్యం లేదా అధికత్వం, ప్రధానత్వం, ప్రముఖత్వం, లేదా అధికత, ప్రధానత, ప్రముఖత అనేవి ష్యఞ్, త్వ, తల్ ప్రత్యయాంతాలై సాధువులవుతున్నాయి. ఇలాగే వివక్షత అనే పదం. వివక్ష అంటే చెప్పాలనే కోరిక అని అర్థం. ఇదే భావాన్ని సూచించే పదంగనుక దీనికి తిరిగి భావార్థకప్రత్యయం చేర్చడం ఉచితం గాదు. వివక్షే గాని వివక్షత గాదు. ధర్మిని చేసి దానికి భావప్రత్యయాన్ని చేర వచ్చు. 'పిపాసుతా శాంతి ముపైతి వారి జాన జాతు దుగ్ధాన్మధునో ఒధికాదసి' అని నైషధప్రయోగం. ఇలాగే దిదృక్షత అంటున్నారు. దిదృక్ష సరైన రూపం. చూడాలనే కోరిక అని అర్థం.

ఇంకా మనకి హోటల్ బోర్డులపైనా తదితర స్థలాలలోను శాఖాహారం అని కనిపిస్తుంది. శాఖాహారం అంటే కొమ్మలతో చేయబడిన ఆహారం అని అర్థం. ఈ అర్థం అసమంజసం గనుక శాకాహారం అనేది సరైన పదం. కూర మొదలైన ఆహారం అనే అర్థంలో వెజిటబుల్ ఫుడ్ అనే పదానికి శాకాహారం సరైన పదం. వీధుల్లో ఫలహారశాల అని గూడ కనిపిస్తూ ఉంటుంది. ఫలహారశాల అనేది తప్పు. ఫలాహారం అనేది సరైన పదం. పండ్లు మొదలైన అల్పాహారా లుంటాయని అర్థం. ఆహారం గాని హారం గాదు. అలాగే 'శీతాకాలం వచ్చింది. శీతాకాలంలో జాగ్రత్తలు' అని అంటున్నారు. పై పదంలో సవర్ణ దీర్ఘానికి ప్రసక్తి లేదు. శీతకాలం అనే అనాలి.

ప్రస్తుతం సౌదామిని అనే పదం గూర్చి చర్చిద్దాం. ఈ పదంలో సౌదామిని అని మకారానికి ఇకారాన్నిచేర్చడం పొరపాటు. హరి ప్రబోధం అనే సంస్కృత కావ్యంలో ఈ శ్లోకాన్ని చూడండి :

"ఖేఽభ్రం జగామ కాంచనసరసము సౌదామనీలతా ధామాస్తమ్
కువలయ మివహి సరజసం సరసమ సౌదామనీలతా ధామాస్తమ్"

ఇక్కడ యమకం కుదరాలంటే సౌదామనీ అనే ఉండాలి. ఇదే సరైన రూపం.

ఇలాగే భానూజీ దీక్షిత వ్యాఖ్యలో గూడ కనుపిస్తుంది. 'తేనైకదిక్' అనే సూత్రంచేత సుదామన్ ప్రాతిపదిక కంటె అణ్ ప్రత్యయం. పిమ్మట జీప్వచ్చి సౌదామనీ అని అవుతుంది. సౌదామని అంటే మెఱుపుతీగ అని అర్థం. ఇత్వప్రసక్తి దోషజుష్టం.

ప్రస్తుత కాలంలో చాలామంది స్త్రీలు కిరణ్మయి అనే పేరు పెట్టుకుంటున్నారు. సంస్కృతంలో హిరణ్మయి అనే పదం ఉంది. హిరణ్మయి అంటే బంగారుబొమ్మ యని అర్థం. ఈ పదంతో సామ్యం ఉండటం వలన కిరణ్మయి అంటున్నారు. హిరణ్మయి శబ్దం "దాడింనాయన... " అనే సూత్రంలో నిపతింపబడిందిగనుక కుదురుతుంది. కనుక కిరణమయి అని ఉండాలి. ఇలాగే 'సృజనాత్మక శక్తిని పెంపొందించాలి.' 'సాహిత్యంలో సృజనాత్మక రచనలు రావాలి' అనే ప్రయోగాలు కనుపిస్తున్నాయి. సృజనంగాదు సర్జనం, సర్జనాత్మకశక్తి అనడం ఉచితం. కానీ ఈ ప్రయోగం భాషలో బాగా నాటుకుపోయింది. ఇలా రూఢమైన పదం వ్యావహారిక భాషలో

దోషం గాదేమో. కాలం నిర్ణయించాలి. సృజన్ అనేది హిందీలో కుదురుతుంది. సర్జనమని గుణయుతరూపం సాధువు.

"ఆహ్వానితులైన రసజ్ఞుల సమక్షంలో" అని చెబుతూ ఉంటారు. ఆహ్వానితులు అనేదాన్ని ఇతజ స్తంగా సమర్థించుకోవచ్చు. ఆహ్వానితులు అనేది తప్పుగాదుగాని ఆహూతులు అంటే ఇంకా బాగుంటుంది. 'భక్తిరస ప్రధానమైన సినిమా' అని సాధారణంగా మనం అనే మాట. భక్తిని రసం అనడం కంటె భావం అనడం ఉచితం. ఐతే భక్తిని రసంగా పరిగణించిన ఆలంకారికులు చాలామంది ఉన్నారు. కాని ఎక్కువమంది భక్తిని భావంగా పరిగణించారు. కనుక భక్తిరసం అన్నా, భక్తిభావం అన్నా దోషంలేదు. 'సుస్వాగతం' అనే పదం పరిశీలనార్హం. మంచిరాక అనే అర్థంలో సు + ఆగతం అని సంబోధిస్తేస్వాగతం అవుతుందిగాని సుస్వాగతం కాదు. పోనీ నిస్ నిర్, దుస్ అన్నట్లు సుస్ అనేది ఉపసర్గేమో అనుకుంటే అట్టి ఉపసర్గ దృగ్గోచరం గావడం లేదు. సు, సు అని ఒకే ఉపసర్గను రెండుమార్లు పదానికి జేర్చడం తప్పు. కనుక స్వాగతం అనే అనాలి. 'బంధుమిత్ర సపరివారసమేతంగా అనే వాటిలో ఏదో ఒకటి చాలు. రెండూ అవసరం లేదు.

ఉద్యోగం అనే పదం వృత్తిఅనే అర్థంలో బాగా లోకంలో నాటుకు పోయింది. న్యాయంగా ఉద్యోగమనే సంస్కృత పదానికి ప్రయత్నం అని అర్థం. సంధి ప్రయత్నాలు సాగాయి కనుక భారతంలో పర్వానికి ఉద్యోగపర్వం అని పేరు. "ఉద్యోగః పురుష లక్షణం" అనే చోటా, 'ఉద్యోగినం పురుషసింహముపైతి లక్ష్మీః' అనే చోటా ఉద్యోగ పదానికి ప్రయత్నమనే అర్థం. కానీ ఆంధ్ర భాషా ప్రవాహంలో వృత్తి అనే అర్థం ఉద్యోగపదానికి రూఢమైంది. రూఢమైంది గనుక ఉద్యోగం అనేది వృత్తి అనే అర్థంలో తప్పు గాదేమో. కాని సంస్కృతంలో మాత్రం ఇప్పటికీ ఉద్యోగం అంటే ప్రయత్నమే.

కొందరికి ఉషస్విని అనే పేరుంటుంది. మనస్విని అన్నట్లే ఉషస్విని అనేది కూడ సాధువే అని కొందరి అభిప్రాయం. మనస్విని అంటే ప్రశస్తమైన మనస్సు కలిగినది అని అర్థం. ఉషస్విని అంటే ప్రభాతకాలం కలిగినది అనే అర్థమా? అనే సందేహం కలుగుతుంది. అంటే రాత్రి అనుకుందాం అంటే రాత్రికి ఆ పేరు ఎక్కడా లేదు. అసలు మనస్విని అన్నచోట వచ్చిన విన్ ప్రత్యయం ఇక్కడ రాదు. 'సమిష్టిగా మనం కృషి చెయ్యాలి' అని చాలా మంది చెబుతూ వుంటారు. సమిష్టి అంటే మంచి యజ్ఞం అనే అర్థమే వస్తుంది. కాని కలపికట్టు అనేఅర్థం రాదు. వి+అష్టి=వ్యష్టి ఐనట్లుగానే సమ్+అష్టి=సమష్టి అవుతుంది. వ్యష్టి, సమష్టి అన్న రెండుచోట్లా అష్టి అనేపదమే గాని ఇష్టిగాదు. కనుక సమష్టి సరైన రూపం. 'ఇది మన సాంప్రదాయం' అంటారు. కాని సంప్రదాయం అనే అనాలిగాని సాంప్రదాయం అనగూడదు. సంప్రదాయం అంటే పద్ధతి అని అర్థం. నిదానస్థులు అనేది సంస్కృత పదం. నిదానం అంటే మెల్లగాఅని చాలామంది భావిస్తున్నారు. కాని 'నిదానం త్వాదికారణం' అనే అమరాన్నిబట్టి నిదానము అంటే మూలకారణం అని అర్థం. వాడుక భాషలో ఇలాగే 'ఆయన చాలా శుభ్రస్థులు' అని అంటున్నారు. ఇది తెలుగు సంస్కృతాలవలన ఏర్పడ్డ అపభ్రంశరూపం. ఇది పూర్తిగా తప్పే. 'అంతర్రాష్ట్రియ పద్ధతి' అనిగూడ వాడుక భాషలో ప్రయోగంపుంది. దేశంలో దాగియున్న పద్ధతులు అనే అర్థంలో అంతా రాష్ట్రియ అనడం వుచితంగాని రేఫక్రింద రేఫప్రయోగం ఉచితంగాదు. మనోశక్తి అనేది తప్పు. మనశ్శక్తి అనేది సాధుప్రయోగం. 'ఆయన దేవునిలో ఐక్యత చెందారు' 'మనలో ఐక్యత చాలా అవసరం' అనే సందర్భాలలో ఐక్యం అనడం యుక్తము. పత్రికల్లోగూడ ఐక్యత అని కనిపిస్తోంది. 'అందుకు అనుగుణ్యంగా' అనడం పొరపాటు. "అందుకు అనుగుణంగా"-అనిగానీ 'అందుకు అనుగుణ్యంగా' అనిగానీ అనాలి. 'ఆయన దేశంలో ఏకైకకవి' అనడం తప్పు. ఏకైక అంటే ఒక్కొక్క అని అర్థం వస్తుందిగాని ఒకే ఒక్క అనే అర్థంరాదు. 'ఏకైక కవి. ఏకైకపుత్రుడు' అనేవి అపరూపాలు.

సఖ్యత అని మనం సాధారణంగా అనాలోచితంగా అంటూ ఉంటాము. సఖ్యం అనేది సరైన పదం. సఖ్యతగాదు. 'ఈమె బ్రహ్మచారిణిగా ఉండిపోయింది' అనే చోట వాడబడిన బ్రహ్మచారిణి అనేపదం సరైన అర్థాన్నివ్వదు. స్త్రీని బ్రహ్మచారిణి అనడంకంటె కన్య అనడమే సముచితం. స్త్రీలకు బ్రహ్మచర్యం లేదుగదా. ఐతే బ్రహ్మచర్య భావనతో సంచరించే స్త్రీ అనే అర్థంలోమాత్రం సమంజసమే. అవివాహిత అనే అర్థంలోగాదు.

కొందరు 'ఈమె మాగుర్విణి' అని గురువు అనే అర్థంలో స్త్రీనుగురించి ప్రయోగించడంగూడ గలదు. గుర్విణి అనేది సరైన రూపంగాదు. గుర్విణి అంటే గర్భవతి అని ప్రసిద్ధమైన అర్థం. కనుక గుర్వి లేక గురువు అనాలి. "వోతో గుణవచనాత్" అని జీష్ వికల్పంగా వస్తుంది. "ఆయనకేం ఆయన కవి సామ్రాట్", "నటసామ్రాట్" అంటారు. సమ్రాట్ అనాలిగానీ

సామ్రాట్ అనరాదు. అందుకే విశ్వనాథ సత్యనారాయణగారికి కవిసమ్రాట్ అనే పేరుంది.

"వారిరువురూ సమకాలీనులు" అనడం శాస్త్రవిరుద్ధం. ఇందుకు వ్యాకరణం అంగీకరించదు. సమకాలికులు అనాలని వ్యాకరణం చెబుతూంది. భానోదయం అనడం తప్పని మనందరికీ తెలిసినదే. సవర్ణదీర్ఘం చేస్తే భానూదయ అనే అవుతుంది. ఇంకా 'అరిషడ్వర్గము' అనేది కొంచెం క్లిష్టమైన రూపం. షణ్ణాం వర్గః షడ్వర్గః, అరీణాం షడ్వర్గః అరిషడ్వర్గః అని చెప్పాలి. శివభాగవతరూపం వలె ఇదీ అసమర్థసమాసమే. ఇది కవులచే ఆదృతమై ప్రయుక్తమైంది. "కృతారిషడ్వర్గజయేన మానవీమ్" అని భారవి ప్రయోగం.

'నా జన్మ పునీతం అవుతుంది' అనడం పరిపాటి. పునీతం అనేది ప్రామాదికమే. పవిత్రమైంది అనే అర్థంలో పూతం అవుతుంది గాని పునీతం గాదు. పవిత్రం చేయబడింది అనే అర్థంలో పావితం అవుతుంది. పునీతః అని క్రియారూపం సంస్కృతంలో ఉంది. దాన్ని క్తాంతమని భ్రాంతిపడి ఉంటారు కొందరు. ఆ శబ్ద భ్రాంతితో వచ్చిన పదమే పునీతం అనేది. కాని పునీతం అనేది వాడుక భాషలో బాగా వ్యాపించింది. ఇలాగే తెలివి అనే అర్థంలో మేధస్సు అనడం కూడా కొంచెం ఇబ్బందిని కలిగిస్తుంది. మంచి మేధ అనడం ఉచితం. మేధస్సు గాదు. సమాసంలో మేధా శబ్దం 'నిత్యమసిచ్ ప్రజామేధయోః' అనే సూత్రం వలన సాంతం అవుతుంది గాని విడిగా మేధాశబ్దం ఆకారాంతమే. "ఉపాధ్యాయినులు కావలెను" అనడం చాలా సందర్భాలలో కానవస్తుంది. ఇది పొరపాటు. ఉపాధ్యాయి లేక ఉపాధ్యాయ అనాలి గాని ఉపాధ్యాయిని గాదు. మల్లికార్జున పదంలో కకారమేగాని ఖకారం గాదు.

పై పదాలు శాస్త్రవిరుద్ధాలు. కాని అనంతమైన కాలగమనం, పొంగే నదిలా దినదినాభివృద్ధి జెందే ఆంధ్రవాఙ్మయం పై పదాలకు సాధుత్వాన్ని కలిగిస్తాయేమో ? కానీ సంస్కృత భాషలో పై పదాలు నాటికీ నేటికీ అపశబ్దాలే. చక్కని భాష, లలితమైన భావాలు, వీనులవిందొనరించే లలిత పదవిన్యాసం, సంభాషణా చాతురికి, ఆకర్షణకు, సభ్యతకు, సంస్కారానికి మూలకారణాలనడంలో సందేహం లేదు. 'వాగేకాసమలంకరోతి' అన్నట్లు చక్కనివాక్కే మనిషికి పెట్టని అలంకారం. సుశబ్దశోభితమైన భాషనుపయోగించడానికి మనం అందరం ప్రయత్నిద్దాం.

శ్రీ నిష్ఠల సుబ్రహ్మణ్యం

నిత్య జీవితంలో అలంకారాలు

"వాక్యం రసాత్మకం కావ్యం" అని విశ్వనాథుని నిర్వచనం.

"రమణీయార్థ ప్రతిపాదకశ్శబ్దః కావ్యం" అని జగన్నాథ పండితరాయల ప్రతిపాదన.

ఎవరి ఉపన్యాసమైనా ఉచ్చారణ స్పష్టంగావుండి, భాష దోషరహితంగావుంటే, ధార అనర్గళంగావున్నా, చమత్కారం లేక, హృదయరంజకంగా లేకుంటే, సభాజనుల నాకట్టుకోలేదు. అలాగే కావ్యం సుందరమై భాసించాలంటే పదాడంబరం, నాలుగుపాదాలకు సరిపడే సుదీర్ఘ సంస్కృత సమాసాలూ, పది పుటల వచనమూ వుంటేచాలదు. రసాత్మకంగా, రమణీయార్థ ప్రతిపాదకంగా వుండాలి. కావ్యానికటువంటి శోభను గూర్చేవే అలంకారాలు. సహజ సుందరులకైనా శోభను పెంచేవి అలంకారాలేకదా.

అలంకారాలు కావ్యాలకు పరిమితంకావు. నిత్య జీవితంలోని చమత్కార భాషణాల్లోనూ అలంకారాలు పాత్ర వహిస్తుంటాయి. మనం వుపయోగించే సామెతల్లో ఏ విధంగా యతి ప్రాసల్లో ఒకటిగానీ, రెండుగానీ, ఒక్కొకసారి ఓ విధమైన లయగానీ వుంటాయో, అదేవిధంగా మనకు తెలియకుండానే ఎన్నో అలంకారాలు మన మాటల్లో దొర్లుతాయి.

కావ్యాల్లో పదే పదే చదువుతున్నా మన కంటిబాటులోలేని చందురుని, మన అనుభవంలోకిరాని శీతనగపు చల్లదనాన్ని వర్ణించుకోడంకన్నా నిత్యజీవితంలో ఎదురయ్యే రకరకాల మనుష్యుల్ని, అనేక సంఘటనల్ని అర్థాలంకారాలకు ఉదాహరణలుగా చెప్పాలనే ప్రయత్నంలో కొన్నింటిని యీ క్రింద పొందుపరచాను.

1. ప్రతీపాలంకారము : ఉపమానాన్ని వుపమేయంగా చెబితే ప్రతీపాలంకారము.

ఉదా : అప్పడం నీ ముఖంలా వుంది.

ఇక్కడ ముఖం ఉపమానం; అప్పడం వుపమేయం; వర్ణించవలసిన ముఖాన్ని ఉపమానంగా చెప్పినందువల్ల ప్రతీపాలంకారము.

2. ఉపమేయోపమ : ఉపమేయాన్ని వుపమానంగా, వుపమానాన్ని వుపమేయంగా మార్చి మార్చి చెబితే ఉపమేయోపమ.

ఉదా : బీదరికం,నిరక్షరాస్యతలాగా, నిరక్షరాస్యత బీదరికం లాగా మనిషిని చిన్నబుచ్చుతాయి.

3. శుద్ధాపహ్నుతి : ఇతర ధర్మాన్ని వర్ణనీయ వస్తువులో నిలపడానికై వస్తువు స్వధర్మం దానియందు లేదని చెప్పడం శుద్ధాపహ్నుతి.

ఉదా : అతడు డాక్టరు కాదు బాబూ! రోగుల్ని చంపడానికి వచ్చిన సాక్షాత్తు యముడు.

డాక్టరు యముడు యమధర్మాన్ని నిలపడానికై అతడి స్వవృత్తి అయిన డాక్టరు కాదని చెప్పడం.

4. దీపకాలంకారము : వర్ణ్యానికీ, అవర్ణ్యానికీ (ప్రస్తుతానికీ, అప్రస్తుతానికీ) ఏకధర్మం చెప్పడం దీపకాలంకారము.

ఉదా : జమీందారుకు డబ్బువల్ల, ఆయన భార్యకు జబ్బువల్ల కళ్ళు కన్పించవు.

ఇక్కడ కళ్ళు కన్పించక పోవడమనేది సామాన్యధర్మం. కారణాలు వేరు.

5. వినోక్తి : అల్పవస్తువు లేకపోవడంవల్ల వర్ణ్యానికి హీనత్వం కలిగితే వినోక్తి.

ఉదా : ఉప్పు లేని కూర ఎంత గొప్పదైనా తినలేం కదా.

ఉప్పు అనే అల్ప వస్తువు లేనందువల్ల గొప్ప వస్తువైన కూరకు రుచిహీనతే ఏర్పడింది.

అల్పవస్తువు పోవడంవల్ల వర్ణ్యానికి గొప్పదనం కలిగినా అది వినోక్తిమే.

ఉదా : మీసాలు తీసేస్తే నువ్వు అచ్చం హిందీ సినిమా హీరోలా ఉంటావు. నే చెప్పలా!

అల్పవస్తువైన మీసాలు పోవడంవల్ల ఆ యువకుడికి హిందీ సినిమా హీరో అనే రమణీయత కలిగింది.

6. అధికాలంకారము : గొప్ప ఆధారానికన్నా ఆధేయానికి ఆధిక్యంచెప్తే అధికాలంకారము.

ఉదా : ఏనుగులు స్నానంచేసే ఆ చెరువులో గజలక్ష్మమ్మ పట్టదులేవయ్యా, కంగారుపడకు.

చెరువు పెద్దదే. ఏనుగులు కూడా స్నానం చెయ్యొచ్చు. కానీ గజలక్ష్మమ్మ అంతకన్నా పెద్దది కనుక పట్టదు. ఆమె ఆ చెరువులో మునుగుతుందని భయపడం అనవసం అని భావం.

7. వ్యాఘాతాలంకారము : ఒక పనికి సాధనమైన వస్తువు తద్విరుద్ధమైన పనికి సాధనం చెయ్యబడితే వ్యాఘాతాలంకారం.

ఉదా:- ఏ భోజనం పేదలను తృప్తి పరుస్తుందో, అదే ధనికులను బాధిస్తుంది.

భోజనం వల్ల పేదలు సంతోషిస్తారు. కానీ అజీర్ణాదిరోగాల వల్ల ధనికులకు ఆ భోజనమే బాధాకరమౌతుంది.

8. కారణమాలాలంకారము : ఒకదానికి మరొకటి దానికి మరొకటి కారణంగా చెబితే కారణమాల. ఒకదానికి మరొకటి, దానికి మరొకటి ఫలితంగా చెప్పినా కారణ మాలయే.

ఉదా : 1. అహంకారం తెలివితక్కువతనం వల్ల, తెలివితక్కువతనం చదువు లేమి వల్ల కలుగుతాయి కాబట్టి మనిషికి చదువు ముఖ్యం.

2. డబ్బు వల్ల వ్యసనాలూ, వ్యసనాల వల్ల రోగాలూ, రోగాల వల్ల మరణం కలుగుతాయి.

9. సారాలంకారము : రాను రాను ఉత్కర్షము వర్ణిస్తే సారాలంకారము.

ఉదా : ఇల్లు బాగుంటుంది. ఇంటికన్నా ఆఫీసు బాగుంటుంది. ఆఫీసుకన్నా క్లబ్బు మరీ బాగుంటుంది.

10. పరివృత్తి : కొద్దదిచ్చి గొప్పది గానీ, గొప్పదిచ్చి కొద్దిది గానీ మార్చుకుంటే పరివృత్తి.

ఉదా : వందరూపాయలు లంచమిచ్చి వెయ్యి రూపాయల ఉద్యోగం సంపాదించాడు శివరాం.

ఇక్కడ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందడం వల్ల పరివృత్తి.

ఉదా : కామాక్షమ్మ పట్టుచీర యిచ్చి స్టీలు చెంబు కొన్నదట, నీకు తెలుసా.

ఇక్కడ పట్టుచీర విలువైంది. స్టీలు చెంబు తక్కువ వెలవి కాబట్టి పరివృత్తి.

11. సమాధి : పనికి కావలసిన కారణం వల్ల గాక మరో కారణం వల్ల ఆ పని సులభంగా నెరవేరితే అది సమాధి.

ఉదా : పిల్లవాడు పరీక్షలు వద్దనుకున్నాడు. స్కూలు బిల్డింగు తగలబడింది.

పిల్లవాడు కోరింది పరీక్షల రద్దు, స్కూలు బిల్డింగు తగలబడ్డం కాదు. కానీ బిల్డింగు కాలిపోవడం వల్ల పిల్లవాడి కోరిక సులభంగా నెరవేరింది కనుక సమాధి.

12. కావ్యార్థాపత్తి : కిముత (చెప్పవలసినదేమి) అనడంచేత అర్థ సంసిద్ధి కలిగితే అది కావ్యార్థాపత్తి.

ఉదా : ఆ తాయారమ్మ నోటికి భూతాలే జడుస్తాయే, వాళ్ళాయనొక లెక్కా!

అందరినీ జడిపించే భూతాలు కూడా తయారమ్మ నోటికి జడుస్తాయి. ఇక వాళ్ళాయన సంగతి చెప్పవలసినదేమి?

13. కావ్యలింగము: సమర్థింప వలసిన దానికి సాధనం చెప్పడం కావ్యలింగం.

ఉదా : నేను చదవకుండానే ప్యాసయినాను. మా నాన్న ఎమ్మెల్లే.

చదవకుండా ప్యాసవడం అసాధ్యంకదా అంటే దానికి సమర్థనము వాళ్ళ నాన్న ఎమ్మెల్లే కావడం.

14. మీలనము : సాదృశ్యము వల్ల భేదమే కనబడక పోతే మీలనము.

ఉదా : ఆమె కందెన ముఖంలో కాటుక కూడా కన్పించడం లేదు.

15 అనుగుణము : ఒక వస్తువుకు మునుపుండిన గుణమే మరొక వస్తువు సన్నిధిలో మరింత పెరిగినట్లు చెబితే అది అనుగుణము.

ఉదా : ఈ కోతి వెధవ ఆ రాజుగాడితో స్నేహంచేసి మరీ చెడిపోయాడండీ.

అసలేకోతివెధవ. రాజుగాడనువాడి స్నేహంవల్ల ఆ గుణమే మరీ ఎక్కువైంది కాబట్టి అనుగుణము.

16. ఉన్మీలితము : భేదస్ఫూర్తి చెప్పబడితే ఉన్మీలితము.

ఉదా : అమావాస్య చీకట్లో ధూమేశ్వరరావు సిగిరెట్ పొగ వల్ల ప్రత్యేకంగా తెలుస్తాడు.

అమావాస్య చీకట్లో ఏవస్తువూ కనబడలేదు. కానీ ధూమేశ్వరరావునుమాత్రం సిగిరెట్ పొగవల్ల ప్రత్యేకంగా గుర్తుపట్టవచ్చు. అంటే అంత ఎక్కువగా సిగిరెట్లు కాలుస్తాడన్నమాట.

17. ఉత్తరాలంకారము : ఒక ప్రశ్నకు అదే జవాబైనా, రెండు ప్రశ్నలకు ఒకే జవాబైనా ఉత్తరాలంకారము.

ఉదా : వాడు ఏ సెక్షనులో పనిచేస్తాడు? ఇది ప్రశ్న. జవాబూ అదే; వాడు 'ఏ' సెక్షనులో పనిచేస్తాడు.

గాలిని కదిలించేదేది?
సినీతారకు ఉత్తరం రాసేదెవరు — ఫ్యాను.

రెండు ప్రశ్నలకూ ఒకే జవాబు.

18. ప్రతిషేధము : చెప్పకుండానే ప్రసిద్ధమైన నిషేధాన్ని మళ్ళీ చెబితే ప్రతిషేధము.

ఉదా : అమ్మా! యిది వంటిల్లు కాదు, ఆఫీసు.

నెమ్మదిగా పనిచేస్తున్న టైపిస్టును చూచి నెమ్మదిగా పని చేయడానికిది వంటిల్లు కాదు, ఆఫీసు. పని త్వరగా కావాలి అని చెప్తున్నాడు ఆఫీసరు. ఆఫీసు వంటిల్లు కాదన్నది ఇదివరకే ప్రసిద్ధం. కానీ మళ్ళీ చెప్పడం వల్ల ప్రతిషేధము.

19. నిషేధాభాసము : నిషేధము వలె కనబడుతుంది కానీ నిషేధము కాదన్నది నిషేధాభాసము.

ఉదా : బాబూ! యివి చేతులు కావు. నా బిడ్డను కాపాడండి. పట్టుకున్నది చేతులనే. చేతులనే చేతులు కాదనడం నిజమైన నిషేధం కాదు కాబట్టి నిషేధాభాసము.

20. మిథ్యాధ్యవసితి : ఒకదాని మిథ్యాత్వం నిరూపించడం కోసం మరొక మిథ్యను కల్పించడం మిథ్యాధ్యవసితి.

ఉదా : లాటరీలో ఇరవై లక్షలు వస్తే సినిమా తీద్దువులే.

లాటరీలో ఇరవై లక్షలు రావడమెంత నిజమో, సినిమా తియ్యడమూ అంత నిజమే. రెండూ మిథ్యలే అని అర్థం.

21. వికల్పము : సమాన బలములు గలవానికి విరోధము కలుగ జెబితే వికల్పము.

ఉదా : పరీక్ష రిజల్టు రానీ, నీకు సైకిలో, సైకిలు రిక్షానో కొనిపెడతాను.

సైకిలు కొనడం పాఠ్యాలకి ప్రోత్సాహకరంగా, సైకిలురిక్షా కొనడం ఫెయిలైతే అంటే చదువు ఆపేసి రిక్షా తొక్కడం కోసం. ఒకదానికొకటి వ్యతిరేకం కనుక వికల్పాలంకారం.

22. విరోధాభాస : విరోధమున కాభాసత్వము అంటే విరోధమున్నట్లు కన్పిస్తుందే కానీ నిజంగా విరోధం లేకుంటే విరోధాభాస.

ఉదా : ఆ వర్తకుడి అంగట్లో టోపీలు లేకున్నా కొనేవారి కతనం టోపీ పెయ్యగలడు.

టోపీలున్నప్పుడు కదా టోపీ వెయ్యగలిగేది ! టోపీలు లేకున్నా టోపీ వేస్తాడనడం విరోధం. టోపీ వెయ్యడం అంటే మోసం చెయ్యడం అనే అర్థం వుంది గనుక నిజంగా విరోధం లేదు కాబట్టి విరోధాభాసం.

23. వికస్వరము : ఒక విశేషం చెప్పి, దాన్ని సామాన్యంతో సమర్థించి ఆ సమర్థనంతో తృప్తిపడక మరొక విశేషం చెప్పడం వికస్వరం.

ఉదా : ఏమే! కాసేపు ఆ వాగుడు కట్టిపెట్టి వెళ్ళి లైబ్రరీలో కూర్చో. లైబ్రరీలో కూర్చుంటే చదువుకున్నదాని వనుకుంటారు. స్థానమహిమవల్ల కొందరికి గొప్పదనం వస్తుంది. లక్షాధికారి వెంగళరావు భార్య మెడలోవుండే గిల్టునెక్లేసును బంగారని ఎవరనుకోరు?

లైబ్రరీలో వుంటే చదువుకున్నదనుకుంటారనేది విశేషం. స్థాన మహిమ వల్ల కొందరికి గొప్పదనం వస్తుందనే సామాన్య విషయం. దీనిపై విశేషం సమర్థింపబడింది. దాంతో తృప్తిపడక "లక్షాధికారి ......ఎవరనుకోరు" అని మరొక విశేషం చెప్ప బడింది గనుక వికస్వరం.

24. వ్యాజనింద : నింద వల్ల నింద స్ఫురిస్తే వ్యాజ నింద.

ఉదా : రివర్షు విచిన జగన్నాథం గార్ని నాలి కానీ గుర్నాథాన్ని మెందుకు ?

గుర్నాధం లంచగొండి. అతడికి రివర్షనిచ్చినా గుణం మారలేదు. రివర్షనివ్వకుండా వుద్యోగమే తీసేసివుంటే ఆ లంచగొండితనం వుండదు కదా. రివర్షనిచ్చాడని జగన్నాధం గార్ని నిందించడం వల్ల లంచగొండి గుర్నాథం నింద తెలుస్తున్నది కనుక వ్యాజనింద.

25. అతద్గుణము : తనకు దగ్గరగా వున్నా, తనతో కలసినా అన్య పదార్థము గుణాన్ని స్వీకరింపకుండటం అతద్గుణము.

ఉదా : బొగ్గు గనుల్లో పనిచేస్తున్నా రామనాధం ముఖం ఎప్పుడూ నల్లబడలేదు.

బొగ్గు గనుల్లో పనిచేసేవారి ముఖం నల్లబడాలి కదా. కానీ రామనాధం ముఖం నల్లబడలేదు. అంటే అతడెప్పుడూ యితర్ల చేత మాటపడలేదని అర్థం.

కుమారి జె. వి. సుబ్బలక్ష్మి

నిరుధాన

తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనల రాగిరేకు ప్రారంభంలో ఈ వాక్యం కనిపిస్తుంది.

"స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు ౧౩౪౭ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళ నాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శక వరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభిసంవత్సర ఫాల్గుణ బ ౧౨ నిరుధానకు తిరువేంగళ నాథుని మీఁదను అంకితముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన శృంగార । అధ్యాత్మ సంకీర్తనలు."

అన్నమాచార్యుల సంకీర్తనలను తొలిసారిగా శాస్త్రీయమైన దృష్టితో పరిష్కరించిన కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు — "నిరుధానకు (నిరోధానకు? తిరోధానానకు)" అని చిప్పలలో సూచించారు.[1] తర్వాత ఈ సంకీర్తన వాఙ్మయ పరిష్కరణాన్ని కొనసాగించిన నా గురువర్యులు కీ. శే. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు – "ఈ శబ్దము అపరిచితము. శ్రీ ప్రభాకరశాస్త్రి గారు 'నిరోధానకు? తిరోధానానకు?' అని సందేహముతో పాఠము సూచించిరి. 'సరిగా' అను నర్థమున ప్రయోగించినట్లున్నది. ఇది యింకను అన్వేషణీయము."[2] శాస్త్రిగారి తర్వాత కొంతవరకు పరిష్కరణ భారాన్ని వహించిన అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారు "ఈశబ్దము అపరిచితము. అస్మద్గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'నిరోధానకు? తిరోధానానకు' అని సందేహముతో పాఠము సూచించిరి. నిరుధానము అనగా చనిపోవు అను అర్థమున ప్రయోగించినట్లున్నది."[3] కొన్ని తాళ్ళపాకవారి సంకీర్తనలను పరిష్కరించిన శ్రీ పి. టి. జగన్నాథరావుగారు— "ఈపదము నిరోధ శబ్దమునకు సంబంధపడినది. నిర్యాణమువరకు నను నర్థమునఁ బ్రయోగింపబడినది. (నిరోధము = వినాశము.)[4] ఈ వాఙ్మయ పరిష్కరణాన్ని రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారితో కలసి, తర్వాత ఒంటరిగ సాగిస్తున్న శ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారు "ఈ శబ్దము 'నిరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారిక రూపముగా గానవచ్చుచున్నది. అడ్డగింపు, అవధి – అని యర్థము. అనాఁడు కడపటి దినమని తాత్పర్యము. కీ. శే. ప్రభాకరశాస్త్రి గారూహించిన 'సరియగు' అనునర్థము తాత్పర్యార్థము గావచ్చును.◆ అవధి అను నర్థములో 'ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు' అను తరిగొండ వెంగమాంబగారి ప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్య అకాడమీవారి 'విష్ణు పారిజాతము' (౯౫ పుట) నేనీ ప్రయోగమివ్వగా శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత

కృష్ణశర్మగారు 'నిఋత్తం' అను అరవ పదముగూడ "నిలుపు" అను నర్థముతో దీనికి సహాయపడుననిరి."[5]

ఈ తాళ్ళపాక వాఙ్మయం గురించి పరిశ్రమిస్తున్న నాకు 'విరుధాన' శబ్దం మీద ఒక వింత మమకారం ఏర్పడ్డది. తాళ్ల పాక కవుల పాటలలో మరెక్కడైనా ఈ ప్రయోగం కన్పిస్తుం దేమో అని వెదికాను. ఇంతవరకు అది అదృష్టమే. మరి యే యితర తెలుగు కవులలో కూడ ఈ ప్రయోగం నాకు కనిపించలేదు. కాని కొన్ని శాసనాలలో ఈ ప్రయోగం వుంది:

(i) నిరుద్ధానకు [హరిహర, II. 1382 క్రీ. శ.]

(ii) [ని] రుద్ధానకు [అచ్యుత, 1532 క్రీ. శ.]

(iii) నిరు [పా]నకు [అచ్యుత, 1532 క్రీ. శ.]

(iv) నిరుధానకు [సదాశివరాయలు, 1547 క్రీ. శ.]

(i) నెం. 6. [అ. రి. నెం. 404, 190:]

చిలమకూరు, కమలాపురం తాలూకా, కడప జిల్లా, అగస్త్యే శ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఒక స్తంభం మీద మలచిన శాసనం.

ఉదయగిరి సీమను హరిహర దేవరాయలు కుమారుడు మహామండలేశ్వర వీరదేవరాయ ఒడయిలు పాలించేవారు.

హరిహర, 1382 క్రీ. శ.

....

40. .... మా [శీమం] జెల్లే సగం బాలి

41. కిని ఒడంబడను అథ[ర]ుగొని యీ దినం

42. నిరుద్ధానకు యీ స్తావానకుం జెల్లే అటువంటి

43. మా సగం

44. ప్రిత్తి మేరసై

45. తమైన అష్ట

46. భోగ తేజ

47. సాం మ్యతలు

48. ంన్ను ఈ దినం

49. ఆరభ్యంగాను.

(ii) నెం. 97. [అ. రి. నెం. 542, 1919]

చిన్న కాంచీపురం, కాంచీపురం తాలూకా, చంగల్‌పట్ జిల్లా, అరుళాళ పెరుమాళ్ గుడి.

అచ్యుతరాయలు, 1532 క్రీ. శ.

[విషయం— అచ్యుతరాయలు కిరీటధారణం చేసిన రోజు కొందరు పాళెగార్లకు అభయమివ్వడం. పాండ్యరాజు కూతురిని పరిణయం కావడం. వరదరాజస్వామిని దర్శించి కైంకర్యాలు చేయడం.]

పాఠము

2. .... విరోధి సంవత్సర కార్తీక మాసం ...దలు నందన సంవెత్సరం అషాఢమాస [ని]రుద్ధానకు కా: కెంగ సమ పిం౦చిన గ ౪ం౫ నైవేద్యానకు సమపిం౦చిన ం౫ం ఉభయం గ ౫ల౫ పితాంబర ంకి తట్టు ంకిన్ని చెఱగులు ౨ కిన్ని తిరు [మ] హారాల కిచ్చిన. ....

(iii) నెం. 98 [అ. రి. నెం. 158, 1924]. కాళహస్తి, చంద్రగిరి తాలూకా, చిత్తూరు జిల్లా, కాళహస్తీశ్వరాలయము మూడవ ప్రాకారం యొక్క ఉత్తరం, పడమర గోడలమీద.

అచ్యుతరాయలు, 1532 క్రీ. శ.

4. రం శ్రావణ బ ౧౦ నిరు[పా]నకు కానికగాను సమ పిం౦చిన.

(iv) నెం. 161. [అ. రి. నెం. 409, 1926].

మిడుతూరు, నందికోట్కూరు తాలూకా, కర్నూలు జిల్లా, చెన్నకేశవస్వామి గుడి ప్రాకారంలో ఒక ఫలకం మీద.

సదాశివ, 1547 క్రీ. శ.

9. ....సదాసివదేవ మహారా

10. యులుంగారు। మాకు అమరనాయంకరానకు పాలించిన మిరుతూరి గ్రామా

11. నను స్వామికి పూర్వాన చెల్లివచే క్షేత్రం హసాశి ప్రమాణం కొలపాటి ఖ ౨౫॥౨ కున

12. యి నిరుధానకు చెల్లివచె క్షేత్రమును.

రేకులోని వాక్యాన్ని పరిశీలిస్తే, అన్నమాచార్యులవారు నిర్వహించిన సంకీర్తన యజ్ఞం ప్రారంభ పరిసమాప్తాలను తెలప దేమే అని తోస్తుంది. '.... .. అది మొదలుగాను .... బ. ౧౨ నిరుధానకు.......' బహుళ ద్వాదశి దాక, వరకు అనే అర్థాలు పొసగుతాయి. గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు ఈ శబ్దం గురించి

చేసినచర్చ కొంత ... నది. శాసనస్థమయిన ప్రయోగాలను పరిశీలిస్తే దినం, మా..., తిథుల తర్వాత ఈశబ్దాన్ని వాడడం గ..ంచవచ్చు. ఒక నిలుపును, అవధిని ఖండితంగ తెలపడం కాలేలు.

ఈ ప్రయోగాలను, చర్చను శ్రీమాన్ రాళ్ళపల్లివారి దృష్టికి తేగ వారు 2౧.7-77 బెంగుళూరునుండి ఉత్తరం వ్రాశారు — " 'నిరుద్ధ' శబ్దార్థం నీ పరిశీలనతో స్థిరమైనది. 'నిఱుత్తం' అనే మిళ పదము నిఱుతం - నిరుధంగా పరిణమించేది ఆ భాషలో ...ం. నిరోధ-నిరుద్ధ శబ్దాలకు ఆ యర్థంలో సంస్కృత వ్యవహారం కానరాదు. తెలుగులోను క్వాచిత్కముగానే ఒకప్పుడుండి ...యినదనిపిస్తుంది. ఎట్లైనా అర్థభేదం లేదు. ఇట్టి పదాలెన్ని ...క్రమంలో ఊడిపోయినవో ప్రాచీన వాఙ్మయం పరిశీలిస్తే తెలుసుకోగలము. తమిళంలోను నాటి-నేటి మాటలలో ఎక్కడైనా వాడుకలో నుండునేమో పరిశీలింప దగును."

బహుభాషా కోవిదులైన పండితుల పరిశీలనకు ఈ శబ్దాన్ని అందిస్తున్నాను. ఈ చర్చ క్షోదక్షమమనే నా విశ్వాసం.

◆ శాసనాలకు ఆకరం :

ద. దే. శ. సం XVI, [అర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి తెలుగు ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ది విజయనగర్ డయినస్టీ].

1. శృం. సం. సంపు. 4, పుట 1, తి. తి. దే. 1949.
2. శృం. సం. సంపు. 12, పుట, 1, క్రీగీతలో, తి. తి. దే. 1956.
3 శృం. సం. సంపు. 15, పుట 1, క్రీగీతలో, తి. తి. దే. 1961.
4 శృం. సం. సంపు. 18, పుట 1, క్రీగీతలో, తి. తి. దే. 1964.
5 శృం. సం. సంపు. 22, పుట 1, క్రీగీతలో, తి. తి. దే. 1975.

◆ ...తియగు' అనే అర్థాన్ని శాస్త్రిగారూహించినట్లు శర్మగారు వ్రాయుటకు ఆధారము కనిపించదు.

శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు

లేఖలు

ప్రమాదో ధీమతా మపి

జులై 1983 భారతిలో శ్రీ కాపూరి పాపయ్యశాస్త్రి వ్రాసిన శ్రీమద్రామాయణ కల్పవృక్షము - బాలకాండము - కవితా రామణీయకత అనే వ్యాసం చక్కని పరిశీలనకి తార్కాణ —

శాస్త్రిగారు రామకథ వివరిస్తూ "కూజంతం రామ రామేతి" అనే శ్లోకం విశ్వనాథ రచించినట్లు వ్రాశారు—. "ఆ రామాయణ మహీరుహంపై కవికోకిలలు కూర్చుని మధురంగా గానంచేస్తాయి ఆ నాడు ఆ కోకిల వాల్మీకి. ఈ నాడు ఆ కోకిల విశ్వనాథ.

కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితాశాఖామ్ వందే వాల్మీకి కోకిలమ్॥

పై పద్యంలో ఇంతటి భావమరందతుందిలము గావించి నాడు విశ్వనాథ.

"త్రచ్వినకొద్దీ తరగనిసంపద. త్రాగినకొద్దీతరగనిరసధార."
(జూలై భారతి 1983, 43వ పేజీ)

ఇలా వ్రాయడంవల్ల విశ్వనాథే "కూజంతం" అనే శ్లోకాన్ని వ్రాసినట్లు అనిపించదా? శ్రీమద్రామాయణం నిత్యానుసంధేయంగా పారాయణం చేసే వారంతా అనూచానంగా పై శ్లోకాన్ని ప్రార్థనా శ్లోకాల్లో పఠిస్తారు. ఆ శ్లోకకారు లెవరో తెలియదుగాని, విశ్వనాథ మాత్రం కాదు. ఈ తప్పు ఎలా దొర్లిందో!

ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు,
నూజివీడు.

"అప్పిన్నది" - "నప్పిన్నయి" పాఠనిర్ణయము

"ఆముక్తమాల్యద" మహాకావ్యావతారికలో ఆంధ్రరాయడగు విష్ణువు, కన్నడరాయడైన శ్రీకృష్ణదేవరాయలకిట్లానతిచ్చెను:

"ఎన్నినుఁ గూర్తునన్న, విను, మేమునుదాల్చిన మాల్యమప్పిన్న
ప్పిన్నది రంగమందయిన పెండిలి సెప్పము .... "

ఏ నిన్ను ఉద్దేశించి కథను వ్రాయుదునంటివా వినుము నేనును తాను ముందుగా ధరించిన దండను


నాకు పిమ్మట సమర్పించు చుండిన యాబాలికయు శ్రీరంగమందు చేసికొనిన వివాహము వర్ణింపుము అని అర్థమయి యున్నది. వేదమువారి సంజీవనీ వ్యాఖ్య ఇట్లే వివరణ వ్రాసినది.

ఇందు "దాల్చిన మాల్యమిచ్చు నప్పిన్నది" అను వాక్యము తికమక పెట్టుచున్నది. ఇచ్చున్ + అప్పిన్నది = ఇచ్చునప్పిన్నది. ధరించిన దండను సమర్పించు అపిన్నది ఉన్నదే అది అని చప్పున అర్థమువచ్చును. కానీ యిది అంత సూటి వ్యవహారము కాదని నాయూహ. "అప్పిన్నది" అన్నచోట నున్నది కిటుకంతయును. ఇందు కవి గడుసుదనము చూపించినాడు అని నాకెప్పుడును అనిపించుచుండును. ఆ శబ్దము "అప్పిన్నది" కాదు "నప్పిన్నయి" అయి యుండునని నా అనుమానము. అప్పుడు వాక్యము "దాల్చిన మాల్యమిచ్చు నప్పిన్నయి" అగును. ఇందును గణ యతి ప్రాసములు కుదిరినవి. "నప్పిన్నయి" శబ్దార్థము శ్రీవైష్ణవులు రకరకాలుగా నిచ్చెదరు. కొందరు "నప్పిన్నయి" శ్రీకృష్ణమహిషి అనియు, ఈమెయే నీళాదేవి (విష్ణువుకు ముగ్గురుదేవేరులు శ్రీభూనీళలు) అని యందురు. మఱికొందరు ఆనీళాదేవి గోదాదేవిగా పుట్టినదనియు న[illegible]. వీరి ప్రకారము "నప్పిన్నయి" గోదాదేవియే. నప్పిన్నయి" [illegible]నిన అరవములో "నాపిన్నది" అని అర్థము చేయవచ్చును. విష్ణువుకు గోదాదేవి "నాపిన్నదే" మనకు [illegible] కావచ్చును.

ఇప్పుడు కావ్యపద్యములో అప్పిన్న [illegible] అను రెండుపాఠభేదములకు పోటీవచ్చును "ఎ[illegible] అన్నదానికి "అప్పిన్నది" అనునది తూగునిచ్చు[illegible] శబ్దముగా భాసించును. ఇది ఈ పాఠము సుగుణ[illegible]

"నప్పిన్నయి" అను పాఠములో ద్రా[illegible] సారమూ, ఆర్షపురాణ విషయమూ ప్రతిబింబించుచున్నవి. ఇవి ఈ పాఠ సుగుణములు. పాఠము "నప్పిన్నయి" యని యుండినదే ఔచిత్యమని నా అభిప్రాయము నేను పాఠాంతర పరిశోధన చేయలేదు. నాకు శ్రీవైష్ణవమత పరిజ్ఞానమునులేదు. కానీ సంగతిసందర్భములు యోచించి యిది వ్రాసినాను. రసజ్ఞులు, శ్రీవైష్ణవ పుంగవులు ఇందలి సామంజస్యమును నిర్ణయింతురు గాక.

"తి"



గ్రంథ విమర్శలు

ంధ్ర భారతముల త్మక పరిశీలనము

వన: శ్రీ వి. ఎస్. రాఘవన్, 360 పేజీలు. వెల:
7-2 లు. ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి,
సైఫ హైదరాబాద్ - 500 004.]

ంటే భారతం వినాలి" అంటారు ఆంధ్రులు. తెలుగు వారికి ష్టదైవం రాముడయినా, మిక్కిలి ఇష్టమయిన గ్రంథం భారతమే. మన పొరుగున ఉన్న తమిళులకు ఇష్టదైవం మురుగన్ అయినా, వారిలో అధిక సంఖ్యాకులు అభిమానించేది కంబరామాయణం. తమిళంలోకూడా భారతం వ్రాయబడక పోలేదు. కాని పలు కారణాలవల్ల తమిళ భారతం అంతగా ప్రజాదరణకు నోచుకోలేదు. అందుకు కొన్ని కారణాలు వివరిస్తూ "తమిళాంధ్ర భారతముల తులనాత్మక పరిశీలనము" చేశారు శ్రీ వి ఎస్. రాఘవన్ గారు.

తమిళనాడులో ప్రతి గ్రామంలోనూ ద్రౌపది అమ్మన్ కోయిల్ ఉంటుంది. ద్రౌపదికి మిక్కిలి కోలాహలంగా పూజలు జరుగ ను. ద్రౌపది అనే పేరుగల స్త్రీలు కూడా కనిపిస్తారు. భారత ను పలువురు కవులు తమిళంలో వెలయించారు. దాదాపు 23 త తాలున్నాయని రాఘవన్‌గారు వెల్లడించారు. వీటిలో ముఖ్య కవి వ్రాసిన భారతంతో కవిత్రయం రచించిన ఆంధ్ర న్ని పోల్చి చూడటం ఈ రచయిత ముఖ్య ఉద్దేశం.

తమిళంలో ఇన్ని భారతములు వెలసినప్పటికీ ప్రజానీకంలో భారత కథకు అంతగా ప్రాచుర్యం, ఆదరణ లేకపోవడానికి రచయిత కొన్ని హేతువులు పేర్కొన్నారు. 1) తమిళ శైవులు కృష్ణ ప్రాధాన్యత కలిగిన భారతాన్ని అభిమానించరు. 2) దౌత్యము, సారథ్యమూ నిర్వహించిన భారత కృ ని యెడ తమిళ వైష్ణవులకు వైముఖ్యంవుంది. 3) ఇక భారతం పాఠ్య గ్రంథమైతే కథకు సంబంధించిన కొంటె ప్రశ్నలతో విద్యార్థులు ఉపాధ్యాయుల్ని వేపేస్తారు. 4) తరగతులలో భారత పాఠము చెప్పనప్పుడు అన్యమతస్థులు హిందూ విద్యార్థులను పరిహసిస్తారు.

ఇలాంటి హేతువులు వివరిస్తూ రచయిత ద్రావిడకజగం వారి ప్రభావాన్ని గురించికూడా ప్రస్తావించారు. కజగంవారి ప్రభావం ఎంత ఉన్నా నేటికీ తమిళనాడులో దైవభక్తికి ఏలోటూ రాలేదు. పైగా పైన పేర్కొన్న కారణాలు ఒక్క తమిళనాడుకు మాత్రమే పరిమితం కావడానికి ఆస్కారంలేదు. తమిళులు అనువాద గ్రంథాలను ఆదరించరన్న ఉపపత్తి కొంతవరకు హేతుబద్ధంగా ఉంది. ఒక్క కంబ రామాయణం తప్ప తక్కినవేవీ అంతగా ప్రాచుర్యం పొందినట్లు కనిపించదు. తమిళులకు 'శిలప్పదికారం' మున్నగు స్థానిక కథా వస్తువులపైనే ఎక్కువ మక్కువ ఉన్నట్లు తోస్తుంది.

శ్రీ వి. ఎస్. రాఘవన్‌గారి తులనాత్మక పరిశీలన ఆసక్తిదాయకంగా సాగింది. పెరుందేవనార్ రచించిన భారత వెణ్బా, విల్లి విరచించిన భారతం ఈరెంటినుంచీ ఎన్నో ఉదాహరణలు గైకొని కృతకృత్యులైనారు. అందునా ముఖ్యంగా సంస్కృతాంధ్ర భారతములకంటె విభిన్నమైన కల్పనలు ఉటంకించడం ఎంతైనా ఉచితంగా ఉంది.

దుర్యోధనుడు యుద్ధ ప్రారంభానికి మంచి ముహూర్తం చెప్పమని భీష్ముని కోరాడు. నీ శత్రువైన సహదేవుణ్ణి అడగమన్నాడు భీష్ముడు. సంకోచంతోనే తన్ను సమీపించిన దుర్యోధనుని కోరికను మన్నించి సహదేవుడు నిస్సంకోచంగా శుభముహూర్తం పెట్టాడట!

సహదేవుణ్ణి గురించే మరో కల్పన: శ్రీకృష్ణుడు రాయబారానికి వెళ్తూ యుద్ధం నివారించడానికి మార్గమేమిటని సహదేవుణ్ణి అడిగాడు. అతడు నిర్భయంగా "నీ కాళ్ళుచేతులు కట్టి చెఱలో వేయించుట, ద్రౌపది శిరోముండనము, అర్జునుని సంహరించుట, కర్ణుని రాజు చేయుట" అని చెప్పాడు.

ఉలూపి కుమారుడు ఇరావంతుని గురించి అమూలకమైన ఓ ఉదంతం విల్లి భారతంలో ఉంది. ఇరావంతుడు కర్ణుని మించిన దాత. దుర్యోధనుడతన్ని కళబలి (యుద్ధరంగానికి ఇచ్చే బలి) కమ్మని కోరగా అతడు అంగీకరించాడు. ఇది తెలుసుకుని కృష్ణుడు ఇరావంతుణ్ణి మాయమాటలతో మోసగించి పాండవుల తరపున కళబలి గావించాడు.

ద్రౌపది మనస్తత్వం గూర్చిన మరో కథను విల్లి భారతం నుండి ఉదహరించారు రచయిత. పాండవులు అరణ్యవాసం చేస్తూ ఉన్న సమయంలో ఆ సమీపంలో ఒక ముని తపమాచరిస్తూ ఉండేవాడు. అతని ఆశ్రమంలోని ఉసిరిక చెట్టుకు గల పండును చూసి ద్రౌపది ఆశపడి అర్జునుణ్ణి అడిగింది. అర్జునుడు బాణంతో దాన్ని నేలరాల్చాడు. తరువాత ఆ పండు మహిమాన్వితమైనదనీ, దాన్ని నేలరాల్చినందుకు తపస్సు చాలించాక ముని ఆగ్రహించ గలడనీ తెలిసి పాండవులు భీతులై కృష్ణుని ధ్యానించారు. కృష్ణుడు ప్రత్యక్షమై మీ మనస్సుల్లోని కోరికలను దాచక చెప్పితే పండు మళ్ళీ వృక్షాన్ని అంటుకుంటుందని తెల్పాడు. పంచ పాండవులు తమ మనస్సులలోని విషయాలను చెప్పారు. కాని అవి అసత్యాలవడంచేత పండు యథాస్థానం చేరలేదు. తుదకు ద్రౌపది "షష్ఠో మే రోచతే పతిః" అని చెప్పింది. ఆమెకు కర్ణునిపై కూడ ప్రేమ కలదన్న సత్యం వెల్లడి కావడంతో పండు చెట్టును చేరుకుంది. అందరూ సంతోషించారు. ఈ కథ విల్లి భారతంలోనే గాక ఒకానొక కన్నడ భారతంలో కూడ ఉంది.

విల్లి భారతంలో కర్ణుని గూర్చిన కల్పనలు కూడ కడు హృద్యములై ఉన్నాయి.

కర్ణుడు యుద్ధరంగంలో క్రుంగిన రథము నెత్తే ప్రయత్నంలో ఉన్నాడు. అప్పుడు కృష్ణుడు బ్రాహ్మణ వేషంతో అతన్ని సమీపించి "నీవు చేసిన పుణ్యము ను దానము చేయు"మని యాచించాడు. కర్ణుడు వెనువెంటనే తన శరీరమున గ్రుచ్చుకున్న బాణములను లాగివేసి వెడలివచ్చు రక్తధారతో ఆ బ్రాహ్మణునికి తాను చేసిన పుణ్యం ధారపోశాడు. అంతట బ్రాహ్మణుడు నారాయణ స్వరూపుడైన అతనికి ప్రత్యక్షమై అనుగ్రహించాడు.

కర్ణుడు నేలగూలిన వార్తను ఆకాశవాణి కుంతికి తెలిపింది. వెంటనే పరుగున వచ్చి కర్ణుని శిరమును ఒడిలో పెట్టుకుని విలపిస్తూ పాలిచ్చింది. అతడు తన పుత్రుడే అన్న సత్యం సర్వులకూ వెల్లడించింది.

ఇలాంటి కల్పనలు ఇంకా అనేకములు. వీనిని రాఘవన్ గారు ఉచిత రీతిని ఉటంకించారు. తెలుగు భారతమునుండీ, విల్లి భారతమునుండీ తులనాత్మకంగా ఎన్నో ఉదాహరణలిచ్చి గ్రంథ రచనకు వన్నెతెచ్చారు.

విల్లి తన పద్యాల్లో "చెవి, పసు, చెప్పు" మున్నగు తెలుగు పదాలు వాడి తన ఆంధ్రభాషాపాండిత్యం ప్రకటించారనీ వ్రాశారు రచయిత. ఈ పదాలే కాక ఇలాంటి ఎన్నో మూల ద్రావిడపదాలు కంబ రామాయణం మున్నగు [illegible]న తమిళ గ్రంథాల్లో అక్కడక్కడ ప్రయుక్తములైనాయి. అంతమాత్రాన [illegible] పదాలు అనుకోనక్కరలేదు. ఉదాహరణకు "పులు (చేయి)" తెలుగు కావ్యాల్లో ప్రయుక్తములైనాయి. తమిళ పదాలుగా భావించరాదు. అవి మాండలిక[illegible] లోను, తమిళంలోను మిగిలిపోయిన మూల ద్రావిడ మాత్రమే.

"శిఅప్పుప్పాయిరం" అన్న సమాసం [illegible] "శిర ప్పాయిరం"గా (అచ్చుతప్పు అనుకోవడానికి వీల్లేకుం[illegible]డు చోట్ల ముద్రితమైంది. ఎందుకో?! భారత కథ [illegible]మనీ, వాల్మీకి రామాయణానికి పోటీగా వ్రాయబడిందనీ చెబ[illegible]క్కు ఉపపత్తులు ప్రతిపాదించారు రచయిత.

మొత్తంమీద ఆంధ్ర తమిళ భారతముల తులనాత్మక పరిశీలన ప్రయోజనకరంగా ఉంది. జాతీయ భావసమైక్యతను పెంపొందించడానికి ఇలాంటి గ్రంథాలు ఇంకా విరివిగా వెలువడగలవని ఆశించవచ్చు.

శ్రీ పులిచెర్ల సుబ్బారావు

వజ్ర సంకల్పం (వచన కవితా సంకలనం)

[సంకలన కర్తలు : వెంపల వెంకట శివప్రసాద్, పెమ్మరాజు గోపాలకృష్ణ. వెల : రు. 3–00 లు. ప్రతులకు : 1) వెంపలి వెంకట శివప్రసాద్, బోయినవారి [illegible] అనకాపల్లి – 531 001. 2) పి. వి. రమణమూర్తి, జోగినాయుడు వీధి, అనకాపల్లి–531 002.]

ఈ కవితా సంకలనం రేపటి సామ్యవాద వ్యవస్థ కోసం ఈనాటి పీడిత సమాజంలోని ఆగ్రహోదగ్రులైన యువతరం రాసినది. ఈనాడు కవిత్వం రాస్తున్న చాలా మందికి వారి అక్షర శక్తిమీద, దాని ప్రభావంమీద అచంచలమైన విశ్వాసం ఉండటం సాధారణమై పోయింది. శివారెడ్డిగారు 'నా తపన' అంటూ రాసిన కొన్ని వాక్యాలు యువకులందరూ గుర్తుంచుకో తగ్గవి. "ఈ నలభై మంది కవుల్లో ఐదేళ్ళ తరువాత ఎంతమంది మిగుల్తారో చూడాలి. పదేళ్ళ తరువాత మరెంతమంది కవిత్వం రాస్తూ ఉంటారో చూడాలి." విప్లవం పోరాటం, తిరుగుబాటు ఇత్యాదులైన మాటలు కవిత్వంలోనూ, జీవితంలోనూ ఫ్యాషన్‌గా మారకూడదని చాలామంది ఆశిస్తున్నారు.

ఈ కవితా సంక   ి మంచి కవిత్వముందని చెప్పటానికి వె ాడవలసిన అవసరం లేదు. కవిత్వం చెప్పే పద్ధతిలో ఌ, నేర్పు ఈ కవులకు పుష్కలంగా ఉందని చాలా కవితలు ఖావు చేస్తున్నాయి.

ఏ పాపమూ తెలియని కొండల్ని
కోసం పేల్చేయడం లేదూ ?
ంమూ ఎరుగని వృక్షాల్ని
కట్టెల కోసం నరికెయ్యడం లేదూ ?
మరి
పాపాలే మోసాలే చేస్తూ
మన నెత్తురు పీల్చేస్తున్న జలగల్ని
మనందరి కోసం ఏదైనా చేస్తే తప్పా ?

ఈ గేయంలో భావం వాచ్యం కాకపోయినా కవితా పాఠకులకు స్పష్టంగానే అర్థం అవుతుంది. కార్య కారణ సంబంధం కవితాత్మకంగా చెప్పినప్పుడే దాని ప్రభావం ఫలవంతమవుతుంది. అట్లాంటిదే మరొక గేయం.

చెకుముకి రాళ్ళ రాపిడికి శిరసెత్తుతుంది అగ్నికణం
అడవి వృక్షాల ఒరిపిడికి పుడుతుంది లావా లాంటి దావానలం
సెలయేటి కెరటాల ఉరవడికి
గులకరాయి గొంతు విప్పుతుంది.
శోభితా్రఖు జలపాతాల తాకిడికి
గుండెల జనరేటర్లు చలించి జ్వలించి
విప్లవ విద్యుత్తు జనిస్తుంది
్ర వేల బ్రతుకు బల్బుల్ని వెలిగించటానికి."

న కవిత్వంలో రాసే గాని వాసి లేదనే వారు ఇట్లాంటి ంను ఒకసారైనా చూడటం మంచిది.

దృష్టి (నవ్య కవిత్వం)

[తమిళ మూలం : కొ. స. బలరామన్. తెనిగింపు : కె. ఆర్. వేలాయుధరాజా. ప్రతులకు : దక్షిణాంధ్ర భాషాసమితి, గూడలూరు, పి.ఓ. - 627789 వయా వాసుదేవనల్లూరు, తిరునెల్వేలి జిల్లా, తమిళనాడు.]

ఈ వచన కవితా సంకలనం తమిళంలో ఈనాడు వస్తున్న ఆధునిక కవిత్వం యొక్క రూపానికీ, వస్తువుకీ నిదర్శనం. తమిళ మూలం నాకు తెలియదు. ఈ అనువాద కావ్యాన్ని బట్టి పై భావానికి రావలసి వచ్చింది. వేలాయుధరాజా గారు వచన కవిత్వాన్ని రాయడానికి వ్యాకరణాన్ని ఎదిరించినట్టుగా చెప్పుతున్నారు. వ్యాకరణం శబ్దానికి సంబంధించినది; ఛందస్సు కవిత్వానికి సంబంధించినది. వచన కవిత్వం ఛందో నియమాలను ఛిన్నాభిన్నం చేసింది. వాడుక భాష వ్యాకరణ సంప్రదాయాన్ని మార్చింది.

ఈ కవిత్వంలో సంఘ దౌష్ట్యాన్ని అతి తీవ్రంగా ఖండించటం కంటె అతి బలంగా అపహాస్యం చేసి వెక్కిరించటం జరిగింది. కవిత్వం చెప్పటంలో ఈ సెటైర్ పద్ధతి కవికి ఆయుధంగా ఉపయోగపడింది. ఉదాహరణకు—

పుష్పలావిక పూర్ణమ్మ
పుష్పించుటకు ముందుగానే
బొట్టు చెడింది పొలుపు చెడింది
పూవూ చెడింది.

పై పాదాల సెటైర్‌లో కూడా ఒక ధర్మ ధ్వనిని పాఠకుడు గమనిస్తాడు. 'ఏమిటి వ్రాస్తున్నావ్' అనే ఖండికలో ఆధునిక కవిత్వ లక్ష్యాన్ని వివరించటం జరిగింది. మూఢ విశ్వాసాన్ని అధిక్షేపిస్తూ 'జ్యోతిషం' అనే ఖండిక ఈ కవి రాశాడు.

"జ్యోతిషం చెబుతున్న ఆదిశేషుడు
తన కుమార్తె వివాహాన్ని
హడావిడిగా ఆడంబరంగా జరిపించాడు
మూడవ దినం ఆమె విధవ"

ఇట్లాగే ఈ కవితా సంకలనం రాజకీయ, సాంఘిక, మత మౌఢ్యాలపై పెద్ద సెటైర్‌గా కనబడుతుంది.

సైబ పదచిత్రాలు

[వెల : రు. 8-00 లు. ప్రతులకు : ఇందూరు భారతి, తెలుగు రచయితల సమాఖ్య, నిజామాబాద్.]

కవిత్వ భావుకతకు, చిత్రభావుకతను జోడించి అందంగా ముద్రించిన పదచిత్రాలివి. ప్రతి ఖండికలోనూ గాఢమైన కవితానుభూతి ఆవిష్కృతమైంది. కావ్యమంతా ఇక్కడి జీవితం తాలూకు అవ్యక్తమైన వేదన పరచుకుని ఉంటుంది. ఏ మాత్రం భాషాభేషజం లేకుండా, అంత్యప్రాసల, ఆదిప్రాసల, సమాసాల అర్పటి లేకుండా అలతి మాటలతో జీవితం యొక్క ఎత్తుపల్లాలను గురించి వర్ణించటం ఈ కావ్యం ప్రత్యేకత.

కరుడు కట్టిన రేయిలా విలిచిపోయిన జీవితంలోని వేదనను కవితాగానం చేస్తూ ఎక్కడో, ఎప్పుడో, ఏ చూరు మూలో వెలిగే మిణుగురు వెలుగుకోసం కవి మనస్సు అన్వేషిస్తుంది. జీవితంలో సౌందర్యారాధన ఒక ఉన్నతమైన భాగం. కాని జీవితావసరాలు మనిషిని ఈ సౌందర్యం నుంచి బీభత్సంలోకి నెట్టుతున్నాయి. ధనం అన్ని విలువల్ని హత్య చేస్తోంది. జీవితాలు బ్రతుకుతున్న కంకాళాలుగా మారి పూటగడవటం కోసం ఎడారిలో మార్గాన్ని అన్వేషిస్తున్నాయి.

"ఆకలిని చంపుకోలేక
సగం చచ్చిన రాత్రిలో
శవాలు నడుస్తూనే వున్నాయి
వెన్నెల వెలుగులూ
మలయ మారుతాలూ
కోయిల కూజితాలూ
చిగురాకు విందులూ
ఇవేవీ పట్టించుకోకుండా
కదుల్తూనే ఉన్నాయి."

తూరుపు ఆకాశంలో ఆకలి అంతాన్ని రెప్పల గోడల మీద చిత్రించటం గొప్పతనం కదా! వెలిగించడం కాదు; వెలగడం నేర్చుకోమంటున్నారు. ఉపదేశం కంటే అనుష్ఠానం ఎప్పుడూ గొప్పదే.

'మేము ఊదిన ఆలోచనల్ని
కట్టేసి ఆకాశంలో
వారు బంతులాడేవేళ
నా తిరాన్ని - దేశాన్ని
రంగు నీళ్ళలో ముంచుతూ'

రక్తం సూర్యుడు ఉదయిస్తాడు. పై ఐదు పాదాల్లో వ్యక్తం అయిన భావాన్ని విశ్లేషిస్తే తాత్పర్యం రాసినట్లవుతుంది. "అవకాశం, ఆదరణా లేక రచయిత గుండె లోతులో అణిగి నిద్రాణ స్థితిలో పడివున్న సృజనాత్మక శక్తినీ, ప్రతిభనూ జాగృతం చేసి కొత్త ఊపిరిలూది ఉత్తేజరితే ఆదర్శాలలో అడుగు వేస్తూ, సాహితీ చింతనలో ప్రవల్లో మనోవికాసాన్ని కలిగిస్తూ, ఒది; ...గారతి" సాహితీ సమాఖ్య ముమ్మందు వారి కార్యక్రమాలను జ... ం చేసుకొంటూ, మం. కవితా సంకలనాలను అందించాలని ఆ...న్నాను.

కెరటం నా ఆదర్శం

[ఆచార్య భావన్. వెల : రు. 4-00 ...
ఆచార్య భావన్, దాసన్నపేట, విజయనగరం.


లేచి పడినందుకు కాదు పడినా లేచినందుకే కెరటం ఆదర్శమని భావన్‌గారు మొదటి ఖండికలో చెప్పారు. ...మంటే కవితా నేత్రాన్ని తెరవటమని, ఎదగటమంటే మన... గాన్ని పైకి విసరటమనీ కవిగారు అభిప్రాయపడుతున్నారు. ... సహించలేని వాళ్ళు, నవ్యతను ఆహ్వానించలేని వాళ్ళు, నేటి పాడలేని వాళ్ళు, రేపటి బాటను వేయలేని వాళ్ళు, వె... పయనించటానికి ఇష్టపడలేని వాళ్ళు, అభ్యుదయ గమనం లేని వాళ్ళు, బూజు భావాల ఛాందసులు ఎప్పుడూ ఉంటారు. అట్లాంటి హృదయాలకు 'అనంతాక్షర అగ్నిధార ...దును పదా కవితా కిదన రంగ పరశు ధార' తన కవిత అని చాటించారు. 'కల నిజమై నిలబడాలని, అల అంబుదమై విహరించాలని, కల ప్రజాగళమై నినదించాలని' కవిగారు నిరీక్షిస్తున్నారు. ... నిజంగా సత్ఫలితాలను అందిస్తే విప్లవాల అవసరమేమిటని ప్ర...స్తున్నారు.

"పక్షి పాడుతుంది
నిప్పు మండుతుంది
గాలి నడుస్తుంది
పక్షి పాటలో స్వేచ్ఛ
నిప్పుమంటలో విప్లవం
గాలి నడకలో ప్రగతి
అందుకే—
ప్రకృతి - ప్రపంచానికి
ఆదర్శం."

అంటూ స్వేచ్ఛనూ, విప్లవాన్ని కాంక్షిస్తూ, మా... లోకం కోసం ఈయన కవిత్వం రాస్తున్నారు.

శ్రీ టి. ఎల్. కాంత

A...eswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra P... nagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 &61247



అమృతాంజన్‌కే తెలుసు తల నొప్పి బాధ

అసలు తల నొప్పి అంటేనే భరించలేని బాధ. దాన్ని పోగొట్టుకోడానికి సులువైన మార్గము. కొంచెము అమృతాంజన్ తీసుకొని కణతల మీద బాగా గట్టిగా నిమిరి పట్టించండి. వెంటనే తల నొప్పి తగ్గిపోయి హాయిగా వుంటుంది.

అమృతాంజన్ ఇతర మందులవలెగాదు. అమృతాంజన్‌లో చేరివున్న శక్తివంతమైన 10 ఔషధాలు అమోఘంగా పనిచేసి రాసిన చోట పై చర్యవల్ల అతి త్వరగా ఇట్టే నొప్పిని నివారిస్తుంది. ఏ అపాయం వుండదు.

85 సంవత్సరాలకు పై బడిన ప్రసిద్ధి కల అమృతాంజన్ వొంటి నొప్పులకు, బెణుకులకు, జలుబులకు గొంతు నొప్పులకు కూడా చాలా అమోఘంగా పనిచేసి నివారిస్తుంది.

ఎప్పుడూ అమృతాంజన్ చేతికి అందుబాటుగా వుంచుకోటం మంచిది. ఎందుకంటే ఎప్పుడు అవసర మొస్తుందో చెప్పలేము.



అమృతాంజన్

శీఘ్ర నివారిణి. నమ్మకమైనది. ఏ ఇతర బాధనూ కలుగచేయదు.

OBM 7652 TG-R